Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

సంపుటి: 56 • సంచిక: 138 • మంగళవారం 29 ఆగస్టు 2017 • హైదరాబాద్ * పేజీలు: 12+4 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి: శుద్ధ అష్టమి రా. 2.11 వరకు, అనంతరం నవమి; నక్షత్రం: అనూరాధ రా. 11.43 వరకు, అనంతరం జ్యేష్ఠ; అమృతకాలం: మ. 12.15 నుండి 2.00 వరకు; వర్జ్యం: తె. 5.54 నుండి ఉ. 7.40 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.17 నుండి 9.08 వరకు; తదుపరి రా. 11.00 నుండి 11.45 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు



జైలుకే తరలివెళ్లిన కోర్టు

డేరా బాబాకు 20 ఏళ్ల జైలు

రూ. 30 లక్షల జరిమానా



- కుప్పకూలిన రేపిస్ట్ బాబా • శిక్ష తగ్గించాలని వేడుకోలు
- చేతులు జోడించి అర్థింపు • తిరస్కరించిన సీబీఐ జడ్జి
- సిర్సాలో చెలరేగిన హింస • పంజాబ్, హర్యానాల్లో కర్ఫ్యూ
- జైల్లోనే తాత్కాలిక కోర్టు • హెలికాప్టర్ ద్వారా జడ్జి తరలింపు
- కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో శాంతిభద్రతల పర్యవేక్షణ
- హర్యానా, పంజాబ్ సీఎంల అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్షలు

వివరాలు 11లో...

నంద్యాల ఉప ఎన్నిక



సైకిల్ గెలుపు

- ప్రతి రౌండులోనూ తెదేపాదే ఆధిక్యత
- 16వ రౌండులో స్వల్ప ఆధిక్యంలో వైకాపా
- కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు...డిపాజిట్ రాలేదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అత్యంత ప్రతిష్టాత్మకంగా, హోరాహోరిగా సాగిన కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ ఉపఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయంసాధించారు. ఈ ఎన్నికలో త్రిముఖ పోటీ జరిగినా కాంగ్రెస్ నామమాత్రంగానే మిగిలింది. తెదేపా, వైకాపా 8వ పేజీలో...

సర్కారీ వైద్యానికి క్యూ!

- పెరుగుతున్న ప్రసవాలు • ఇతర రోగుల రష్ పెరిగింది
- మందుల కొరత లేకుండా చర్యలు • కొత్త సిబ్బంది నియామకానికి సన్నాహాలు • మారిన జిల్లా ఆసుపత్రుల ముఖచిత్రం • 24 గంటలు పనిచేస్తున్న పీహెచ్‌సీలు



మెదక్ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చిన మహిళలు

వివరాలు 2లో...

ఒకప్పుడు గ్రామాల్లో ప్రజలు వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)లకు రావాలంటే భయపడేవారు. ప్రభుత్వ దవాఖానాల్లో డాక్టర్లు గానీ, నర్సులు గానీ ఉండరు. ఇక మందుల మాట సరేసరి.. కనీసం రోగులు కూర్చోవడానికి బెంచీలకు కూడా దిక్కులేని పరిస్థితి. అయితే ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉండటం నుంచి మౌలిక సౌకర్యాల కల్పన వరకు అన్నింటిలోనూ గణనీయమైన మార్పులు వచ్చాయి.



హైదరాబాద్‌లో చిన్నపాటి వర్షానికే జలమయమైన రహదారి

స్థిరంగా అల్పపీడనం

- తెలంగాణ వ్యాప్తంగా చెదురు మదురు జల్లులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. ఫలితంగా తెలంగాణ వ్యాప్తంగా కొన్నిచోట్ల భారీ వర్షాలు, అనేక ప్రాంతాల్లో చదురు మదురు జల్లులు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ అల్పపీడన ప్రభావం మరో నాలుగు రోజులపాటు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దాదాపు 80 శాతం మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటల్లో జలకల సంతరించుకుంది. హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపిన సమాచారం మేరకు గడిచిన 24 గంటల్లో ఆరు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. కామారెడ్డి, 9వ పేజీలో...



సుప్రీం సీజే దీపక్ మిశ్రా

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా సోమవారంనాడు రాష్ట్రపతి భవన్ దర్బార్ హాలులో పదవీ ప్రమాణం చేశారు. ఆంగ్లంలో దేవుని మీద ప్రమాణం చేశారు. ఆయన చేత రాష్ట్రపతి 9వ పేజీలో...

ప్రాణదాత కేసీఆర్!

- ఏడాది బాబుకు కాలేయ మార్పిడికి రూ. 25 లక్షల ఆర్థిక సాయం
- సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు విడుదల
- బాలుడి తల్లిదండ్రులకు చెక్కు అందజేసిన సిద్దిపేట జిల్లా కలెక్టర్
- ముఖ్యమంత్రికి బాధితుల కృతజ్ఞతలు



గజ్వేల్, కెఎన్ఎన్: ప్రభుత్వాధినేతగా తనకున్న బాధ్యతకు మానవీయ కోణాన్ని జోడించిన కేసీఆర్ ప్రాణదాతగా నిలిచారు. కాలేయ మార్పిడి చేయాల్సిన అవసరం ఉన్న పేద బాలుడికి ముఖ్యమంత్రి మానవతా హృదయంతో ముందుకొచ్చి రూ.25 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గజ్వేల్‌కి చెందిన హనుమాన్ దాస్ కుమారుడైన దేవసాని శ్రీనివాస్ (11 నెలలు) పుట్టినప్పటి నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. వైద్య పరీక్షలు చేయించగా కాలేయ సమస్యఅని, కాలేయ మార్పిడి ఒక్కటే పరిష్కారమని వైద్యులు చెప్పారు. అంత ఖర్చు భరించలేమని తల్లిదండ్రులు ఆందోళన చెందారు. మీడియా కథనాల ద్వారా సీఎం కేసీఆర్ తెలుసుకుని సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డితో మాట్లాడారు. అవసరమైన వైద్యాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వెంకట్రామ్ రెడ్డి బాలుడి కుటుంబ సభ్యులను కలిసి వివరాలు అడిగి తెలుసుకుని సీఎంకు వివరించారు. వెంటనే సీఎం రూ.25 లక్షలను సీఎం సహాయనిధి నుండి మంజూరు చేశారు. ఆ చెక్కును కలెక్టర్ హైదరాబాద్‌లోని గ్లోబల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు.



2లోగానే ఎలక్షన్ కేబినెట్!

- 3 నుంచి చైనా పర్యటనకు వెళ్లనున్న మోడీ
- అన్నాడీఎంకే వివాదాలతో విస్తరణ ఆలస్యం
- తంబిదురైకి పట్టణాభివృద్ధిశాఖ కేటాయింపు
- కల్‌రాజ్ అవుట్.. బీహార్ గవర్నర్‌గా మిశ్రా
- ఎన్‌సిపి చేరికపై ఊహాగానాలు హల్‌చల్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కేంద్రమంత్రి వర్గ పునర్ వ్యవస్థీకరణ సెప్టెంబరు 2లోపు జరిగే అవకాశం ఉంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ వచ్చే నెల 2తర్వాత విదేశీ పర్యటనలో భాగంగా చైనా పర్యటన వెళ్లనున్నారు. దాంతో ఈలోపే కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ పూర్తి 9వ పేజీలో...

ఉద్యోగుల విభజనకు 'స్థానికత'

- రెండు నెలల్లో ఉద్యోగుల విభజన పూర్తిచేయాలి
- తెలుగు రాష్ట్రాల సీఎస్‌ల భేటీలో నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల విభజనకు సంబంధించిన కీలక అంశాలపై ఏర్పాటైన సలహా మండలి 23వ సమావేశం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. తెలంగాణ సీఎస్ ఎస్.పి.సింగ్, ఏపీ సీఎస్ దినేష్‌కుమార్‌తో పాటుగా కేంద్ర ప్రభుత్వ డివోపిటి సంయుక్త కార్యదర్శి కిమ్‌బోవాంగ్ కిప్గెన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రేమచంద్రారెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి అజయ్ మిట్టల్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఉద్యోగుల విభజనకు సంబంధించి ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలు, మిగిలిపోయిన సమస్యలపైనా ప్రధానంగా చర్చించారు. మిగిలిపోయిన ఉద్యోగుల సీనియారిటీ జాబితాను సిద్ధం చేయాలని సమావేశం నిర్ణయించింది. కోర్టు వివాదాల్లోని అంశాలను కూడా పరిశీలించాలని మరో కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ చివరి నాటికి మిగిలిపోయిన ఉద్యోగుల విభజన అంశానికి సంబంధించిన జాబితాను సిద్ధం చేసి, అక్టోబర్ చివరి నాటికి విభజన ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. కమలనాథన్ కమిటీ ఇప్పటి వరకు 55, 870 మంది ఉద్యోగులను విభజించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 31,611 మందిని, తెలంగాణకు 24,259 మందిని కేటాయించింది. మిగిలిపోయిన ఉద్యోగుల విభజనకు సంబంధించి 1302 రాష్ట్రస్థాయి పోస్టుల విభజనపై వివాదం పరిష్కరించవలసి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తున్న 635 మంది 9వ పేజీలో...



9

ఆంధ్రావాళ్లను పంపేయండి!

విద్యుత్ సౌధ ఎదుట ఉద్యోగుల ధర్నా



డొక్లామ్‌కు దౌత్యంతో చెక్

- సైన్యం ఉపసంహరణకు ఇరుదేశాలు అంగీకారం
- డ్రాగన్ వక్రభాష్యం
- భారత దౌత్యపర్వులకు ప్రపంచదేశాల ప్రశంస

10



3

ఈసారి 69కోట్ల చేప పిల్లలు





సర్కారీ వైద్యానికి క్యూ

● పెరుగుతున్న ప్రసవాలు ● ఇతర రోగుల రష్ పెరిగింది ● మందుల కొరత లేకుండా చర్యలు ● కొత్త సిబ్బంది నియామకానికి సన్నాహాలు ● మారిన జిల్లా ఆసుపత్రుల ముఖచిత్రం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: గతంలో పిహెచ్‌సీల్లో చికిత్స కోసం రోజుకు ముగ్గురు, నలుగురు రోగులు వచ్చేవారు. ఇప్పుడు ఆ సంఖ్య సగటున 30 నుంచి 40 చేరింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు చేయించుకోవాలంటే గతంలో గర్భిణులు బెంబేలెత్తిపోయేవారు. అప్పోసొప్పో చేసైనా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించేవారు. కానీ ఇప్పుడు మారిన పరిస్థితుల రీత్యా పీహెచ్‌సీల్లోనే ప్రసవాలను చేయించుకోవడానికి మహిళలు క్యూ కడుతున్నారు. అంతగా మారిపోయాయి తెలంగాణలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు.

రాష్ట్రంలోని ప్రతి సామాన్యునికి నాణ్యమైన వైద్యం అందాలి. ఇది ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సంకల్పం. ఆయన ఆశయాన్ని నెర వేర్చడానికి వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ వైద్యశాలలకు జనాన్ని రప్పించేందుకు చర్యలు చేపట్టింది. గ్రామాల్లో పీహెచ్ సీలు మొదలు కొని పట్టణ ప్రాంతాలల్లోని ఏరియా ఆసుపత్రుల వరకూ రూపురేఖలు మార్చే పనిలో పడింది. వైద్యశాలలకు మందుల కొరత లేకుండా చూడటంతో పాటు ఆధునిక వైద్య పరిక రాలు సమకూర్చింది. అయితే సర్కారీ వైద్యంపై ముందు నుంచీ అపనమ్మకంతో ఉన్న ప్రజలను వైద్యశాఖ అధికారుల చర్యలు ప్రభుత్వ ఆసుపత్రులకు రప్పించలేకపోయాయి. ఈ సమయంలో ప్రభుత్వం గర్భిణుల కోసం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగుపడిన పరిస్థితుల గురించి ప్రజలకు తెలియ చెప్పింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేసుకునే వారికి కేసీఆర్ కిట్స్ పేరుతో అప్పుడే పుట్టిన పాపాయికి ఉపయోగపడేలా రూ. 2,000 విలువచేసే వస్తువులను అందించే ఈ పథకానికి ఆకర్షితులై గర్భిణులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బాట పడుతున్నారు. అలా పీహెచ్‌సీలకు వచ్చేవారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు గతం కంటే ఎంతో మెరుగైన విషయం బోధ పడుతోంది. దీంతో గర్భిణులతో పాటు ఇతర రోగులు సర్కారీ దవాఖానాలకు క్యూ కట్టడం ప్రారంభిం చారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మారిన పరిస్థితులను పరిశీలిస్తే జిల్లా కేంద్ర ఆసుపత్రి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ప్రతిరోజు ఇన్ పేషెంట్ వార్డుల్లో బెడ్ షీట్ లు మారుస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం వీల్ చైర్లను ఏర్పాటు చేశారు. ఎక్కువ మంది రోగులు వస్తే కూర్చోవడానికి బెంచీలను అమర్చారు. ఇవి కాకుండా ప్రధానంగా పీహెచ్‌సీలు అంటే పాడబడ్డ బంగళాల మాదిరిగా ఉండకుండా వాటికి రంగులను వేయించారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కొత్త వాటిలాగా మెరిసిపోతున్నాయి. కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులను మరిపిస్తున్నాయి. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే వారి సంఖ్య ఈ మధ్య కాలంలో గణనీయంగా పెరిగింది. ప్రధానంగా కేసీఆర్ కిట్స్ పంపిణీ ప్రారంభం అయిన జూన్ తరువాత నుంచి గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ప్రధాన ఆసుపత్రుల వరకు అన్నింటిల్లోనూ ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. వీటితోపాటు హైదరాబాద్‌లోని ప్రధాన ఆసుపత్రుల్లో సైతం ప్రసవాల సంఖ్య పెరిగింది. చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్యకు అనుగుణంగా ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, బోధనా సుపత్రుల్లో వైద్యులు, ఇతం సిబ్బందిని భర్తీ చేయడం కోసం ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వీరి నియా మకం కోసం త్వరలోనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నోటిఫికేషన్‌ను సైతం జారీ చేయించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

24 గంటలు పనిచేస్తున్న పీహెచ్‌సీలు

రాష్ట్రంలో రెండు రకాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తున్నాయి. 24 గంటలు పనిచేసే పీహెచ్‌సీలు కొన్ని ఉండగా 12 గంటలపాటు పనిచేసే వి మరికొన్ని. 12 గంటలపాటు పనిచేసే పీహెచ్‌సీలు రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయి. 24 గంటలపాటు పనిచేసే పీహెచ్‌సీల్లో ఇద్దరు డాక్టర్లు ఉంటారు. ఒకరు ఉదయం వేళలో విధులు నిర్వర్తిస్తుండగా మరొకరు రాత్రి వేళల్లో విధుల్లో ఉంటారు. 24 గంటల పీహెచ్‌సీలకు గర్భిణులు ఎక్కువ మంది వస్తున్నారు. రాత్రి వేళల్లో సైతం డాక్టర్లు అందుబాటులో ఉంటారనే నమ్మకంతో అక్కడి వెళుతున్నారు.

చిరిగిన బెడ్‌షీట్లు....కాలు విరిగిన బెడ్‌లు.. పనిచేయని వీల్‌చైర్లు... ఇటువంటి సమస్యలు ఇప్పుడు జిల్లా, ఏరియా ఆసుపత్రులే కాదు... ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ రోగు లకు ఎదురు కాకుండా సర్కార్ చర్యలు తీసుకుం ది. ప్రభుత్వ ఆసుపత్రుల భవనాలకు రంగులు వేశారు... రోజుకొక బెడ్‌షీట్‌ను మార్చుతున్నారు... కొత్త బెడ్‌లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు లేబర్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. సౌకర్యాలు మెరుగు పడటంతో పాటు పరిస రాలు శుభ్రంగా ఉండటంతో చికిత్స చేయించుకోవ డానికి ప్రభుత్వ ఆసుపపత్రులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది.

రంగారెడ్డి జిల్లా పరిధిలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవేళ్ల ప్రాంతాల్లో ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. పిహెచ్‌సీల్లో కేసీఆర్ కిట్స్ పథకం ప్రారంభించిన తరువాత 17 శాతం ప్రసవాల సంఖ్య పెరిగింది. అదే ఏరియా ఆసుపత్రుల్లో 20 శాతానికి పెరిగాయి. నల్గొండ జిల్లా చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతంలో రోజుకు నలుగురు, ఐదుగురు వచ్చే పరిస్థితి ఉండగా నేడు అది 30 మందికి చేరుకుంది. ఇక్కడ సాధారణ ప్రసవాల సంఖ్య కూడా గతం కంటే పెరిగింది. ప్రసవాల సంఖ్య పెరగడానికి ప్రధాన కారణం కేసీఆర్ కిట్స్. దాంతోపాటు పీహెచ్‌సీల్లో లేబర్ రూమ్‌లను ఏర్పాటు చేయడం కూడా గర్భిణులను పీహెచ్‌సీల వైపు మళ్లించింది.

తీరిన మందుల కొరత

వైద్య రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నప్రభుత్వం మలేరియా, డెంగ్యూ, విషజ్వరాలకు అవసరమైన మందులను అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిణీ చేస్తోంది. ఇవే కాకుండా సాధారణంగా జ్వరాలు, తలనొప్పి, ఒళ్ళునొప్పులు తదితర ఇతర రోగాలకు కూడా అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. తెలంగాణ ప్రభుత్వ మౌలిక వసతుల కల్పన మండలి ప్రభుత్వ ఆసుపత్రులకు అన్ని వైద్య పరికరాలను సమకూర్చడంతోపాటు, మందులను కూడా సరఫరా చేస్తోంది. ఎక్కడా మందులు లేవనే సమాధానం రాకుండా చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి వ్యాధులు సోకకుండా ప్రజలకు మందులతోపాటు దోమతెరలు కూడా సర్కార్ పంపిణీ చేస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో 17 పిహెచ్‌సీలు ఉండగా వాటిలో అన్నింటికీ మందులను సరఫరా చేశారు.

వైద్యులు, సిబ్బంది కొరత

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రా లతోపాటు ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు చివరికి బోధనా సుపత్రుల్లో సైతం వైద్యుల కొరత ఉంది. వైద్యుల కొరతతోపాటు సిబ్బంది లేమి కూడా వెంటాడుతోంది. రాష్ట్రంలో ఉన్న ఏ ఒక్క పీహెచ్‌సీలో కూడా ఉండాల్సినంత మంది వైద్యులు, సిబ్బంది లేరు. అయినప్పటికీ వైద్యులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తున్నారు. పీహెచ్‌సీల్లో ప్రధానంగా గైనకాలజిస్టుల కొతర తీవ్రంగా ఉంది. 90 శాతం పీహెచ్‌సీల్లో గైనకాలజిస్టులు లేరు. జిల్లా ఆసుపత్రు ల్లో సైతం గైనకాలజిస్టులు లేకపోవడంతో మహిళలు ఎక్కువ మంది చికిత్సల కోసం రావడం లేదు. ప్రస్తు తం ప్రభుత్వం అమలు చేస్తున్న కేసీఆర్ కిట్స్ మూలంగా మహిళలు వస్తున్నప్పటికీ గైనకాలజిస్టులు అందుబాటులో ఉంటే ఇంకా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే మహిళా రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అలాగే చిన్న పిల్లల వ్యాధి నిపుణుల కొరత కూడా బాగానే ఉంది. గర్భిణీలు ప్రసవించిన వెంటనే చిన్న పిల్లల నిపుణులు ఉంటే వారికి అవసర మైన సూచనలు, సలహాలు ఇచ్చే అవకాశం ఉంటుంది. కానీ వారు లేకపోవడంతో ఎంబిబిఎస్ డాక్టర్లే బాలింతలకు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ లేబర్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. లేబర్ రూమ్‌లను ఏర్పాటు చేసిన తరువాత ప్రసవాల కోసం వచ్చే వారి సంఖ్య పెరిగింది. ప్రసవం అయిన

లేబర్ రూమ్‌ల ఏర్పాటు

తరువాత బాలింత కనీసం వారం రోజులు ఆసుపత్రి లో ఉండాల్సి ఉంటుంది. వారిని వారం రోజుల పాటు లేబర్ రూమ్‌లోనే ఉంచి తగిన చికిత్సను అందిస్తారు. గతంలో లేబర్ రూమ్‌లు సరిగా ఉండేవి కావు. కానీ కేసీఆర్ కిట్స్ అమలు చేయాలని సర్కార్ నిర్ణయించిన తరువాత లేబర్ రూమ్‌లను ఆధునీకరించారు. ప్రతి లేబర్ రూమ్ శుభ్రంగా ఉండటమే కాకుండా నర్సులు, ఇతర సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. బాలింతలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుతున్నారు.

పెరుగుతున్న ఔట్ పేషెంట్లు

సౌకర్యాలు పెరగడంతోపాటు, లేబర్‌రూమ్‌లను ఏర్పాటు చేయడంతో పీహెచ్‌సీలకు జనాదారణ పెరుగుతోంది. మరో వంక అనేకచోట్ల ఔట్ పేషెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. నల్లగొండ జిల్లాలో ఈ మార్పు స్పష్టంగా గోచరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుం టున్న సానుకూల చర్యలతో ప్రజల్లో సదాభిప్రాయం నెలకొనడం వల్ల ఇది సాధ్యం అవుతున్నదని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

నియామక ప్రక్రియకు విధి విధానాలు సిద్ధం

పీహెచ్‌సీల నుంచి జిల్లా ప్రధాన ఆసుపత్రులు, బోధనాసుపత్రుల్లో నెలకొన్న వైద్యులు, సిబ్బంది కొరతను తీర్చడానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. నియామకానికి సంబంధించి వైద్య, ఆరోగ్య శాఖ ఇప్పటికే విధానాలను రూపొందించింది. అవసరమైన ఉద్యోగాల సంఖ్యను గుర్తించింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,600లకు పైగా పోస్టులను భర్తీ చేయా లని నిర్ణయించింది. ఇప్పటికే వైద్యులు, ఇతర సిబ్బంది నియామకం కోసం వైద్య, ఆరోగ్య శాఖ విధి విధానాలను రూపొందించింది. రాష్ట్రం లోని నీలోఫర్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రు ల్లో వైద్యులు, సిబ్బంది నియామకానికి ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 331 వైద్యుల పోస్టుల భర్తీ నోటిఫికే షన్‌ను సైతం జారీ చేసింది. మిగిలిన పోస్టుల భర్తీకి సంబంధించి త్వరలోనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి మరికొన్ని నోటిఫికేషన్లను జారీ చేయించనుంది. టీఎస్ పీఎస్సీ ద్వారానే కాకుండా జిల్లాల్లో ఔట్ సోర్సింగ్, తాత్కాలిక పద్ధతుల్లో కూడా వైద్యు ల నియామకం చేపట్టడం కోసం జిల్లా కలెక్టర్లకు అధికారాలను ఇచ్చింది.



ప్రసవాలలో జగిత్యాల బెస్ట్

జగిత్యాల, కెఎన్ఎన్ : సర్కారు ఆసుపత్రి అంటేనే ఎవరు పట్టించుకోరని, చికిత్స సరిగా ఉండదన్న భావన గ్రామీణుల్లో ఉండేది. ఈ పరిస్థితిని నివారించి ప్రజల్లో ప్రభుత్వం వైద్యశాలలపై నమ్మకం కలిగేలా చర్యలు చేపడుతున్నారు జగిత్యాల జిలా వైద్యశాఖ అధికారులు. ప్రసూతి సేవల్లో ఒక మెట్టు ముందుండి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారు. జగిత్యాల జిల్లాలో 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్ సీలు) ఉండగా వాటిలో 10 మంది వైద్యులు పనిచేస్తున్నారు. మిగిలిన చోట్ల వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పీహెచ్ సీల్లో కేసీఆర్ కిట్స్ పథకం ప్రారంభమైనప్పటి నుండి ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ పథకం ప్రభావంతో సామాన్యులతో పాటు ఉన్నద వర్గాల వారు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులను చేర్పించడానికి ముందుకు రావడం విశేషం. ఒక జూలై నెలలోనే 725 ప్రసవాలు జరగడం ప్రజలు వైద్య సేవలు అందించడంలో వైద్యుల అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుంది. పలు ప్రాంతాల నుండి వచ్చిన రోగులకు దగ్గరుండి వైద్య సేవలందిస్తూ వారికి సర్కారు ఆసుప్రతులపై నమ్మకాన్ని పెంచుతున్నారు. పీహెచ్ సీల్లో మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు సరఫరా చేస్తున్నారు. అలాగే ఆసుపత్రుల్లో కేసీఆర్ కిట్లను ఎల్లప్పుడు అందుబాటులో ఉంచుతున్నారు. వైద్యులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎన్ లు ఇంటింటికి తిరుగుతూ గర్భిణులను గుర్తించి వారి కుటుంబసభ్యులకు సర్కారు ఆసుపత్రి సేవలను వివరిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా వైద్య సేవలు అందించడంతో గ్రామీణ ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.



సౌకర్యాలు భేష్

మహబూబ్‌నగర్ , కెఎన్ఎన్ బ్యూరో : మహబూబ్ నగర్ జిల్లాల్లో ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు ఇప్పుడిప్పుడే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ప్రధాన ఆసుపత్రులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా సిబ్బంది నియామకాలు చేపట్టారు. అయితే అటెండర్లు , వాచ్‌మెన్లు , దోబీలు, పారిశుధ్య కార్మికుల పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. దవాఖానాల్లో పారిశుధ్య లోపం నివారణకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ దవాఖానాల్లో వైద్యం కోసం వస్తున్న రోగులు ఆసుపత్రి వాతావరణంలో వచ్చిన మార్పులను గమనిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో ఇరుకు గదులతో గతంలో సామాన్య మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడేవారు. ఇప్పుడా పరిస్థితి మారింది. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్య సిబ్బందితో పాటు వైద్యాధికారులు గతంలో రోగులకు సరైన సమయంలో అందుబాటులోకి రాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. మందులను పూర్తిస్థాయిలో రోగులకు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి మూడు నెలలకోసారి మండలాధ్యక్షుడు చైర్మన్‌గా వైద్యాధికారి కన్వీనర్‌గా ఏర్పాటైన కమిటీలు ఆసుపత్రులో కావాల్సిన వసతుల కల్పన కోసం కార్యాచరణ రూపొందిస్తున్నాయి.

కేసీఆర్ కిట్‌లకు ఆదరణ ఫుల్



నల్గొండ, కెఎన్ఎన్ బ్యూరో : నల్గొండ జిల్లాలో అరకొర వసతుల సమస్యలతో సర్కారీ దవాఖానాలు సతమతమవుతున్నాయి. పేదలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు నోచుకోవడంలేదు. సర్కారీ దవాఖానాలకు ప్రజలు వస్తున్నా సిబ్బంది కొరత.. పట్టించుకునేవారే లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. సామాన్యులు సైతం చేసేదేమీ లేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. నల్గొండ జిల్లాలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5అర్బన్ హెల్త్ సెంటర్లు, 257 సబ్ సెంటర్లు ఉన్నాయి. 24గంటలు పనిచేసే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు 18, 12గంటలు పనిచేసే పీహెచ్‌సీలు 14 ఉన్నాయి. అయితే పీహెచ్‌సీల్లో సిబ్బంది సమయానికి రాకపోవడంతో రోగులు ఎదురుచూసి తిరిగివెళ్తున్నారు. జిల్లాలోని చింతపల్లి, మర్రిగూడ, పిఏపల్లి, కనగల్, హాలియాతో పాటు అన్ని పీహెచ్‌సీల్లో సిబ్బంది అందుబాటు లో ఉండడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. డాక్టర్లుకూడా సమయానికి కాకుండా ఇష్టమొచ్చినట్లు వచ్చిపోతుంటారని రోగులు ఆరోపిస్తున్నారు. వీటికితోడు పీహెచ్‌సీల్లో మందుల కొరత వేధిస్తోంది. ప్రభుత్వం మందులను పంపిణీ చేస్తున్నప్పటికి పీహెచ్‌సీల్లో మాత్రం మందులు అరకొరగా దొరుకుతుండడంపై రోగులు మండిపడుతున్నారు. వీటికితోడు పీహెచ్‌సీల్లో అంబులెన్సులు, ల్యాబ్, స్కానింగ్‌తో పాటు ఇతర సౌకర్యాలు అందుబాటు లో లేవు. ఉన్నా కూడా చాలాచోట్ల నిరుపయోగంగా ఉండడంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదురౌతుంది. ఇలాఉంటే నాగార్జునసాగర్ కమలానెహ్రూ వంద పడకల ఏరియాఆస్పత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. ఆర్ఎంఓ, గైనకాలజిస్టు, అనస్తీషియా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీహెచ్ సీలతో పాటు ఏరియా ఆస్పత్రుల్లో సమస్యలతో తిష్ట వేసినప్పటికీ కేసీఆర్ కిట్‌లకు మాత్రం మంచి ఆదరణే లభిస్తోంది. నల్గొండ జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలలో గతంకంటే ఇప్పుడు ప్రసవాల సంఖ్య పెరగడం విశేషం. కేసీఆర్ కిట్‌లను అందిస్తుండడంతో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకునేందుకు మహిళలు ముందుకు వస్తున్నారు. కిట్‌లతో పాటు నగదు కూడా అందిస్తుండడంతో ప్రభుత్వ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. అమ్మఒడి పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు నల్గొండ జిల్లాలో 1,465 కిట్లను పంపిణీ చేశారు. పీహెచ్‌సీల్లో 115.. ఏరియా ఆస్పత్రులో 1,350 కిట్లను బాలింతలకు అందచేసినట్టు అధికారులు చెప్తున్నారు.



పీహెచ్‌సీలకు కొత్త హంగులు

రంగారెడ్డి, కెఎన్ఎన్ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చాలామార్పు వచ్చింది. గతంలో ఉన్న సమస్యలు ఒకొక్కటిగా దూరమవుతున్నాయి. చూడగానే అరే ఇది ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమా అని ఆశ్చర్యపోయే విధంగా పరిస్థితులు మారిపోయాయి. భవనాలకు రంగులు వేయడంతోపాటు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఎక్కడైనా మరమ్మతులు అవసరమని కోరగానే వెంటనే నిధులుమంజూరు చేసి మరమ్మతులు చేయిస్తున్నారు. ఇందులో కాన్పులు ఎక్కువగా జరుగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. గతంతో పోలిస్తే మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటితోపాటు రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల ప్రాంతాల్లో ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో చాలా వరకు ఆసుపత్రులకు మరమ్మతులు చేపట్టారు. చిన్న చిన్న మరమ్మతులు వెంటనే చేసేస్తున్నారు.

కేసీఆర్ కిట్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తరువాత ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెరిగింది. గతంతో పోలిస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 15నుంచి 17శాతం కాన్పులు పెరిగాయి. ఏరియా ఆసుపత్రుల్లో మాత్రం దాదాపుగా 20 శాతం మేర కాన్పులు పెరిగాయి. దీంతో కాన్పులకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తపడుతున్నారు. కాన్పు జరిగిన తరువాత వారం రోజుల వరకు ఆసుపత్రుల్లోనే ఉండాల్సి ఉంటుంది. వారికోసం లేబర్ రూంలు తయారు చేస్తున్నారు.కాన్పుల సంఖ్యను బట్టి లేబర్‌రూంలు తయారు చేస్తున్నారు. ముఖ్యంగా కన్పులు ఎక్కువగా జరిగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లేబర్‌రూంలు ఏర్పాటు చేస్తున్నారు. దాంతోపాటు బెడ్లు, బెడ్‌షీట్లు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో చినిగిపోయిన బెడ్ షీట్లు దర్శనమిచ్చేవి. కానీ కేసీఆర్ కిట్లకార్యక్రమం తరువాత కొత్త బెడ్‌షీట్లు ఏర్పాటు చేస్తున్నారు.

మెరుగైన పారిశుధ్యం....

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్యం మెరుగైంది. గతంలో ఎక్కడపడితే అక్కడ చెత్త, ఉమ్ము వేయడం చేసేవారు. ముగురు కూడా ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో దర్శనమిచ్చేది. కానీ ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోంది. ఆసుపత్రులను వెంటవెంటనే శుభ్రం చేయడం, ఎవరూ కూడా ఉమ్ము వేయకుండా చర్యలు తీసుకోవడం, ఆసుపత్రి పరిసర ప్రాంతాలను రోజూ శుభ్రం చేయడం చేస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా జాగ్రత్తపడుతున్నారు.

రంగారెడ్డి జిల్లా పరిధిలో ఏరియా ఆసుపత్రుల్లో కాన్పులు పెరిగాయి. గతంతో పోలిస్తే దాదాపుగా 20 శాతం కాన్పులు పెరిగాయి. జిల్లా పరిధిలో రాజేంద్రనగర్, షాద్‌నగర్, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. గతంలో రాజేంద్రనగర్ ఆసుపత్రిలో 139 కాన్పులు జర్గగా కేసీఆర్ కిట్ల కార్యక్రమం వచ్చిన తరువాత 699 కాన్పులు జరిగాయి. ఇబ్రహీంపట్నంలో 697 కాన్పులు, షాద్‌నగర్‌లో 150, చేవెళ్లలో 124 కాన్పులు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా కేసీఆర్ కిట్ల పంపిణీ ప్రారంభమైన తరువాత 3339 కాన్పులు జరిగాయి.

మెరుగుపడుతున్న ఆస్పత్రులు

భద్రాద్రి కొత్తగూడెం, కెఎన్ఎన్ : జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ ఇప్పుడిప్పుడే మెరుగుపడుతోంది. రోగుల తాకిడి పెరిగింది. అందుకు అనుగుణంగా వసతులు ఇంకా పెరగాల్సి ఉంది. జిల్లాలో 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా 65మంది వైద్యాధికారులు పని చేస్తున్నారు. స్త్రీ వైద్య నిపుణులు, హెల్త్ అసిస్టెంట్, హెల్త్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్య, ఆరోగ్య శాఖ గణాంకాలను బట్టి జిల్లాలో 38 హెల్త్ అసిస్టెంట్ పోస్టులు, ఐదు గైనకాలజిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీహెచ్‌సీలలో పూర్తి స్థాయి సౌకర్యాలు లేక అక్కడికి వచ్చే గర్భిణీలను పాల్వంచ, కొత్తగూడెం, భద్రాచలం వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ములకలపల్లి మండలం దమ్మపేట పీహెచ్‌సీలో ఆపరేషన్‌లకు అవసరమైన పరికరాలు, ఆక్సిజన్ వంటి సౌకర్యాలు లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. చర్ల, ఇల్లెందు, ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సెంటర్లలో పని చేసేందుకు స్త్రీ వైద్య నిపుణులు ఆసక్తి చూపడం లేదు. చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని షిమాంగ్ సెంటర్లలోనే నిర్వహిస్తున్నారు. చర్ల మండలంలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన పీహెచ్‌సీ భవనం, సిబ్బంది క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయి. అందులో ఉండే వైద్యులు, సిబ్బంది ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలకు ప్రభుత్వం ఎటువంటి కొరత లేకుండా మందులు సరఫరా చేస్తున్నప్పటికీ సిబ్బంది కొరతతో ఆశించిన స్థాయిలో వైద్య, ఆరోగ్య సేవలు అందడం లేదు. సీఎం కేసీఆర్ జూన్ 3న ప్రారంభించిన కేసీఆర్ కిట్లతో గర్భిణీలతో పాటు వైద్యశాలలకు వచ్చే ఇతర రోగుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరత వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఖాళీలు భర్తీ చేస్తేనే



సిద్దిపేట, కెఎన్ఎన్ : తెలంగాణ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినప్పటికీ జిల్లాలో కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇంచార్జ్ డాక్టర్లతో కొనసాగడంతో రోగులు ఇబ్బందులకు గురౌతున్నారు. సిద్దిపేట జిల్లాలో 33 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా వీటిలో 24 గంటల పాటు పని చేసేవి 11 ఉన్నాయి. వీటిలో ఒక్కో పీహెచ్‌సీకి ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాలి. ఈ 11 పీహెచ్‌సీలలో డాక్టర్లు లేక ఇతర పీహెచ్‌సీల్లోని డాక్టర్లు ఇంచార్జులుగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని చింతమడక, కొండపాక, కుకునూర్‌పల్లి, మిరుదొడ్డి, రాజగోపాల్‌పేట, రామక్కపేట, సింగన్నగూడ, మర్కుక్, తీగుల్, ములుగు పీహెచ్‌సీల్లో ఇప్పటి వరకు పని చేసిన డాక్టర్లు ఉన్నత చదువుల కోసం వెళ్లిపోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. వీటికి ఇతర డాక్టర్లు ఇంచార్జులుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో 12 మంది స్టాఫ్ నర్సు పోస్టులు, 5 సూపర్‌వైజర్ పోస్టులు, 15 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అత్యవసర చికిత్సకు అవసరమైయ్యే మందులు అన్ని పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయి. జూన్ నుండి ఇప్పటి వరకు 1, 836 కేసీఅర్ కిట్లను బాలింతలకు అందజేశారు.

సిబ్బంది కొరత తీరితే చాలు

కరీంనగర్, కెఎన్ఎన్ బ్యూరో : కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలలో కలిపి మొత్తం 71 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో 350 పడకల ప్రధాన ఆసుపత్రి, 150 పడకల మాత-శిశు సంరక్షణ కేంద్రం, జగిత్యాల, సిరిసిల్ల, గోదావరిఖనిలలో 150 పడకల ఏరియా ఆసుపత్రులు, పెద్దపల్లి, మెట్‌పల్లి, మంథనిలలో 50 పడకల ఆసుపత్రులు ఉన్నాయి. కరీంనగర్ జిల్లా విషయానికి వస్తే జిల్లాలో 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ఐదు ప్రాథమిక కేంద్రాలలో వైద్యాధికారులు లేరు. అయితే అక్కడ రోగులకు కనీస వైద్యం అందాలన్న ఉద్ధేశంతో అధికారులు వైద్య విద్యార్థులకు బాధ్యతలు అప్పగించారు. సీఎం దత్తత తీసుకున్న చిన్న ముల్కనూర్ గ్రామంలో పీహెచ్‌సీకి నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. రేకొండ, బొమ్మనపల్లి గ్రామాలలో సబ్ సెంటర్లకు కొత్త భవనాలు నిర్మించాల్సి ఉంది. కొత్తగా ఏర్పడ్డ మండలాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ భవనాలు, సిబ్బంది కొరత కారణంగా ఇంకా వైద్యసేవలు ప్రారంభం కాలేదు. కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో 24 మంది డాక్టర్ల కు గాను 16 మంది ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా కరీంనగర్ ప్రధాన ఆసుపత్రిలో ఆరుగురు గైనకాలజిస్టులు అవసరముండగా ఇద్దరే ఉన్నారు. మరో ఇద్దరు వైద్య విద్యార్థులు సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో 350 పడకలు, ఇటీవలే ప్రారంభమైన మాత శిశు సంరక్షణ కేంద్రంలో 150 పడకలు మొత్తంగా 500 పడకలకు సరిపడా సిబ్బంది ఉన్నారు. ఆరోగ్య సేవలందించడానికి వైద్య పరికరాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో ఉన్నప్పటికి సిబ్బంది కొరత కారణంగా వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. కేసీఆర్ కిట్ ల పంపిణీ తరువాత ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు పెరిగినప్పటికి సిబ్బంది కొరత కారణం గా గర్భిణులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 700 సీఎం కేసీఆర్ కిట్స్ అందజేశారు. 150 పడకల ఈ ఆసుపత్రిలో మూడు ఆపరేషన్ థియేటర్లు, ఏడు లేబర్ రూమ్‌లు, ఎనిమిది హైరిస్క్ డెలివరీ రూములు, రెండు ప్రసూతి వార్డులు, ఒక పిల్లల వార్డు, 34 పేయింగ్ గదులను అందుబాటులో ఉంచారు.



మత్స్య రంగం మెరవాలి

- మత్స్య సహకార సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం
- 4, 647 చెరువుల్లో బుధవారం నుంచి ఉచిత చేపపిల్లల విడుదల
- ఈ ఏడాది 69 కోట్ల చేపపిల్లల విడుదలే లక్ష్యం
- గ్రామ పంచాయితీల పరిధిలోని కుంట్లలోనూ మత్స్య పరిశ్రమ అభివృద్ధి
- నాణ్యత, పరిమాణంలో రాజీ పడొద్దు: సంఘాలకు మంత్రి తలసాని



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తరతరాలుగా వృత్తినే నమ్ముకుని బతుకుతున్న మత్స్యకారులు, మత్స్య కార్మిక కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్తను తెలియజేసింది. కొత్తగా మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేసి 18 సంవత్సరాలు నిండిన వారందరికీ సభ్యత్వం కల్పించాలని నిర్ణయించింది. ఈ వృత్తిపై ఆధాపడే గంగపుత్ర, ముదిరాజ్, తెలగ, గోండ్ల తదితర కులాల వారికి వృత్తి నైపుణ్యతపై శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి మార్గాలను చూపాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆదేశాలిచ్చా రు. మిగతా కులాలవారు క ూడా ఈ రంగంపై ఆధారపడి ఉంటే వారికి కూడా సభ్యత్వం కల్పించే అంశాన్ని స్థానిక ఎమ్మెల్యేలు పరిశీలించాలని సూచించారు. ఈ వ్యవహారంలో అంతర్గత కలహాలకు తావులేకుండా సామరస్య పూర్వకంగా అవకాశం ఇవ్వాలని బాద్యతలు అప్పగించారు. అలాగే అన్ని జిల్లా కేంద్రాలు, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో మత్స్య మార్కెట్లను నిర్మించి స్థానిక సహకార సంఘాల్లోని సభ్యులకు నిర్వహణ బాద్యతలు అప్పగించాలని చెప్పారు. సీఎం ఆదేశాల మేరకు సంఘాల్లో సభ్యత్వం కలిగివున్న ప్రతిఒక్కరూ ఆ మార్కెట్లలో ఎలాంటి రుసుము లేకుండా చేపలను అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. దీంతో పాటు ఈ ఏడాదికి సంబంధించి చెరువుల్లో ఉచిత చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని ఈ నెల 30న సంగారెడ్డి జిల్లా సింగూరు జలాశయం వద్ద లాంఛనంగా ప్రారంభిస్తామని వెల్లడించారు. అదేరోజు రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ స్థాయి ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 77 రిజర్వాయర్లు, 4,647 మత్స్యశాఖ చెరువులు, 20,391 గ్రామ పంచాయితీ చెరువులలో 69.66 కోట్ల చేపిల్లలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గత సంవత్సరం రిజర్వాయర్లు, ప్రభుత్వ చెరువులలో 29 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేయడం జరిగిందని వివరించారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతోనే కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తోందని పేర్కొన్నారు. గొర్రెల పెంపకంపై జీవనం సాగిస్తున్న 7.60 లక్షల గొల్ల, కుర్మలకు ఒక్కొక్కరికి 21 గొర్రెలను రెండేళ్ళ కాలవ్యవధిలో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.5వేల కోట్లను కేటాయించిందన్నారు. నేటివరకు 14 లక్షల 76వేల గొర్రెలను పంపిణీ

రికార్డు స్థాయిలో గొర్రెల పంపిణీ

చేయడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంతో ఎంతో సంతృప్తిగా కొనసాగుతుందని, ఇందులో ఎంతో శ్రమిస్తున్న రెవెన్య, పశు సంవర్ధకశాఖ అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో పెరిగిన గొర్రెల సంఖ్యకు అనుగుణంగా దాణా, మందుల కొరత లేకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని మంత్రి వివరించారు. అంతేకాకుండా 100 సంచార పశువైద్య వాహనాలను కూడా త్వరలోనే ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు చెప్పారు.


(ఫైల్ ఫొటో)

లోటుపాట్లపై ముందుజాగ్రత్త చర్యలు

చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఖచ్చితమైన మార్గదర్శకాలను రూపొందించినట్లు ఆయన తెలిపారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాల్లో మత్స్యకారులతో అవగాహన సదస్సులు కూడా నిర్వహించి, ఆ సదస్సులకు ప్రజా ప్రతినిధులను సైతం ఆహ్వానిస్తున్నట్లు మంత్రి వివరించారు. చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్లు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపిటీసీలను పాల్గొనాలని కోరుతూ లేఖలు రాయనున్నట్లు మంత్రి వివరించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మార్గదర్శకాలను వివరించినట్లు చెప్పారు. అవసరమైన చేపపిల్లలను జాయింట్ కలెక్టర్ల అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో కొనుగోలు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

మార్కెటింగ్‌కు సబ్సిడీ వాహనాలు

గత ఏడాది విడుదల చేసిన చేపపిల్లలు ప్రస్తుతం విక్రయించే విధంగా పెరిగిపోవడంతో మత్స్యకారుల కుటుంబాలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. ఉచితంగా విడుదల చేసిన చేపపిల్లల విడుదలనే కాకుండా మత్స్యకారులు చేపలను విక్రయించేందుకు పెద్దఎత్తున మార్కెట్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా మత్స్యకారులకు సబ్సిడీపై వాహనాలను క ూడా అందజేస్తున్నట్లు వివరించారు.

గత ప్రభుత్వాలు పట్టించుకోని కారణంగానే మత్స్య సొసైటీలు నిర్వీర్యమయ్యాయని, త్వరలోనే అర్హులైన మత్స్యకారులకు సభ్యత్వం కల్పించి 31 జిల్లాలకు నూతన మత్స్య సొసైటీలకు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 3,831 సొసైటీలలో 2,79,871 మంది సభ్యులుగా ఉన్నారని ఆయన వివరించారు. గత ప్రభుత్వాలు మత్స్యశాఖకు కేవలం రూ.5 కోట్లు మాత్రమే కేటాయించేవారని అన్నారు. తెలంగాణ ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ విశాల హృదయంతో ప్రతియేటా రూ.5వేల కోట్లకు తగ్గకుండా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు.

గొర్రెల కొనుగోళ్ళకు టెండర్లు ఉండవు

గొర్రెల పంపిణీ కార్యక్రమం ఎంతో సంతృప్తిగా సాగుతుందని, చిన్న చిన్న సమస్యలు ఉన్నప్పటికీ వాటిని అధిగమిస్తున్నామని వివరించారు. ఇప్పటికే ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో లబ్ధిదారులు గొర్రెలను విక్రయించినట్లు ఫిర్యాదు రావడంతో వారిపై తగు చర్యలు తీసుకోవడం జరిగిందని ఒక ప్రశ్నకు మంత్రి సమాధానంగా చెప్పారు. గొర్రెల పంపిణీ కార్యక్రమంలో గొర్రెల కొనుగోలుకు టెండర్లను పిలవాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని మరో ప్రశ్నకు మంత్రి వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో గొర్రెల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్, పశు సంవర్ధకశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్‌చందా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

చెరువులు, రిజర్వాయర్లలో చేపపిల్లలను విడుదల చేసే ప్రక్రియను వీడియో చిత్రీకరణ జరపాలని ఇప్పటికే ఆదేశించడం జరిగిందని, నిబంధనల మేరకు లేని చేపపిల్లలను తిరస్కరించాలని ఖచ్చితమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని మంత్రి చెప్పారు. మత్స్యశాఖలో సరిపడా సిబ్బంది లేనందున చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో

వీడియో కెమెరాల పర్యవేక్షణలో...

పంచాయితీరాజ్, రెవెన్యూ శాఖల సిబ్బందిని కూడా భాగస్వాములను చేయనున్నట్లు పేర్కొన్నారు. మత్స్య సొసైటీల సభ్యులు, మత్స్యకారులు కూడా బాధ్యతగా భావించి చేపపిల్లల పంపిణీ చివరివరకు పరిశీలించాలని సూచించారు. మత్స్య వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికాభివృద్ధిని సాధించాలనే సదుద్దేశంతోనే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు ఆలోచన మేరకు ఈ కార్యక్రమాన్ని దేశంలోనే ఎక్కడా లేనివిధంగా నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

పంటల బీమా అమలుకు ఆరు క్లస్టర్లు

- వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారధి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో అమలు చేస్తున్న వివిధ రకాల పంటల బీమా పథకాన్ని మరింత పకడ్బందీగా కొనసాగించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆరు క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలంగాణ వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారధి తెలిపారు. వరి, గోదుమ, జొన్న, పప్పుదినుసులు, నూనెగింజలు కలుపుకుని మొత్తం 12 పంటలను బీమా పరిధిలోకి తీసుకువస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే రబీ నాటికి క్లస్టర్ల వారీ పంటల బీమాను అమల్లోకి తీసుకువస్తామన్నారు. ఎంపిక చేసిన పన్నెండు పంటలు కాకుండా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు వేరుశనగ, ఆదిలాబాద్, గద్వాల జిల్లాలకు శనగ, అసిఫాబాద్ జిల్లాకు జొన్న, ప్రధానంగా 25 జిల్లాలకు వరి పంటలకు అదనంగా బీమా సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించామని చెప్పారు. ఈ ఏడాది నవంబర్ 30 నాటికి బీమా ప్రీమియం చెల్లించేందుకు గడువు విధించారు.

క్లస్టర్ల వారీగా కేటాయించిన జిల్లాల వివరాలు ఇలా ఉన్నాయి.


క్లస్టర్-1:ఆదిలాబాద్, మంచిర్యాల, కొమురంభీం, జయశంకర్, సిద్దిపేట
క్లస్టర్-2:నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి, రంగారెడ్డి
క్లస్టర్-3:పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల,సిరిసిల్ల, జనగామ
క్లస్టర్-4:ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సంగారెడ్డి, మెదక్
క్లస్టర్-5:భద్రాద్రి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, వనపర్తి, నాగర్‌కర్నూల్
క్లస్టర్-6:మేడ్చల్, మహబూబ్‌నగర్, జోగులాంబ, వికారాబాద్,మహబూబాబాద్

భారీ వర్షాలతో రైళ్ల రద్దు

అమరావతి - ఆంధ్రప్రభ : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా తాత్కాలికంగా కొన్ని రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు సోమవారం పేర్కొన్నారు.భారీ వర్షాల కారణంగా రైల్వే ట్రాక్‌లపైకి వరద నీరు పొంగి ప్రవహిస్తున్నందున భద్రతా కారణాల రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నామని సంబంధిత అధికారులు తెలిపారు. కేఎస్ఆర్ బెంగుళూర్- న్యూ టినుష్క్యా (నెంబర్ 22501) ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 29వ తేదీన రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా 12509 నెంబర్‌గల బెంగుళూర్ కంటోన్మెంట్ - గౌహతి ఎక్స్‌ప్రెస్ రైలును కూడా ఈనెల 30, 31వ తేదీల్లో రద్దు చేశారు. సికింద్రాబాద్ - ధర్భంగ (నెంబర్ 07007) ప్రత్యేక రైలును ఈనెల 26న పాక్షికంగా రద్దు చేశారు. దర్భంగ - సికింద్రాబాద్ రైలు షెడ్యూల్‌లో కూడా స్వల్ప మార్పు చేశారు. హరియానా, పంజాజ్ రాష్ట్రాలలో తలెత్తినశాంతి భద్రతల దృష్ట్యా అటుగా వెళ్లే కొన్ని రైళ్లను కూడా రద్దు చేశారు. అమృతసర్ - హెచ్.ఎస్.నందేడ్ ఎక్స్‌ప్రెస్ (నెంబర్ 12716)ను ఈనెల 27,28 తేదీల్లోను, హెచ్.ఎస్.నాందేడ్ - శ్రీగంగానగర్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 28న రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. అలాగే అమృత్‌సర్ - హెచ్.ఎస్.నాందేడ్ (12422) ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 28న రద్దు చేశారు. మాతా వైష్ణో దేవి కత్ర - యశ్వంత్‌పూర్ ను ఈనెల 29న రద్దు చేశారు. అదే విధంగా మాతా వైష్ణోదేవి కత్ర - చెన్నై సెంట్రల్‌ను ఈనెల 26న, చెన్నై సెంట్రల్ - మాతా వైష్ణో దేవి కత్ర (16031) ను ఈనెల 27న రద్దు చేసినట్లు ప్రకటించారు. మాతా వైష్ణోదేవి క త్ర - కన్యాకుమారి (16318 / 16788) రైలును ఈనెల 28న , తిరునెవెలి - మాతా వైష్ణోదేవి కత్ర రైలును ఈనెల 28న రద్దు చేసినట్లు ప్రకటించారు. మాతా వైష్ణోదేవి క త్ర - మంగళూర్ తిరువెల్లి ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 31 న రద్దు చేశారు. అలాగే చెన్నై సెంట్రల్ - లక్నో (నెంబర్ 16093) ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

జీఎస్టీ వసూళ్లు రూ. 2, 609కోట్లు

- పెట్రో, మద్యం ఆదాయం అదనం
- జీఎస్టీ రూ. 506కోట్లు
- ఎస్‌జీఎస్టీ రూ. 781కోట్లు
- ఐజీఎస్టీరూ. 878కోట్లు
- సెస్సులు రూ. 444కోట్లు
- జీఎస్టీలో ఎన్‌రోల్‌మెంట్లు 2లక్షల 49వేలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత రెండు నాలల రాబడిపై స్పష్టత వస్తోంది. దేశమంతటా ఏకీకృత పన్ను పేరుతో వస్తు సేవలత పన్ను అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. కాగా ఇప్పటివరకు రాష్ట్రంలో జీఎస్టీ పన్ను వసూళ్లు రూ. 2వేల 609 కోట్లుగా నమోదైనట్లు వాణిజ్య పన్నుల శాఖ వర్గాలు తెలిపాయి. ఇందులో సెంట్రల్ జీఎస్టీ(సీజిఎస్టీ) రూ. 506కోట్లు, స్టేట్ జీఎస్టీ(ఎస్‌జీఎస్టీ) రూ. 781కోట్లు, ఐజీఎస్టీ(ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ) రూ. 878కోట్లుకాగా సెస్సుల రూపంలో మరో రూ. 444కోట్లు వసూలైంది. ఇది కాకుండా జీఎస్టీనుంచి మినహాయింపు ఉన్న ఎక్సైజ్, పెట్రో ఉత్పత్తులపై భారీగా పన్ను రాబడి వసూలవుతోంది. గత నెలలో ఆబ్కారీ ఆదాయం రూ. 654కోట్లు కాగా పెట్రో ఉత్పత్తులపై రూ. 720 కోట్ల ఆదాయం ఖజానాకు చేరింది. అయితే ఇందులో పెట్రో, మద్యం రాబడి మాత్రమే తెలంగాణ రాష్ట్ర ఖజానాకు చేరుతోంది. ఇక జీఎస్టీలో భాగంగా ఎస్‌జీఎస్టీ పన్ను మాత్రమే నేరుగా స్టేట్ ఖజానాకు జమ అవుతుంది. వివిధ రాష్ట్రాల్లో వసూలైన పన్నుల్లో ఐజీఎస్టీవాటా కొంత మొత్తం తెలంగాణకు తర్వాత రానుంది. మన రాష్ట్రంలో ఎస్జీఎస్టీ వివిధ రాష్ట్రాలకు వెళ్లనుంది. అయితే మన రాష్ట్రం వినియోగ రాష్ట్రంగా ఉందని, ఉత్పాదనా రంగాల్లో ఉన్న రాష్ట్రాలకు పన్ను లోటు ఉంటుందని తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు జీఎస్టీలో నమోదు చేసుకున్న వ్యాపారుల సంఖ్య 2లక్షల 49వేలుగా ప్రభుత్వం తేల్చింది. మరో 15 వేల దరఖాస్తులు ప్రగతిలో ఉన్నాయని, జీఎస్టీ రిటర్న్‌లను 32 వేల మంది దాఖలు చేసినట్లుగా తెలిసింది.

అంగన్‌వాడీలకు రేషన్ సరుకులు

- త్వరలో రాష్ట్రంలో 300 కొత్త అంగన్‌వాడీ భవనాల నిర్మాణం
- అంగన్‌వాడీల్లో ఖాళీల భర్తీ: మంత్రి తుమ్మల



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వచ్చే నెలనుంచి రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు చౌక ధరల దుకాణాలనుంచే రేషన్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు స్థానికంగా ఉండే స్టాక్ పాయింట్ డిపోలనుంచి అంగన్‌వాడీలకు రేషన్ సరఫరా అవుతోంది. అయితే దీనిని మార్చుతూ ఇకపై రేషన్ దుకాణాలనుంచేసరుకులను అంగన్‌వాడీ కేంద్రాలకు చేరవేయాలని సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ఆదేశాలను జారీ చేశారు. ఇప్పుడు అమలులో ఉన్న విధానంతో కావాల్సినంత రేషన్ సకాలంలో అందడంలేదని, దీనిని నివారించి సమయాన్ని ఆదా చేసేందుకు స్థానిక రేషన్ దుకాణాలకే బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్ బయో మెట్రిక్ ఆధారంగా రేషన్ అందిస్తారని, ఆయా కేంద్రాల్లో ఉండే పిల్లల సంఖ్య మేరకే రేషన్ అందించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 60ఏళ్లు నిండిన టీచర్లు, ఆయాలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద డబ్బులను అందించనున్నట్లు మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ. 60వేలు, ఆయాలకైతే రూ. 30వేల చొప్పున ఇస్తామని పేర్కొన్నారు. కొందరు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ వయసు సహకరించడంలేదని, తమకు ఏదో విధంగా సాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారని, వారిని ఆదుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఖాళీలను భర్తీ చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైందని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు.

త్వరలోనే అన్ని జిల్లాల్లో ఖాళీల మేరకు భర్తీలు పూర్తి చేస్తామన్నారు. ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను త్వరగా ముగించాలని సూచించారు. ప్రక్రియ అంతా పైరవీలకు తావులేకుండా ఆన్‌లైన్‌లో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా నిజమైన అర్హులకే పోస్టులు దక్కేలా చూడాలని కోరారు. అదే తరహాలో నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

వెనుకబడ్డ ప్రాంతాల్లో కొత్తగా 300 అంగన్‌వాడీ మోడల్ భవనాలు...

రాష్ట్రంలో వెనకబడిన ప్రాంతాల్లో కొత్తగా 300 అంగన్‌వాడీ మోడల్ భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి తుమ్మల చెప్పారు. వీటి నిర్మాణానికి వేదాంత ఫౌండేషన్ ముందుకువచ్చిందని తెలిపారు. దేశవ్యాప్తంగా వెనుకబడిన ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించేందుకు ఈ ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. 11 రాష్ట్రాల్లో నాలుగు వేల భవనాలు నిర్మిస్తున్నారని, ఇందుకు కేంద్రంతో అవగాహనా ఒప్పందం కుదిరిందన్నారు. ఈ భవనాల నిర్మాణానికి భూములు అప్పగించాలని సూచించారు. ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. 704 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక్కో భవనాన్ని నిర్మించనున్నారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలను వెంటనే మరమ్మత్తులు చేయాలన్నారు. అద్దె భవనాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శాశ్వత భవనాల్లోకి మార్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి జగదీశ్వర్, డైరెక్టర్ విజయేంద్ర బోయి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కళలతో మానసిక ఉల్లాసం

అమరావతి, ఆంధ్రప్రభ : భారతీయ సాంప్రదాయ కళలు మానసిక ఉల్లాసానికి తోడ్పాటును అందిస్తాయని, మానసికంగా బలంగా ఉన్నవారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని రాష్ట్రవైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం విజయవాడలో సుబ్రహ్మణ్య మహంతి సంగీత సమితి ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ కళలు, మాతృ భాషలను కాపాడుకునేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తూ సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నేటి వేగవంతమైన ప్రపంచంలో సంగీతం, వ్యాయామం జీవితంలో భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని రీతిగా సాంస్కృతిక రంగానికి, ప్రజా రోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజారోగ్య సేవల్లో జాతీయ స్థాయిలో అనేక అవార్డును గెలుచుకొని దేశంలోనే నెంబర్ వన్‌గా ఏపీ నిలిచిందన్నారు. నేటి యువ తరాన్ని శాస్త్రీయ సంగీతం, సాంప్రదాయ కళ లవైపు ఆకర్షితులయ్యేలా కార్యక్రమాలు నిర్వహిం చాలని సాంస్కృతికసంస్థలకు సూచించారు. అనంతరం దేశంలోనే ప్రసిద్ద సంగీత కళాకారులుగా గు ర్తింపు పొందిన మల్లాది సోదరులు శ్రీరామ్‌ప్రసా ద్, రవి కుమార్‌లు ఆలపించిన త్యాగరాజ కీర్తనలు శ్రోతలను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, కళాకారులు మావుడూరి సత్యనారాయణ వర్మ, కె.సాయి గిరిధర్ సరస్వతుల హనుమంతరావు, సి.వి.రావు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.వి.ఎస్.చౌదరి తదితరులు పాల్గొన్నారు. .

కొత్త విధానంలో పాత పద్ధతే

- ఆన్‌లైన్ ఊసే లేని మద్యం విధానం
- దరఖాస్తు రుసుముల లోటు
- తగ్గనున్న రాబడి
- ఆన్‌లైన్‌తో ఏపీలో అదనంగా రూ. 500 కోట్ల రాబడి
- తెలంగాణలో నామ మాత్రమే
- కొత్త పాలసీలో ఆన్‌లైన్ దరఖాస్తులే మేలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నూతన మద్యం విధానంలో పారదర్శకత, రాబడి పెంపును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. అక్టోబర్ 1నుంచి అమలులోకి రానున్న నూతన మద్యం విధానంలో కీలక అంశాలను విస్మరించినట్లుగా తెలుసింది. ప్రధానంగా మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించి, ఆన్‌లైన్‌లోనే లైసెన్సులను కేటాయించాలన్న విధానాన్ని ముఖ్య కార్యదర్శి తిరస్కరించినట్లుగా సమాచారం. తాజాగా పొరుగు రాష్ట్రంలో ఏపీలో మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తీసుకోవాలని నిర్ణయించారు. తద్వారా 3 రెట్ల దరఖాస్తు రుసుము రాబడి పెరిగిందని తెలిసింది. ఇదే విధానం ఇక్కడా అమలు చేసి పారదర్శకత పెంచాలన్న అధికారుల నిర్ణయాన్ని ముఖ్య కార్యదర్శి తోసిపుచ్చినట్లుగా తెలిసింది. రాష్ట్రంలో 2216 ఏ4 (వైన్స్) మద్యం దుకాణాలను గుర్తించగా 2144 దుకాణాలకు లైసెన్సులను జారీ చేశారు. ఇందుకు 31వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు రూ. 50వేల తిరిగి చెల్లించబడని దరావత్తును ఆబ్కారీ శాఖ వసూలు చేస్తోంది. గత రెండేళ్ల క్రితం దరఖాస్తు రుసుముల రూపంలో రూ. 130 కోట్లు సమకూరాయి. అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తే భారీగా రాబడి పెరిగే అవకాశం ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. సిండికేట్లు ఒక్కో దుకాణానికి తక్కువ సంఖ్యలో దరఖాస్తులు సమర్పించడం, కొత్తగా ఔత్సాహిక వ్యాపారులు ఈ రంగంలోకి వచ్చేందుకు సరైన అవగాహన లేకుండా పోవడం వంటి అవరోధాలను ఆన్‌లైన్ విధానం ద్వారా నివారించే అవకాశముంది. దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ సీఐ మొదలుకొని కమిషనర్ కార్యాలయం వరకు భారీగా ముడుపులు చేతులు మారుతున్నాయని, అనేక క్లిష్టమైన ఫారాలతో దరఖాస్తుల సంఖ్య తగ్గుతోందని గతంలో ఈ శాఖలోని ఉన్నతాధికారులు గుర్తించి ఆన్‌లైన్ విధానం మేలని సర్కార్‌కు సూచించారు. ఈ విధానం అమలులోకి వస్తే దరఖాస్తుల సంఖ్య పెరిగి రూ. 500కోట్ల అదనపు రాబడి దరఖాస్తు రుసుముల రూపంలో ఖజానాకు చేరనుందనే అంచనాలున్నాయి. ఆన్‌లైన్ విధానంతో దరఖాస్తులను స్వీకరిస్తే జాప్యం తగ్గడంతోపాటు, అవినీతికి చరమగీతం పాడొచ్చని, ముడుపులు చెల్లించే దుస్థితి తప్పుతుందన్న అధికారుల సూచనలను పట్టించుకోకుండా ఉన్నతాధికారులు పాలసీ ముసాయిదాను రూపొందిస్తున్నారు.

ఈ ఏడాది 850 బార్లతోపాటు 2144 మద్యం దుకణాలను ముసాయిదాను రూపొందిస్తున్నారు. దీంతో అక్టోబర్ 1నుంచి సెప్టెంబర్ 30 వరకు ఆబ్కారీ విధానం ఖరారు కానుంది. ఈ పాలసీలో వ్యాపారుల ట్రేడ్ మార్జిన్ పెంచాలని నిర్ణయించినట్లుగా తెలిసింది. బార్, మద్యం దుకాణాల గడువును రెండేళ్లనుంచి మూడేళ్ల పరిధికి పెంచాలని, 14.5 శాతంగా ఉన్న అదనపు ప్రివిలేజ్ ఫీజును ఎత్తివేయాలని, దుకాణాల సంఖ్యను పెంచడంతోపాటు, లైసెన్సు రుసుముల స్లాబ్‌లను పెంచి రుసుములను తగ్గించాలనే సిఫార్సు చేసినట్లుగా తెలిసింది. కాగా ఈ నెలాఖరుతో బార్ విధానం క ూడా ముగియనుంది. 2015 అక్టోబర్ 1న అమలులోకి తెచ్చిన బార్ పాలసీ ఈ నెల 30తో రెండేళ్ల పరిమితి ముగియనుంది. అయితే మద్యం దుకాణాల గడువు జూలైతోనే పూర్తయినప్పటికీ జాతీయ రహదారులపై 500 మీటర్లలోపు ఉన్న దుకాణాలను తరలించాలనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నెలాఖరు వరకు సుప్రీంకోర్టు పొడిగింపునిచ్చింది. అదేవిధంగా అదనపు రాబడి ఆర్జనకు గత కొంత కాలంగా ప్రతిపాదనలో ఉన్న షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లలో నిర్ణీత రుసుములతో మద్యం లైసెన్సులను జారీ చేయాలనే యోచన చేస్తున్నట్లుగా తెలిసింది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 29 ఆగస్టు 2017


ఖట్టర్ సంగతి తేల్చరా?



అనిత నల్లూజ
సీనియర్ పాత్రికేయురాలు

విశ్లేషణ

సరిగ్గా పదమూడేళ్ళ క్రితం 2004లో ఢిల్లీ పార్లమెంటు స్ట్రీట్‌లో పెద్ద సమూహాన్ని ఉద్దేశించి ఆశారామ్ బాపూ గంభీరోపన్యాసం ఇస్తున్నారు. ఆయన పెద్ద ర్యాలీలో ప్రసంగిస్తుండగా నేను ఆ ప్రాంతాన్ని సందర్శించడం తటస్థించింది. ఆ ర్యాలీకి హాజరైన ప్రముఖుల్లో పలువురు కేంద్ర మాజీ మంత్రులు కూడా ఉన్నారు. కంచి శంకరాచార్య జయేంద్ర సరస్వతి స్వామి అరెస్టుకు నిరసనగా నిర్వహించిన ఆ ర్యాలీలో ప్రసంగించే సమయానికి ఆశారామ్ బాపూజీపై ఇం కా ఎటువంటి ఆరోపణలు రాలేదు. వివిధ నేరాలకు సంబంధించి ఆయనపై ఎటు వంటి కేసులూ లేవు. అయితే, ఆ రోజున ఆయన ప్రసంగించిన తీరు, వ్యక్తం చేసిన భావోద్వేగాలు చూశాను, ఆయన ఉపన్యాసాన్ని రాజకీయ వేత్తలు అంత ఓరిమితో వినడం నాకు ఆశ్చర్యం కలిగించింది. నా దృష్టిలో ఆయన ఒక దొంగబాబా అని అప్పటికే నేను నమ్ముతున్నాను. ప్రజలను వంచిస్తున్నాడు. ఆ విషయం ఆ తర్వాత నిర్ధారణ అయింది. ఎంతో మంది మహిళలను ఆయన లోబర్చుకున్నట్టు కోర్టులు నిర్ధారించాయి. మన దేశంలో చాలా మంది బాబాలు ఉన్నారు. వారిలో గుర్మీత్ రామ్‌రహీమ్ ఒకరు . డేరా సచ్చా సౌదా బాబాగా ఆయన పేరు గడించారు. దేవుని పేరిట ఆయన అమాయక ప్రజలను వంచిస్తున్నారు. ఇలాంటి బాబాలు చెలరేగి పోవడానికి ప్రజల అమాయకత్వం ఒక కారణమైతే, అధికారంలో ఉన్న ప్రభుత్వాల ది ప్రధాన కారణం. గుర్మీత్‌సింగ్ బాబాని ప్రోత్సహించిన, ఇప్పటికీ ప్రోత్సహిస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకీ ఇందులో బాధ్యత ఉంది. మన సమాజంలో నిరుద్యోగుల సంఖ్య నానాటికీ పెరుగుతున్న కొద్దీ చాలా మంది గురువులుగానూ, బాబాలుగానూ అవతారమెత్తుతున్నారు. ధారాళంగా ఉపన్యాసాలు ఇవ్వడం, హిందూ మతాన్ని గురించి మౌలికాంశాలు తెలిసి ఉండటం వంటి అర్హతలు ఉంటే, ఎవరైనా బాబాలుగా, స్వాములుగా అవతారమెత్తవచ్చు. ముందుగా సమావేశాలకు తమ జనాన్ని తరలించుకుంటారు. తమ ఉపన్యాసాలతో జనాన్ని ఆకర్షిస్తారు. ఆ నోటా ఈనోటా ప్రచారం విస్తృతంగా జరుగుతుంది. ఆ రకంగా వారు బాబాలుగా, స్వాములుగా ప్రసిద్ధులవుతారు. రామ్ రహీమ్ బాబా మాదిరిగానే నిర్మల్ బాబా అనే ఆయన ఉన్నారు. ఆయన ప్రసంగాలకు అసంఖ్యాకంగా జనం హాజరైనట్టు టెలివిజన్ చానల్స్‌లో ప్రసారాలు తరచూ జరుగుతూ ఉంటాయి. ఆయన తన ఉపన్యాసాల్లో భక్తులనుద్దేశించి అనేక సూచనలు చేస్తుంటారు. తమ బాధలు మరిచి పోవడానికి మద్యాన్ని సేవించమనీ, సమోసా, ఇతర తినుబండారాలను తినమని ఆయన సలహా ఇస్తుంటారు. ఉద్యోగం కోరుకునే వారు ఫలానా బ్రాండ్ మద్యాన్ని సేవించమని ఆయన తన శిష్యులకు సలహా ఇవ్వడం నేను కళ్ళారా చూశాను. టెలివిజన్ ఛానల్స్‌లో ఇలాంటివన్నీ ఎవరో డబ్బు కట్టి ప్రసారం చేయించే కార్యక్రమాల్లో (స్పాన్సర్ షోల్లో) భాగంగా ప్రసారం అవుతూ ఉంటాయి. సమాజం నుంచి చెడును పూర్తిగా తొలగించాలన్న చిత్తశుద్ధి,ఆసక్తి మనకు ఉన్నట్టయితే, ముందుగా ఇలాంటి స్పాన్సర్ షోలను నిషేధించాలి. రామ్‌రహీమ్ బాబా మాదిరిగా అనేక మంది బాబాలు ఉన్నారు. సుఖ్వీందర్ కౌర్ అనే ఆమె రాధేమాగా సుపరిచితురాలు. అలాగే, నిత్యానంద స్వామి లీలల గురించి మనం విన్నాం, చానల్స్‌లో చూశాం. వీళ్ళంతా దేవుని పై భక్తి పేరిట భక్తులను పెడతోవ పట్టిస్తున్నారు. ఇలాంటి స్వాములు, బాబాల వెంట రాజకీయవేత్తలు ఎందుకు పడుతున్నారంటే, ఓట్లను దండుకోవడం కోసమే. బాబాలు,స్వామీజీల సత్సంగాలకూ, ర్యాలీలకూ హాజరయ్యే జనాన్ని తమకు ఓటు బ్యాంకుగా వాడుకోవాలన్న కాంక్షతోనే రాజకీయ నాయకులు ఈ స్వాముల వెంట పడుతున్నారు. స్వామీజీ, సాధ్వీలకూ, దొంగ బాబాలకూ మధ్య సన్నని విభజన రేఖ ఉంది. బాబాలను ప్రోత్సహించే ముందు ప్రభుత్వం వారి కార్యకలాపాల గురించి సమగ్రంగా తెలుసుకోవాలి.



1992 డిసెంబర్ 6వ తేదీన అయోధ్యలో బాబ్రి మసీదు కూల్చివేత ఘటన జరిగిన మూడుగంటల్లో హైదరాబాద్‌లో శాంతి భద్రతల పరిస్థితిని ఆనాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి ఆదేశంపై తాము అదుపులోకి తెచ్చినట్టు ఆనాటి పోలీసు సూపరింటెండెంట్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు తెచ్చుకోవడం సమయోచితమే. మనసుంటే మార్గం ఉంటుందని ఆయన రుజువు చేశారు.

గుర్మీత్‌సింగ్ అలియాస్ రామ్‌రహీమ్ బాబా అనుచరులు సృష్టించిన విధ్వంస కాండను నిలువరించ లేకపోయారంటూ హర్యానా పోలీసు డిజిపిని బలిపశువుగా చేయడం సరైన చర్య కాదు. రామ్‌రహీమ్ సింగ్‌ని పదిహేనేళ్ళ క్రితం నాటి అత్యాచారం కేసులో పాటియాలాలోని సిబీఐ ప్రత్యేక కోర్టు దోషిగా ప్రకటించగానే, అప్పటికే అక్కడ వేచి ఉన్న వేలాది మంది ఆయన భక్తులు, అభిమానులు ఆందోళనకు దిగారు. రామ్‌రహీమ్ బాబాను ప్రోత్సహించిన హర్యానా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇందుకు హర్యానా డిజిపిపై చర్య తీసుకోవడం సమంజసంగా లేదు. రామ్‌రహీమ్ బాబాకు కోర్టు ఈరోజు రెండు నేరాలకు గాను పదేసి ఏళ్ళ చొప్పున ఇరవై ఏళ్ళ జైలు శిక్ష విధించడం హర్షణీయం.అదే సందర్భంలో హింసను ప్రేరేపించిన వారెవరో నిర్ధారించాలి. ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడానికీ,కోట్లాది రూపాయిల ఆస్తుల ధ్వంసానికీ బాధ్యులెవరో నిర్ధారించాలి. చట్టప్రకారం అత్యాచార నేరానికి పాల్పడిన వ్యక్తికి శిక్ష పడింది.మరి హర్యానాలో 35 మంది పైగా మరణానికి బాధ్యులైన వారి సంగతి ఏమిటి? పరిస్థితిని అదుపు చేయలేకపోయిన ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని బర్తరఫ్ చేయాల్సిందే.

డోక్లామ్‌పై చైనాను నమ్మొచ్చా?!

సిక్కిం సరిహద్దుల్లో డోక్లామ్ ప్రాంతం నుంచి సేనలను ఉపసంహరించుకోవాలని భారత్, చైనా కుదుర్చుకున్న అవగాహనను చైనా గౌరవిస్తుందా అన్న అనుమానం గత అనుభవాల దృష్ట్యా నిరాధారం కాదు. భారత్‌తో చైనా ఎప్పుడూ సానుకూలవైఖరితో లేదు. అపోహలు పెంచుకోవడం,అనవసరమైన రాద్ధాంతాలు సృష్టించడం చైనాకు అలవాటే. తమ దేశంలో ప్రజల దృష్టిని మళ్ళించడానికి పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని రోజూ ఉల్లంఘిస్తున్నట్టే, చైనా తన ప్రాబల్య విస్తరణ కాంక్ష నుంచి ప్రపంచ దేశాల దృష్టిని మరలించడానికి తరచూ వివాదాలు సృష్టిస్తూ ఉంటుంది.అటువంటిదే డోక్లామ్ వివాదం. అమెరికాను మించి ఆర్థికంగా అజేయమైన శక్తిగా ఎదిగిపోవాలన్నకాంక్ష చైనాకు ఉంది.అదే సందర్భంలో పొరుగుదేశాల భూభాగాల మీదుగా నిర్మాణాలు సాగించి, తన వాణిజ్యాన్ని పెంచుకోవాలన్న అత్యాశా చైనాకు ఉంది.చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మన దేశ పర్యటనలో ఉన్నప్పుడే లడఖ్‌లోకి చైనీస్ సేనలు చొచ్చుకుని వచ్చాయి. జిన్‌పింగ్‌తో చర్చల్లో ప్రధాని నరేంద్రమోడీ ఈ విషయం ప్రస్తావించగానే ఆయన తమ సేనలను వెనక్కు వెళ్ళాలని ఆదేశించారు. చైనా సేనలు వెనక్కి వెళ్ళినట్టు వెళ్ళి ఆ మరునాడే మళ్ళీ యథాస్థానానికి వచ్చాయి.చైనా మాటమీద నిలబడదనడానికి ఇదొక్కటే చాలు. మోడీ బీజింగ్ పర్యటన సందర్భంగా ద్వైపాక్షిక వాణిజ్యం ఉభయతారకంగా ఉండేట్టు చర్యలు తీసుకుంటామని జిన్‌పింగ్ ఢిల్లీ పర్యటన సందర్భంగా హామీ ఇచ్చారు. మూడేళ్ళు కావస్తున్నా, ఆయన హామీ ఇంతవరకూ అమలు జరగలేదు. తమ దేశం చేసే ఉత్పత్తులను భారత్‌లోకి కుప్పతెప్పలుగా ఎగుమతి చేస్తున్న చైనా, మన ఉత్పత్తులను కొనుగోలు చేయడం పట్ల ఆసక్తి చూపడం లేదు.ద్వైపాక్షిక వాణిజ్యంలో లోటు 40 శాతం కొనసాగుతోంది. మాటకు కట్టుబడే నైజం చైనాకు లేదనడానికి ఇది మరో ఉదాహరణ.

అసలు డోక్లామ్‌లో ఉద్రిక్తత సృష్టించింది చైనాయే. ట్రై జంక్షన్ (త్రి కూడలి)గా పిలవబడే ప్రాంతంలో భూటాన్ సరిహద్దులు దాటి చైనా సేనలు చొచ్చుకుని వెళ్ళడంతో ఉద్రిక్తత ఏర్పడింది. రాయల్‌భూటాన్‌తో మన సైన్యానికి ఉన్న ఒప్పందం కారణంగా,రాయల్ భూటాన్ సైనికులు మన సాయాన్ని కోరారు.దాంతో ముందు జాగ్రత్త కోసం సిక్కిం సరిహద్దుల్లో మన సేనలను కూడా మోహరించాల్సి వచ్చింది. ఇందుకు బాధ్యత పూర్తిగా చైనాదే అయినప్పటికీ, మన సైనికులేదో చొరబడినట్టు గగ్గోలు చేసింది. ఇప్పుడు కూడా అవగాహనకు అంగీకరించినట్టు తలూపిన చైనా తమ సేనలు గస్తీ కొనసాగిస్తారంటూ సన్నాయి నొక్కులు ప్రారంభించింది. పొరుగుదేశానికి చెందిన సేనలు తమ భూభాగంలో ప్రవేశిస్తారేమోనన్న అనుమానం ఉన్నప్పుడే ఏ దేశమైనా గస్తీని కొనసాగిస్తుంది.కానీ, డోక్లామ్ వద్ద పొరుగు దేశం భూభాగంలోకి చొచ్చుకుని వెళ్ళాలన్న దురాలోచన, దుష్ట సంకల్పం భారత్‌కి ఏ కోశానా లేవు.అటువంటివి చైనాకే ఉన్నాయన్నది చరిత్ర నిరూపితమైన సత్యం. చైనా ఆక్రమించుకున్న మన భూభాగాలను ఏభైఐదేళ్ళు దాటినా ఇంతవరకూ ఖాళీ చేయలేదు,సరికదా, ఆ భూభాగాల మీదుగానే మహామార్గం నిర్మాణానికి చైనా పథకాలను రూపొందించింది. చైనా తలపెట్టిన వన్ బెల్ట్-వన్ రోడ్డు పథకం ఆ కోవకు చెందినదే. చైనా ఆక్రమించిన భూభాగాల మీదుగానే మహామార్గాన్ని నిర్మిస్తున్నందువల్లనే వన్ బెల్ట్-వన్ రోడ్డు పథకంపై బీజింగ్‌లో ఏర్పాటైన రెండు రోజుల సదస్సుకు మన దేశం హాజరు కాలేదు. డోక్లామ్‌లో సేనల ఉపసంహరణపై కుదిరిన అవగాహనకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేస్తామంటూ చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి ప్రకటించారు.ఆ మార్పులేమిటో వెల్లడించలేదు.అలాంటి ముఖ్యమైన విషయాలను రహస్యంగా ఉంచడం వల్ల అనుమానాలు రేకెత్తుతాయి.ఇరుదేశాల మధ్య వివాదం మహామార్గం గురించే తలెత్తింది.ఈ మార్గం నిర్మాణాన్ని కొనసాగిస్తామని కానీ,విరమించుకున్నామని కానీ ప్రకటించకుండా సస్పెన్స్‌లో ఉంచింది. భవిష్యత్‌లో చేస్తామన్న మార్పులు ఈ మహామార్గం విషయంలోనా,లేక సరిహద్దుల్లో తమ సేనల గస్తీ గురించా అనే విషయమై కూడా చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి స్పష్టంగా ప్రకటించలేదు. చైనా పోకడ చూస్తుంటే, తాత్కాలికంగానే వెనక్కి తగ్గినట్టు కనిపిస్తోంది. మరి కొద్ది వారాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు హాజరయ్యేందుకు గాను బీజింగ్‌లో పర్యటించనున్న దృష్ట్యా, ముఖం చెల్లని పరిస్థితి నుంచి తప్పించుకోవడానికే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఈ అవగాహనకు అంగీకరించి ఉండవచ్చు.అంతేకాక, భారత్‌ని కవ్వించడం కోసమే డోక్లామ్ వద్ద చైనా ఉద్రిక్తతను పెంచిందన్న వాస్తవాన్ని అన్ని దేశాలూ గుర్తించాయి. వన్ బెల్ట్,వన్ రోడ్డు పథకం అమలు కోసం చైనా పాకిస్తాన్‌ని అడ్డగోలుగా సమర్థించాల్సి వస్తోంది.పాక్ తప్పులన్నింటినీ నెత్తిన పెట్టుకుని మోయాల్సి వస్తోంది. ఈ విషయమై కూడా చైనాలో నిరసనలు వ్యక్తం అవుతున్నట్టు వార్తలు వచ్చాయి. డోక్లామ్‌లో సేనల ఉపసంహరణ అవగాహనకు చైనా రావడానికి ఇది కూడా ఒక కారణం కావచ్చు. అన్నింటికన్నా, ఆఫ్ఘనిస్థాన్ నుంచి తమ సేనలను ఉపసంహరిస్తామన్న వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మనసు మార్చుకోవడం తమ వ్యూహాల అమలుకు అడ్డంకిగా చైనా భావించి ఉండవచ్చు.అయితే, ఎప్పటికప్పుడు పరగడపే అన్న సామెత చందాన దుందుడుకుగా వ్యవహరించే చైనాను ఎప్పటికీ నమ్మలేం.

మానవత్వమే మిన్న!

సమాజంలో మార్పు అత్యంత సహజం.యుగాలు, తరాలను బట్టి మనిషి జీవన విధానంలో, స్థితిగతుల్లో, ఆచార వ్యవహారాల్లో కాలక్రమంలో వస్తున్న మార్పులు పరిణామక్రమంలో భాగం. పాలనా విధానంలో మార్పులు వచ్చాయి. రాచరిక వ్యవస్థ స్థానే మనకు మనమే పరిపాలించుకునే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రస్తుతం మనం ఉన్నాం. ప్రజల ఆరాధనా విధానంలో మార్పులు వచ్చాయి. ఆది మానవుడి నుంచి నేటి ఆధునిక మానవుడి వరకు నాగరికత, ఆచార వ్యవహారాలు, సంస్కృతిలో వచ్చిన మార్పులు ఎన్నో. ప్రజాస్వామ్య వ్యవస్థలో లౌకిక వాదం సర్వజనామోదం పొందింది. తద్వారా భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించగలిగాం.

విద్య, నాగరికత ప్రభావం వల్ల హిందు మతంలో మార్పులు వచ్చాయి. తరతరాలుగా కొనసాగుతున్న ఆచారాలు, నమ్మకాలను ఇప్పుడు ఎవరూ పాటించడం లేదు. మన సెక్యులర్ రాజ్యాంగం ద్వారా ప్రజలకు ఆ స్వేచ్ఛ లభించింది. ముస్లిం మహిళలు కూడా ఉన్నత విద్యావంతులవుతున్నారు. ఆధునిక జీవన రీతులను ఆహ్వానిస్తున్నారు. వారి మతాచారం పేరిట తరతరాలుగా అమలులో ఉన్న ముమ్మారు తలాఖ్ చెప్పే దురాచారానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. భర్త భార్యకు లేఖ ద్వారా కానీ, ఫోన్ ద్వారా కాని ముమ్మారు తలాఖ్ చెబితే విడాకులు ఇచ్చినట్టే. ఇది మతాచారంగా కాకుండా, లింగవివక్షగా చూడాలని ముస్లిం మహిళలు కోరుతున్నారు.ఎంతో కాలంగా ఉద్యమాలు సాగిస్తున్న ముస్లిం మహిళలు న్యాయపోరాటం సాగించి అత్యున్నత న్యాయస్థానంలో విజయం సాధించారు. ఇది లింగవివక్ష అని అత్యున్నత న్యాయస్థానం మెజారిటీ తీర్పుతో నిర్ధారించింది. మహిళా సాధికారికతకు ఇదొక మైలురాయి కానుంది. ముస్లిముల పవిత్ర గ్రంథమైన ఖురాన్ ప్రకారం ముమ్మారు తలాఖ్ తప్పు అంటున్నప్పుడు, చట్టప్రకారం ఎలా సక్రమం అవుతుందంటూ మెజారిటీ తీర్పు తోసిపుచ్చడంతో దశాబ్దాల ఛాందసవాద, పిడివాదాలు, శృంఖలాలు సంకెళ్ళు తెగిపడ్డాయి. ఇరుగు పొరుగు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, టర్కీ వంటి ముస్లిం దేశాలన్నీ మతాచారాన్ని మానవీయంగా సంస్కరించుకున్నాయి. తలాఖ్‌పై విచారణ చేపట్టిన ఐదుగురు న్యాయమూర్తులు, ఐదు మతాలకు చెందినవారు 3-2 మెజారిటీతో ట్రిపుల్ తలాఖ్ మహిళా ప్రాథమిక హక్కులకు భంగం, చట్టవ్యతిరేకం, రాజ్యాంగ విరుద్ధమని తీర్పు ఇచ్చి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఆరు నెలల్లో దీనిపై పార్లమెంటులో చట్టం తేవాలని సూచించడం ముస్లిం మహిళల పాలిటి వరంగా మారనుంది.అయితే, చట్టం చేసినంత మాత్రాన సరిపోదు. చట్టాలను చాపచుట్టగల ఘనులు మనలో చాలా మంది ఉన్నారు. వరకట్న దురాచారం ఈనాటికీ సమాజాన్ని పీడిస్తుండటం ఇందుకు నిదర్శనం. నా మతమే మనుగడ సాగిస్తుం దని ఎవరైనా అనుకుంటే పొరపాటేనన్న స్వామివివేకానంద ప్రబోధాన్ని మరువ రాదు. అలాగే,స్త్రీ,పురుషులకు సమానమైన స్వేచ్ఛ లభించినప్పుడే ఏ సమాజమైనా సుఖశాంతులతో కొనసాగుతుందన్న పెద్దల మాట చద్దిమూట. మహిళలపై వివక్షతకు సంబంధించిన వాటిని వెంటనే సంస్కరించుకోవాలి. వ్యక్తి స్వేచ్ఛను ఏ మతమూ హరించదు, మానవత్వమే అన్ని మతాల సారమని గమనించాలి.కాలం చెల్లిన సిద్ధాంతాలకు చరమగీతం పాడాలి. మనుషులంతా మానవతావాదులుగా వెలుగొందాలి. మతం కాదు మానవత్వమే మనందరి మతమని నినదిద్దాం... నిరూపిద్దాం...



నేటి ఆధునిక భారతదేశంలో ప్రతిపౌరుడు ఆలోచనా స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, విశ్వాస స్వేచ్ఛ, ఆహార స్వేచ్ఛను హరిస్తే, ప్రతిఘటన అనివార్యమౌతుంది. ప్రపంచంలో ఎక్కడ ఏ అన్యాయం జరిగినా కులం, మతం, ప్రాంతం, జాతి, లింగ బేధాలు లేకుండా కవులు, రచయితలు, బాధితుల పక్షాన నిలిచి అక్షర పోరాటం చేయాలి.

భావవ్యక్తీకరణ స్వేచ్ఛ అందరికీ ఉందని చెపిన తస్లీమా నస్రీన్ ముస్లిం ఛాందసవాదుల దాష్టీకాలకు ఎదురొడ్డి దేశ బహిష్కరణకు గురికావడాన్ని చూశాం. ఇలా ఒక్క ముస్లిం మతమే కాదు అన్ని మతాలు నేడు సుప్రీం కోర్టు తీర్పుతో సంస్కరణలకు పూను కోవాలి. భారతపౌరులు వైజ్ఞానిక ధోరణిని, మానవతా వాదాన్ని, సత్యాన్వేషణ తత్వాన్ని, సంస్కరణ తత్వాన్ని అలవరచుకోవడం కర్తవ్యం గా భావించాలి.

మన సమాజం ఆటవిక దశనుండి నాగరికతవైపు అణచివేత నుండి విముక్తి వైపు, లేమి నుండి సంపదవైపు పయని స్తోంది... మతాలను సంస్కరించుకొని మానవత్వాన్ని చాటుదాం...

-మేకిరి దామోదర్, 9573666650

తెలుగు లెస్ కాదు లెస్సని నిరూపిద్దాం

క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ
ట ఠ డ ఢ ణ త థ ద ధ

ఆగస్టు 29 తెలుగు భాషా దినోత్సవం పాటిస్తున్నాం, కాని తెలుగు భాష వాడుక మరచి, ఇంగ్లీష్ భాషనే ప్రజలు ఆదరించడం సబబుగా లేదు. దేశ భాషలందు తెలుగు లెస్స అన్న దానిని అందరూ ఆదరంగా తీసుకోవాలి. దేశంలో, (3 వందల 3 వేల భాషల్లో) తెలుగు నేర్చుకోవడం సులువు. పైగా తెలుగు ప్రజలు అందరూ మంచిమనసున్నవారు, ఆపదలో ఆదుకొనే మంచి మనసున్నవారు. ఐకాస విద్య సాంస్కృతికసంస్థ 2002లో చేసిన తీర్మానం, 2029 వరకు ఇండియాలో హిందీ, బెంగాలి, మరాఠీ, తమిళం, మళయాళం మాత్రమే మిగులుతాయని పేర్కొనడంపై, గిడుగు రామమూర్తి పుట్టిన రోజు ఆగస్టు 29న తెలుగు భాషను రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది, కనుక మన విద్యావిధానంలో మార్పు రావాలి. తెలంగాణా రాష్ట్ర సమితి అధ్యక్షులు, సిఎం కేసీఆర్ గారు తెలుగు భాష కోసం అధికారుల ఉత్తరాలను, సమాధానాలను తెలుగులోనే పంపించే ఏర్పాట్లు చెయ్యాలి. రవీంద్ర భారతిలో తెలుగు భాషా గొప్పదనంపై సెమినార్లు నిర్వహించాలి. ప్రపంచంలోనే తెలుగు రాష్ట్రా లైన ఎపి టిఎస్ లలో, బతికి ఘనంగా జీవించే విధంగా రాష్ట్ర ప్రజల ఆదరాభిమానాలను కేంద్రం గుర్తించి తెలుగు భాష గొపతనంపై స్పందించాలి. దేశ భాషలందు తెలుగు లెస్స మాదిరిగానే తెలుగు రాష్ట్ర ప్రజలు తేనెమనసులుగా దేశం భావించాలి. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం చాన్సలర్ డాక్టర్ ఎస్.వి. సత్యనారాయణ గారు, విద్యావేత్త చుక్కా రామయ్య, తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గారు తెలుగు భాష గొపతనం దేశానికి తెలియచెప్పిన గిడుగు రామమూర్తికి ఘనంగా రవీంద్ర భారతిలో నివాళులు అర్పించాలి. ప్రస్తుతం తెలంగాణాలో 27 శాతం మాత్రమే తమ పిల్లలను తెలుగు మీడియంలో చేర్పిస్తున్నారు. జనాల్లో తెలుగు వెలుగు ద్వారా కూడా పైకి ఎదగవచ్చని గుర్తించి తేనెకన్న తియ్యనైన తెలుగు భాషను నేర్చుకొని తేనెమనసులు అవుదాము. అమెరికా అధ్యక్షపీఠాన్ని ఏదో ఒకరోజు తెలుగు వారు సొంతం చేసుకుంటారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని రుజువుచేద్దాం.

-కోలిపాక శ్రీనివాస్

జీఎస్టీ మాయ తెలిసొస్తోంది

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒకే పన్ను విధానం (జీఎస్టీ)కి ఏవో ఒకటి, అర తప్పించి అన్ని రాష్ట్రాలు పూర్తి మద్దతు తెలిపాయి. ఎందుకు మద్దతిచ్చామా అని ఇప్పుడు కొన్ని రాష్ట్రాలు మథనపడుతున్నాయి. జీఎస్టీ పేరుతో ప్రతి చిన్నా, చితకా వ్యాపారస్తులు సైతం దోపిడీ చేస్తున్న మాట వాస్తవం. అతికొద్ది ఖరీదు (రూ.500)తో ఒక వస్తువు కొంటే దానిపై 2 శాతం తప్పనిసరిగా పన్ను వసూలు చేస్తున్నారు. రోజువారీ కూలీలకు ఇది పెద్ద మొత్తమే. వారికిది భారమే. బడుగు, బలహీన వర్గాల, మధ్యతరగతి వారిపై పన్నుభారం లేకుండా చేసేదే నిజమైన ప్రభుత్వమని నమ్ముతారు ఓటరు. జీఎస్టీ అమల్లోకి వచ్చి కొన్ని రోజులు పోతేగాని జనాలకు అవగాహనకు రాలేదు. బ్లాక్ మార్కెట్ అంతుచూస్తామని ప్రగల్భాలు పలికిన కేంద్ర సర్కార్, అదే నంబర్ టూ దందాగా కొనసాగుతోంది. ఇదిలా ఉంటే, పెట్రోల్, డీజిల్‌పై నొప్పి తెలియకుండా మోడీ తెలివికి జోహార్లు పలకాల్సిందే. ప్రజల నుంచి ఎటువంటి నిరసనలు, ఆందోళనలు, వ్యతిరేకత వెల్లువెత్తకపోవటంపై మోడీ మాయాజాలం లోతుగా గమనిస్తే అర్థమవుతుంది. రోజువారీ హెచ్చుతగ్గులతో పెట్రోలు, డీజిల్ ధరలను అనూహ్యంగా పెరగటం గమనిస్తున్నాం. ఒక్క వారానికే రూ.6 వరకు పెరగడాన్ని ప్రజలు గమనిస్తున్నారు.నొప్పి తెలియకుండా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీతో సామాన్య ప్రజలపై దెబ్బకొడుతున్న వైనాన్ని ప్రజలు గమనించట్లేదనుకోవడం పిచ్చిపొరపాటేనని చెప్పొచ్చు. అమిత్ షా అండ్ కో దేశమంతా తమ పార్టీనే ఏలాలని ఏదో భ్రమలో ఉన్నట్లుంది. ఆ భ్రమను తొలగించే ఆయుధం ప్రజలేనని, వారికి నొప్పి కల్గించకూడదని కనీస బాధ్యతను మరచి రోజువారీ ఉపయోగాలపై కూడా జీఎస్టీ అనే మాయాజాలంతో ముంచెత్తుతుంటే 2019లో మోడీ గెలుపు ప్రశ్నార్థకమే అవుతుందేమోననిపిస్తోంది?!

-కోనేటిరాయుడు, హైదరాబాద్

సాంకేతం

మంచి మాట


ఏమైనా అభిమానమంటూ మిగిలిన ఏ పండితుడైనా, కవి అయినా తన బిరుదులు, పతకాలు అన్నీ రామ్మూర్తి పంతులుగారికి దోసిలొగ్గి సమర్పించుకొని మళ్లీ ఆయన అనుగ్రహించి ఇస్తే పుచ్చుకోవాల్సిందే.

● చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి

వాడుక భాషకే పెద్దపీట

నేడు తెలుగు భాషా దినోత్సవం

మొట్టమొదటి ఆధునిక భాషా శాస్త్రవేత్త, ఆధునిక సాహిత్య విమర్శకులు గిడుగు వేంకట రామమూర్తి పంతులుగారి జన్మదినం ఇవాళ. అందుకే ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని భాషాదినోత్సవంగా ప్రకటించింది. కొంతమంది భాషా శాస్త్రవేత్తలు, సాహితీవేత్తలకు భాషా పురస్కారాలను ఇచ్చి గౌరవిస్తోంది. ఈ సందర్భంలో మనం కొన్ని విషయాల్ని నిర్మొహమాటంగా చర్చించుకోవలసిన అవసరం ఉంది. ప్రతివ్యక్తి తమ మాతృభాషలో ప్రాథమిక విద్య గరపాలన్నది ఆయన అభిమతం. అంటే పుట్టినప్పటి నుంచి ఇతరులు మాట్లాడుతుంటే విని నేర్చుకునే భాషని పాఠశాలకు వెళ్ళి రాయడం, చదవడంతో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తవుతుంది. అంటే మాతృభాషని అందరూ మొదట నేర్చుకోవాలన్న మాట! మాతృభాషలో అతను లేక ఆమెకి తన గురించి, తన వాళ్ళ గురించి తెలుస్తుందని గిడుగు చెప్పారు. ఆ జ్ఞానంతో ఆ తర్వాత ఎన్ని భాషలనైనా నేర్చుకోవచ్చనీ ఆయన అన్నారు. మాట్లాడే భాషకి పెద్దపీట వేయాలని ఉద్యమం చేసిన భాషాశాస్త్రవేత్తే కాదు, అందరూ తమ మాతృభాషని ముందు అభ్యసించాలని చెప్పినవారు కూడా! ఆ రోజుల్లో ఆయన పర్లాకిమిడిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రోజుల్లో అక్కడ సంత జరిగేటప్పుడు పక్కనే ఉన్న కొండల్లోంచి వచ్చి తాము తెచ్చిన వస్తువుల్ని అమ్ముకునేప్పుడు నాగరికుల చేతుల్లో వాళ్ళ మోసపోతున్నట్లు గ్రహించారు. అందుకు కారణం వాళ్ళకి వాళ్ళ మాతృభాష సవర తెలియకపోవడమే అని గుర్తించారు. అందుకని తాము సవర భాషను నేర్చుకొని, వాళ్ళకు సవర భాషని బోధించడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. ముందు సవరల కథలని, పాటల్ని సేకరించారు. వాళ్ళకి లిపి లేకపోవడంతో వాళ్ళు చెప్తుంటే వాటిని తాము తెలుగు లిపిలో రాశారు. ఆ తరువాత వాళ్ళకి వినిపించి అవసరమైన విధంగా సరిదిద్దారు. తర్వాత సవర - తెలుగు, తెలుగు - సవర నిఘంటువుల్ని రూపొందించారు. అలాగే అప్పుడు ఆంగ్లేయుల పాలనలో ఉన్నాం కాబట్టి సవర - ఆంగ్లం, ఆంగ్లం - సవర నిఘంటువుల్ని రూపొందించారు. అంతటితో ఊరుకోకుండా వాళ్ళ భాషలో వాక్యనిర్మాణం ఎలా ఉంటుందో కూడా వివరించారు. ఇతరులతో ఎలా సంభాషించాలో, ఎలాంటి పదాల్ని వాడకూడదో, వాడాలో కూడా వాళ్ళ భాషను అనుసరించి చెప్పారు. ఇలా చెప్పిన వాటన్నింటినీ ప్రత్యేక పాఠశాలల్ని నిర్వహించి, సవరులకి బోధించారు. అందుకు ప్రభుత్వం సహకరించక పోయినా తామే ఆ ఖర్చుని భరించి తరగతులను నిర్వహించారు. లిపి లేని భాషకి ఇవన్నీ రూపొందించడానికి ఎంతో కష్టం అయ్యిందని ఆయన చెప్పుకున్నారు కూడా! అంటే ఆయన సవరలు అనే కొండ జాతివాళ్ళు కూడా ముందు మాతృభాషను నేర్చుకొని తమ గురించి తెలుసుకోవడం అవసరం అన్న విషయాన్ని ఆయన మాటలతోనే కాక చేతలద్వారా చూపించారు. అంతే కాదు, లిపి ఉన్న తెలుగు భాషని మాతృభాషగా ఉన్న అందరూ నేర్చుకోవాలని అందరూ మాట్లాడుకునే భాషకి పట్టంగట్టారు. ఆయన, గురజాడ - మిత్రులిద్దరూ కలిసి గొప్ప ఉద్యమాన్నే నడిపారు. భాషని బోధించేటప్పుడు అనువాద పద్ధతిని కాకుండా ప్రత్యక్ష పద్ధతి ద్వారా బోధించడం మేలని చెప్పారు. అప్పట్లో ఆంగ్ల విద్యాబోధనే ప్రత్యక్షపద్ధతి ద్వారా చెప్పేవారు. గిడుగువారి జయంతి జరుపుకునేటప్పుడు ఈ విషయాలన్నిటిని ఒకసారి గుర్తుచేసుకోవడం చాలా అవసరం. గత సంవత్సరం గిడుగు పుట్టిన రోజునాడు విజయవాడలో భాషా దినోత్సవంలో ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు గిడుగు సవరల కోసం రూపొందించిన సాహిత్య సంకలనం సవర సంబంధిని ఆవిష్కరిస్తూ తెలుగు భాషకి సంబంధించి ఎన్నో వరాలిచ్చారు. అవి



గిడుగు వేంకట రామమూర్తి

★తెలుగు భాష లేకపోతే మన జాతి ఉనికి ఉండదని భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. (అందుకేనేమో ఈ సంవత్సరం ప్రాథమిక విద్య నుంచి కూడా తెలుగు మాధ్యమం పనికిరాదని ఆంగ్లంలోనే విద్యా బోధన జరగాలని నిశ్చయించారు)

★తెలుగు భాషను కాపాడుకునేందుకు తెలుగుదేశం రాజీ లేని కృషి చేస్తుందని చెపారు. (కాపాడుకునేందుకా తెలుగు భాషా బోధనని పూర్తిగా తొలగించింది!)

★తెలుగు భాషాభివృద్ధికి ప్రాధికార సంస్థ - తెలుగు డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. (ఈ అథారిటీ కాగితంపులే అయ్యింది)

★ఈ అథారిటీకి రూపకల్పన చేయడంకోసం మండలి బుద్ధ ప్రసాద్‌గారు తదితరులతో ఒక కమిటీని నియమించారు. వీళ్ళు పొరుగు రాష్ట్రాల్లో భాషల అభివృద్ధికి చేపడుతున్న విధానాల్ని పరిశీలించి ఒక నివేదికని రూపొందించాలన్నది ఆయన ఆలోచన. (నివేదికని సమర్పించారో లేదో కాని భాషా సేవ పేరుతో బుద్ధ ప్రసాద్‌గారు గౌరవ డాక్టరేట్‌ను పొందారు. అంతేకాదు, ఏ సభలో మాట్లాడుతున్నా తెలుగు భాషాభివృద్ధికి సాహితీవేత్తలు, తత్సంబంధ ప్రజలు కృషిచేయాలి గాని ప్రభుత్వం కోసం ఎదురు చూడకూడదని పదే పదే చెప్పారు.)

★తెలుగుదేశం ప్రభుత్వం 2013లో ఇచ్చిన జిఓ నెంబర్ 86 తు.చ. తప్పకుండా పాటిస్తామన్నారు. ఈ జిఓ ప్రకారం ఒకటి నుంచి పదో తరగతి వరకు అన్ని పాఠశాలల్లో తెలుగును తప్పనిసరిగా బోధించేలా చూడాలి. ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేట్ పాఠశాలల్లో కూడా విధిగా అమలుచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. (అందుకేనేమో ఈ సంవత్సరం ఒకటవ తరగతి నుంచి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి తెలుగు మాధ్యమానికి మంగళం పాడారు!?)

★ప్రాచీన భాషా కేంద్ర నిర్మాణానికి నాగార్జున విశ్వ విద్యాలయంలో వెయ్యి గజాల స్థలం కేటాయిస్తామన్నారు (ఎక్కడ జరిగింది స్థలం కేటాయింపు? ఎక్కడుంది మన ప్రాచీన భాషా కేంద్రం?)

★తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన వ్యక్తి ఎన్.టి.రామారావు అన్నారు. అందుకే పార్టీలో తెలుగు ఉండాలనే ఉద్దేశంతో తెలుగుదేశం అని పేరు పెట్టారనీ అన్నారు (నిజమా! నేతిబీరకాయ చందాన తెలుగు తగ్గిస్తూ ఆంగ్లంవైపు మొగ్గుచూపుతూ ముందుకు సాగుతోంది ఈ పార్టీ. ఇప్పుడిది తెలుగుదేశమా? ఆంగ్లదేశమాని ఆశ్చర్యపోవడం ప్రజలవంతైంది!) ఈ విషయాలన్నింటిని ఇప్పుడు చెప్పుకోవడం, ప్రభుత్వాన్ని విమర్శించాలని కాదు, ప్రభుత్వానికి అసలు విషయాల్ని మనవి చేసుకోవడానికే! కనీసం ఈ సంవత్సరం తెలుగు భాషా దినోత్సవం నుంచైనా ఆయన చెప్పిన విషయాలవైపు మొగ్గు చూపిస్తారని ఓ సగటు తెలుగువాడి వేదన... ఆవేదన!

-డా॥ వేదగిరి రాంబాబు

బషీర్‌బాగ్ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు..

- అభద్రతలో ముఖ్యమంత్రి కేసీఆర్
- టీఆర్ఎస్‌ను ప్రజలే పాతరేస్తారు: ఉత్తమ్
- విద్యుత్ అమర వీరులకు కాంగ్రెస్ నివాళి




హైదరాబాద్, ఆంధ్రప్రభ : బషీర్‌బాగ్ ఉద్యమ స్ఫూర్తితో ప్రజా పోరాటాలను నిర్వహిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలే బుద్ధిచెబుతారని హెచ్చరించారు. విద్యుత్ ఉద్యమం సందర్భంగా బషీర్‌బాగ్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు ఆందోళనకారులు అమరులై నేటికి 17 ఏళ్లయిన సందర్భంగా సోమవారం బషీర్‌బాగ్‌లోని అమరుల స్తూపం వద్ద కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌తో పాటు టీపీసీసీ ఉపాధ్యక్షులు కుమార్‌రావు, ప్రధాన కార్యదర్శులు వినోద్ రెడ్డి, జి నిరంజన్, బొల్లు కిషన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద, టీపీసీసీ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్ ఇతర నాయకులు కిరణ్‌యాదవ్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అనంతరం గాంధీభవన్‌లో ఉత్తమ్ మాట్లాడు తూ, పాలకులు నిరంకుశ విధానాలు చేపడితే ప్రజలు వీరోచితంగా తిరగబడతారనటానికి బషీర్‌బాగ్ ఉద్యమ మే నిదర్శనమన్నారు.

ప్రస్తుత సీఎం కేసీఆర్ కూడా ప్రజాకంటకుడిగా వ్యవహరిస్తున్నారని, ఆయనకు బుద్ధి చెప్పేరోజులు రానున్నాయని హెచ్చరించారు. కొత్త రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా ఆనందంగా లేదని, అందరూ సమస్యలతో సతమతమవుతున్నారని ఆరోపించారు. స్వప్రయోజనాలు, రాజకీయ స్వార్థం, అధికార దుర్వినియోగంతో పాలన సాగుతోందని ఆరోపించారు. వ్యవసాయాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన కేసీఆర్‌కు ఒక ప్రైవేట్ సంస్థ అవార్డు ప్రకటిస్తే దాన్నేదో గొప్ప అవార్డుగా ప్రచారం చేసుకుంటున్నారని ఉత్తమ్ మండిపడ్డారు. రైతాంగాన్ని కష్టాల్లో నెట్టిన వారికి అవార్డులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సర్వేలంటూ కేసీఆర్ బూటకపు ప్రకటనలు చేస్తున్నారని, ఒకసారి టీఆర్ఎస్‌కు వంద సీట్లు అంటారని, ఇంకో సారి మరికొన్ని లెక్కలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ అభద్ర తతోనే కేసీఆర్ సర్వేల పేరుతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ సర్కార్‌కు ప్రజలు పాతరేయడం ఖాయమని ఉత్తమ్ జోస్యం చెప్పారు.

విద్యుత్ సంస్కరణలకు ప్రభుత్వాల కుట్రలు

- వామపక్ష పార్టీల ధ్వజం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తే.. అప్పటి టీడీపీ ప్రభుత్వం ముగ్గురిని పొట్టన పెట్టుకున్నదని వామపక్షాల నేతలు విమర్శించారు. పదిహేడేళ్ల క్రితం జరిగిన పోలీసుల తూటాలలో వందలాది మంది గాయాలపాలైనారని అన్నారు. విద్యుత్ చార్జీల సంస్కరణలకు కేంద్రంతో పాటు, రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని వామపక్ష పార్టీల నేతలు ఆరోపించారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని విద్యుత్ మృతవీరుల స్థూపం వద్దకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, చాడ వెంకట్‌రెడ్డితో పాటు వామపక్ష పార్టీల నేతలు హాజరై నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ.. స్వదేశీ పేరుతో విదేశీ పెత్తనం ఉండొద్దని చెప్పే బీజేపీ ప్రభుత్వం ఎఫ్‌డీఐలకు ద్వారాలు తెరుస్తోందన్నారు. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని హరిస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్య హక్కులను పునరుద్ధరించుకునేందుకు ప్రజలను సమీకరించి, ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని సురవరం తెలిపారు. విద్యుత్ పోరాటంలో ప్రాణాలో కోల్పోయిన వారి స్ఫూర్తితో ఉద్యమాలను కొనసాగిస్తామని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ప్రపంచ బ్యాంకు, నీతి ఆయోగ్ సలహాలతో విద్యుత్ పంపిణి సంస్థలను ప్రైవేటికరణ చేసేందుకు మూడేళ్ల క్రితమే ప్రణాళికలు రూపొందించారని, ఈ ప్రణాళిక అమలైతే ప్రజలపై విద్యుత్ చార్జీలు భారం పడుతుందన్నారు.

రైతు సమాఖ్యలు కావు..రాజకీయ సమాఖ్యలు




హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న రైతు సమాఖ్యలు.. రాజకీయ సమాఖ్యలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు విమర్శించారు. ప్రభుత్వంపై రోజు రోజుకు వ్యతిరేకత పెరుగుతున్నదని, ప్రజల దృష్టిని మళ్లించేందుకు సీఎం చంద్రశేఖర్ రావు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారని ఆయన ఆరోపించారు. సోమ వారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడి యాతో మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభు త్వం ఏర్పడిన తొలి ఏడాదిలో చేపట్టిన సమగ్రసర్వే ఏమైందో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భూ సర్వే ఒక ఫాల్స్ అని, ఇలాంటి సర్వేలతో ప్రజలకు ఇబ్బందులే తప్పా లాభం ఉండదన్నారు. టైం పాస్ ప్రభుత్వంగా మారి, రైతులను, ప్రజలను మభ్యపెడుతోందన్నారు. భూ వివాదాల ప్రక్షాళన చేస్తామంటున్న సీఎం కేసీఆర్‌ను చూస్తుంటే పిట్టల దొర గుర్తుకొస్తున్నాడని ఆయన విమర్శించారు. కేసీఆర్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే స్థితిలోలేరన్నారు.

ఓపీఎస్ విధానమే మేలు: శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సిపిఎస్ విధానాన్ని ఎత్తివేసి పాతపెన్షన్ విధానాన్నే తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సోమవారం తీర్మానించింది. టీజీవో నగర శాఖ కార్యవర్గ సమావేశం నాంపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగింది. హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎం లక్ష్మీనారాయణ సమావేశాన్ని ప్రారంభించారు. నగర శాఖ అధ్యక్షుడు జి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో కీలక నిర్ణయాలను తీసుకున్నారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, చైర్మన్ వి శ్రీనివాస్‌గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఎస్ విధానం ఎత్తివేసి ఉద్యోగులందరికీ ఓపిఎస్ విధానం వర్తింపజేయాలన్నారు. 11వ పిఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షులు మమత, ప్రధాన కార్యదర్శి తదితరులు హాజరయ్యారు.

జంప్ జిలానీలకు భయపడే సిట్టింగ్‌లకు సీట్లు

- భూసర్వేపై శాసన సభను సమావేశపరచండి: షబ్బీర్ అలీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీఆర్ఎస్ పార్టీ నుంచి వేరే పార్టీలకు ఎమ్మెల్యేలు, ఎంపీలు వెళుతున్నారని అందిన సమాచారం మేరకే సిట్టింగ్‌లు అందరికీ సీట్లిచ్చి గెలిపిస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని శాసన మండలిలో విపక్ష నాయకుడు మహ్మద్ అలీ షబ్బీర్ ఆరోపించారు. వంద సీట్లను తమ పార్టీ గెలుస్తుందని చెప్పుకుంటున్న కేసీఆర్ ముందుగా తమ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో రాజీనామాలు చేయించి ఎన్నికలకు వెళ్లాలని సవాల్ చేశారు. భూసర్వేకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని, అయితే, ఈ సర్వేపై చర్చించేందుకు శాసనసభను సమావేశపర్చాలని డిమాండ్ చేశారు. సోమవారం శాసనసభ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డితో కలిసి ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. 1993-94 నాటి కాంగ్రెస్ సీఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డి హయాంలో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు, టైటిల్స్ ఇవ్వడం ప్రారంభమైందన్నారు. చాలాకాలం తర్వాత సర్వే చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే, కోటి 20 లక్షల మంది రైతులకు సంబంధించిన భూముల సర్వేకు సంబంధించి విపక్షాల సూచనలు, సలహాలు అవసరం లేదా? కేవలం టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. కమిటీలు వేస్తామంటున్నారు.. ఎవరితో వేస్తారు ? ఈ అంశంపై చర్చించేందుకు వెంటనే అఖి లపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సర్వేకు సెప్టెంబర్ 9 లోగా గడువు విధించడాన్ని కూడా షబ్బీర్ అలీ వ్యతిరేకించారు. సర్వేపూర్తికి అంత హడా వుడి ఎందుకని మండిపడ్డారు. కేసీఆర్ తనకు వ్యతిరేక వాతావరణం ఏర్పడుతుందని నివేదికలు అందిన సమయంలో హడావుడి చేయడం, ఆ తర్వాత వెనక్కు తగ్గడం ప్రజలకు తెలుసునని, ఆయన మైండ్ గేమ్ ఆడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మియాపూర్‌లో 10 వేల కోట్ల స్కాంను ప్రభుత్వమే బయటపెట్టిందని చెప్పిన కేసీఆర్ ఆ తర్వాత మాటమార్చి ప్రభుత్వానికి ఒక్కపైసా కూడా నష్టం జరగలేదని చెప్పడంతో నిందితులకు బెయిల్ వచ్చిందని ఆరో పించారు. అదే విధంగా డ్రగ్స్ కేసులో హడావుడి చేశారని, సినిమా నటులు, ఇతరులకు సంబంధం ఉందని ప్రచారం చేసి తోకముడిచారని విమర్శించారు. ప్రభుత్వానికి పరిపాలనా అభిమానం లేకపోవడంతో కోర్టులతో మొట్టికాయలు కొట్టిం చుకుంటోందని చెప్పారు. గోవా, నంద్యాలలో సిట్టింగ్‌లు రాజీనామాలు చేసి ఎన్నికల్లో గెలిచారని, అదే విధానాన్ని పాటించి నైతిక విలువలను కేసీఆర్ చాటాలని కోరారు. పొంగు లేటి సుధాకరరెడ్డి మాట్లాడుతూ, గ్రామ సభలు నిర్వహిం చకుండా భూసర్వే ఎలా చేపడతారని ప్రశ్నించారు. సర్వేయర్ల ఖాళీలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని, సిబ్బంది లేకుండా ఎలా పూర్తి చేస్తారని మండిపడ్డారు.

అసెంబ్లీలో ప్రజా సమస్యలకు ప్రాధాన్యత

- గతంకంటే భిన్నంగా సమావేశాలు
- సమస్యలపై మీడియా కమిటీతో చర్చిస్తాం
- స్పీకర్ మధుసూదనాచారి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రశాసనసభ సమావేశాలు గతం కంటే భిన్నంగా జరుగుతున్నాయని, ప్రజా సమస్యల ప్రస్తావనకు చర్చా వేదికగా మారిందని శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. విలేఖరుల సమస్యలను మీడియా కమిటీతో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సోమవారం శాసన సభలోని స్పీకర్ ఛాంబర్‌లో శాసనసభ మీడియా కమిటీ తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ కూడా పాల్గొన్నారు. తొలుత మీడియా అడ్వయిజరీ కమిటీ చైర్మన్ వి. సూరజ్ భరద్వాజ్ తదితరులు స్పీకర్, స్వామిగౌడ్‌లకు పుష్ప గుచ్చాలు అందించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర తిరుగులేనిదని అన్నారు. చట్టసభల్లో జరిగే చర్చల వివరాలు మీడియా ద్వారానే ప్రజలకు తెలియజెప్పగలమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సమావేశాలు జరుగుతున్నాయని, ప్రజాసమస్యలపై గంటల తరబడి చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. మీడియాతో చర్చించాల్సిన అంశాలను కచ్చితంగా చర్చించి ముందుకుపోతామన్నారు. విలేఖరుల సమావేశాలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తేవాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మండలి చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ, మీడియా సమస్యలపై తరచుగా ఇలాంటి సమావేశాలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా సలహా కమిటీ చైర్మన్ సూరజ్ మాట్లాడుతూ కొన్ని సూచనలు చేశారు. ప్రస్తుతమున్న మీడియా గ్యాలరీ ఇరుకుగా ఉందని, కొంత భాగం విస్తరించాలని కోరారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ఏర్పాటు చేసే వర్కింగ్ లంచ్‌లో కెమెరామెన్‌లు తినేందుకు కూడా అవకాశం కల్పించాలని సూచించారు. అసెంబ్లీ పాస్‌లు ఉన్నప్పటికి కూడా పోలీసులు అడ్డగించి వేధిస్తున్నారని, ఈ విషయంలో పోలీసులకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో శాసనసభ కార్యదర్శి రాజా సదారాం, సంయుక్త కార్యదర్శి నర్సింహాచార్యులుతో పాటు మీడియా కమిటీ సభ్యులు ఎ శ్రీనివాస్, మెండు శ్రీనివాస్, ఆకారపు మల్లేష్, వై నాగేశ్వరరావు, వెల్జాల చంద్రశేఖర్, బొమ్మగాని కిరణ్‌కుమార్, ఎంఎ మాజీద్, ఎన్ రాహుల్, పి బాలకోటేశ్వర్, జి సోమభూపాల్, మార్గం శ్రీనివాస్, జె సంగప్ప పాల్గొన్నారు.

రైల్వే కోర్టుకు మంత్రులు

బుధవారం తీర్పు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర మంత్రులు కేటీఆర్, నాయినీ నర్సింహ్మారెడ్డి, పద్మారావు తదితరులు సోమవారం సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో హైదరాబాద్‌లోని మౌలాలీ రైల్వే స్టేషన్ వద్ద రైలు రోకో నిర్వహించి పలు రైళ్ళ రాకపోకలకు అంతరాయం కలిగించినందుకుగానూ వారిపై 2011లో కేసులు నమోదు అయిన విషయం తెలిసిందే. మంత్రులతో పాటు మరో 11 మంది కూడా ఈ కేసుల్లో ఉన్నారు. పలు దఫాలుగా విచారణ చేపట్టిన సికింద్రాబాద్ రైల్వేకోర్టు తుది తీర్పును ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసింది. కాగా కోర్టుకు హాజరైన మంత్రులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కోర్టులోనే ఉన్నారు.

మిషన్ భగీరథపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆసక్తి

- నేటినుంచి ఆ రాష్ట్ర ఇంజనీర్ల బృందం పర్యటన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ప్రాజెక్టుపై మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి కనబరుస్తుంది. ఈ మేరకు మంగళవారంనాడు రాష్ట్రానికి ఆ రాష్ట్ర జల్ నిగమ్ మర్యాధిత్‌శాఖ ఇంజనీర్ల బృందం రానున్నది. ఈ బృందం రాష్ట్రంలో మూడు రోజుల పాటు పర్యటించనున్నది. క్షేత్రస్థాయిలో మిషన్ భగీరథ ప్రాజెక్టును ఏ విధంగా నిర్మాణం చేపడుతున్నారో ఈ ఇంజనీర్ల బృందం పరిశీలించనున్నది.

దీంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో జల్‌నిగమ్ ఇంజనీర్ల బృందం ఉదయం 11 గంటలకు ఈఎన్‌సీ బీ సురేందర్‌రెడ్డిని కలువనున్నారు. అక్కడ మిషన్ భగీరథ ప్రాజెక్టు స్వరూపం, లక్ష్యాలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు. బుధవారం నుంచి జల్‌నిగమ్ బృందం క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లనున్నారు.

బుధవారంనాడు మెదక్-సింగూరులో చేపడుతున్న పనులను పరిశీలిస్తారు. గురువారంనాడు మహబూబ్‌నగర్- ఎల్లూరులో సాగుతున్న భగీరథ పనుల పురోగతిని మధ్యప్రదేశ్ ఇంజనీర్లు పరిశీలించనున్నారు. మిషన్ భగీరథ ప్రాజెక్టును ఇప్పటికే ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర ప్రభుత్వాలు తమ అధికారులు బృందాన్ని రాష్ట్రానికి పంపించిన విషయం తెలిసిందే.

గిరిజన విద్యార్థులకు ఉచిత వైద్య సేవలు

మహేశ్‌దత్ ఎక్కా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ చర్యల వల్ల గిరిజన సంక్షేమ శాఖ నడుపుతున్న పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో లక్షలాది మంది గిరిజన విద్యార్థులు చేరుతున్నారని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా అన్నారు. గిరిజనులకు నాణ్యమైన ఆహారంతో పాటు, మౌళిక సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తున్నదని తెలిపారు.

వైద్యంలో సేవ చేసే పనాసియా సంస్థకు చెందిన పలువురు సోమవారం మహేశ్‌దత్ ఎక్కాను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనసంక్షేమశాఖలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థుల డేటాను ప్రతి నెల నమోదు చేస్తారని చెప్పారు.

గ్రామీణ రోడ్లకు అటవీ అడ్డంకులు

- 22 కేసులకు అనుమతుల్లేవు
- ఏళ్ల తరబడి పెండింగ్
- ఇబ్బందులు పడుతున్న గిరిజనులు
- పట్టించుకోని సర్కార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ రహదారులకు అటవీ అడ్డంకులకు అవరోధంగా మారాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామీణ రహదారుల నిర్మాణం కోసం అటవీశాఖ అధికారులు అనుమతులు జారీ చేయడం లేదని తెలిసింది. అనుమతులు లేక వందలాది కిలోమీటర్ల మేరకు గ్రామీణ రహదారులు నిర్మాణం చేయలేక పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా గిరిజన ప్రాంతాలకు గ్రామీణ రహదారులు మంజూరైనా కూడా ప్రయోజనం లేదు. ఈ నిర్మాణాలకు అనుమతులు జారీ చేసేందుకు అటవీశాఖ అధికారులు ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్నట్లు తెలిసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 22 ప్రాంతాల్లో పంచాయతీ రాజ్ ఇంజనీరింగు విభాగం రోడ్ల నిర్మాణం చేపట్టడం లేదు. ఈ ప్రాంతాల్లో కూడా 5 హెక్టార్ల కన్నా తక్కువగా ఉన్న భూముల్లోనే ఎక్కువగా అడ్డంకులున్నట్లు అధికారులు వెల్లడించారు. దీంట్లో స్టేజ్1కు సంబంధించిన 9 ప్రాంతాలున్నట్లు ప్రాథమికంగా అటవీశాఖ అధికారులు గుర్తించినట్లు అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం తెలుస్తుంది. కానీ పూర్తిస్థాయిలో లిఖితపూరకమైన అనుమతులను అటవీశాఖ అధికారులు జారీ చేయలేదని తెలిసింది. దీంతో రోడ్డు నిర్మాణం లేకపోవడంతో ఆదివాసీ గిరిజనులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఇదిలా ఉండగా గ్రామీణ రహదారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న విషయం తెలిసిందే. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే గ్రామీణ రహదారులకు రూ.4వేల కోట్ల నిధులను మంజూరు చేసింది. గ్రామీణ రోడ్లను అద్దంలాగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. కానీ ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో అటవీ అనుమతులు తీసుకోవడంలో ప్రభుత్వం ఆలసత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాల్లో కిలోమీటరుకు రూ.40-50లక్షల మేరకు నిధులను అంచనాల్లో పేర్కొన్నది. దీన్నిబట్టి సుమారు రూ.5వేల కోట్ల మేరకు నిధులు దుర్వినియోగం కానున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. మిషన్ భగీరథ ప్రాజెక్టుకు చాలా వేగంగా అటవీ అనుమతులు తీసుకున్న సర్కార్ గ్రామీణ రహదారులకు ఎందుకు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అనుమతులు తీసుకుంటే మంజూరైనా రోడ్ల నిధులు వృధా కాకుండా ఉండే అవకాశాలున్నాయి.

పెండింగులో అటవీ అనుమతుల వివరాలు

క్ర.సంఖ్య	పాత జిల్లాపేరు	పెండింగు దరఖాస్తులు
1.	ఆదిలాబాద్	16
2.	వరంగల్	01
3.	ఖమ్మం	02
4.	కరీంనగర్	01
5.	రంగారెడ్డి	02
	మొత్తం	22

Andhraprabha business 2017

బిజినెస్



BUSINESS

ఎన్‌ఫీల్డ్ మూడవ ప్లాంట్‌లో ఉత్పత్తి షురూ



చెన్నై: రాయల్‌ఎన్ ఫీల్డ్ చెన్నై సమీపంలోని వల్లాం వడగాల్‌లో కొత్త తయారీ ప్లాంట్‌లో ఉత్పత్తి మొదలుపెట్టింది. ఇక్కడి నుంచి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు మోటార్‌బైక్‌లను ఎగుమతి చేస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3 ప్లాంట్లలో కలిసి 825,000 యూనిట్లు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. కాగా 2016-17 ఆర్థిక సంవత్సరంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ 667,135 మోటార్‌సైకిల్స్‌ను విక్రయించింది. చెన్నై సమీపంలో 50 ఎకరాల స్థలం కొనుగోలు చేసి 15 నెలలో కొత్త ప్లాంట్‌ను పూర్తి చేసింది. ఈ ప్లాంట్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి అత్యంత నాణ్యమైన బైక్‌లను ఉత్పత్తి చేస్తామని కంపెనీ వివరించింది. గత 6 సంవత్సరాల నుంచి రాయల్‌ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన చూస్తే 55 శాతంపైనే పెరిగాయి. ఆర్డర్ పుస్తకం రోజు రోజుకు పెరుగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.800 కోట్ల పెట్టుబడులు పెట్టి వల్లాం వాడాగల్ ప్లాంట్‌ను విస్తరించాలనుకుంటోంది. మార్కెట్లో హార్లీ డెవిడ్ సన్‌కు చెందిన స్ట్రీట్ 750 మోటార్‌సైకిల్‌కు పోటీ ఇచ్చేందుకు కంపెనీ త్వరలోనే 750 సీసీ మోటార్‌సైకిల్‌ను మార్కెట్లో విడుదల చేయబోతోంది.

జీఎస్టీతో రాష్ట్రాలకు లబ్ధి

ఇండియా రేటింగ్స్

India Ratings & Research
A Fitch Group Company

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్టి) అమలుతో రాష్ట్రాల ఆదాయానికి గండిపడుతున్న ఆందోళనకు విరుద్ధంగా ప్రస్తుతం రాష్ట్రాలకు ఆదాయం పెరుగుతోందని రేటింగ్ ఏజెన్సీ ఇండియా రేటింగ్స్ తాజా పరిశోధన పత్రంలో వెల్లడించింది. సోమవారం నాడు విడుదల చేసిన పరిశోధనా పత్రంలో మధ్య కాలానికి, దీర్ఘకాలానికి ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడే అవకాశం ఉందని తేల్చి చెప్పింది. అయితే ఈ ఆదాయం ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధంగా సమకూరుతుందని నివేదికలో తేల్చి చెప్పింది. తాజా నివేదికలో 2015-16 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఆర్థిక సంవత్సరం అంటే 2017-18లో అన్నీ రాష్ట్రాల రెవెన్యూ 16.6 శాతం పెరుగుతుందని వివరించింది. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధంగా రెవెన్యూ సమకూరుతుండగా.. ఎనిమిది రాష్ట్రాలు ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిషా, పంజాబ్, తమిళనాడులకు జీఎస్టి వల్ల నష్టపోతున్న రెవెన్యూకు గాను కేంద్రప్రభుత్వం పరిహారం చెల్లించాల్సి రావచ్చునని ఇండియా రేటింగ్స్ అంచనా వేసింది.

జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత ... వస్తు సేవలపై ఇన్‌ఫుట్ టాక్స్ క్రెడిట్ అందుబాటులోకి వచ్చింది. లేదంటే అన్నీ రాష్ట్రాలకు కలిపి రెవెన్యూ 15.5 శాతం తగ్గేదని, మరో మూడు రాష్ట్రాలు గోవా, జమ్ము కాశ్మీర్, జార్ఖండ్‌లకు కేంద్రప్రభుత్వం నుంచి పెద్దమొత్తంలో పరిహారం చెల్లించాల్సి వచ్చేదని పేర్కొంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం కేంద్రప్రభుత్వం అన్నీ రాష్ట్రాలకు కలిపి నష్టపోతున్న రెవెన్యూకు గాను రూ.95వేల కోట్లు సర్దుబాటు చేయాల్సి వచ్చేదని ఇండియా రేటింగ్ నివేదికలో వివరించింది.

కేంద్రప్రభుత్వం ఐదు సంవత్సరాల పాటు రాష్ట్రాలకు వృద్ధిరేటు 14 శాతం చొప్పున లెక్కగట్టి పరిహారం ఇస్తామని ప్రకటించింది. 2012-17 ఆర్థిక సంవత్సరాల్లో సరాసరి రాష్ట్రాల రెవెన్యూ ప్రాతిపదికన లెక్కగట్టింది. అయితే ఒక్కో రాష్ట్రంలో వృద్ధిరేటు ఒక్కో విధంగా ఉదారణకు పంజాబ్‌ను తీసుకుంటే 8.47 శాతంగా ఉంటే అంటే ఇదే కాలంలో తెలంగాణలో 39.70 శాతంగా ఉంది. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రస్థాయిలో విధించే తొమ్మిది రకాల పన్నుల మటుమాయం అయ్యాయి. వాటిలో రాష్ట్రస్థాయిలో విలువ ఆధారిత పన్ను, కేంద్ర అమ్మకపు పన్ను, కొనుగోలు పన్ను, లగ్జరీటాక్స్, ఎంట్రీటాక్స్, వినోదపన్ను, అడ్వర్టయిజమెంట్లపై పన్ను, లాటరీలపై పన్ను, బెట్టింగ్, గ్యాంబ్లింగ్ (జూదం)పై పన్ను విధించేవి.

అయితే ఆస్తిపన్ను, పెట్రోలియం ప్రొడక్టులు, రాష్ట్రస్థాయి ఎక్సైజ్, ఎలక్ట్రిసిటి డ్యూటీ ఆదాయంపై పన్ను తదితర వాటిని జీఎస్టి పరిధి నుంచి మినహాయించింది. వాటిపై వచ్చే ఆదాయం రాష్ట్రాల ఖాతాలోకి నేరుగా వెళుతుంది.

జీఎస్టి రెవెన్యూ రూ.65వేల కోట్లు
36 లక్షల ఫైలింగ్

కేంద్రప్రభుత్వానికి జీఎస్టి రిటర్న్స్ ఫైలింగ్ ద్వారా రూ.65వేల కోట్ల రెవెన్యూ



సమకూరింది. ఇప్పటి వరకు సుమారు 36 లక్షల మంది మొట్టమొదటిసారి జీఎస్టి రిటర్న్స్ ఫైల్ చేశారని సోమవారం నాడు ప్రభుత్వం ఉన్నతాధికారి తెలియజేశారు. జులై 1 నుంచి కొత్త జీఎస్టి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. జీఎస్టి రిటర్న్ ఫైలింగ్ చివరి తేదీ ఇంకా పూర్తి కాలేదని ఆయన అన్నారు. రెవెన్యూశాఖ అంచనా ప్రకారం జీఎస్టి వసూళ్లు రూ.65వేల కోట్ల వరకు వచ్చాయని ఉన్నతాధికారులు చెబుతున్నారు. సోమవారం నాటికి మొత్తం 36.32 లక్షల రిటర్న్స్ ఫైల్ అయ్యాయి. పూర్తి వసూలు వివరాలు తెలియడానికి మరింత కొంత సమయం పడుతుందని అధికారులు తెలిపారు.

కొత్త జీఎస్టి ప్రకారం వ్యాపారులు ప్రతి నెల అమ్మకాలతో పాటు పన్నును తదుపరి నెలలో చెల్లించాల్సి వస్తుంది. జులైలో ప్రారంభమైంది కాబట్టి మొదటి నెలలో కొంత వెసులుబాటు కల్పించి ఆగస్టు 25 వరకు ఫైలింగ్‌కు గడువు ఇచ్చారు. గడువులోగా ఫైల్ చేయని కంపెనీ ఏడాదికి 18 శాతం చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. కొత్త జీఎస్టి నెట్‌వర్క్ పోర్టల్‌కు 50 లక్షల మదింపుదారులు మారారని అంతకు ముందు పాత మదింపుదారులు 72 లక్షలని ప్రకటనలో వివరించింది. దీంతో పాటు కొత్త 15 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయని వారిలో పది లక్షల మదింపుదారులు జులైకి రిటర్న్స్ దాఖలు చేస్తారని అంచనా.

టిడిఎస్ వసూళ్ల లక్ష్యం రూ.25వేల కోట్లు

• ఐటి ప్రధాన కమిషనర్ చౌధురి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2017-18లో ఆదాయ వనరుల వద్దే పన్ను వసూళ్ళు (టిడిఎస్) రూ.25వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆదాయపన్ను శాఖ ప్రధాన కమిషనర్ ఎస్‌పీ చౌధురి చెప్పారు. గత ఏడాది తెలుగు రాష్ట్రాల్లో రూ.39వేల కోట్ల ఆదాయ పన్ను వసూలైందని, ఇందులో 52శాతంతో రూ.20,389 కోట్లు టిడిఎస్ ద్వారానే వచ్చిందని ఆయన చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు టిడిఎస్ గురించి వివరించి దానికి సంబంధించి రిటర్న్స్ దాఖలు చేసే అంశంపై సోమవారం నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో చార్టర్డ్ అకౌంటెంట్లు, సిఏ అసోసియేట్స్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చౌధురి మాట్లాడుతూ, గత ఏడాది అడ్వాన్స్ ట్యాక్స్ ద్వారా రూ.15వేల కోట్లు, సాధారణ చెల్లింపుల ద్వారా రూ.4వేల కోట్ల ఆదాయపన్ను వచ్చిందని చెప్పారు. పన్ను చెల్లింపు దారులకు పూర్తిగా అవగాహన ఉండకపోవచ్చునని, పన్ను చెల్లింపు, ఉల్లంఘిస్తే ఉత్పన్నమయ్యే పరిణామాల గురించి వారికి వివరించాల్సిన బాధ్యత చార్టర్డ్ అకౌంటెంట్లపైనే ఉందని ఆయన అన్నారు. టిడిఎస్ అనేది పన్ను వసూళ్ళ ప్రక్రియలో సాంకేతిక పద్ధతి మాత్రమేనని, ఇది పన్ను చెల్లింపుదారులకు ఎంతో అనువైన మార్గమని ఆయన చెప్పారు. పన్ను వసూళ్ళు, ఆ తర్వాత అపరాధ సుంకం ఉంటుందని, సకాలంలో చెల్లించకుంటే నిబంధనల మేరకు విచారణ ఎదుర్కోవలసి ఉంటుందని చౌధురి చెప్పారు. మరోవైపు ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతదారులపై క్రిమినల్ కేసులు నమోదుచేసి విచారిస్తామని ఆయన చెప్పారు. ఆదాయపన్ను చట్టంలోని నిబంధనలు పన్ను చెల్లింపుదారులకు పూర్తిగా తెలియవని, అలాగే టిడిఎస్‌పై కూడా అవగాహన లేదని ఆయన అన్నారు. పన్ను చెల్లించాల్సిన అవసరాన్ని చార్టర్డ్ అకౌంటెంట్లు తమ క్లయింట్లకు అవగాహన కల్పించి వారిని పన్నులు చెల్లించే మార్గంలోకి తేవాలని చౌధురి సూచించారు.

ఆదాయ పన్ను చెల్లింపుదారులకు టిడిఎస్ ఆన్‌లైన్ చెల్లింపులు, సాంకేతిక పద్ధతిలో వసూళ్ళని ఆదాయపన్ను శాఖ అధికారి గుప్తా చెప్పారు. ఘజియాబాద్‌లోని టిసిఎస్ కార్యాలయం ద్వారా టిడిఎస్ పర్యవేక్షణ ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో గత ఏడాది రూ.8,191 కోట్ల మేరకు ఉద్యోగుల వేతనాల టిడిఎస్ ద్వారా పన్ను వసూలైందని ఆయన చెప్పారు. రూ.50వేల పైబడిన స్థిరాస్తి లావాదేవీలకు పాన్‌కార్డు ద్వారా నిర్వహించామని చెప్పారు. ప్రైవేట్ కంపెనీల విలీనాలు, విక్రయాలు, అమ్మకాలు, ఖాయిలా పడిన పరిశ్రమలు తమవద్ద ఉన్న పాన్‌కార్డులను వెంటనే ఆదాయపన్ను శాఖకు తిరిగి ఇచ్చివేయాలని గుప్తా సూచించారు. ఆర్థిక సంవత్సరం చివరి నెల మార్చి నెలలో చెల్లించే జీతా లకు అదే నెలలో టిడిఎస్ సమర్పించాలని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఆదాయపన్ను శాఖ ముఖ్య కమిషనర్ వెంకట్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.



అత్యాశ వద్దు


• ఇన్వెస్టర్లకు సెబి సూచన

మధురా : పెద్దమొత్తంలో ఆదాయం చూపిస్తామని బురిడి కొట్టించే కంపెనీలను నమ్మి మోసపోవద్దని మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి ముఖ్యంగా యువతను హెచ్చరించింది. పాంజీలాంటి స్కీంలలో చిక్కుకోరాదని సూచించింది. ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేముందు స్కీంకు సంబంధించి నిబంధనలు షరుతులు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సెబి డీజీఎం సూర్యకాంత్ శర్మ ఇక్కడ ఒక మహిళా కళాశాలలో జరిగిన సదస్సులో మాట్లాడుతూ చెప్పారు. మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి, బీఎస్ఈ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రాంతీయ సదస్సుకు ఇన్వెస్టర్ ఎడ్యూకేషన్‌పేరుతో నిర్వహించారు. ఇన్వెస్టర్లలో అవగాహన కల్పించేందుకు మోసాల బారిన పడకుండా, వారి ప్రయోజనాలను కాపాడేందుకు సెబి ప్రాంతీయ సదస్సులను నిర్వహిస్తోంది. పాంజీ లాంటి స్కీంల ఆకర్షణనకు లోనుకాకుండా ప్రభుత్వం పలు స్కీంలు ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సుకన్యా సమృద్ధి స్కీంలను తీసుకొచ్చిందని సెబి అధికారులు వివరించారు. అయితే అటల్ పెన్షన్‌పై దృష్టి పెట్టడం మంచిదని ఇన్వెస్టర్లకు అధికారులు సలహా ఇచ్చారు.

ఎన్‌టీపీసీలో 10% డిజిన్వెస్ట్‌మెంట్

• రూ.13,800 కోట్ల సేకరణ

న్యూఢిల్లీ : కేంద్రప్రభుత్వం ప్రభుత్వ రంగానికి చెందిన ఎన్‌టీపీసీలో 10శాతం వాటాలు విక్రయించి రూ.13,800 కోట్లు సేకరించబోతున్నట్లు ఎన్‌టీపీసీ బీఎస్ఈకి సమాచారం అందించింది. కాగా ఎన్‌టీపీసీకి కేంద్రప్రభుత్వం ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్నందున మొత్తం ఈక్విటిలో ఐదు శాతం అంటే 41,22,73,220 షేర్లు ఆగస్టు 29న విక్రయిసున్నట్లు ఎన్‌టీపీసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఫ్లోర్ ధర షేరుకు రూ.168గా నిర్ణయించారు. ఈ లెక్కన చూస్తే ప్రభుత్వానికి రూ.6926.19 కోట్ల వరకు రావచ్చు. ఈ ఆఫర్ రెండు ట్రేడింగ్ రోజుల పాటు కొనసాగుతుంది. అయితే నాన్ రిటైల్ ఇన్వెస్టర్లు మాత్రం మంగళవారం నాటి బిడ్‌లో పాల్గొనడానికి అవకాశం ఉంటుంది. రిటైల్ ఇన్వెస్టర్లు ఆగస్టు 30 తర్వాత బిడ్‌లు దాఖలు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.



హోస్ట్ ఎనలటిక్స్ ఆర్‌అండ్‌డి విస్తరణ

• 25 మిలియన్ డాలర్ల పెట్టుబడితో మరిన్ని సేవలు
• సంస్థ సీఈవో డేవ్ కెలోగ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అమెరికాకు చెందిన హోస్ట్ ఎనలటిక్స్ సంస్థ హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డి) సెంటర్‌ను రెట్టింపు చేస్తోంది. స్కేలబుల్, క్లౌడ్ ఆధారిత ఎంటర్‌ప్రైజెస్ ఫర్ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ (ఇపిఎం) సొల్యూషన్స్ అందిస్తున్న ఈ సంస్థ తన కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు హైదరాబాద్ సెంటర్‌లో 28 మిలియన్ డాలర్ల పెట్టుబడితో పాటు ప్రస్తుతం ఉన్న సిబ్బందిని 150 నుంచి 300లకు పెంచుతున్నట్లు ఈ సంస్థ సీఈవో డేవ్ కెలోగ్ చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న ఐటి నిపుణులు, ఐటి రంగంలో మౌలిక సదుపాయాలు, జాతీయ, అంతర్జాతీయ సంస్థల ఏర్పాటుతో తమ సంస్థ విస్తరణకు అవకాశాలు మెరుగయ్యాయని సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. తమ సంస్థకు 650 మంది కస్టమర్లు ఉన్నారని, గత ఏడాది 10 కోట్ల డాలర్ల వ్యాపారం చేసిందని ఆయన తెలిపారు. తమ సంస్థకు చిన్న, భారీ కస్టమర్లు, అన్ని రంగాలకు చెందిన సంస్థలకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. తమ కంపెనీ డిజైన్ నిపుణులుగా క్లౌడ్ ఇపిఎంలో ఐటి నిపుణులను నియమించనున్నామని, వీరందరినీ టెక్నాలజీ, డిజైన్, ఆపరేషన్ కార్యకలాపాల్లో వినియోగించుకుంటా మని, కొత్త నియామకాలను ఐఐటి, బిట్స్, ఐఐఐటిల నుంచి ఎంపిక చేస్తామని వివరించారు.

ఎనిమిదేళ్లలో లక్ష కోట్ల మార్కెట్ క్యాప్

• 39,253 శాతం పెరిగిన షేరు • బజాజ్ ఫైనాన్స్

కేవలం 8 సంవత్సరాల్లో బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాప్ సోమవారం మెట్టమొదటి సారి రూ.1,00,000 కోట్లు దాటిపోయింది. మార్చి 2009లో రూ.175 కోట్లున్న మార్కెట్ క్యాప్ ఆగస్టు 28, 2017 నాటికి రూ.1,00,000 కోట్లు దాటిపోయింది. 8 సంవత్సరాల్లో 550 రెట్లు పెరిగిపోయింది. కంపెనీ షేరు మార్చి 9,2009లో రూ.4.64 నుంచి ఆగస్టు 28, 2017 నాటికి రూ.1,826కు ఎగబాకింది. మొత్తానికి షేరు ధర 39,253 శాతం పెరిగింది. వివరంగా చెప్పాలంటే 2009లో రూ.10,000 పెట్టుబడులు పెడితే ప్రస్తుతం ఆ మొత్తం కాస్తా రూ.39 లక్షలవుతోంది. ఈ షేరును వ్యూహాత్మకంగా దీర్ఘకాలానికి కొనుగోలు చేసిన వారికి లాభాల పంటే అని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ పేర్కొంది. ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో బజాజ్ ఫైనాన్స్ అతి పెద్ద కంపెనీ. కన్స్యూమర్ డ్యూరబుల్ ఫైనాన్స్‌లో కంపెనీ బలంగా ఉంది. మొత్తం వ్యాపారంలో 15 శాతం కన్స్యూమర్ డ్యూరబుల్‌కు కేటాయించింది. ఈ రంగంలో పోటీ కూడా తక్కువ ఉండటం బజాజ్ ఫైనాన్స్‌కు బాగా కలిసొచ్చింది. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ సుమారు కోటి మంది క్లయింట్లకు సేవలందించింది. కన్స్యూమర్ ఫైనాన్స్‌కు 45 శాతం, ఎస్‌ఎంఈకి 37 శాతం, వాణిజ్యానికి 13 శాతం, గ్రామీణ ప్రాంతానికి 5 శాతం చొప్పున వ్యాపారాన్ని విభజించింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరాభం 42 శాతం పెరిగి రూ.602కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.423.99 కోట్లుగా ఉంది. బ్రోకరేజి కంపెనీలు షేరు దీర్ఘకాలం ఉంచుకుంటే మంచి లాభాల అందిస్తుందని సూచిస్తున్నారు.

త్వరలో ఆస్ట్రేలియా గనిలో ఉత్పత్తి

సిడ్నీ : ఆస్ట్రేలియాలోని కార్మిచెల్ బొగ్గు ప్రాజెక్టు పనులను అక్టోబర్‌లో ప్రారంభించనున్నట్లు ఆదాని గ్రూప్ ప్రకటించింది. ఈ వివాదస్పద బొగ్గుగని ప్రాజెక్టుకు నిధుల సమీకరణ సమస్య కావడంతో, తొలుత 317 మిలియన్ డాలర్ల సొంత నిధులతోనే మొదలు పెట్టాలనుకుంటున్నట్లు ఆదాని గ్రూప్ తెలిపింది. ఈ ప్రాజెక్టుకు 2 బిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల రుణం అవసరమని ఆదాని గ్రూప్ గతంలో చెప్పింది. మార్చి 2020 నాటికి బొగ్గు రవాణా మొదలవుతుందని అప్పట్లో పేర్కొంది. పర్యావరణ ఆందోళనకారులు అంతర్జాతీయంగా వ్యతిరేకిస్తుండటంతో ఈ ఆస్ట్రేలియా బొగ్గు ప్రాజెక్టును ఆదాని గ్రూప్ తగిన నిధులు సమీకరించి, ముందుకు తీసుకు వెళ్లడం కష్టసాధ్యమని విశ్లేషకులు అంచనా వేశారు. ఇప్పటికీ అత్యంత సంక్లిష్టమైన పని నిధులు సమీకరించడమేనని, దీనికి ఇంకా పరిష్కారం దొరకలేదని సిఎల్ఎస్ఏ గనుల విశ్లేషకుడు ఆండ్రూ డ్రిస్కల్ తెలిపారు. అంతర్జాతీయ బొగ్గు మార్కెట్‌కు మరింత సరఫరా అవసరం లేదని తాము అభిప్రాయపడుతున్నామన్నారు. ఇక ఈ ప్రాజెక్టు నిధుల సమీకరణ, తదితర అంశాల మీద అధ్యయనానికి గ్రాంట్ శామ్యూల్స్ సంస్థను ఆదాని గ్రూప్ ఈ నెల మొదట్లో నియమించింది.

తొలిదశలో మాతృసంస్థ నుంచి 400 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లను ఈక్విటీ రూపంలో సమకూర్చుకోనున్నట్లు ఆదాని ఆస్ట్రేలియా ప్రతినిధి రాన్ వాట్సన్ చెప్పారు. మిగిలిన నిధుల సమీకరణకు సంబంధించి సంప్రదింపులు తుది దశలో వున్నాయని, ఇప్పుడే వివరాలు చెప్పలేమని అన్నారు. బొగ్గు గని, రైలు, పోర్టు మౌలిక వసతుల కల్పన....అన్నింటికీ కలిపి 16.5 బిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల అంచనా వ్యయంతో ఆదాని గ్రూప్ అప్పట్లో ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఆ తర్వాత కిందటేడాది తొలి దశ ప్రాజెక్టును కుదించి, వ్యయం తగ్గించుకోనున్నట్లు తెలిపింది. ప్రాజెక్టు యధా ప్రకారం సాగుతోందనడానికి, ఈ రోజు తమ మాటలు నిదర్శనంగా నిలుస్తాయని వాట్సన్ చెప్పారు. ఈ నెల ప్రారంభంలో భారీగా పడిన ఆదాని షేర్ ఈ రోజు ట్రేడింగ్ ప్రారంభంలో 6.5 శాతం లాభపడింది. పర్యావరణ ఉద్యమ కారులు, స్థానిక గ్రూపుల వ్యతిరేకత వల్ల ఈ కార్మిచల్ బొగ్గు ప్రాజెక్టు సంత్సరాల తరబడి ఆలస్యమవుతోంది. డాయిష్ బ్యాంకు, కామన్‌వెల్త్‌బ్యాంక్ ఆఫ్ ఆస్ట్రేలియా ఈ ప్రాజెక్టుకు నిధులిచ్చేది లేదని ఇప్పటికే స్పష్టం చేశాయి.

హార్లే డేవిడ్‌సన్ కొత్త ఎండీ పీటర్ మెకింజీ

న్యూఢిల్లీ: హార్లే డేవిడ్‌సన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్‌గా పీటర్ మెకింజీ నియమితులయ్యారు. గ్రేటర్‌చైనాకు మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న పీటర్ మెకింజీ అదనంగా ఇండియా బాధ్యతలు కూడా వెంటనే చేపట్టనున్నట్లు హార్లే డేవిడ్‌సన్ మోటార్ కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. చైనాలోని షాంఘై నుంచే ఆయన కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఇక భారత్‌లో రోజువారీ కార్యకలాపాల విషయంలో కంట్రీ మేనేజర్ మనీష్ అగర్వాల్ ఆయనకు సహాయపడతారని వివరించింది. అమ్మకాలు, డీలర్ నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, సర్వీస్ వంటి అన్ని రంగాలను పీటర్ మెకింజీ నిర్వహించనున్నట్ల కంపెనీ ఈ ప్రకటనలో తెలిపింది.

గ్లోబల్ మార్కెట్ల అండ

సరిహద్దుల్లో చల్లబడ్డ ఉద్రిక్తత

ముంబై: వరుసగా నాలుగో రోజు స్టాక్ మార్కెట్లు లాభాలతో దూసుకుపోయాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టెక్ రంగాలకు చెందిన షేర్లు లాభాల పంటపండించాయి. దీనికి ప్రధాన కారణం గ్లోబల్ మార్కెట్ల నుంచి సానుకూల పరిణామాలతో పాటు ఇండో - చైనా సరిహద్దుల్లో తగ్గిన ఉద్రిక్తత కారణంగా చెప్పుకోవచ్చు.

గత రెండు నెలల నుంచి భారత్ - చైనా సరిహద్దులో కొనసాగుతున్న ఉద్రిక్తతను తగ్గించేందుకు ఇరు దేశాలు సరిహద్దుల నుంచి సైనాన్ని ఉపసంహరించాలని నిర్ణయించాయి. త్వరలో బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఈ నిర్ణయం జరిగింది. వచ్చే నెల చైనాలో జరిగే బ్రిక్స్ సమావేశంలో బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికాలు పాల్గొంటాయి. ఈ సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ హాజరవుతారు. బ్రోకర్ల సమాచారం ప్రకారం దేశీయ సంస్థాగత మదుపరులు పెద్దెత్తున షేర్లు కొనుగోలు చేశారని.,. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మార్కెట్‌కు అనుకూలమైన పన్ను సంస్కరణలు తీసుకువస్తారన్న అంచనాతో ఆసియా మార్కెట్లో పుంజుకున్నాయి. దాని సెంటిమెంట్ దేశీయ మార్కెట్లపై పనిచేసిందని చెబుతున్నారు. ఇక డాలర్ మారకంతో రూపాయి ఇంట్రాడేలో 63.86 మార్కుకు ఫారెక్స్ మార్కెట్లో చేరింది. దీని ప్రభావం కూడా మార్కెట్‌పై పనిచేసింది.

మొత్తానికి 30 షేర్ల బీఎస్ఈ సూచి 154.76 పాయింట్లు లాభపడి 31,750.82 వద్ద, నిఫ్టీ 55.75 పాయింట్లు లాభపడి 9,912.80 వద్ద ముగిసింది.



బీఎస్ఈలో లాభపడిన ఐదు సూచిలు ఇలా ఉన్నాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 1.29 శాతం, ఐటి 1.25 శాతం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 1.24 శాతం, టెక్ 1.14 శాతం పెరిగాయి. బీఎస్ఈలో లాభపడిన టాప్ ఐదు షేర్లు ఇలా ఉన్నాయి. ఇన్ఫోసిస్ 3.14 శాతం, ఎన్‌టీపీసీ 2.1 శాతం, సన్‌ఫార్మా 1.96 శాతం, హీరోమోటోకార్ప్ 1.39 శాతం, హెచ్‌యూఎల్ 1.87 శాతం. కాగా దీనికి వ్యతిరేకంగా నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. డాక్టర్ రెడ్డీస్ 2.01 శాతం, టాటామోటార్స్ 1.25 శాతం, పవర్‌గ్రిడ్ 1.00 శాతం, ఎస్‌బీఐ 0.41 శాతం, టీసీఎస్ 0.38 శాతంగా ఉన్నాయి.

ఇన్ఫోసిస్ విషయానికి వస్తే సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని చైర్మన్‌గా నియమించబడ్డ తర్వాత సోమవారం నాడు మొదటి ట్రేడింగ్ జరిగింది. నెల రోజుల నుంచి వ్యవస్థాపకులకు.. బోర్డుకు మధ్య ఉన్న ఉద్రిక్తతలను తగ్గించడానికి ఆయన ప్రయత్నిస్తారని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఇన్ఫోసిస్ నుంచి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విశాల్‌సిక్కా ఆకస్మిక రాజీనామాతో నెలకొన్ని అనిశ్చితికి నీలేకని రాకతో తెరపడింది. దీంతో ఇన్ఫీ షేరు 4.6 శాతం పెరిగింది. హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న డాక్టర్ రెడ్డీస్ షేరు 2.9 శాతం క్షీణించింది. కంపెనీకి వ్యతరేకంగా అమెరికాలో దావా వేయడమే కారణం. గురువారంతో ఆగస్టు నెల డెరివేటివ్ కాంట్రాక్టు ముగియనుండటంతో మార్కెట్ ఒడిదుడకులకు లోనయ్యే అవకాశాలున్నాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

అధిక వృద్ధి రాష్ట్రాలలో అనుమతులు సులభం

• నీతి ఆయోగ్

న్యూఢిల్లీ : సరళతర వ్యాపారంపై నీతి ఆయోగ్ ఒక నివేదికను ప్రవేశపెట్టింది. దేశంలోని వివిధ రాష్ట్రాలను అధ్యయనం చేసి ఈ నివేదికను రూపొందిస్తుంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 3,500 తయారీ రంగ సంస్థల పరిశీలించి నీతి ఆయోగ్ తన నివేదిక రూపొందించింది. వ్యాపార సంస్థల దృష్టిలో ప్రభుత్వాల నియమ, నిబంధనలు ఎంత సరళతరంగా వున్నాయనే కోణంలో ఐడిఎఫ్‌సి ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి నీతి ఆయోగ్ ఈ సర్వే నిర్వహించింది.

కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, న్యాయ, ఐటి శాఖల మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఈ సర్వే విడుదల చేశారు. నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగారియా, ఆయన స్థానంలో కొత్తగా నియమితులయిన రాజీవ్ కుమార్, నీతి ఆయోగ్ సిఇఓ అమితాబ్ కాంత్, కేంద్ర పరిశ్రమల అభివృద్ధి విధాన శాఖ కార్యదర్శి రమేష్ అభిషేక్, పారిశ్రామిక రంగ ప్రతినిధులు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతర్జాతీయంగా పోటీని తట్టుకునే సంస్థల రూపకల్పన, అభివృద్ధి ఆవశ్యకమనే నేపథ్యంలో ఈ నివేదికను తయారు చేశారు. దేశం స్థిరమైన ఆర్థికవృద్ధి సాధించేందుకు అటువంటి సంస్థలు అవసరమవడంతో, దేశంలోని 3,500 తయారీ రంగ పరిశ్రమలను పరిశీలించి, నివేదికను రూపొందించారు.

అధికవృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలలో ప్రభుత్వాల అనుమతులు పొందడం కొంత సులభంగా వున్నట్లు ఈ నివేదిక పేర్కొంది. భూమి, నిర్మాణ సంబంధ అనుమతులు, పర్యావరణపరమైన అనుమతులు, నీరు, శానిటేషన్ సంబంధ అనుమతులు పొందే విషయంలో అధికవృద్ధి రాష్ట్రాలలో కొంత సులభంగా వుందని వివరించింది. వృద్ధి తక్కువగా నమోదవుతున్న రాష్ట్రా లలో ఈ అనుమతులు పొందడం కొంత కష్టంగానే వుందని అభిప్రాయపడింది. గతంలో ఎప్పుడో ఏర్పాటయిన పరిశ్రమలతో పోలిస్తే ఇటీవల ఏర్పాటయిన పరిశ్రమలు అనుమతులు పొందే విషయంలో తక్కువగా శ్రమ పడుతున్నట్లు అవగతమవుతోందని, అంటే వ్యాపార పరిస్థితులలో మార్పులు స్పష్టంగా కనబడుతున్నాయని పేర్కొంది. కొత్తగా ఏర్పాటయిన పరిశ్రమల జాబితాలో 2014 తర్వాత మొదలయిన సంస్థలు కూడా వున్నాయి. వ్యాపారం చేయడానికి నియంత్రణా సంబంధ సమస్యలు పెద్ద అవరోధం కాదని కొత్త సంస్థలు భావిస్తున్నట్లు ఈ సర్వేలో తేలింది.

వ్యాపార నిర్వహణ సులభతరం చేసేందుకు తాము చేస్తున్న ప్రయత్నాల పట్ల వాణిజ్య వర్గాలలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం వున్నట్లు ఈ సర్వే చెబుతోంది. ముఖ్యంగా సింగిల్ విండో వంటి విధానాల పట్ల పరిశ్రమ వర్గాలలో పూర్తి అవగాహన లేకపోవడాన్ని ఉదహరిస్తోంది. కొత్తగా ప్రారంభమైన వాటిలో 20 శాతం మాత్రమే ఈ సింగిల్ విండో విధానం తెలుసని చెబుతున్నట్లు పేర్కొంది. నిపుణులలో కూడా కేవలం 41 శాతం మందికి మాత్రమే ఈ అవగాహన వుందని వివరించింది. కార్మికులను అధికంగా వినియోగించే రంగాలు సంబంధిత నియమ నిబంధనలు కొంత కఠినతరంగా వున్నాయని, ఆ వర్గాలు భావిస్తున్నట్లు సర్వేలో తేలింది. నిపుణులయిన కార్మికుల కొరత, కాంట్రాక్టు కార్మికుల నియామకం, సమ్మెలు-లాకౌట్‌ల వల్ల పని నష్టం వంటివి వారికి సమస్యలుగా వున్నాయని తెలిపింది. కొన్ని రంగాలలో చిన్న పరిశ్రమలు నియంత్రణాపరమైన సమస్యలు ఎదుర్కొంటుంటే, మరికొన్ని రంగాలలో పెద్ద పరిశ్రమలు అలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నాయి. త్వరలో రూపొందించే మరో డాక్యుమెంట్‌లో వివిధ రాష్ట్రాల తీరు, తెన్నులను వివరించనున్నట్లు నీతి ఆయోగ్ ఈ సందర్భంగా తెలిపింది.

లక్స్ ఇండస్ట్రీ లాభం రూ.16 కోట్లు

కోలకతా: లక్స్‌ఇండస్ట్రీస్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికర లాభంలో 60 శాతం వృద్ధితో రూ.16 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.10 కోట్లు నమోదు చేసింది. రెవెన్యూ ఏకంగా 43 శాతం పెరిగి రూ.260 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.182 కోట్లు సాధించింది. ఎబిడేటా రూ.32.32 కోట్లు కాగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.19.97 కోట్లని కంపెనీ ఎండీ ప్రదీప్‌కుమార్ టోడీ తెలియజేశారు.

సిడ్బి కొత్త సీఎండి ముస్తఫా

స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిడ్బి) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా మొహ్మద్ ముస్తఫా (ఐఏఎస్) నియమితులయ్యారు. ఉత్తరప్రదేశ్ కేడర్‌కు చెందిన ముస్తఫా నియామకం ఆగస్టు 28 నుంచే అమలులోకి వచ్చిందని సిడ్బి ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నియామకానికి ముందు ముస్తఫా కేంద్ర ఆర్థిక సేవల శాఖలో జాయింట్ సెక్రటరీగా పదవీ బాధ్య తలు నిర్వహించారు. ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్‌లలో ఈయనకు విశేషమైన అనుభవం వుందని పేర్కొంది.

ICEX
Seize the right opportunity

వజ్రాల ఫ్యూచర్ ట్రేడింగ్ షురూ

ప్రపంచంలోనే మొదటిసారిగా వజ్రాలలో డెరివేటివ్స్ ట్రేడింగ్ దేశంలోని ఇండియన్ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఐసిఇఎక్స్) ప్రారంభించింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం కింద ఎంఎంటిసి, ఇండియన్ పొటాష్, క్రిభ్‌కో, ఐడిఎఫ్‌సిలు సంయుక్తంగా ఈ ఐసిఇఎక్స్‌ను నెలకొల్పాయి. సెబి నియంత్రణలో పనిచేసే ఈ ఎక్స్ఛేంజ్ స్క్రీన్ ఆధార ట్రేడింగ్ నిర్వహిస్తుంది. అనిల్ అంబాని గ్రూప్‌లోని రిలయన్స్ క్యాపిటల్ ఈ ఐసిఇఎక్స్‌లో అతిపెద్ద వాటాదారు. ఈ నెల 7 నుంచి 11 దాకా నమూనా ట్రేడింగ్‌ను ఐసిఇఎక్స్ విజయవంతంగా పూర్తి చేసింది. ట్రేడింగ్ సిస్టమ్‌లోని ఫీచర్స్, హెడ్జింగ్‌తోపాటు ప్లాట్‌ఫామ్ సామర్థ్యం సరిచూసేందుకు ఈ నమూనా ట్రేడింగ్ నిర్వహించారు. వారం రోజుల పాటు సాగిన ఈ నమూనా ట్రేడింగ్‌లో దేశవ్యాప్తంగా 62 మంది సభ్యులు, వారి క్లయింట్లు 388 టెర్మినల్స్ ద్వారా ట్రేడింగ్ నిర్వహిం చారు. నమోదు చేసుకున్న 8,013 మంది క్లయింట్లలో 5,119 మంది ఈ నమూనా ట్రేడింగ్‌లో పాల్గొన్నారు. ఆ వారంలో మొత్తం 26,64,208 లావాదేవీలు జరిగాయి. రోజువారీ సగటు టర్నోవర్ రూ.3,590 కోట్లుండగా, ఒకరోజు అత్యధికంగా రూ.7,855 కోట్లు జరిగింది. ఈ రోజు ప్రపంచంలోనే మొదటిసారిగా వజ్రాలలో డెరివేటివ్స్ కాంట్రాక్టుతో ఐసిఇఎక్స్ కార్యకలాపాలు ప్రారంభించింది. వజ్రాల డెరివేటివ్స్ కాంట్రాక్టు తొలి దశలో ఒక క్యారట్‌కు పరిమితమని, డెలివరి తప్పనిసరని ఎక్స్ఛేంజ్ తెలిపింది. వజ్రాల పరిశ్రమలోని వారికి దీంతో మరో కొత్త మార్కెట్ లభించనుంది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కొనుగోలుదారులకు తమ నాణ్యమైన, సర్టిఫైడ్ వజ్రాలను డెలివరీ ఇచ్చే అవకాశం వర్తకులకు కలుగుతుంది. సమంజసమైన ధరలు లభించడానికి వజ్రాల వ్యాపారులకు ఈ హెడ్జింగ్ ప్లాట్‌ఫామ్ ఉపయోగపడుతుందని ఐసిఇఎక్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఓ సంజిత్ ప్రసాద్ చెప్పారు. దేశవ్యాప్త మార్కెట్ కావడంతో సరఫరా, గిరాకీల వల్ల సరయిన ధరలు వుండే సామర్థ్యం ఎక్కువగా వుంటుందన్నారు. ఈ ట్రేడింగ్‌కు ఇప్పటిదాకా 100 మంది సభ్యులు, 4,000 మంది క్లయింట్లు నమోదు చేసుకున్నారు. ఎక్స్ఛేంజ్ డెలివరీ ఇచ్చే వజ్రాలను డిబీర్స్ గ్రూప్‌నకు చెందిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైమండ్ గ్రేడింగ్ అండ్ రిసెర్చ్ (ఐఐడిజిఆర్) సర్టిఫికేషన్ నిర్వహించనుంది. వజ్రాల డెలివరీకి అవసరమైన అన్ని రకాల హంగులనూ ఎక్స్ఛేంజ్ సమకూర్చుకుంది.


ప్రాజెక్టులతోనే సస్యశ్యామలం

పెద్దపల్లి ఎంపీ సుమన్



పెద్దపల్లి , కెఎన్ఎన్ : ప్రాజెక్టులతో తెలంగాణను సస్యశ్యామలం చేయడమే కేసీఆర్ లక్ష్యమని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు బాల్క సుమన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆర్కె గార్డెన్స్‌లో జరిగిన రైతు సంఘాల ఏర్పాటు సదస్సులో మాట్లాడుతూ కోటి ఎకరాల మాగాణే లక్ష్యంగా తమ ప్రభుత్వం ప్రాజెక్టుల రూపకల్పన చేసిందన్నారు. తమ పరిపాలన చూసి కాంగ్రెస్ వాళ్లు ఏడుస్తున్నారని, తెలంగాణ గొప్ప రాష్ట్రంగా ఎదగడం ఓర్వలేకపోతున్నారన్నారు. గతంలో దోచుకోవడానికే కాంగ్రెస్ పాలకులు ప్రాజెక్టులు నిర్మించారని విత్తనాలు, ఎరువుల కోసం రైతులు రోజుల తరబడి వడిగాపులు కాసే దౌర్భాగ్యపు పరిస్థితులు ఇప్పుడు లేవన్నారు. మూడేళ్ల పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నామన్నారు. రైతాంగం పండించిన పంట నిలువ కోసం 18 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాముల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఎకరానికి 8వేల రూపాయలు అందించాలని ముఖ్యమంత్రి కేసిఆర్ తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మేడిగడ్డ వద్ద నుంచి జూన్ 1 నుంచి ఆగస్ట్ 20వ తేదీ లోపు 200 టీఎంసీల నీరు సముద్రం పాలైందని కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే ఆ నీటిని వరద కాలువ, కాకతీయ కెనాల్‌ల ద్వారా ఎస్సారెస్పీకి మల్లించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎస్సారెస్పీ పునర్జీవ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. వేయి కోట్ల రూపాయలతో చేపట్టిన పనులు పూర్తయితే 2.56 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగు నీరందుతుందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో రైతాంగం అభిప్రాయాలు చెప్పించాల్సింది పోయి మాజీ మంత్రి రౌడీలను తీసుకువచ్చి సభలో రభస చేశారని ఆరోపించారు. ప్రాజెక్టులు దోచుకునేందుకు నిర్మిస్తే తమ ప్రభుత్వం రెండు పంటలకు రైతాంగానికి సాగు నీరందించేందుకు ప్రాజెక్టులు నిర్మిస్తుందన్నారు. 40 ఏళ్ల పాలనలో చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి కేసీఆర్ మూడు సంవత్సరాలలో చేసి చూపించారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని నెరవేరుస్తుందని ఎంపీ సుమన్ పేర్కొన్నారు.

లాలూతో వీహెచ్ భేటీ



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌తో పీసీసీ మాజీ అధ్యక్షుడు వి హనుమంతరావు భేటీ అయ్యారు. పాట్నాలోని లాలూ నివాసంలో విహెచ్ కలిశారు. ఇటీవల జరిగిన మిత్రపక్షాల సభ విజయవంతం కావడంతో లాలూకు విహెచ్ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలో సెక్యులర్ శక్తులు బలోపేతం కావడానికి లాలూ ప్రసాద్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా విహెచ్ ప్రస్తావించి అభినందించారు.

భారీగా గంజాయి పట్టివేత



కరీమాబాద్, కెఎన్ఎన్ : ఒరిస్సా నుంచి బొంబాయికి వెళ్లి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని జీఆర్‌పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌లో సీఐ జూపల్లి వెంకటరత్నం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రైల్వే డీజీపీ క్రిష్ణప్రసాద్ ఉత్తర్వుల మేరకు ఇంఛార్జి ఎస్పీ రైల్వేస్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం, రైల్వే పోలీసులు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఎస్సై ఎస్. శ్రీనివాస్, ఎస్ఐఆర్‌పీ టీం విజయవాడ నుంచి వరంగల్ వరకు తనిఖీలు నిర్వహిస్తుండగా రైలు నుంచి వరంగల్ స్టేషన్‌కు వచ్చే ముందు జనరల్ బోగిని తనిఖీలు చేస్తుండగా అక్రమంగా సరఫరా చేస్తున్న 80 కిలోల ఎండు గంజాయి లభించిందని, బహిరంగ మార్కెట్‌లో దీనివిలువ రూ.8 లక్షలుఉంటుందని ఆయన వెల్లడించారు. గంజాయి రవాణా చేస్తున్నవారు మహారాష్ట్రకు చెందిన రాణిరాజునాయుడు సంతోష్‌మాత సోసైటీ డోంగ్రీ, రవి మరియప్పన్, ఆర్డి రవిదేవడ్, ప్రతిభా రాజునాయుడు వీరందరు మహారాష్ట్రంలోని ముంబాయి డోంగ్రి దాహినర్ ఈస్ట్ ప్రాంతానికి చెందినవారు అని ఈ నలుగురు నిందితులు విశాఖ పట్టణం ఒరిస్సా బార్డర్‌లో ఎండు గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ముంబాయిలో అధిక ధరకు అమ్మేందుకు 8 బ్యాగుల్లో మొత్తం 82 కిలోల ఎండు గజాయిని తరలిస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

వేడిపాలు పడి బాలుడికి గాయాలు


అంగన్‌వాడీ సెంటర్‌లో ఘటన



దంతాలపల్లి, కెఎన్ఎన్ : అంగన్‌వాడీ కేంద్రంలో వేడిపాలు మీదపడి బాలుడు గాయపడ్డ సంఘటన దంతాలపల్లి మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం దంతాలపల్లికి చెందిన సోమారపు సైదులు విజయలకు చెందిన మూడేళ్ల కుమారుడు సోమారపు ప్రణిత్‌తేజ్ అంగన్‌వాడి రెండో సెంటర్‌లో చేర్పించారు. ఈ క్రమంలో అంగన్‌వాడీ సెంటర్‌కు ప్రణిత్ తేజ్‌ను పంపించి సైదులు, విజయలు కూలి పనులకు వెళ్లారు. కాగా అంగన్‌వాడీ టీచర్ రిజిస్టర్ రాస్తుండగా ఆయా స్టౌవ్‌పై పాలు వేడి చేసి కింద పెట్టి వంట పనుల్లో నిమగ్నమైంది. ఈ క్రమంలో ప్రణిత్‌తేజ్, మరో చిన్నారి తులసిలు ఆడుకుంటూ వేడిగా ఉన్న పాలగిన్నె వద్దకు వెళ్లగా ప్రణిత్‌తేజ్ ప్రమాదవశాత్తు పాలగిన్నెలో పడటంతో శరీరం తీవ్రంగా కాలిపోయింది. గమనించిన అంగన్‌వాడీ టీచర్, ఆయాలు ప్రణిత్‌తేజ్‌ను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అక్కడ ప్రథమ చికిత్స చేసి బాలున్ని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో బాలుడి ప్రమాదానికి కారకులైన అంగన్‌వాడీ టీచర్ సోమారపు విజయ, ఆయా నెమ్మది లక్ష్మీలను విధుల నుండి తొలగించినట్లు శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి స్వర్ణలత లెనిన్ తెలిపారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదానికి కారణం అంగన్‌వాడీ టీచర్, ఆయాలే బాధ్యులన్నారు. చిన్న పిల్లల విషయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వారు తీసుకోపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ విషయం రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ కమీషనర్ విజయేంద్రబోయి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, ప్రమాదానికి గురైన బాలుడి చికిత్సకు ఎంత ఖర్చు అయిన ప్రభుత్వమే భరించడం జరుగుతుందని, బాలుడికి మంచి చికిత్స అందేలా చూడాలని, బాధ్యులను విధుల నుండి తొలగించాలని ఆదేశించినట్లు తెలిపారు.

ఐదేళ్ళు...ఐదు లక్షలు!

డీఎస్సీ కోసం నిరుద్యోగుల నిరీక్షణ!



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఉపాధ్యాయులుగా కావాలనుకుని బిఈడీ, డీఈడీ, టీటీసీ కోర్సులను పూర్తి చేసిన నిరుద్యోగులు గత ఐదేళ్లుగా డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ(డీఎస్సీ) కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో డీఎస్సీ పరీక్షను నిర్వహించారు. డీఎస్సీ రాత పరీక్ష ఆగస్టు 27, 2012న నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ఇప్పటి వరకు డీఎస్సీ నిర్వహించలేదు. దీంతో డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న వారి సంఖ్య లక్షలకు చేరింది. సుమారు 5 లక్షల మంది నిరుద్యోగులు ఉపాధ్యాయ నియామక పరీక్షకోసం ఎదురు చూస్తున్నారు.

2012లో 21,343 పోస్టులకు డీఎస్సీ

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో ఆగస్టు 27, 2012లో 21,343 ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నిర్వహించారు. అందులో 11,602 ఎస్‌జిటి పోస్టులు ఉండగా మరో 2 వేల మున్సిపల్ టీచర్ పోస్టులు ఉన్నాయి. మిగిలినవి స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. వీటిలో తెలంగాణ ప్రాంతానికి సుమారు 10వేల పోస్టులు వచ్చాయి. అప్పటి నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు డీఎస్సీ నిర్వహించలేదు.

రాష్ట్ర అవతరణ అనంతరం లేని డీఎస్సీ

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి మూడేళ్లు పూర్తి అయినా ఇప్పటి వరకు డీఎస్సీ నిర్వహించలేదు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 8792 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి నియామక ప్రక్రియను చేపడతామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ అందుకు సంబంధించిన విధి విధానాలు మాత్రం ఇప్పటి వరకు విడుదల చేయలేదు. డీఎస్సీ ఎలా నిర్వహించాలి అనే దానిపై ప్రభుత్వంలో ఇంకా స్పష్టత రాలేదు. ఉమ్మడి 10 జిల్లాల వారీగా నియామక ప్రక్రియ చేపట్టాలా? లేకపోతే కొత్తగా ఏర్పాటైన 31 జిల్లాల వారీగా చేపట్టాలా? అనేది తేలలేదు. దీంతో నియామకాలకు సంబంధించిన ప్రక్రియను ఇంకా ప్రారంభించలేదు. అయితే సెప్టెంబర్ 11న సుప్రీంకోర్టులో తుదితీర్పు నేపథ్యంలో అప్పటి లోగా నియామక ప్రక్రియను ప్రారంభించితే తప్ప కోర్టుకు ఇతర కారణాలు చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరున గానీ లేదా సెప్టెంబర్ మొదటి వారంలోగానీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

ఇజ్రాయిల్ టూరిజం రోడ్‌షోలు

- ఇజ్రాయిల్ టూరిజం డెరెక్టర్ హసన్ మదా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తమ దేశంలోకి భారతీయ పర్యాటకుల సంఖ్యను మరింత వృద్ధి చేసేందుకు ఇజ్రాయిల్ పర్యాటక మంత్రిత్వ శాఖ చేపట్టిన చర్యలు ఆకట్టుకుంటున్నాయి. 2017వ సంవత్సరానికి భారతదేశంలో తమ రెండవ రోడ్‌షోను నిర్వహించారు. ఈ రోడ్‌షోను నెట్‌వర్కింగ్ వర్క్‌షాప్ ఫార్మాట్‌లో మొదలు పెట్టారు. ముంబైలో ఆగస్టు 21న ప్రారంభమైన ఈ రోడ్‌షో ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరులలో పూర్తి చేసుకుని ఆగస్టు 30న చెన్నైలో ముగియనుంది. ఇజ్రాయిల్ బృందానికి ఆ దేశ పర్యాటక శాఖ డైరెక్టర్ హసన్ మదా, మార్కెటింగ్ డైరెక్టర్ జుదా శామ్యూల్ నాయకత్వం వహించారు. ఈ బృందంలో ఇజ్రాయిల్ పర్యాటక మంత్రిత్వశాకకు చెందిన భాగస్వామ్య ప్రతినిధులు కూడా ఉన్నారు. ప్రతి నగరం నుంచి 100కుపైగా ట్రావెల్ ఏజెంట్లు ఈ రోడ్‌షోలో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా సోమవారం హైదరాబాద్ వచ్చిన హసన్ సదా ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ, 2017లో గత ఏడు నెలలుగా 34వేల మందికిపైగా భారతీయులు ఇజ్రాయిల్‌ను సందర్శించారని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 36శాతం వృద్ధి భారతీయ పర్యాటకులు వచ్చారని చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీ ఇజ్రాయిల్‌ను సందర్శించడంతో భారతీయులలో ఆసక్తి పెరిగిందన్నారు. భారతీయ ట్రావెల్ ట్రేడ్, మైస్ ఏజెంట్ల నడుమ మరింత అవగాహన కలిగించేందుకు మేము ప్రయత్నిసున్నామని హసన్ సదా అన్నారు. ఆరు నగరాల్లోనూ ఈ రోడ్‌షోకు మంచి స్పందన లభిస్తుందని ఆశిస్తున్నామని అన్నారు.

భువనగిరికి కేంద్రీయ విద్యాలయం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణాలోని భువనగిరి నియోజక ప్రజలకు శుభవార్త. వచ్చే ఏడాది నుంచి భువనగిరిలో కేంద్రీయ విద్యాలయం (కేవీ)ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు 50 కొత్త కేంద్రీయ విద్యాలయాలను కేంద్రమానవ వనరుల శాఖ మంజూరు చేసింది. అందులో భాగంగా భువనగిరికి కేంద్రీయ విద్యాలయను కేటాయించారు. తమ నియోజక వర్గానికి కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయాలని మూడేళ్లుగా భువనగిరి ఎంపీ బూర నర్సయ్య గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని పదేపదే కోరుతూ వచ్చారు. ఆయన విజ్ఞప్తి మేరకు కేంద్రం భువనగిరికి కేవీని కేటాయించింది.

బెంగళూర్-హౌరా మధ్య ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నిరీక్షణలో ఉన్న ప్రయాణికుల సౌకర్యార్ధం బెంగుళూరు - హౌరా మధ్యన మూడు సూపర్ ఫాస్టు ప్రత్యేక రైళ్లను నడపబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ప్రత్యేక రైలు బెంగుళూర్ నుండి 29వ తేదీ (మంగళవారం) న 03.10 గంటలకు బయలుదేరి బుధవారం 13.55 గంటలకు హౌరా చేరుకుంటుంది. హౌరా - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు ఆగస్టు 31వ తేదీ గురువారం 10.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 18.25 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకోనుంది. బెంగుళూర్ - మాల్దా ప్రత్యేక రైలు బెంగుళూర్‌లో ఆగస్టు 30 బుధవారం 23.40 గంటలకు బయలుదేరి శుక్రవారం 17.15 గంటలకు మాల్దా చేరుకుంటుందని పేర్కొన్నారు. అన్ని ప్రధాన స్టేషన్‌లలో ఈ ప్రత్యేక రైళ్లను నిలుపుదల చేయడం జరుగుతుందని వెల్లడించారు.

అవినీతి తప్ప అభివృద్ధి లేదు

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావ్



కందుకూర్ , కెఎన్ఎన్ : అమరుల త్యాగ ఫలితతో ఏర్పడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతుందే తప్ప అభివృద్ధి ఎక్కడ కనిపించడం లేదని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావ్ ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కేవలం ఒకే కుటుంబం ప్రతిఫలాలను పొందుతుందని ఆయన దుయ్యబట్టారు. సోమవారం మహేశ్వర మండలం తుక్కుగూడ గ్రామంలోని సత్యనారాయణ ఫంక్షన్ హాల్ లో కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ అధ్యక్షతన కూరగాయలు, రైతు సమస్యల పంచాయతీ కార్యక్రమ సభ జరిగింది. సభకు ముఖ్య అతిథులుగా జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావ్ తోపాటు అఖిల భారత కిసాన్ మోర్చ కార్యదర్శి సుగుణాకర్ రావులు హాజ రయ్యారు. సభలో మురళీధర్ రావు మాట్లాడుతూ రైతు కంట్లో కన్నీరు పెట్టిన ఏ రాజ్యము బాగుపడదని ఆయన చెప్పారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు ఆత్మహత్యలు ఉండవని అందరూ భావిస్తే , వారి ఆత్మహత్యలు మరింత పెరిగాయని ఆయన చెప్పారు. అమరుల త్యాగ ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అందరికి సముచిత న్యాయం , గౌరవం లభిస్తుందని భావిస్తే కేవలం ఒకే కుటుంబం ప్రతిఫలం పొందడం విచారకరమని , ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావ్ ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు , దళితులకు మూడెకరాల భూమి , లక్ష ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కేసిఆర్ ఇప్పటి వరకు ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఆయన చెప్పారు. దేశంలో నరేంద్ర మోదీ పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలలో విరివిగా ప్రచారం కలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మురళీధర్ రావ్ పిలుపునిచ్చారు. సభలో అఖిల భారత కిసాన్ మోర్చ కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంకెల గారెడీతో రైతుల జీవితాలను బుగ్గిపాలు చేస్తుందని విమర్శించారు. ఎన్నికలముందు రైతులకు ఒకేసారి లక్షలోపు రుణాలను మాఫీ చేస్తామని చెప్పి ఇప్పటికి చేయకుండా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందన్నారు. తమ సమస్యలపై రైతులు నిరసన వ్యక్తం చేస్తే బేడిలతో జైళ్ళకు పంపిన ఘనత కేసిఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రుణ మాఫీని, సబ్సిడీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని లేని పక్షంలో బిజెపి ఆధ్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహ్మా రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్ కుమార్ గౌడ్, నాయకులు కడారి జంగయ్య యాదవ్, పాపయ్య గౌడ్, సుధాకరశర్మ, నర్సింహ్మా రెడ్డి, అశోక్ గౌడ్, శ్రీనువాస్ గౌడ్, మండల శాఖ అధ్యక్షుడు సుదర్శన్ యాదవ్, యాదిశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ జాబితా పున:వర్గీకరణ

బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో బీసీ కులాల జాబితా పున:వర్గీకరణ, సంచార కులాలు, ఎంబీసీల గుర్తింపుపై కసరత్తు జరుగుతోందని బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు అన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ తదితర అంశాలపై సమాలోచన చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఎంసీహెచ్‌ఆర్డీలో బీసీ కమిషన్ చైర్మన్ రాములు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీసీ కమిషన్ సభ్యులతో పాటు వివిధ బీసీ కులాల నాయకులు హాజరయ్యారు. జాతీయ స్థాయిలో కాకాకాలేల్కర్, మండల్ కమిషన్ నివేదికలు, సంచార కులాలకు సంబంధించి బాలకృష్ణ రెనెకెతో పాటు ఇడాట కమిషన్ నివేదికలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కమిషన్ నివేదికలపై సమీక్ష చేశారు. బీసీల అభ్యున్నతి కోసం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కూడా చర్చించారు.

విశ్వయవనికపై గీతం విద్యార్థుల జయకేతనం



తల్లితో కలిసి గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ అందుకుంటున్న శివాలి

రామచంద్రాపురం (పటాన్‌చెరు), కెఎన్ఎన్: గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని విద్యార్థులను విద్యతో పాటు ఇతరత్రా రంగాల్లో కూడా పాల్గొనేలా ప్రోత్సహించి సంపూర్ణ పరిణితి సాధించడానికి చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రెండో యేడాది విద్యార్థిని శివాలి తన తల్లి కవితతో కలిసి రెండో గిన్నిస్ రికార్డు సాధించగా, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ మూడో ఏడాది విద్యార్థిని మానస జొన్నలగడ్డ 'మిస్ ఇండియా ఏషియా ఫసిఫిక్-2017' టైటిల్ విజేతగా నిలిచి విశ్వ వేదికపై గీతం జయకేతనాన్ని ఎగురవేసిందని గీతం వీసీ ప్రొ.ఎన్. శివప్రసాద్ తెలిపారు.

రెండో గిన్నిస్ రికార్డు: శివాలి, ఆమె తల్లి కవితలు క్విల్లింగ్ (కాగితాన్ని గుండ్రంగా చుడుతూ చేసే కళ) చేసిన రంగుల కాగితాలతో 7,011 పూలను అల్లి (ఒక దానికి మరొకటి ప్రత్యేక రూపురేఖలతో చేసినవి) అంతకు ముందున్న 6,241 రికార్డును బద్దలు కొట్టి రెండో గిన్నిస్ రికార్డు సాధించారు. గతంలో కూడా 1,251 కాగితం బొమ్మలను తయారుచేసి తొలి గిన్నిస్ రికార్డును సాధించారు.

అందాల పోటీల్లోనూ: ఈసీఈ విద్యార్థిని మానస జొన్నలగడ్డ మిస్ అండ్ మిసెస్ ఇండియా ఏషియా ఫసిఫిక్ 2017 టైటిల్ విజేతగా నిలిచింది. ఇటీవల థాయిలాండ్‌లోని పట్టాయలో జరిగిన పోటీలలో ఆమె ఈ ఘనత సాధించింది. మనదేశంతో పాటు దుబాయ్, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంకకు చెందిన ఔత్సాహికులతో మానస పోటీపడి టైటిల్‌ను కైవసం చేసుకుంది. గీతం విద్యార్థులు ప్రపంచంలోనే మేటివారిగా ప్రతిభ చాటడంపై ప్రొఫెసర్ వీసీ ప్రొ. ఎన్.శివప్రసాద్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొ.సిహెచ్ సంజయ్, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొ.జి.ఎ. రామారావు, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొ.ఎల్ శివప్రసాద్, జీహెచ్‌బీఎస్ డీన్‌అండ్‌డైరెక్టర్ ప్రొ.వై. లక్ష్మణ్‌కుమార్, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హర్షంతో వారిని అభినందించారు.

మునిసిపల్ కార్మికుల సమ్మె వాయిదా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకుగానూ నేటి నుంచి రెండు రోజుల పాటు తలపెట్టిన ఆందోళనను మున్సిపల్ కార్మిక సంఘాలు తాత్కాలికంగా విరమించుకున్నాయి. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో సోమవారం సచివాలయంలో రాష్ట్ర పురపాలక శాఖ కార్యదర్శి నవీన్‌మిట్టల్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐఎన్‌టియుసీ, ఏఐటియుసీ, సిఐటియు, ఐఎఫ్‌టియు, బిఎంఎస్, హెచ్‌ఎంఎస్ తదితర కార్మిక సంఘాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. మున్సిపల్ వర్కర్ల వేతనాలను పెంచే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని నవీన్‌మిట్టల్ కార్మిక సంఘాల నాయకులకు తెలియజేశారు. అలాగే అన్ని స్థానిక పట్టణ సంస్థల్లోనూ ఈపిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలలో ఎలాంటి కాలయాపన జరగకుండా చూస్తామని హామి ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలను కూడా వెనువెంటనే జారీ చేశారు. అలాగే కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలను కూడా వెంటనే చెల్లించాల్సిందిగా అన్ని మున్సిపాలిటీల కమిషనర్లను నవీన్ మిట్టల్ ఆదేశించారు. మున్సిపల్ వర్కర్లకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళను కేటాయించే విషయంలోనూ ప్రాధాన్యతను ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. అలాగే మున్సిపల్ కార్మికులకు సంబంధించి రక్షణ చర్యలను కూడా యుద్ధప్రాతిపదికన చేపట్టామని జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులకు ఆయన హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న వారిని దళారులను నుంచి విముక్తి కల్పిస్తామన్నారు. వారందరికి ఇకపై బ్యాంకుల ద్వారానే వేతనాలు చెల్లిస్తామని నవీన్‌మిట్టల్ పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన హామీలపై జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు సంతృప్తి చెందారు. దీంతో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు తలపెట్టిన ఆందోళనను విరమించుకున్నట్లు స్పష్టం చేశారు.

న్యాక్ బృందం కేయూ సందర్శన

హన్మకొండ, కెఎన్ఎన్ : కాకతీయ విశ్వ విద్యాలయానికి జాతీయ స్థాయి గుర్తింపు పొందె అర్హత ఉందా?లేదా అనే అంశం పరిశీలించడానికి సోమవారం న్యాక్ బృందం యూనివర్సిటీని సందర్శించింది. ఉదయం 10 గంటలకు బృందానికి కాకతీయ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొ. ఆర్. సాయన్న స్వాగతం పలికారు. ఏడుగురు సభ్యులతో గల బృందానికి మహత్మా గాంధీ చిత్రకూట్ గ్రామోద్యోగ విశ్వ విద్యాలయ ఏసీ ప్రొ. ఎస్పీ. గౌతమ్ సారథ్యంలో యూనివర్సిటీలోని అన్ని విభాగాలను పరిశీలించారు. సోమవారం నుండి బుధవారం వరకు యూనివర్సిటీలోని అన్ని విభాగాలను సందర్శించి నివేదిక సమర్పిస్తారని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆర్. సాయన్న తెలిపారు. యూనివర్సిటీలో ఏడేళ్లుగా జరిగిన అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన అన్ని విషయాలను యూనివర్సిటీ అధికారులు న్యాక్ బృందానికి తెలియచేశారు. ప్రతి విభాగంలోని అధ్యాపకులకు సంబంధించిన విద్యార్హత విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలకులు యూనివర్సిటీ అధికారులతో చర్చించి వివరాలను తీసుకున్నారు. కాకతీయ విశ్వ విద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను బోధన పరిశోధన, మౌలిక వసతుల కల్పన హస్టల్ వసతి, యూ జీసీ రూపొందించిన సీబీసీఎస్‌సీ విధాన అమలు తీరు తెన్నులను వైస్ చాన్స్‌లర్ న్యాక్ కమిటీకి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 1976లో ప్రారంభమైన కాకతీయ యూనివర్సిటీ 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని న్యాక్ ఏ గ్రేడ్ ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు రావడానికి యూనివర్సిటీ అధికారులు కృషి చేస్తున్నారు. ఈ కమిటీ 3 రోజులు అన్ని విభాగాలను సందర్శించి 30వ తేది సాయంత్రం వారు సేకరించిన వివరాలను యూనివర్సిటీ అధికారులకు అందచేసే అవకాశం ఉంది.

సభ్యుల, చందా వివరాలతో రండి

భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో సంఘానికి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఏపీ ఎన్జీవోలో సభ్యత్వం కోసం చెల్లించే చందా ఎంత,సభ్యత్వం తీసు కోబోయే సభ్యుల వివరాలతో కోర్టుకు రావాలని భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో అసోసియేషన్ తరపు న్యాయ వాదికి హైకోర్టు సూచించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రదాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ ,జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ బుధవారానికి వాయిదా వేసింది.గూకోర్టు గతంలో ఆదేశించిన మేరకు భాగ్యనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉన్న గదులను తమకు అప్పగించాల్సి ఉన్నా, అప్పగించలేదని పేర్కొంటూ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హైకోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్ వేసింది. భాగ్యనగర్ అసోసియేషన్ తరపు న్యాయవాది జె.కనకయ్య వాదనలు వినిపిస్తూ ..తాళాలు అప్పగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. తాళాలు కోర్టుకు తీసుకువచ్చామన్నారు. కోర్టు ఆదేశించిన ప్రకారం తమ సంఘం సభ్యులకు సభ్యత్వం ఇవ్వడానికి, చందాగా చెల్లించిన సొమ్మును తీసుకోవడానికి ఏపీ ఎన్జీవో అంగికరించడం లేదన్నారు. ఆ వివరాల్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ..సభ్యులెంత మంది ,ఎంత సొమ్ము చందాగా చెల్లించాలి... బకాయిలెన్ని.. తదితర వివరాలతో రావాలని సూచించింది.

ఎమ్మెల్యే రమేష్ బాబుపై ద్వంద్వ పౌరసత్వ కేసు విచారణ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : వేములవాడ టీఆరెస్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు ద్వంద్వ పౌరసత్వం కేసును ఆరు వారాల్లోగా పూర్తి చేయాలని కేంద్ర హోంశాఖను సుప్రీం కోర్టు ఆదేశించింది. రమేష్‌బాబు భారత దేశ పౌరసత్వం వ్యవహారంలో దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. జర్మనీలో ప్రొఫెసర్‌గా పని చేసే చెన్నమనేని రమేష్ బాబు 1993లో భారత దేశ పౌరసత్వాన్ని రద్దు చేసుకుని అక్కడి పౌరసత్వం తీసుకున్నారు. ఆ తర్వాత తిరిగి స్వదేశానికి వచ్చిన ఆయన 2009లో ఈ దేశ పౌరసత్వాన్ని పొందారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగి వేములవాడ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన తప్పుడు ధ్రువీకరణ పత్రాలు చూపించి భారత పౌరసత్వం పొందారంటూ, ఎన్నికల కమిషన్‌కూ నకిలీ డాక్యుమెంట్లు సమర్పించారంటూ ఆయన మీద పోటీ చేసి ఓడిపోయిన బీజేపీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ ఈసీని, ఆ తర్వాత హైకోర్టును ఆశ్రయించారు. చెన్నమనేని రమేష్ తప్పుడు పత్రాలు చూపించారని ఉమ్మడి హైకోర్టు ధ్రువీకరించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రమేష్ బాబు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీంతో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆరు నెలల్లో ఈ కేసును పూర్తి చేయాలని 2016, ఆగస్టు 11న సుప్రీంకోర్టు కేంద్ర హోంశాఖను ఆదేశించింది.సోమవారంతో ఆ గడువు పూర్తైనందున ఆరు వారాల్లో కేసును పూర్తి చేయాలని కేంద్ర హోంశాఖను సుప్రీంకోర్టు మరోసారి ఆదేశించింది. ఈ కేసు విషయంలోఢిల్లీకి వచ్చిన ఆది శ్రీనివాస్ ఏపీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వాపరాలను వెల్లడించారు.

ఎన్‌సీటీ వ్యాజ్యం 31కి వాయిదా

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రూ.1.50 లక్షల రుసుము సొమ్మును చెల్లించకుండా ఆయా కాలేజీలకు సంబంధించిన సమాచారాన్ని వెబ్‌సైట్లో ఉంచే అవకాశం ఉందేమో తెలుసుకొని చెప్పాలని హైకోర్టు జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్ సీటీఈ)తరపు న్యాయవాదికి సూచించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్,జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ వ్యాజ్యాలపై సోమవారం విచారణ చేపట్టి, ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. జాతీయ ఉపాధ్యాయ మండలి నుంచి తప్పని సరిగా అక్రిడేషన్ తీసుకోవాలని పేర్కొంటూ జారీ చేసిన సవరణ నిబంధనను సవాలు చేస్తూ ఏపీ,తెలంగాణ రాష్ట్రాల్లోని ఉపాధ్యాయ విద్యను అందిస్తున్న సంస్థలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎన్ సీటీఈ తరపున స్టాండింగ్ కౌన్సెల్ కె.రమాకాంత్ రెడ్డి స్పందిస్తూ హైకోర్టులో దాఖలైన పిటిషన్లను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని అభ్యర్థించారు. ఎన్ సీటీఈ సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిందన్నారు.పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ ..1993 నాటి ఎన్ సీ టీ ఈ ప్రధాన చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా సవరణలు తీసుకొచ్చారన్నారు. వెబ్ సైట్లో వివరాలు పొందుపరిచేందుకు కావాలంటే రూ.1.50 లక్షల అదనపు భారం పడుతుందన్నారు. ఎన్ సీ టీ ఈ స్టాండింగ్ కౌన్సెల్ రమాకాంత రెడ్డి వాదనలు వినిపిస్తూ ..అక్రిడేషన్ పొందాలనే కొత్త నిబంధనను జస్టిస్ వర్మ కమిటీ సుప్రీంకోర్టుకు ఇచ్చిన నివేదిక ఆధారంగా తీసుకొచ్చారన్నారు. వివాదం వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరినందువల్ల ప్రస్తుత వ్యాజ్యాలపై విచారణ జరపొద్దని అభ్యర్థించారు.

ఆంధ్రప్రభ

నంద్యాలలో సైకిల్‌దే గెలుపు

(మొదటిపేజీ తరువాయి)

పోటాపోటీగా ప్రచారం చేసినా చివరికి విజయం తెదేపానే వరించింది. ఈ ఉపఎన్నికలో తెదేపా అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి సమీప ప్రత్యర్థి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత శిల్పా మోహన్‌రెడ్డిపై 27వేల ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ ఎంపీ భూమా నాగిరెడ్డి హఠాన్మరణంతో నంద్యాల అసెంబ్లీకి ఉపఎన్నిక జరిగింది. అధికారపక్షం తెదేపా, విపక్ష పార్టీ వైకాపా ఈ ఎన్నికను ఓ సవాల్‌గా తీసుకుని బరిలోకి దిగారు.

నంద్యాల నియోజకవర్గంలో నంద్యాల పట్టణం, నంద్యాల గ్రామీణం, గోస్పాడు మండలం ఉన్నాయి. గత సార్వత్రిక ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి వైకాపా తరఫున భూమా నాగిరెడ్డి పోటీచేసి విజయం సాధించారు. తిరిగి ఈ ఫలితాలే ఉపఎన్నికలో పునరావృతమవుతాయని వైకాపా ఆశలు పెట్టుకుంది. అయితే అనూహ్యంగా నంద్యాల ప్రజలు ఈ ఉపఎన్నికలో బ్రహ్మానందరెడ్డికి పట్టంగట్టారు. వైకాపా ఆశలు పెట్టుకున్న అన్ని ప్రాంతాల్లో తెదేపా పాగా వేసింది. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 2 గంటల దాకా సాగింది. ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి ఆధిక్యతను చాటుతూ వచ్చారు. 16వ రౌండులో మాత్రమే వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి స్వల్ప ఆధిక్యత సాధించగా, మొత్తం 19 రౌండ్లలో 18 రౌండ్లు బ్రహ్మానందరెడ్డి ఘనమైన ఆధిక్యతను చాటుతూ వచ్చారు. ఓటమి అంచున ఉన్నానని భావించిన మోహన్‌రెడ్డి 11వ రౌండులోనే ఓట్ల లెక్కింపు కేంద్రం నుంచి బయటకు వచ్చారు. నంద్యాల ఉపఎన్నిక నోటిఫికేషన్ కన్నా ముందే ఈ నియోజకవర్గంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి.

సీఎం చంద్రబాబు రెండు రోజులపాటు ఈ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన జరిపి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నంద్యాల పట్టణంలో ఎంతో ఇబ్బందిగా మారిన రహదారి విస్తరణకు ఆయన భూమిపూజ చేశారు. దాహార్తితో అల్లాడుతున్న ఈ నియోజకవర్గ ప్రజలకు శుద్ధమైన నీటిని అందించేందుకు చేపట్టిన భారీ ప్రాజెక్టుకు చంద్రబాబు అంకురార్పణ చేశారు. ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం నడుం బిగించడంతో ఓటర్లు ఏకపక్షంగా తెలుగుదేశం పార్టీకి మద్దతు పలికి ఉపఎన్నికలో ఊహించని విజయాన్ని అందించారు. అల్ప సంఖ్యాకవర్గాలు, యువతీ యువకులు, కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలు, దళితులు తమ పక్షాన ఉన్నారని వారంతా వైకాపాకు ఓటువేస్తారని ఆ పార్టీ చివరి దాకా లెక్కలు వేసింది. అయితే ఉపఎన్నికకు కొద్ది రోజుల ముందే కాపు రిజర్వేషన్ల అమలుపై చంద్రబాబు ప్రకటన విడుదల చేయడం ఆ సామాజికవర్గానికి చెందిన ఓటర్లు తెదేపా పక్షాన నిలబడినట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి, కళాశాలల ప్రవేశాలలో కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామని బీసీ రిజర్వేషన్లకు ఎటువంటి విఘాతం కలుగకుండా కాపులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. అలాగే అల్పసంఖ్యాక వర్గాలకు తమ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మరో ఏడాదిన్నరలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని వైకాపాను ఉపఎన్నికలో గెలిపించినా అదనంగా ఒరగూరే ప్రయోజనమేమీ లేదని తెదేపా తరపున



ప్రచారం చేసిన నాయకులంతా చెప్పడంతో ఓటర్లు సైతం ఈ విషయాన్ని ఆలోచించి ఈ పార్టీకి మద్దతు ఇచ్చినట్టు చెబుతున్నారు. ఉపఎన్నికలో తన సోదరుడు మోహన్‌రెడ్డి పోటీ చేసే అవకాశం కల్పించకపోవడంతో పాటు మంత్రిగా ఉన్న అఖిలప్రియ పార్టీ నిబంధనలను ఉల్లంఘించి వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ ఎమ్మెల్సీగా ఉన్న మోహన్‌రెడ్డి సోదరుడు చక్రపాణిరెడ్డి తెదేపాకు, తన పదవికి రాజీనామా చేసి జగన్ అధ్యక్షతన వైకాపాలో చేరారు. తొలుత తెదేపాకు రాజీనామా చేస్తున్నట్టు ఫ్యాక్స్ ద్వారా చంద్రబాబుకు రాజీనామా లేఖను పంపించిన చక్రపాణి జగన్ నంద్యాల ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా ఆగస్టు 9వ తేదీన నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించి ఆ లేఖను జగన్ చేతికి అందించారు. ఈ సందర్భంగా చక్రపాణిరెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. ఆట మొదలైంది.. చంద్రబాబు ఛాలెంజ్ ఛాలెంజేనంటూ చక్రపాణిరెడ్డి చేసిన ప్రకటనను తెదేపా సీరియస్‌గా తీసుకుంది. ఉపఎన్నికలో పోటాపోటీగా ప్రచారం చేసినా ఫలితం మాత్రం తెదేపాకే అనుకూలంగా వచ్చింది.

విపక్ష నేత జగన్ ఎలాగైనా సరే తన సిట్టింగ్ స్థానమైన నంద్యాలను చేజిక్కించుకోవాలని ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగానే పదమూడు రోజులపాటు నంద్యాలలోనే మకాంవేసి రోడ్‌షోలు, బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ చేసిన వ్యాఖ్యలు తమ పార్టీకి కొంత ఇబ్బందిని తెచ్చిపెట్టాయని వైకాపా నేతలు బాహాటంగానే చెప్పడం విశేషం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేని చంద్రబాబును నడిరోడ్డులో కాల్చిచంపినా తప్పులేదని, చంద్రబాబును ఉరితీయండని, ఆయన బట్టలు ఊడదీయాలని ప్రచార సభల్లో జగన్ చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకే దారితీశాయి. ఈ వ్యాఖ్యలను తెదేపా నాయకులు తమకు అనుకూలంగా మార్చుకుని ప్రచార సభల్లో జగన్‌కు వ్యతిరేకంగా ప్రజల్లోకి వెళ్లారు. మంత్రి అఖిలప్రియను ఉద్దేశించి వైకాపా ఎమ్మెల్యే, సినీనటి రోజా చేసిన వ్యాఖ్యలు సైతం ఆ పార్టీకి ఇబ్బందిని తెచ్చిపెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. అఖిలప్రియ వేసుకునే దుస్తులు, ఆమె ఆహాభావాలు, వ్యవహరిస్తున్న తీరును రోజా తప్పుబట్టడంతో పాటు ఆమెపై దిగజారి అభ్యంతరాలు మోపిందని తెదేపా నేతలు మహిళల్లో ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయడంతో వైకాపాకు కొంత ఇబ్బంది పరిస్థితి ఏర్పడింది. ఓట్ల లెక్కింపు జరుగుతున్న సమయంలో వైకాపా సీనియర్ నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ ఉపఎన్నికలో తమ పార్టీ ఓడిపోతుందని తనకు ముందే తెలుసునని ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే వైకాపా అభ్యర్థి ఖరారు అయినపుడే తాను భావించానని రాంబాబు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తాను బాహాటంగా ప్రకటిస్తే ఇబ్బందులు ఉండడంతో పాటు పార్టీ శ్రేణులు మానసిక స్థైర్యం కోల్పోతారన్న ఉద్దేశంతో గుమ్మనంగా ఉన్నానని రాంబాబు సోమవారం వివిధ టీవీ ఛానళ్లలో నిర్వహించిన చర్చ సందర్భంగా ఈ ప్రకటన చేయడంతో వైకాపా అభిమానులకు ముచ్చెమటలు పోసినట్టు ప్రచారం జరుగుతోంది. ఉపఎన్నికలో అధికార పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో పలువురు మంత్రులు కాల్వ శ్రీనివాసులు, అమర్‌నాథ్‌రెడ్డి, గంటా శ్రీనివాసరావు, డాక్టర్ పి.నారాయణ, శిద్దా రాఘవరావు, ఆది నారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు మకాం వేసి ప్రచారం నిర్వహించారు. వైకాపా కూడా అంతే సంఖ్యలో ఎమ్మెల్యేలను, సీనియర్ నేతలను నియోజక వర్గంలో మోహరించి ప్రచారం నిర్వహించింది. ఇదిలా ఉండగా, జాతీయ, రాష్ట్రస్థాయిలో భాజపా, తెదేపాలు మిత్రపక్షాలుగా ఉన్నప్పటికీ నంద్యాల ఉపఎన్నికలో మాత్రం భాజపా నేతలు ప్రచారంలో పాల్గొనలేదు. ఈ నియోజకవర్గంలో అల్ప సంఖ్యాకవర్గాల ఓట్లు క్రియాశీలకం కావడంతో భాజపా నేతలను చంద్రబాబు ప్రచారానికి దూరంగా ఉంచినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ప్రధాని నరేంద్రమోడీని కలిసి ఎన్‌డిఎలో చేరేందుకు పావులు కదుపుతున్నారన్న ప్రచారాన్ని తెదేపా నేతలు తెరపైకి తేవడంతో వైకాపాకు ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో తెదేపా, భాజపా భాగస్వామ్యం ఉన్నప్పటికీ నంద్యాల మైనారిటీ వర్గాలు ఆ పరిస్థితిని అర్థం చేసుకుని తెదేపాకు మద్దతు ఇచ్చాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

గత సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా తరపున నంద్యాల నుంచి పోటీచేసి వైకాపా అభ్యర్థి భూమా నాగిరెడ్డి చేతిలో ఓటమి పాలైన మాజీమంత్రి శిల్పా మోహన్‌రెడ్డి ఈ ఉపఎన్నికలో వైకాపా తరఫున బరిలోకి దిగడం విశేషం. వైకాపాతో తెగతెంపుల చేసుకుని ఆ పార్టీకి గుడ్‌బై చెప్పిన భూమా నాగిరెడ్డి కుమార్తె, ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియతో కలిసి చంద్రబాబు అధ్యక్షతన తెదేపాలో చేరిన సంగతి తెలిసిందే. మంత్రివర్గ విస్తరణలో భూమాకు అవకాశం ఉంటుందన్న ప్రచారం జరుగుతున్న సమయంలో ఆయన తీవ్ర గుండెపోటుతో కన్నుమూశారు. దీంతో ఆయన కుమార్తె అఖిలప్రియకు మంత్రి పదవి వరించింది. నాగిరెడ్డి మరణంతో నంద్యాల అసెంబ్లీకి ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికలో పార్టీ తరఫున తనకు పోటీచేసే అవకాశం ఇవ్వాలని శిల్పా మోహన్‌రెడ్డి చంద్రబాబును కోరారు. పార్టీ నిబంధనల ప్రకారం ఏ నాయకుడైనా చనిపోతే ఆ కుటుంబంలోని వారికే పోటీచేసే అవకాశం ఉంటుందని ఈ ప్రతిపాదన ఎప్పటినుండో అమల్లో ఉందని, దీన్ని కాదని ఉపఎన్నికలో బరిలోకి దిగే అవకాశం ఇవ్వలేనని చంద్రబాబు శిల్పా మోహన్‌రెడ్డికి స్పష్టంచేశారు. ఈ అంశంపై అనేక దఫాలు చర్చోపచర్చలు సాగినా ఫలితం లేకుండాపోయింది. చివరికి తెదేపాకు రాజీనామా చేసిన శిల్పా జగన్ అధ్యక్షతన వైకాపాలో చేరి ఎన్నికలో పోటీచేసేందుకు టికెట్‌ను సాధించారు. ఉపఎన్నికలో భూమా నాగిరెడ్డి సోదరుడి కుమారుడు బ్రహ్మానందరెడ్డి, కుమార్తె మౌనిక పోటీకి సిద్ధమయ్యారు.

కుటుంబ సభ్యులంతా కలిసి చర్చించుకున్నాక బ్రహ్మానందరెడ్డిని అభ్యర్థిగా ఖరారు చేశారు. ఉపఎన్నిక నోటిఫికేషన్ వెలువడడానికి నెల రోజుల ముందే ఏపీ సీఎం చంద్రబాబు బ్రహ్మానందరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. నోటిఫికేషన్ వెలువడ్డాక శిల్పా మోహన్‌రెడ్డికి టికెట్‌ను ఇస్తున్నట్లు వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. భూమా నాగిరెడ్డి గుండెపోటుతో చనిపోయారు కనుక ఆయన కుటుంబం నుంచి బ్రహ్మానందరెడ్డిని ఉపఎన్నికలో అభ్యర్థిగా తమ పార్టీ ఎంపిక చేసిందని ఈ ఎన్నిక ఏకగ్రీవమయ్యేందుకు సహకరించాలని సీఎం చంద్రబాబు విపక్ష నేత జగన్మోహన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు తెదేపాకు చెందిన ముఖ్య నేతల ద్వారా జగన్‌కు సమాచారం కూడా పంపించారు. ఇందుకు జగన్ అంగీకరించలేదు. తమ పార్టీకి చెందిన 21 మంది ఎమ్మెల్యేలను తెదేపా తమ తిప్పుకుందని ఈ పరిస్థితుల్లో నంద్యాల ఏకగ్రీవమయ్యేందుకు సహకరించేది లేదని జగన్ తెగేసి చెప్పారు. దీంతో ఉపఎన్నిక అనివార్యమైంది.

అన్ని రౌండ్లలోనూ తెదేపా ఆధిక్యత

● ఒక్క రౌండ్‌లోనే మాత్రమే వైకాపాకు స్వల్ప ఆధిక్యత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నంద్యాల ఉపఎన్నికలో ఓట్ల లెక్కింపు ప్రారంభమైన మొదటి రౌండు నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి ఆధిక్యత కొనసాగిస్తూ వచ్చారు. మొదటి నుంచి చివరి వరకు తెదేపా ఆధిక్యత కనబరచగా, కేవలం 16వ రౌండులో మాత్రం వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి స్వల్ప ఆధిక్యత సాధించారు. అన్ని రౌండ్లు పూర్తయ్యే సరికి తెదేపా అభ్యర్థి 20,466 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు.

రౌండు	తెదేపా	వైకాపా	ఆధిక్యత
1	5,477	4,279	1,198
2	5,162	3,400	1,762
3	6,640	3,553	3,087
4	6,465	2,859	3,606
5	6,975	3,563	3,412
6	6,161	2,828	3,332
7	4,859	4,312	547
8	4,436	4,088	348
9	4,309	3,430	879
10	4,642	3,156	1,486
11	4,226	3,622	604
12	5,629	4,359	1,270
13	5,690	4,235	1,455
14	5,172	4,125	987
15	6,049	3,760	2,289
16	4,663	5,317	654 (వైకాపా)
17	5,133	4,148	985
18	4,467	3,961	506
మొత్తం	**97,106**	**69,710**	

టీటీడీపీ నేతల్లో పెరిగిన ఆత్మస్థైర్యం

● స్వీట్లు పంచిపెట్టిన పార్టీ శ్రేణులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిన నంద్యాల ఉపఎన్నికలో తెలుగుదేశం పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించడం తెలంగాణ పార్టీ రాష్ట్ర నేతల్లో మరింత ఆత్మస్థయిర్యాన్ని నింపింది. ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా అధికారంలోకి వచ్చి మూడేళ్ళు పూర్తి అవుతున్న సమయంలో ఈ ఉపఎన్నిక జరిగింది. దీంతో చంద్రబాబు పాలనకు ఎన్నికల ఫలితం రెఫరెండం అవుతుందని అంతా భావించారు. అందుకే అధికార తెలుగుదేశం, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ పార్టీలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని గెలుపు కోసం చివరి నిమిషం వరకు యత్నించాయి. కానీ అక్కడి ప్రజలు సైకిల్‌కు మొగ్గుచూపడం, భారీ మెజార్టీతో తెదేపా అభ్యర్థిని గెలిపించారు. చివరకు వైసీపీకి బాగా పట్టున్న ప్రాంతాల్లోనూ సైకిల్ జోరు చాలా స్పష్టంగా కొనసాగింది. ఈ గెలుపు 2019 ఎన్నికలపై కొంతమేర ప్రభావం చూపుతుందని రాజకీయ పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. మొదటి రౌండ్ నుంచే తెదేపా స్పష్టమైన ఆధిక్యాన్ని కొనసాగించడంతో తెలంగాణ పార్టీ రాష్ట్ర నేతల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పక్క రాష్ట్రంలో చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లోనూ తెదేపా ప్రభంజనం ఇదే విధంగా కొనసాగితే దాని ప్రభావం తెలంగాణాలో కూడా ఉంటుందని నేతలు ఊహిస్తున్నారు. దీంతో తెలంగాణలోనూ తెదేపా మంచి ఫలితాలు సాధిస్తుందన్న ధీమాతో ఉన్నారు. అందుకే పార్టీ నేతలు కూడా నంద్యాల ఫలితం కోసం వేయి కళ్ళతో నిరీక్షించారు. వారు ఊహించినట్లుగానే ఫలితం తెదేపాకు అనుకూలంగా రావడంతో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. విజయానికి సూచికగా పార్టీ నేతలు పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. ఆనందంతో డ్యాన్సులు చేశారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. పరస్పరం స్వీట్లు పంచుకున్నారు. ఉపఎన్నికలో తెదేపా విజయం సాధించడం ద్వారా చంద్రబాబు ఇమేజ్ మరింత పెరుగుతుందని, ఇది కూడా తమకు కలిసొచ్చే అంశంగా పరిగణిస్తున్నారు. మొత్తానికి నంద్యాల విజయం ఇక్కడి రాష్ట్ర నేతల్లో మరింత ఆత్మస్థయిర్యాన్ని కలిగించినట్లుగా చెబుతున్నారు. కాగా ఈ వేడుకల్లో పార్టీ రాష్ట్ర నేతలు అమర్‌నాథ్‌బాబు, బుచ్చిలింగం, రామావత్ లక్ష్మణ్‌నాయక్, బిఎన్.రెడ్డి, తాజుద్దీన్, ఆజ్మీర రాజునాయక్, పి. సాయిబాబా, దీపక్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్ గౌడ్, కంది చంద్రయ్య, రామచంద్ర బినోలా, రామకృష్ణ, హైదరాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే ఆ 20 మందితో రాజీనామా చేయించండి

● ఒకేసారి ఎన్నికలకు రండి ● చంద్రబాబుకి జగన్ సవాల్
● అధికారాన్ని అడ్డు పెట్టుకుని గెలిచారు ● రూ.200 కోట్లు వెదజల్లారు
● ఓటర్లను ప్రలోభపెట్టారు ● పోలీసులనూ వాడుకున్నారు ● రాజకీయాల్లో గుండె ధైర్యం కావాలి ● మా సమయం వచ్చినప్పుడు మేమూ కొడతాం
● శిల్పా సోదరులకు హేట్సాఫ్ ● నంద్యాల ఓటమిపై జగన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఓటర్లను ప్రలోభపెట్టి భయభ్రాంతులకు గురిచేసి గెలిచిందని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం జగన్ తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. నంద్యాల ఉప ఎన్నికల్లో రెండు వందలకోట్లపైగా డబ్బులు వెదజల్లి అధికార దుర్వినియోగానికి పాల్పడి ఓటర్లను ప్రలోభపెట్టి గెలవడం ఒక గెలుపే కాదన్నారు. ఇది విజయం అనుకుంటే చంద్రబాబు అంత మూర్ఖుడు ఇంకొకరు ఉండరన్నారు. టీడీపీ నేతలు ఓటర్లదగ్గరకు వెళ్లి ఆధార్ కార్డులు లాక్కున్నారని, ఓటేయకపోతే పెన్షన్ కట్ చేస్తామని బెదిరించి ఓట్లేయించుకున్నారని అన్నారు. అధికార టీడీపీ భయభ్రాంతులకు గురిచేసినాకూడా ధైర్యంగా ఓటేశారంటూ నంద్యాల ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాల ఎన్నికల్లో ఇన్ని ప్రలోభాలు, బెదిరింపుల మధ్య కార్యకర్తలు గట్టిగా నిలబడినందుకు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ విలువలకు కట్టుబడి ఉండే పార్టీ అన్నారు. శిల్పా చక్రపాణి రెడ్డి తన ఎమ్మెల్సీ పదవిని వదులుకుని అధికారపార్టీ నుంచి వైఎస్‌ఆర్‌సీపీలోకి వచ్చారని, శిల్పామోహన్ రెడ్డి కూడా బాగా కష్టపడ్డారంటూ శిల్పా సోదరులకు జగన్ హ్యాట్సాఫ్ చెప్పారు. పదవి పోతుందని తెలిసి కూడా రాజీనామా చేసి పార్టీలో చేరి విలువలు అన్న పదానికి శిల్పాసోదరులు రాజకీయాల్లో కొత్త అర్థం తీసుకువచ్చారన్నారు. చంద్రబాబు ఈ ఎన్నికను విజయంగా భావించటం దిగజారుడుతనమే అవుతుందన్నారు.

నంద్యాల ఎన్నికల ప్రచారంలో తాము ప్రతిచోట ప్రజలతో మమేకమయ్యామని చెప్పారు. చంద్రబాబు ఎన్నికలపుడు ఇచ్చిన మాటలు, తర్వాత చేసిన మోసం గురించి ప్రజలను ప్రశ్నించినపుడు వారినుంచి కూడా పూర్తి అవగాహనతో కూడిన సమాధానాలు వచ్చాయన్నారు. రైతులు , డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఎన్నికలపుడు చెప్పినవి నెరవేర్చకుండా మోసం చేశాడన్నారు. రేషన్ షాపుల్లో ఇచ్చే బియ్యం దగ్గర నుంచి కరెంట్ చార్జీల పెంపువరకూ బాబు చేసిన ప్రతిమోసాన్ని ప్రజలే చేతులెత్తి చెప్పారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గెలిచాడంటే కారణం ఇది సాధారణ ఎన్నికలు కాకపోవడమే అన్నారు. బాబుకు వ్యతిరేకంగా ఓటేసినా వెంటనే అధికారం నుంచి తప్పుకోడు కాబట్టే నంద్యాల ప్రజలు ఈ రకంగా ఆలోచన చేశారన్నారు.

ఒకేసారి ఎన్నికలకు రండి!

నంద్యాలలో ఒకే చోట ఎలక్షన్ జరపటం, రెండు వందల కోట్లు ఖర్చు పెట్టడం, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి పోలీసులను వాడుకోవటం రెఫరెండం ఎలా అవుతందని జగన్ ఒక ప్రశ్నకు బదులిచ్చారు.వైఎస్‌ఆర్‌కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచి తెలుగుదేశం పార్టీలో చేరిన ఆ 20 మంది ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి దమ్ముంటే ఒకేసారి ఎన్నికలకు రావాలని చంద్రబాబుకు జగన్ సవాల్ విసిరారు. నియోజకవర్గానికి రూ.200కోట్ల వంతున ఎన్నికలు జరిగే 20 చోట్ల నాలుగు వేల కోట్లు ఎలా పెడతావో, 20చోట్ల పోలీసులు నీమాట ఎలా వింటారో, ఓటర్లను ఎలా భయపెడతావో తెలుస్తుందన్నారు. ఒక్క చోట ఎలక్షన్ పెట్టి రెఫరెండం అనడం సరికాదన్నారు. ఆ ఎమ్మెల్యేలను తన పార్టీ గుర్తుపై గెలిపించుకునే ధైర్యం చంద్రబాబుకు లేదన్నారు. రాజకీయాల్లో గుండెధైర్యం కావాలన్నారు. బలంగా కొట్టినపుడు వెనక్కు తగ్గుతాం, అవతలి వాడు కొట్టినపుడు తీసుకున్నాం.. మా టై వస్తుంది..మేమూ కొడతాం.. అని జగన్ పేర్కొన్నారు.

తెదేపాకు తిరుగులేదు: బాలకృష్ణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నంద్యాల ఉపఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించిన నంద్యాల ప్రజలకు హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికలో తమ పార్టీ గెలుపు చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషిచేస్తున్న తెలుగుదేశం ప్రభుత్వానికి అన్ని వర్గాల మద్దతు ఉందన్న విషయం ఈ ఎన్నికల ద్వారా మరోసారి రుజువైందన్నారు. ఇదే స్ఫూర్తిని తెదేపా శ్రేణులు కొనసాగించి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని బాలకృష్ణకోరారు.

కాంగ్రెస్‌కు 1,382 ఓట్లే!

● నోటా కంటే 151 ఓట్లే అధికం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నంద్యాల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భంగపాటు ఎదురైంది. జాతీయ పార్టీ గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల్లో చతికిలపడింది. ఇంకా చెప్పాలంటే తుడిచిపెట్టుకుపోయింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చినన్ని ఓట్లు సైతం రాలేదు. నోటాతో కాంగ్రెస్ అభ్యర్థి పోటీ పడ్డారా? అని చలోక్తులు విసురుకునే పరిస్థితి ఎదురైంది. గెలుపోటములు అటుంచి కనీసం గతం కంటె ఎక్కువ ఓట్లు సాధించుకునే అవకాశాన్ని సైతం పార్టీ కోల్పోయిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలే విమర్శిస్తున్నారు. ఈ దుస్థితి రావడానికి స్వయంకృతాపరాధమే అని వారంటున్నారు. పార్టీకి మంచి ఓట్లు సాధించుకోవాల్సిన పరిస్థితుల్లో టీడీపీ అభ్యర్థికి ఓట్లేయాలని కొందరు పార్టీ నేతలు చెప్పడం విమర్శలకు దారి తీసింది. ఈ పరిస్థితి రాష్ట్ర అధ్యక్షుడికి తెలిసి జరిగిందా ? లేదా ? కాని, గతంలో వచ్చినన్ని ఓట్లు కూడా సాధించలేకపోయింది. ఎపిసీసీ అధ్యక్షుడు ఎన్ రఘువీరారెడ్డి నియోజకవర్గంలో ప్రచారం చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఓడిపోయినప్పటికీ కనీసం 10 వేల ఓట్లయినా రావచ్చని అంచనా వేశారు. అధికార టీడీపీ, విపక్షవైఎస్ ఆర్ కాంగ్రెస్ నాయకులు సైతం అనుకున్నారు. కాంగ్రెస్‌కు కాస్తా ఓటింగ్ పెరగవచ్చనుకున్నారు. అయితే, అందుకు విరుద్ధంగా ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గడ్డం అబ్దుల్ ఖాదర్‌కు కేవలం 1382 ఓట్లు మాత్రమే వచ్చాయి. 2014 ఎన్నికల్లో అప్పుడు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన జూపల్లె రాకేష్ రెడ్డికి 2459 ఓట్లు వచ్చాయి. రాష్ట్ర విభజన జరిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయిన సందర్భంగా ప్రజలు ఆగ్రహంతో ఉన్నప్పుడు కూడా 2459 ఓట్లు పడ్డాయి. కానీ, ఈ సారి గతం కంటే 1077 ఓట్లు తక్కువ ఓట్లను పార్టీ మూటగట్టుకుని పరాజయం పాలైంది. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, వ్యతిరేక ఓటు, కేంద్రంలో బీజేపీ విధానాలు, ఈ సారి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపి ఎంతో కొంత ఓటు శాతం పెరుగుతుందని ఆశించిన నేతలకు నిరాశే ఎదురైంది. గతం కంటే ఎక్కువే పడే అవకాశాలను కాంగ్రెస్ పార్టీ చేజేతులా జారవిడుచుకుందని విమర్శలు వస్తున్నాయి. స్థానికంగా ఉన్న వ్యక్తిని కాకుండా హైదరాబాద్‌లో ఉన్న వ్యక్తిని నిలబెట్టడం కూడా పార్టీలో అసంతృప్తికి దారి తీసిందని, అందువల్లే తమకు పడాల్సిన ఓట్లు కూడా పడలేదని మరి కొందరు మైనారిటీ నాయకులు పెదవి విరుస్తున్నారు. ఈ ఎన్నికల్లో నోటాకు 1231 ఓట్లు పడ్డాయి. కాంగ్రెస్ 1382 తో సరిపుచ్చుకుంది.

ఆంధ్రప్రదేశ్‌కు మరో లక్ష గృహాల మంజూరు

● 21 శాతం వాటాతో దేశంలోనే ముందంజ

● మొత్తం 5.41 లక్షలకు చేరిన ఇళ్ల సంఖ్య

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : 2022నాటికి దేశంలో అందరికీ సొంతింటి కలను నెరవేర్చే క్రమంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మరో 2,17,900 గృహాలు మంజూరు చేసింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ 1,20,894 గృహాలతో సింహభాగం దక్కించుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో ఉత్తర ప్రదేశ్ (41,173), అస్సాం (16,700), గుజరాత్ (15,222), జార్ఖండ్ (14,017), మహారాష్ట్ర (9,894) రాష్ట్రాలు నిలిచాయి. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంజూరు చేసిన గృహాల్లోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది.

తాజాగా మంజూరైన గృహాలతో కలిపి మొత్తం ఇప్పటి వరకు 5,41,300 గృహాలను కేంద్ర ప్రభుత్వం నుంచి పొందింది. ఇందుకోసం రూ. 31,056 కోట్లు ఖర్చవుతుందని అంచనాలురూపొందించగా, ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ. 8,138 కోట్లు మంజూరయ్యాయి. మొత్తం మంజూరైన గృహాల్లో తమిళనాడు రాష్ట్రం 3,35,039 గృహాలతో ద్వితీయస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో మధ్యప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, బిహార్ రాష్ట్రాలు నిలిచాయి.

మొత్తం మంజూరైన 26,13,568 గృహాల్లో ఈ పది రాష్ట్రాల వాటాయే అత్యధికంగా 82శాతం ఉంది. వీటి కోసం రూ. 1,39,621 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా, కేంద్ర ప్రభుత్వం రూ. 40,597 కోట్లు తమ వాటాగా రాష్ట్రాలకు అందజేస్తోంది.

లోపం ఎక్కడ?

● ఓటమిపై వైకాపాలో అంతర్మథనం

● త్వరలో ముఖ్యనేతలతో సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎన్నికల ప్రచారంలో ప్రజాభిమానం వెల్లువెత్తింది.. పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి రోడ్‌షోలకు అన్ని వర్గాల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎన్నికల ప్రచారంలో మహిళలు జగన్ పట్ల ఎనలేని అదరణ కనబరిచారు. యువత సైతం వెళ్లిన ప్రతి చోట జగన్‌కు జేజేలు పలికారు. పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డిని వెంటబెట్టుకుని జగన్‌కూడా రెట్టించిన ఉత్సాహంతో నంద్యాల నియోజకవర్గంలో 13 రోజుల పాటు కాలికి బలపం కట్టుకుని తిరిగారు. మరి నంద్యాల ఉప ఎన్నికల ఫలితం ఇలా అయిందేమిటి, లోపం ఎక్కడ జరిగింది...ప్రజాభిమాన్నాన్ని ఓట్ల రూపంలో మలుచుకోలేక పోయాం ఎందుకు వెనకబడ్డాం ..అన్న ప్రశ్నలు ఇపుడు వైఎస్‌ఆర్‌కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని ములుకుల్లా తొలుస్తున్నాయి. నంద్యాల ఉప ఎన్నికలకు సంబంధించి వ్యూహంలో ఏమైనా లోపం ఉందా లేక ఎన్నికల ప్రచారంలో ఏమైన పొరపాట్లు చేశామా, కఠిన పదజాలంతో అధికార తెలుగుదేశం పార్టీపై చేసిన విమర్శల ప్రభావం ఏమైనా ఉందా, అధికార పార్టీకి ప్రభుత్వపరంగా కలిసివచ్చే అదనపు బలాన్ని అంచనావేసుకోలేక పోయామా అన్న కోణంలో కూడా పరిశీలన చేసుకుంటున్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రయోగించిన ఆర్థిక బలం ముందు నిలదొక్కుకోలేక పోయామా అన్న దిశగా కూడా చర్చించుకుంటున్నారు. పార్టీ అధినేత జగన్ నంద్యాల ఉప ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టి పోరాడారు. ఒక పార్టీ అధ్యక్షుడిగా చేయదగ్గ దానికంటే వందరెట్లు అధికంగానే శ్రమించారు. ఎండల తీవ్రతను భరిస్తూ, వర్షాలకు తడుస్తూ నంద్యాల, గోస్పాడు మండలాల పరిధిలోని గ్రామగ్రామం తిరిగారు. నంద్యాల పట్టణంలో కూడా రోడ్‌షోలు చేశారు. వీధివీధి తిరిగారు. రాటు దేలిన ప్రసంగాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు కృషి చేశారు. నంద్యాలలో జగన్ చేసిన రెక్కల కష్టం ఎన్నికల్లో ఆపార్టీ విజయంపై విశ్వాసాన్ని పెంచింది. తొలిదఫా నంద్యాల పర్యటనలోనే ఎస్పీజీ పాఠశాల మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు జనం పోటెత్తారు. సభ సక్సెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహంతోపాటు గెలుపుపై ఆశలను పెంచింది. పోలింగ్ సరళి తీరు కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి విజయం ఖాయం అన్న నమ్మకాన్ని కల్పించింది. గోస్పాడు, నంద్యాల మండలాల పరిధిలో పార్టీకి మంచి మెజారిటీ లభిస్తుందని, గ్రామీణ ప్రాంత ఓటర్లు ఇచ్చే మెజారీటితో నంద్యాల పట్టణంలో కూడా నెగ్గుకు రాగలం అని పోలింగ్ అనంతరం పార్టీ విశ్లేషకులు అంచనాలు వేశారు. పోలింగ్ కేంద్రాల వారిగా చేసిన విశ్లేషణలు కొద్దిపాటి మేజారిటీతో అయినా గెలుపు ఖాయం అన్ని ధీమాను పెంచాయి. తీరా ఓట్ల లెక్కింపు వచ్చేసరికి ఫలితం తిరగబడింది. అందులోనూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి లభించిన భారీ మెజారిటీ వైకాపా నేతలను ఒకింత ఆశ్చర్యంతోపాటు ఆందోళనకు కూడా గురిచేసింది. ఎక్కడైనా పొరపాటుచేశామా, అన్న కోణంలో కూడా శోధిస్తున్నారు. నంద్యాల నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగానే కాకుండా కొద్ది నెలలపాటు మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న శిల్పా మోహన్ రెడ్డికి నంద్యాలపై మంచి పట్టే ఉంది. అంతకు మించి నియోజకవర్గం అంతటా బలమైన వర్గం కూడా ఉంది.మరి ఎన్నికల్లో ఇంత భారీ తేడాతో ఎందుకు ఓటమిని చవిచూడాల్సి వచ్చిందన్న ప్రశ్నలకు ఇప్పటికిపుడు పార్టీ నేతలకు కూడా సమాధానాలు తట్టడం లేదు. తెలుగుదేశ పార్టీ ఎన్నికల్లో అధికార బలాన్ని ఉపయోగించుకుందని, దాన్ని నిలవరించలేకపోయమని పార్టీ ముఖ్యనేత ఒకరు అంగీకరించారు. పోలీసులు అధికార టీడీపీకే లోలోపల సహకారం అందించారన్న అభిప్రాయం కూడా వ్యక్తం చేస్తున్నారు. అన్నింటికీ మించి తెలుగుదేశం పార్టీ ధనం బలం ముందు తూగలేకపోయారన్న వాదనను కూడ పరోక్షంగా అంగీకరిస్తున్నారు. పార్టీ ముఖ్య సలహాదారుగా ఉన్న ప్రశాంత్ కిషోర్ సర్వేలు, ఎన్నికల వ్యూహాలు, ఫలితాలపై అంచనాల్లో ఎక్కడైనా తేడా వచ్చిందా అన్న అంశాన్ని కూడ పరిశీలిస్తున్నారు. త్వరలోనే పార్టీ ముఖ్య నేతలతో నంద్యాల ఉప ఎన్నికల ఓటమికి గల కారణాలపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు సమాచారం. ఈ సమవేశానికి నంద్యాల నియోజకవర్గలోని కొందరు కీలక నేతలను ఆహ్వానించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

ఉద్యోగుల విభజనకు 'స్థానికత'

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ స్థానికత కలిగిన నాల్గవ తరగతి ఉద్యోగులు, 11 మంది డ్రైవర్లు, ఇద్దరు భారీ వాహనాల డ్రైవర్లు, 71 మంది రికార్డు అసిస్టెంట్లు, డూప్లికేటింగ్ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించే విధంగా చర్చలు జరిగినట్లుగా తెలిసింది. స్వరాష్ట్రం వెళ్లేందుకు దరఖాస్తు చేసుకొని ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్న సుమారు 2 వేల మంది ఉద్యోగులను ఆంధ్రప్రదేశ్‌కు పంపించే విధంగా ఉత్తర్వులు జారీ చేయడం, తెలంగాణ సచివాలయంలో పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన 24 మంది ఏఎస్‌వోల వివాదం పై కూడా సలహా మండలి చర్చించినట్టు తెలిసింది. స్థానికత ఆధారంగా మిగిలిపోయిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకొనేందుకు చర్యలు తీసుకోవాలని సమావేశలో నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిసింది.

శాఖాపరమైన పదోన్నతుల కమిటీ భేటీ


శాఖాపరమైన పదోన్నతులపై ఏర్పాటైన ఎస్.కె. జోషీ కమిటీ సోమవారం సమావేశమైంది. వ్యవసాయం, సహకార, ఆర్థిక, పురపాలక, విద్యాశాఖల్లో పదోన్నతులపైన కమిటీ ప్రధానంగా చర్చించింది. మొత్తంగా 51 మందికి శాఖాపరమైన పదోన్నతులు కల్పించడానికి కమిటీ సిఫార్సు చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖాధిపతులు తగిన చర్యలు తీసుకొనవలసి ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

2లోగానే ఎలక్షన్ కేబినెట్!

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని భావిస్తున్నారు. దీని కోసం రాష్ట్రాల పర్యటన రద్దుచేసుకుని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఢిల్లీలోనే మకాం వేశారు. ఎన్‌డీఏలో కొత్త పార్టీలను చేర్చుకునే అంశంపై ఆయన కసరత్తు చేస్తున్నారు. ఎన్‌డీఏలో చేరిక తర్వాత ఆ పార్టీలకు మంత్రివర్గంలో చోటు కల్పించేందుకు మార్గం సుగమం చేస్తున్నారు. అయితే ఎన్‌డీఏలో చేరేందుకు ఎదురవుతున్న చిన్నచిన్న అవాంతరాలను తొలగించేందుకు కొంత సమయం పడుతుండంతో మంత్రివర్గ విస్తరణ ఆలస్యమవుతోందని పార్టీ వర్గాలు అంటున్నాయి. జేడీయూలో శరద్‌యాదవ్ వివాదం దాదాపు ముగిసిపోయినా, అన్నాడీఎంకేలో మళ్లీ కొత్త వివాదాలు రాజుకున్నాయి. దినకరన్ వర్గం, పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు జెండా ఎగరేయడంతో అన్నాడీఎంకే సొంత ఇంటిని చక్కబెట్టుకునే పనిలో ఉంది. ఒకటిరెండు రోజుల్లో ఇవి కొలిక్కివస్తాయని అంచనా వేస్తున్నారు. 19మంది దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు గవర్నర్‌ను కలిసి పళనిపై అవిశ్వాసాన్ని ప్రకటించారు. అయితే అది ప్రభుత్వంపై అవిశ్వాసం కాదని బీజేపీ సీనియర్ నేత ఒకరు చెపుతున్నారు. పళని నాయకత్వంపై అసంతృప్తి ఉంటే పార్టీలో తేల్చుకోవాలే తప్ప గవర్నర్ దగ్గరో, లేక అసెంబ్లీలో కాదని ఆ బీజేపీ నేత వెల్లడించారు. పార్టీ నాయకత్వంపై అభిప్రాయభేదాలున్నా, ఎన్‌డీఏలో చేరే అంశంపై పెద్దగా అభ్యంతరాలు లేవని అంటున్నారు. పార్టీని కాపాడుకోవాలనే అన్నాడీఎంకేలోని అన్ని వర్గాల్లో ఉందని, దాని వల్లే పార్టీ చీలిపోదని బీజేపీ నేత అంచనా వేస్తున్నారు. ఈ అవాంతరాలు త్వరలోనే తొలగిపోతాయని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంటు ఉభయసభల్లో కలిపి అన్నాడీఎంకే 50మంది ఎంపీలున్నారు. దాంతో ఆ పార్టీకి రెండు కేబినెట్, రెండు సహాయమంత్రి పదవులు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం లోక్‌సభ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న తంబిదొరైకి కేబినెట్ పదవి దక్కనుంది, పన్నీరు వర్గానికి చెందిన మైత్రేయన్‌కు సైతం మంత్రివర్గంలో చోటు ఇచ్చే అవకాశముంది. తంబిదొరై పట్టణాభివృద్ధి శాఖ ఆశిస్తున్నట్లు తెలిసింది. ఇటీవలే ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఎన్నికవడంతో ఆశాఖ ఖాళీగా ఉంది. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్, ప్రస్తుతం ఈ శాఖను అదనంగా మోస్తున్నారు. జనతాదళ్ (యునైటెడ్)కు సైతం కేబినెట్‌లో రెండు బెర్తులు ఇచ్చే అవకాశం ఉంది. లోక్‌సభలో పెద్దగా బలం లేకపోయినా, రాజ్యసభలో ఆ పార్టీకి పది మంది ఎంపీలున్నారు. దాంతో జేడీయూకు సైతం కీలక శాఖలు కట్టబెట్టే అవకాశం ఉంది. గతంలో జేడీయూ నుంచి నితీష్ కుమార్ రైల్వేశాఖ నిర్వహించారు. ఈసారి తమకు ఆ శాఖ ఇవ్వాలని కోరుతున్నారని తెలిసింది. ఇక అనూహ్యంగా శరద్‌పవార్‌కు చెందిన ఎన్‌సీపీ సైతం ఎన్‌డీఏలో చేరుతుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆ పార్టీకి మంత్రివర్గంలోకి చోటు కల్పిస్తారనే ప్రచారం జరగుతోంది. శరద్‌పవార్ కూతురు సుప్రియా సూలే, ప్రఫుల్ పటేల్‌లో ఎవరో ఒకరికి మంత్రిపదవి దక్కుతుందని అంటున్నారు. మంత్రివర్గంలో ప్రస్తుతం అనేక ఖాళీలు ఉన్నాయి. కీలకమైన రక్షణశాఖ, అటవీ పర్యావరణ శాఖ, సమాచారశాఖకు ఫుల్‌టైమ్ మినిస్టర్లు లేరు. ఈ శాఖల్లో సమర్ధవంతమైన వ్యక్తుల కోసం నరేంద్ర మోడీ అన్వేషిస్తున్నారు. రక్షణశాఖ మంత్రిగా ఉండే వ్యక్తి నీతి, నిజాయితీలకు మారుపేరుగా ఉండాలని ఆశిస్తున్నారు. గోవా ముఖ్యమంత్రిగా వెళ్లిన మనోహర్ పారికర్ ఆడంబరాలకు దూరంగా, నిజాయితీగా కలిగిన వ్యక్తిత్వం ఉండడంతో ఆయన్ను అప్పట్లో రక్షణశాఖ మంత్రిగా నియమించారు. అయితే గోవాలో బీజేపీ అనూహ్యంగా దెబ్బతినడంతో పార్టీ ప్రయోజనాల దృష్ట్యా తిరిగి ఆయనను గోవాకు పంపాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో తిరిగి అదే స్థాయిలో సమర్థత, నిజాయితీ కలిగిన వ్యక్తి కావాలని మోడీ భావిస్తున్నారు. ఇప్పటికే మంత్రివర్గంలో వివాదాలకు దూరంగా, మంచి పనితీరు కనబరుస్తున్న నేతలకు ప్రమోషన్ ఇవ్వాలని భావిస్తున్నారు. కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి పీయూష్ గోయల్, పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌లకు కేబినెట్ యోగం దక్కే అవకాశముందని తెలుస్తోంది. మరోవైపు వయోభారంతో ఉన్న కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కల్‌రాజ్ మిశ్రాను కేబినెట్ నుంచి తొలగించే అవకాశముంది. ఆయనను బీహార్ గవర్నర్‌గా పంపాలని ఆలోచిస్తున్నారు. గత ఏడాది మంత్రివర్గ విస్తరణ సమయంలోనే ఈయనపై వేటు పడాల్సినప్పటికీ ఉత్తరప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆగారు. మైనారిటీ శాఖ మంత్రిగా ఉన్న నజ్మా హెప్తుల్లాను మంత్రివర్గం నుంచి తొలగించి మణిపూర్ గవర్నర్‌గా పంపిచారు. మంత్రివర్గ విస్తరణ పూర్తయితే ఖాళీగా ఉన్న గవర్నర్ పోస్టులన్నీ భర్తీ చేసే అవకాశాలున్నాయి. ఈసారి మంత్రివర్గ విస్తరణ పూర్తిగా 2019 ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే మార్పులు చేర్పులు చేయనున్నారు. కేవలం పనితీరే ప్రామాణికం కాకుండా, అసెంబ్లీ ఎన్నికలే జరిగే రాష్ట్రాలకు ప్రాధాన్యం, కుల, ప్రాంత సమతుల్యతలు, రాజకీయ సమీకరణలు బేరీజు వేసుకుని విస్తరణ చేపట్టనున్నారు.

సుప్రీం సీజే దీపక్ మిశ్రా



(మొదటి పేజీ తరువాయి)

రామనాథ్ కోవింద్ ప్రమాణం చేయించారు. 1977లో ఆయన ఒడిషా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించారు. ఇంతవరకూ ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ జెఎస్ కేహార్ పదవీ కాలపరిమితి నిన్నటితో ముగిసింది. మిశ్రా ప్రధాన న్యాయమూర్తి పదవిలో 2018 అక్టోబర్ 2వ తేదీ వరకూ కొనసాగుతారు. ఆయన గతంలో ఒడిషా, ఢిల్లీ హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారు 2012లో ఢిల్లీలో నిర్భయ్ కేసులో నిందితులకు మరణశిక్ష విధించిన ఐదుగురు న్యాయమూర్తుల్లో ఆయన ఒకరు. కావేరీ,కృష్ణా నదీ జలాల వివాదాలపై విచారణ జరిపిన ధర్మాసనంలో సభ్యునిగా, బీసీసీఐ వివాదంపై విచారణ జరిపిన బెంచ్ సభ్యునిగా ఆయన వ్యవహరించారు. ఆయన ప్రమాణ స్వీకారోత్సవానికి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, పలువురు కేంద్ర మంత్రులు,మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు గులామ్ నబీ ఆజాద్ ప్రభృతులు హాజరయ్యారు.

ఆంధ్రావాళ్లను పంపేయండి



విద్యుత్ సౌధ ఎదుట ఉద్యోగుల ధర్నా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మా రాష్ట్రం తదలరా.. మీ రాష్ట్రం వెళ్లరా, ఏపీ ఉద్యోగుల మొండి వైఖరి నశించాలి.. అన్న నినాదాలతో తెలంగాణ విద్యుత్ సౌధ మారుమోగింది. సోమవారం తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ సౌధ వద్ద మహాధర్నా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున విద్యుత్ సంస్థల ఇంజనీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోషియన్ రాష్ట్ర అధ్యక్షుడు సంపత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ సంస్థలు 2015 జూన్‌లో రిలీవ్ చేసిన 1253 మంది ఆంధ్రా స్థానికత గల ఉద్యోగులకు రెండున్నరేళ్లుగా జీతాలు ఇస్తుండటంవల్ల తెలంగాణ విద్యుత్ సంస్థలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతోందన్నారు. మూడేళ్లు కావస్తున్నా అటు ఆంధ్రా విద్యుత్ సంస్థలుకాని, ఆ రాష్ట్ర ప్రభుత్వం కాని వారిని తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. తెలంగాణ ఉద్యోగులపైనే కోర్టుల్లో కేసులు వేస్తూ విభజన ప్రక్రియను మరింత జఠిలం చేస్తూన్నారన్నారు. తమకు రావాల్సిన ప్రమోషన్లను కోర్టుకేసులతో అడ్డుకుంటూ మొండిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు, విద్యుత్ సంస్థలు ముందుకు వచ్చి ఉద్యోగుల విభజనకు ముగింపు పలకాలన్నారు. లేదంటే రిలీవ్ అయిన ఆంధ్రా ఉద్యోగులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం అసోషియేషన్ ముఖ్యనేతలతో కలిసి సీఎండీ ప్రభాకర్ రావుకు మెమోరాండం సమర్పించారు. ఉద్యోగుల విభజన త్వరితంగా పూర్తి చేయాలని కోరారు. విభజన జరిగే వరకూ విద్యుత్ సంస్థలోని అన్ని అసోషియేషన్లను కలుపుకుని అంతిమ విజయం వరకూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలను కొనసాగిస్తామని తెలిపారు. మహాధర్నాలో అసోషియేషన్ నాయకులు మంగీలాల్, కిరణ్‌కుమార్, వెంకట నారాయణ, సావ్యా నాయక్, తిరుమల రావు, జనప్రియ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనకు ఇది ప్రజాతీర్పు

- రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇదే సీన్ రిపీట్
- ప్రజలు మెచ్చుకునేలా పాలన
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ : తెలుగుదేశం ప్రభుత్వ పాలనకు, అభివృద్ధి, సంక్షేమానికి నంద్యాల ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఇదే సీన్ రిపీట్ అవుతుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం ఉదయం తన నివాసంలో నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలపై మంత్రులు, నేతలతో కలిసి సమీక్షించారు. ప్రతి రౌండ్‌కు తెలుగుదేశం పార్టీ ఆధిక్యత కనబర్చుతుండడంతో ముఖ్యమంత్రితో పాటు మంత్రుల్లో ఆనందం పొంగిపొర్లింది. విజయం ఖాయం అవ్వడంతో మంత్రులకు, నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా మిఠాయిలు తినిపించడమే కాకుండా కేక్ కట్ చేసి తన ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం మంత్రులు, పార్టీ నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ నంద్యాలలో తెలుగుదేశం పార్టీ గెలుపుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించారని, ఈ విజయం అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. ప్రతిపక్ష నేత నంద్యాలలో 15రోజుల పాటు మకాం వేసి ఎన్నో ప్రలోభాలకు గురిచేసినా ప్రజలు తిరస్కరించారని వ్యాఖ్యానించారు. ఈ ఉప ఎన్నిక విజయం ప్రభుత్వం పట్ల ఉన్న విశ్వాసానికి ప్రతీకఅన్నారు. ప్రజల విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకుని మరెన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అవినీతిని నిర్మూలించి ప్రజలు మెచ్చుకునేలా పాలన సాగిస్తామని అన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో శాశ్వతంగా అధికారంలో ఉండేలా కృషి చేస్తామన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపుకు కృషి చేసిన మంత్రులు, నేతలు, కార్యకర్తలను ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. అనంతరం మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడు, నారాయణ, ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, ధూళిపాల నరేంద్ర, ఎమ్మెల్సీలు టిడి జనార్ధన్, రాజేంద్రప్రసాద్, గిడ్డంగులు కార్పొరేషన్ చైర్మన్ ఎల్‌వీఎస్‌ఆర్‌కె ప్రసాద్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మిఠాయిలు తినిపించి, అభినందనలు తెలిపారు.

అభిమానుల సంబరాలు..

నంద్యాల ఉప ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి సీఎం చంద్రబాబు నివాసం ఎదుట అభిమానుల సందడి మొదలైంది. ప్రతి రౌండ్‌లో టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ముందంజలో ఉండడంతో కార్యకర్తలు, అభిమానులు సంబరాల్లో మునిగితేలారు. 16రౌండ్‌లో భూమా గెలుపు ఖాయం కావడంతో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. మిఠాయిలు పంచుకుంటూ, డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన నివాసం నుంచి సచివాలయానికి వెళ్తూ అభిమానులను , కార్యకర్తలను చిరునవ్వుతో పలకరించి అభివాదం చేశారు.

వచ్చే ఎన్నికల్లో వైకాపా ఖాళీ

మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ : వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతుందని , జగన్ లాంటి వ్యక్తి రాజకీయాలకు పనికిరాడని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. జగన్ లాంటి వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌లో ఉండటానికి అర్హుడు కాదని, ఆయనను హైద రాబాద్‌కే పరిమితం చేయా లన్నారు. ఎన్నో ఉప ఎన్నికలు జరిగినా, దేశం మొత్తం ఎంతో ఆసక్తిగా నంద్యాల ఉప ఎన్నికను గమనించిందన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

- యాజమాన్యం నిర్లక్ష్యమే కారణం
- తల్లిదండ్రుల ఆరోపణ



హత్నూర కెఎన్‌ఎన్: హత్నూర మండల పరిధిలోని తుడ్‌కల్ ఖానాపూర్ గ్రామ శివారులో గల రత్నపూరి ఇన్స్‌ట్యూట్ పాలిటెక్నికల్‌లో సోమవారం నాడు పస్ట్ ఇయర్ అగ్రికల్చర్ విద్యార్థిని సహస (17) అనే విద్యార్థి గత కొన్ని రోజులుగా తోటి సీనియర్ విద్యార్థులు,అదే ఇన్‌ట్యూట్‌కు చెందిన ఏఓ యజమాన్యం వేధింపులే కారణమని ఆమె తల్లిదండ్రులు తెలిపారు. ఆమె తండ్రి రాజశేఖర్, తల్లి అరవిందో మాట్లాడుతూ తమకు ఒకగానో ఒక కూతురు అల్లారు ముద్దుగా పెంచుకున్నామని మా కూతురు రత్నపూరి ఇనిస్టిట్యూట్ యజమాన్యం బలి తీసుకోవడం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితి ఏ విద్యార్థికి రాకూడదని సహస తల్లిదండ్రులు తెలిపారు. ఇంతకుముందు రత్నపూరి ఇన్‌స్టిట్యూట్‌లో ఒక విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన విదితమే అని వారు అన్నారు. అయిన ఈ యజమాన్యం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందని వారు తెలిపారు. ఈ పాలిటెక్నికల్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం పోలిసులకు పిర్యాదు చేశామని తెలిపారు. సీఐని వివరణ కోరగా ఆయన కేసు నమోదు చేసుకుని దోశులకు శిక్షపడేవిధంగా చూస్తామని సీఐ వెంకటేశం తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ రాజేశ్ నాయక్ ఉన్నారు.

మోడీని కలిసిన ఐరాస కొత్త అధ్యక్షుడు

న్యూఢిల్లీః ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ కొత్త అధ్యక్షునిగా ఎన్నికైన మిరోస్లావ్ లాజ్‌కాక్ సోమవారంనాడు ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోడీని కలుసుకున్నారు. ఉగ్రవాదంపై పోరులో ఐక్యరాజ్యసమితి మరింత కీలకమైన పాత్ర వహించాల్సిన అవసరం గురించి, సమితిలో సంస్కరణలను సత్వరమే అమలు చేయాల్సిన అవసరం గురించి వారిద్దరూ చర్చించినట్టు ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఒ)వర్గాలు తెలియజేశాయి. సమితి సర్వప్రతినిధి సభ అధ్యక్షునిగా ఎన్నికైన లాజ్‌కాక్‌ని ప్రధానమంత్రి అభినందించారు.ఆయన పదవీ బాధ్యతల నిర్వహణలో భారత్ సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని వాగ్దానం చేశారు. భద్రతా మండలిలో భారత్‌కి శాశ్వత సభ్యత్వం అంశం గురించి కూడా వీరి చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్టు పిఎంఒ వర్గాలు తెలిపాయి.

తుపాకీ నీడలో సిర్సా



రోహ్‌తక్(హర్యానా) : పంచకులలోని సీబీఐ కోర్టు బాబా రాం రహీంను దోషిగా తేల్చిన తర్వాత అక్కడికి సమీపంలోని అంబాలా పట్టణంలోని జైలుకు తరలించాలని తొలుత నిర్ణయించారు. అయితే బాబా భక్తులు, మద్ధతుదారులు సృష్టించిన విధ్వంసం, అల్లర్లు, ఆ తర్వాత చోటు చేసుకున్న హింస నేపథ్యంలో రాం రహీంను రోహ్‌తక్‌లోని కొత్త జైలుకు తరలించారు. ఉన్మాదుల్లా పేట్రేగిపోయిన బాబా భక్తులు జైలుపై దాడి చేసి మరీ తమ బాబాను విడిపించుకుపోయే ప్రమాదముందని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రోహ్‌తక్ జైలునే ఎంచుకోడానికి అనేక కారణాలున్నాయి. ముఖ్యంగా ఈ జైలు కొత్తగా నిర్మించినది కావడం, దుర్భేద్యమైన భద్రతా వ్యవస్థను కలిగి ఉండడం మొదటి కారణం. పైగా ఈ జైలు రోహ్‌తక్ పట్టణానికి శివార్లలో బైపాస్ రోడ్డుకు ఆనుకుని సునారియా గ్రామంలో నిర్మితమైంది. తద్వారా రోహ్‌తక్ పట్టణ జనాభాకు దూరంగా ఉండడం వల్ల భద్రత విషయంలో ఢోకా లేదు.ఇదిలా ఉంటే, బాబా రాం రహీంకు రోహ్‌తక్ పట్టణం లేదంటే పరిసర ప్రాంతాల్లో పెద్దగా పట్టు లేదు. దీనిక్కారణం బాబా అనుచరవర్గమంతా సమాజంలో నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురైన నిమ్నవర్గాలకు చెందినవారే. హర్యాణాలో రాజకీయాల్లో జాట్ల ఆధిపత్యం ఎక్కువ. సామాజికంగా, ఆర్థికంగా జాట్లు ముందంజలో ఉండడంతో నిమ్నవర్గాల ప్రజలకు డేరా సచ్చా సౌధా ఒకవేదికగా మారింది. ఈ వేదికకు సహజంగానే జాట్లు బద్ధ వ్యతిరేకులయ్యారు. రోహ్‌తక్ పరిసర ప్రాంతాల్లో జాట్ల సంఖ్య ఎక్కువ. అందుకే ప్రభుత్వం స్థానికంగా ఇబ్బందులు ఉండని రోహ్‌తక్ ప్రాంతాన్ని ఎంచుకుంది. కేవలం రోహ్‌తక్ జైలుకు తరలించడంతోనే సరిపెట్టకుండా ఆ పట్టణానికి ప్రవేశించే అన్ని మార్గాల్లోనూ నాకాబందీ ఏర్పాటు చేసింది. వచ్చే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తూ ఇతర ప్రాంతాల నుంచి బాబా రాం రహీం భక్తులు రాకుండా నియంత్రించగలిగింది. ఇక జైలు ప్రాంగణానికి కనీసం 2 కిలోమీటర్ల పరిధిలో నిషేధిత ప్రాంతంగా మార్చింది. జైలు సిబ్బంది, ప్రభుత్వాధికారులు, పోలీసులు మినహా మరెవరినీ అనుమతించకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. దీంతో శిక్ష ఖరారు చేసిన తర్వాత రోహ్‌తక్‌లో ఒక్క చిన్న అవాంఛనీయ ఘటన చోటుచేసుకోకుండా అడ్డుకోగలిగింది.ఇక సిర్సా విషయానికొస్తే డేరా సచ్ఛా సౌధా ప్రధానాశ్రమం సహా ఇంకా అనేక బ్రాంచిలు అక్కడే ఉన్నాయి. స్థానికంగా రాం రహీంకు బాగా పట్టున్న పట్టణం సిర్సా. దీంతో ఈ పట్టణంలో కర్ఫ్యూతో పాటు అనేక ఆంక్షలు, నిషేధాజ్ఞలు అమలు చేశారు. పూర్తిగా సాయుధ బలగాల తుపాకీ నీడలో పట్టణాన్ని నిర్బంధించారు. అయినా సరే అల్లరిమూకలు రెండు బస్సులను తగులబెట్టారు. చెదురుమదురు హింసాత్మక ఘటనలకు ప్రయత్నించినప్పటికీ అక్కడున్న భద్రతా సిబ్బంది సమర్ధవంతంగా అడ్డుకున్నారు. అలా శుక్రవారం నాటి హింస పునరావృతం కాకుండా చేయడంలో పోలీసులు విజయం సాధించగలిగారు.

స్థిరంగా అల్పపీడనం

(మొదటిపేజీ తరువాయి)

నిజామాబాద్ జిల్లాల్లో కొన్ని చోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. క్షేత్రస్థాయి సమాచారం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి పంట నష్టం జరగలేదు. వాతావరణ శాఖ తాజాగా బులెటిన్ ప్రకారం తుపా ను తీవ్రత పెరిగితే, అత్యధిక వర్షాలు కురిస్తే భారీ నష్టం సంభ వించే అవకాశాలు ఉన్నట్లు వ్యవ సాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను తీవ్రత ఊహించకుండా పెరిగితే నదీతీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయా ల్సిందిగా సీఎం కేసీఆర్ ఆదేశా లిచ్చారు. ఆ మేరకు ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి ఎస్పీ సింగ్, రాష్ట్ర స్థాయి అధికార యంత్రాంగానికి, జిల్లా కలెక్టర్లకు ముందుజాగ్రత్త చర్యలకోసం ఆదేశాలు జారీ చేశారు. తీర ప్రాంత జిల్లాల్లో విపత్తుల నిర్వ హణశాఖ బృందాలను సిద్ధం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అప్ర మత్తంగా ఉండాల్సిందిగా అప్ర మత్తం చేశారు. ఏయే ప్రాంతాల్లో ఎక్కువ వర్షపాతం నమోదైందో ఆ సమాచారాన్ని వెంటనే ప్రభు త్వానికి పంపించాల్సిందిగా సీఎస్ కలెక్టర్లకు సూచించారు.

ఇబ్బందులకు గురిచేస్తే దాడులు చేస్తాం



ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 28 కెఎన్‌ఎన్: రాష్ట్రంలో గ్రామాభివృద్ధి కమిటీలను ప్రభుత్వం రద్దు చేయాలని, దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసినందున అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌మండలం మంథని గ్రామంలో 120 ఎస్సీ కుటుంబాలను వీడీసీ వారు సాంఘిక బహిష్కరణ చేసినందున సోమవారం పర్యాటించారు. గ్రామంలోని ఎస్సీ కులస్తులతో సమావేశమై ఆయన మాట్లాడారు. గ్రామాలలో అగ్రవర్ణాలు తమ పెత్తనం కోసం గ్రామాభివృద్ధి కమిటీల పేరా అరాచకాలు చేస్తున్నాయని, ప్రశ్నించిన వారిపై బహిష్కరణ వేటుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. రిజర్వేషన్లను దెబ్బకొట్టడానికి ప్రైవేట్ రంగాన్ని ప్రొత్సహించి ఉద్యోగాలను దళితులకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. దళిత, బలహీ న వర్గాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులను అదుపులో పెట్టడానికి వీడీసీలు ఏర్పాటు అయ్యాయన్నారు. వీడీసీలు అంటే దళిత అభివృద్ధి నిరోధక కమిటీలన్నారు. మంథనిలోని వీడీసీ వారు సాంఘిక బహిష్కరణ చేస్తే పోలీసులు కేసునమోదు చేశారని, ప్రస్తుతం కలిసిపోయినందున పోలీసు అధికారులు కేసులను రద్దు చేస్తారా అని ప్రశ్నించారు. ఎస్సీ కుటుంబాలను సాంఘీక బహిష్కరణ చేసినందున గ్రామానికి ఎస్సీ కమీషన్ వచ్చేలా అండగా ఉంటానని పేర్కొన్నారు. మాల, మాదిగలు ఐక్యమత్యంగా ఉండి పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. దళితులను ఎవరైతే ఇబ్బందులు పెడుతున్నారో వారిపై రాబోయే రోజులలో దాడులు చేస్తామని హెచ్చరించారు. పెత్తనం చేసే వారికి శిక్షలు పడే వరకు గ్రామస్తులకు అండగా ఉంటానని చెప్పారు.

నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రభుత్వం నియోజక వర్గాల అభివృద్ధి నిధిని విడుదల చేసింది. ఒకొక్క శాసన సభ నియోజక వర్గానికి రూ. 75 లక్షల చొప్పున ప్రణాళికా శాఖ నిధులను మంజూరు చేసింది. ఎమ్మెల్సీలకు కూడా రూ. 75 లక్షల చొప్పున మొత్తం రూ. 120 కోట్లు విడుదల చేసింది.

ఆర్థిక నేరాలు అత్యంత ప్రమాదకరం

అగ్రిగోల్డ్ డైరెక్టర్ ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఆర్థిక నేరాల ప్రభావం ఇతర నేరాల కన్నా అత్యంత ప్రమాదకరమని హైకోర్టు పేర్కొంది.కార్పోరేట్ నేరాల ప్రభావం కొన్ని కుటుంబాలను నాశనం చేస్తాయని హైకోర్టు స్పష్టం చేసింది. అగ్రిగోల్డ్ యాజమాన్యం దాదాపు రూ. 600 కోట్ల ను తన అనుబంధ కంపెనీలకు బదలాయించినట్లు ప్రాథమిక ఆధారాలున్నాయని హైకోర్టు ప్రకటించింది. దురుద్దేశాలతో,నిబంధనలకు విరుద్ధంగా ఈ మళ్లింపు జరిగిందని స్పష్టం చేసింది. ఈ విషయంలో న్యాయస్థానాలు కళ్లు మూసుకొని ఉండజాలవని హైకోర్టు తేల్చి చెప్పింది.మధ్య తరగతి నిరుపేద ప్రజల నుంచి భారీ మొత్తంలో సొమ్ము వసూలు చేసిన వ్యక్తులు సీఆర్ పీసీ సెక్షన్ 438 కింద రక్షణ పొందడం జరగదని స్పష్టం చేసింది. అగ్రిగోల్డ్ కంపెనీ ,దాని అనుబంధ కంపెనీలకు డైరెక్టర్ గా, వైస్ చైర్మన్ గా వ్యవహరిస్తున్న ఎం.బానోజీ రావుకు ముందస్తు బెయిల్ నిరాకరించింది. ఈ కేసును తీవ్రతను ద ృష్టిలో పెట్టుకుని బానోజీ రావుకు ముందస్తు బెయిల్ నిరాకరిస్తున్నట్లు హైకోర్టు తేల్చి చెప్పింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు పోలీసు ఠాణాల్లో నమోదైన కేసుల్లో తనకు ముందస్తు బెయ్నిల్ మంజూరు చేయాలని కోరుతూ ఎం.బానోజీ రావు హైకోర్టులో వేర్వేరుగా పలు వ్యాజ్యాలను దాఖలు చేశారు.ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.సునిల్ ఇటీవల ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ చేపట్టి ,ఈ మేరకు తీర్పును వెలువరించారు.

ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే పిటిషనర్ ఉద్దేశం ఏమిటో తెలుస్తోందన్నారు. ఎఫ్ఐఆర్ లో తన పేరు ఎక్కడా లేదు కాబట్టి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని పిటిషనర్ కోరుతున్నారు.ఎఫ్ ఐఆర్ లో పేరు లేనంత మాత్రాన ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని పిటిషనర్ కోరుతూ ఎక్కడా లేదన్నారు. ఈ మేరకు న్యాయమూర్తి తన తీర్పును వెలువరించారు. ఈ కేసు తీవ్రతను ,డిపాజిట్ల వసూలులో పిటిషనర్ పాత్రను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి అతని బెయిల్ ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టేస్తున్నట్లు ప్రకటించారు.

జైల్లోనే తాత్కాలిక కోర్టు



రోహ్‌తక్(హర్యానా) : బాబా రాం రహీంపై నమోదైన అభియోగాలపై విచారణ జరిపిన పంచకుల సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం దోషిగా తేల్చిన విషయం తెలిసిందే.సాధారణ పరిస్థితుల్లో శిక్ష ఖరారు చేయడం అక్కడే జరగాలి. కానీ శుక్రవారం తీర్పునిచ్చిన మరుక్షణం నుంచే చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో పంచకులలో సోమవారం శిక్ష ఖరారు చేయడం సాధ్యపడదని ప్రభుత్వం భావించింది. పంచకుల నుంచి 240 కిలోమీటర్ల దూరంలో ఉన్న రోహ్‌తక్ జైలు నుంచి రాం రహీంను కోర్టుకు తరలించడం వల్ల మరోసారి శాంతిభద్రతలకు విఘాతం కల్గించే ప్రమాదముంది.

అందుకే రాం రహీంను ఉంచిన రోహ్‌తక్ జైలులోనే తాత్కాలికంగా న్యాయస్థానాన్ని ఏర్పాటు చేసేందుకు హైకోర్టు అనుమతించింది. ఆ మేరకు ప్రత్యేక న్యాయమూర్తి హెలికాప్టర్లో రోహ్‌తక్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం సరిగ్గా గం. 2.30ని. ల సమయంలో వాదనలు మొదలయ్యాయి. దాదాపు గంటపాటు కొనసాగాయి. చివరకు మధ్యాహ్నం గం. 3.30 ని. లకు శిక్షను ఖరారు చేస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

మాకు వీసాలిప్పించండి



ముంబై: వివిధ జర్మన్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందిన దాదాపు 700 మంది విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరమైంది. వీరందరి ప్రవేశాలు దొరికినా వీసాలు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. వీసా రావడం సంగతి సరే, ముందు జర్మన్ కాన్సులేట్‌లో వీసా స్లాట్ దొరకడం లేదు. వీసా ఇంటర్వ్యూలకు ప్రత్యేక ఏర్పాట్లేమీ జర్మన్ కాన్సులేట్ చేయకపోవడంతో విద్యార్థులందరూ భారత విదేశాంగ మంత్రి సుష్మ స్వరాజ్‌ను ఆశ్రయించారు. చాలా మంది విద్యార్థులు విదేశాంగ మంత్రికి తెలపడానికి ట్విటర్‌ను ఆశ్రయించారు. తమకు వీసా స్లాట్లు ఇవ్వాలని సంబంధిత అధికారులందరికీ అర్జీలు పెట్టుకున్నారు. అక్టోబర్ ఒకటి నాటికి వీరందరూ జర్మనీలో తమకు ప్రవేశం ఇచ్చిన యూనివర్సిటీలో చేరాలి. ప్రభుత్వం లేదా కాన్సులేట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వీరందరికీ వీసా స్లాట్లు ఇస్తే తప్ప వీరు సమయానికి తమ తమ యూనివర్సిటీలకు చేరే అవకాశం కనిపించడం లేదు. ఈ సమస్య ఒక్క జర్మనీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకే ఉంది. మిగిలిన దేశాల్లో ప్రవేశాలు పొందిన వారికి ఆయా కాన్సులేట్లు ప్రత్యేక ఏర్పాట్లు చేయడమో లేక అక్కడ రష్ లేకపోవడమో ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడడం లేదు. కానీ జర్మనీ వెళ్లాల్సిన వారు మాత్రమే సమస్యలు ఎదుర్కొంటున్నారు. అందునా బెంగళూరు, చెన్నై, న్యూఢిల్లీ, కోల్‌కాతా నుంచి వెళ్లాల్సిన విద్యార్థులకు సమస్యలు లేవు. ముంబై నుంచి వెళ్లాల్సిన విద్యార్థులకే ముంబై జర్మనీ కాన్సులేట్ వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

హార్వే బాధితుల్లో భారతీయులు



హ్యూస్టన్: దాదాపు 200 మంది భారతీయ విద్యార్థులు అమెరికాలోని హరికేన్ హార్వే తీవ్రతను చవి చూస్తున్నారు. హ్యూస్టన్ నగరంలో యూనివర్సిటీ ఆఫ్ హ్యూస్టన్‌లో చదువుతున్న వీరు తుపాను కారణంగా వచ్చిన వరదలో చిక్కుకుపోయారు. వీరందరికీ అక్కడి భారతీయ కాన్సులేట్ ఆహారం అందిస్తోంది. వారికి ఆహారం అందిస్తామంటే ముందుగా కోస్ట్ గార్డ్ అంగీకరించలేదని, అందుకు బోట్లు కావాలని కాన్సుల్ జనరల్ అనుపమ్ రాయ్ చెప్పినట్లు భారత విదేశాంగ మంత్రి సుష్మస్వరాజ్ తెలిపారు. షాలిని, నిఖిల్ భాటియా అనే ఇద్దరు విద్యార్థులు ఐసీయూలో ఉన్నారు. వీరి గురించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇస్తామని మంత్రి చెప్పారు. వీరున్న ప్రాంతాన్ని నీరు ముంచేయడంతో విద్యార్థులు ఆయా భవనాలపైన సాయం కోసం వేచి ఉన్నారు. వీరున్న ప్రాంతంలో మంగళవారం నాటికి జనాన్ని ఖాళీ చేయించడం పూర్తి కావాలి. హ్యూస్టన్‌లో నివసిస్తున్న ప్రతి భారతీయ కుటుంబమూ వరదల్లో చిక్కుకుపోయిన వారికి సాయపడుతోందని తెలంగాణలోని నల్గొండకు చెందిన కిషోర్ రామరాజు చెప్పారు. అక్కడి హైదరాబాదీ రెస్టారెంట్ తుపాను బాధితులకు ఆహారం ఏర్పాటు చేస్తోంది. భారత విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు రవి శంకర్ నేతృత్వంలోనూ సహాయ కార్యక్రమాలు జరుగుతున్నాయి. స్టాట్‌ఫోర్డ్, ఫెలిక్స్ అపార్ట్ మెంట్లలో 250 మంది విద్యార్థులు చిక్కుకుపోయారని, ఆహారం లేక అల్లాడుతున్నారని రవిశంకర్ చెప్పారు. యూనివర్సిటీలో హోటళ్లు ఉన్నా, బోట్లు లేక ఆహారం సమయానికి అందించలేకపోతున్నామన్నాడు.

అహ్మద్ పటేల్ ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఇటీవల గుజరాత్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా తిరిగి ఎన్నికైన సీనియర్ కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్‌తో ఉపరాష్ట్రపతి మరియు రాజ్యసభ సభాపతి వెంకయ్యనాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. పార్లమెంటు లో జరిగిన ఈ కార్య క్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ అరుణ్ జైట్లీ, రాజ్యసభ ఉపసభాపతి పి.జె. కురియన్, కాంగ్రెస్ సీనియర్ నేతలు గులామ్ నబీ ఆజాద్, ఆనంద్ శర్మ, రాజీవ్ శుక్లా, మోతీలాల్ వోరా తదితరులు పాల్గొన్నారు. అత్యుత్త మమైన మనదేశ పార్లమెంటు ఔన్నత్యాన్నికాపాడేందుకు, సభలో అర్థవంతమైన చర్చ జరిపేందుకు మనమంతా కలిసి కృషి చేయాలని వెంకయ్యనాయుడు కోరారు.

డోక్లామ్‌కు దౌత్యంతో చెక్

- ఇరు దేశాలూ సర్దుబాటు: భారత్
- రహదారి నిర్మాణ సామగ్రిని తీసేసిన పీఎల్ఏ
- 1962 నాటి వాళ్లం కాదని చాటిన భారత్

బీజింగ్/న్యూఢిల్లీ: మోడీ దౌత్యం, దోవల్ తెరవెనుక మంత్రాంగం, సుష్మ స్వరాజ్ సహనం.. ఫలించాయి. డోక్లాం వివాదం దౌత్యపరంగానే పరిష్కారమైంది. ఇరు దేశాలూ తమ సైనికులను దశల వారీగా లేదా క్రమ క్రమంగా తగ్గిస్తాయిని సోమవారం భారత్ ప్రకటించింది.భారత్ ప్రకటనకు విరుద్ధంగా చైనా స్పందించింది. డోక్లాంలో తమ సైనికులు గస్తీ కాస్తారని సోమవారం ప్రకటించింది. డోక్లాం లో రహదారి వేయడంపైనా స్పందించకుండా మిన్నకుంది. దీంతో డోక్లాం వివాదం పరిష్కారంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే.. క్షేత్ర పరిస్థితికి అనుగుణంగా దళాల గస్తీలో మార్పులు, సర్దుబాట్లు చేస్తామని చెప్పింది. అన్నకొద్ది గంటలకే డోక్లాంలో రహదారి నిర్మాణ సామగ్రిని తొలగించింది. సైనికులూ వెనక్కు తగ్గారు. డోక్లాంలో తమ పోస్టును భారత్ కూడా ఖాళీ చేసింది. దీంతో సర్దుబాట్లు అంటే వెనక్కు తగ్గడమేనని రక్షణ నిపుణులు అంటున్నారు.వెనక్కు తగ్గడం మీద భారత ప్రకటన సోషల్ మీడియా లోవిపరీతంగా వ్యాప్తి కావడంతో అంతా చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి హువా చున్‌యింగ్ రంగంలోకి దిగారు. చైనా వెనక్కు తగ్గిందన్న విషయాన్ని తగ్గించి చూపడానికి ప్రయత్నించారు. సోమవారం మధ్యాహ్నమే భారత్ తన సైనికులతో సహా యంత్రాలను కూడా తీసుకుని సరిహద్దు ఆవలకు వెళ్లిపోయిందని ఆమె చెప్పారు. చైనా సైనికులు ఈ విషయం తనకు తెలిపారని హువా వివరించారు. కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా చైనా సార్వభౌమత్వాన్ని, భూభాగాన్ని కాపాడుకోవడానికి చట్ట ప్రకారం ప్రయత్నిస్తామని ఆమె చెప్పారు. డోక్లాంలో ఇరు దేశాలూ వెనక్కు తగ్గతాయన్న భారత్ ప్రకటన నిజమా? కాదా? అన్న అనుమానం నెలకొంది. దీంతో డోక్లాంలో చైనా గస్తీని కొనసాగిస్తుందని తేలింది. అయితే.. డోక్లాంలో పరిస్థితులను బట్టి చైనా స్పందిస్తుందని మాత్రం ఆమె అన్నారు. అయితే.. ఆ స్పందన ఏమిటి? సర్దుబాట్లు ఎలా ఉంటాయన్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేదు. అలాగే డోక్లాంలో రహదారి నిర్మించడం చైనా ఆపివేస్తుందా? అన్న ప్రశ్నకూ ఆమె సమాధానం ఇవ్వలేదు. 2012లో చైనా, భారత్‌ల మధ్య కుదిరిన ఒప్పందంలో భూటాన్ తనదని చెబుతున్న డోక్లాం కూడా ఉంది. ఆ ఒపన్పందం ప్రకారం త్రిక్కూడలిలో చైనా రోడ్డు వేయకూడదు. ఈ దౌత్య ప్రకటనలు సెప్టెంబర్ మూడు నుంచి ఐదో తేదీ వరకూ జరిగే బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా (బీఆర్ఐసీఎస్) శిఖరాగ్ర సమావేశానికి కొద్ది రోజుల ముందు రావడం గమనార్హం. బ్రిక్స్ సమావేశాలు సభ్య దేశాలందరికీ చాలా ముఖ్యం. ఈ పష్కారంతో భారత్ 1962 నాటి మెతక దేశం కాదు అని మోడీ-దోవల్ నిరూపించినట్లయింది. చైనా ఒకమాట అన్న తరువాత దానిపై వెనక్కి తగ్గడం ఇరు దేశాల దౌత్య చరిత్రలో ఇదే ప్రథమం.



డోక్లాం పరిష్కారమైందిలా..



డోక్లాం వివాదమై పరిష్కారం భారత జాతీయ భద్రతా సలహాదారు దోవల్‌తో ప్రారంభమైందట. ఆయన చైనాలో ఆ దేశ కౌన్సిలర్ (భారత్ లో ఎన్ఎస్ఏ లాంటి పదవి) యాంగ్ జైచీని కలుసుకున్నప్పుడు జరిగిన చర్చలు పరిష్కారానికి బీజం వేసాయని తెలుస్తోంది. ఆయన పర్యటన ముగిసిన తరువాత కూడా ఇరువురు ఎన్ఎస్ఏలూ ఫోన్‌లో మాట్లాడుకుంటూనే ఉన్నారని, అ సంభాషణలే పరిష్కారానికి కారణమయ్యాయని విదేశాంగ శాఖ వర్గాలు చెబుతున్నాయి. జూలై 27-28న దోవల్ చైనా వెళ్లారు. ఇప్పుడు డోక్లాంలో వెనక్కు తగ్గడానికి, రహదారి వేయకుండా ఉండడానికి చైనా అనధికారికంగా అంగీకరించినట్లే. కాకపోతే మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోందంతే. బ్రిక్స్ సమావేశానికి మోడీ హాజరును కూడా డోక్లాం పరిష్కారానికి భారత్ లింకు పెట్టినట్లు సమాచారం.



వెంకయ్యతో అసోం మంత్రుల భేటీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: రాజ్యాంగబద్ధంగా జరగవలసిన పనులకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. అస్సాం ప్రభుత్వంలోని అస్సాం గణపరిషత్ పార్టీకి చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆ రాష్ట్ర వ్యవసాయ మంత్రి అతుల్ బోరా ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకయ్య అస్సాంలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా నిత్యం వరదలతో సతమతమవుతున్న ప్రాంతాల విషయంలో సుదీర్ఘంగా చర్చించారు. అస్సాంను వరద కల్లోలిత ప్రాంతంగా ప్రకటించేందుకు ఉపరాష్ట్రతి సహకరించాలని పలువురు నేతలు కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

స్వైన్ ఫ్లూతో ఎమ్మెల్యే మృతి



కిల్వారా, (రాజస్థాన్): స్వైన్ ఫ్లూతో ఎమ్మెల్యే మృతిచెందిన ఘటన సోమవారంనాడు రాజస్థాన్ రాష్ట్రంలో చోటుచేసుకుంది. కిల్వారా జిల్లా మంగల గఢ్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే కీర్తి కుమారి (50) స్వైన్ ఫ్లూ కారణంగా మరణించారు. కీర్తి కుమారి వారం రోజుల కిందట సొంత నియోజకవర్గంలో పర్యట నకు వెళ్లారు. ఆ తర్వాత అస్వస్థతకు గుర య్యారు. ఆమెకు స్థానిక వైద్యులు చికిత్స అందించగా, మెరుగైన చికిత్స తీసుకోవాలంటూ ఎమ్మెల్యే కీర్తికి వైద్యులు, కుటుంబ సభ్యులు సూచించినా ఆమె నిర్లక్ష్యం చేశారు. అయితే, శ్వాసక్రియలో తీవ్రమైన ఇబ్బందితో ఎమ్మెల్యే కీర్తి ఆదివారం జైపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీకాంత్ స్వామి వెల్లడించారు.

శ్రమయేవ జయతే!



కోరియా, (ఛత్తీస్‌గఢ్): కష్టాన్ని ఇష్టంగా మార్చుకుని శ్యామ్‌లాల్ అనే వ్యక్తి 27 ఏళ్ల శ్రమించి తమ గ్రామానికి ఓ చెరువును తవ్విన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కోరియా జిల్లాలో చోటుచేసుకుంది. కోరియా జిల్లాలో సాజా పహాడ్ అనే గ్రామంలో కొన్నేళ్లుగా తీవ్ర కరవు పరిస్థితుల్లో అల్లాడుతోంది. కనీసం పశుపక్ష్యాదులకు సైతం తాగేందుకు నీరు లేని దుర్భర పరిస్థితి. పట్టణాలకు దూరంగా కొండల ప్రాంతంలో ఉన్న సాజా గ్రామ ప్రజలకు తమ గ్రామ నీటి సమస్యను ఎలా తీర్చుకోవాలో తెలియలేదు. అటు ప్రభుత్వాలు కూడా ఏమీ చేయలేకపోయాయి. అలాంటి పరిస్థితుల్లో శ్యామ్‌లాల్ ఓ రోజు కఠిన నిర్ణయం తీసుకున్నాడు. తమ సాజా గ్రామంలోని నీటి సమస్యను పరిష్కరించుకునేందుకు చెరువును తవ్వడమే మార్గమని, అందుకు తానొక్కడే పూనుకున్నాడు. ఆ ఆలోచన వచ్చినప్పుడు శ్యామ్‌లాల్‌కు 15 ఏళ్లు మాత్రమే. ఇప్పుడు శ్యామ్‌లాల్‌కు 42 ఏళ్లు. అయితే, శ్యామ్‌లాల్‌కు చెరువు తవ్వాలన్న ఆలోచన వచ్చిందే తడవుగా పలుగు, పార భుజాన వేసుకుని తమ ఊరికి ఆనుకుని ఉన్న అడవిలోకి వెళ్లాడు శ్యామ్‌లాల్. ఎవరూ సాయం చేయకున్నా లక్ష్యాన్ని వదల్లేదు. ఏకంగా 27 ఏళ్ల పాటు శ్రమించి చెరువును తవ్వాడు. ఒంటరిగా పోరాడి తన గ్రామానికి నీరు తీసుకొచ్చాడు.

జర్మన్ నర్స్ చేతిలో 84 మంది మృతి

బెర్లిన్: జర్మనీలోని ఓల్డెన్‌బర్గ్, డెల్మెన్‌హార్స్ట్‌లోని రెండు క్లినిక్‌లలో 30 మందిని చంపినందుకు రెండేళ్ళుగా జైలు జీవితాన్ని అనుభవిస్తున్న మాజీ నర్స్ నీల్ హోగెల్ మొత్తం 84 మందిని చంపినట్టు ఇతర కేసుల విచారణ సందర్భంగా నిర్ధారణ అయింది. హృద్రోగ సంబంధమైన సమస్యలు ఉత్పన్నమయ్యేట్టు ఇంజక్షన్లు చేసి 84 మంది మృతికి అతడు కారణమైనట్టు విచారణలో తేలింది. హత్యాయత్నం కేసులో అతడికి 2008లో ఏడు సంవత్సరాల జైలు శిక్షపడింది. 2015లో 30మంది రోగులను చంపాడన్న నేరం రుజువు కావడంతో జైలు శిక్షపడింది. తాజా దర్యాప్తులో అతడు మొత్తం 84 మందిని చంపినట్టు తేలింది.

శశిపై వేటుకు సిద్ధం

- రసవత్తరంగా తమిళ రాజకీయాలు
- పోటాపోటీగా నేతల సమావేశాలు

చెన్నై: తమిళనాడులో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అన్నాడీఎంకే పార్టీలో గ్రూపు రాజకీయాలు ఊహించని రీతిలో మలుపులు తిరుగుతున్నాయి. శశికళ వర్గం దూకుడుకు చెక్ పెట్టేందుకు పళని వర్గం సిద్ధమైంది. తమ మద్దతుదారులతో ప్రత్యేకంగా సమావేశమైన అన్నాడీఎంకే జనరల్ కౌన్సిల్, కార్యవర్గ కమిటీ సీఎం, డిప్యూటీ సీఎం దినకరన్ ఆగడాలకు చెక్ పెట్టాలని నిర్ణయించారు. టీటీవీ దినకరన్ ఇటీవల జరిపిన నియామకాలు, తొలగింపులు చెల్లవని తీర్మానించారు.

పురుచ్చి తలైవి నియమించిన నాయకులను తొలగించే అధికారం దినకరన్‌కు లేదని స్పష్టం చేశారు. దినకరన్ ఆధీనంలో నడుస్తున్న జయటీవీని కూడా తమ ఆధీనంలోకి తీసుకోవాలని వీరు నిర్ణయించారు. శశికళ, ఆమె మేనల్లుడు దినకరన్‌లను అన్నాడీఎంకే నుంచి బహిష్కరించేందుకు పళని, పన్నీర్ సిద్ధమయ్యారు. తమ మద్దతుదారులతో ప్రత్యేకంగా సమావేశమైన అన్నాడీఎంకే జనరల్ కౌన్సిల్, కార్యవర్గ కమిటీ సీఎం, డిప్యూటీ సీఎం దినకరన్ ఆగడాలకు చెక్ పెట్టాలని నిర్ణయించారు. టీటీవీ దినకరన్ ఇటీవల జరిపిన నియామకాలు, తొలగింపులు చెల్లవని తీర్మానించారు.



దినకరన్‌ను ఎప్పుడో తొలగించాం: పళని

పార్టీలో తన వైరి వర్గం నేతలను తొలగిస్తూ కలకలం రేపుతున్న అన్నాడీఎంకే నాయకుడు దినకరన్ కు సీఎం పళని స్వామి షాకిచ్చారు. పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పదవి నుంచి ఈనెల 10 వ తేదీనే తొలగించామని ప్రకటించారు. పార్టీ పోస్టు నుంచి తొలగించిన తర్వాత దినకరన్ తీసుకున్న నిర్ణయాలు పనిచేయవని స్పష్టం చేశారు.త్వరలోనే జనరల్ కౌన్సిల్ తీర్మానం ద్వారా శశికళ, దినకరన్‌లను పార్టీ నుంచి సాగనంపుతామని తెలిపారు. దీంతో పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ దినకరన్ దూకుడు పెంచారు. తాజాగా మరో సీనియర్ మంత్రులను పార్టీ పదవుల నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పళనిస్వామి కేబినెట్ మంత్రులు పి.తంగమణి , ఎస్పీ వెలుమణిలను జిల్లాల సెక్రటరీ పదవుల నుంచి తొలగించారు.

పురుషులకూ బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన

- అప్పుడే ఫలితం ఉంటుంది
- తేల్చిన లండన్ పరిశోధకులు

లండన్: బ్రెస్ట్ కేన్సర్.. ఈ వ్యాధి ప్రస్తుతం భారత మహిళల పాలిటి మహమ్మరిగా పరిణమించింది. 45 ఏళ్లు దాటితే ఎక్కడ ఈ వ్యాధి బారిన పడాలోనని మహిళలు భయపడాల్సిన పరిస్థితి. వారిలో ఆ భయం ఉన్నా నిర్లక్ష్యం చేస్తున్నారని వెల్లడైంది. చదువుకున్న మహిళలు , సంపాదిస్తున్న వారు కూడా ఇలాంటి సమస్యలతోనే బాధపడుతున్నారని తేలింది. దీంతో వీరికి చెబితే లాభం లేదని, పురుషులకే బ్రెస్ట్ కేన్సర్ గురించి అవగాహన కలిగించక తప్పదని పరిశోధకులు ఒక అంచనాకు వచ్చారు. ఆ మేరకు భారత్లో చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

అవగాహన లోపం వల్ల భారతీయుల్లో కలిగే వ్యాధులను లండన్ పరిశోధకులు అంచనా వేసారు. బ్రెస్ట్ కేన్సర్ భారత్‌లో అదుపులో ఉండాలంటే మహిళలకంటే ఎక్కువగా పురుషులకే అవగాహన ఉండాలని యూనివర్సిటీ ఆఫ్ పోర్ట్స్ మైత్ పరిశోధకులు తేల్చారు. గతంలో దీనిపై మహిళలకు మాత్రమే అవగామన కల్పించే పనులు చేపట్టేవారు. కానీ తాజా అధ్యయనం ప్రకారం, బ్రెస్ట్ కేన్సర్ అవగాహన గురించి అధ్యయనం జరగ్గా, భారత్‌లో ఆచార వ్యవహారాలు, మత సంబంధమైన ఆంక్షల వల్ల మహిళలకంటే పురుషులకే వైద్య సంబంధమైన విషయాల్లో అవగాహన, పరిచయానికి అవకాశమెక్కువ ఉంటుందని తేలింది. దీంతో వీరికి అవగాహన కల్పిస్తే, మహిళల్లో ఈ మహమ్మారి రాకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఎక్కువ ఉంటుందని తేలింది. కొన్ని అలవాట్ల వల్ల చిన్న విషయంగా మొదలయ్యే ఆరోగ్య సమస్యల విషయంలో మహిళలు డాక్టర్‌ను కలవకుండా నిర్లక్ష్యం చేస్తారని పురుషుల ప్రోద్బలం ఉంటే డాక్టర్లను కలిసే అవకాశం ఎక్కువవుతుందని తేల్చారు. బ్రెస్ట్ కేన్సర్ విషయంలో ఇది మరింత అవసరమని తేలింది. ఈ విషయంలో నర్సులు బాగా ఉపయోగపడతారని పరిశోధకులు అంచనా వేసారు. ఒక ప్రాంతంలో ఉండే నర్సులతో డాక్టర్ల కంటే ఎక్కువ సంబంధాలు అక్కడి జనానికి ఉంటాయని, అందువల్ల వీరు పురుషులకు ఈ వ్యాధి మీద అవగాహన కల్పిస్తే వ్యాధి నివారణకు లేదా మొదట్లోనే చికిత్స జరిగే అవకాశమూ ఉంటుందని తేలింది. ఈ అధ్యయనంలో భారత్‌లో అభివృద్ధి కారణంగా నగరీకరణ జరిగి మహిళలు పశ్చిమ దేశాల జీవన విధానానికి అలవాటు పడుతున్నారని గమనించారు. దీంతో వీరిలో బ్రెస్ట్ కేన్సర్ వచ్చే అవకాశమూ పెరిగిందని గుర్తించారు.

ఈ వ్యాధి భారత్‌లోని అర్బన్ ప్రాంతాల మహిళల్లో చాలా ఎక్కువగా వస్తున్నట్లు గుర్తించారు. 2012లో భారత్‌లో 70,218 మంది మహిళలు ఈ వ్యాధికి మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ వ్యాధికి చికిత్స గురించి. నివారణ గురించి శ్రద్ధ తీసుకోకుంటే, 2020నాటికి ఈ మరణాలు ఏటా 76000కు చేరుకునే అవాకాశం ఉందని తెలుస్తోంది.

సోషల్ మీడియాలో కోపం వద్దు

- బాస్‌పై కోపాన్ని అసలు చూపొద్దు
- కెరీర్ నాశనమవుతుందని నిపుణుల సలహా



న్యూఢిల్లీ: ఇటీవల సోషల్ మీడియాలో రకరకాల ఆగ్రహావేశాలు కనిపిస్తున్నాయి. ప్రేమ విఫలమైన వారు, స్నేహం దెబ్బతిన్న వారితో పాటు ఉద్యోగంలో కష్టాలు ఎదుర్కొంటున్న వారూ సోషల్ మీడియాలో చెలరేగిపోతున్నారు. మీ బాస్ మీద మీకు కోపంగా ఉందా? మీరు మీ సహోద్యోగుల మీద కోపాన్ని ప్రదర్శిస్తారా? ఇప్పుడా కోపాన్ని ఫేస్‌బుక్, ట్విటర్ లేదా లింక్‌డ్ ఇన్‌లో చూపుతున్నారా? బహుశా నేరుగా సహోద్యోగి మీద కోపాన్ని చూపడం కంటే, సోషల్ మీడియాలో కోపించడం కరక్టనుకుంటే మీరు తప్పులో కాలేసినట్లే. సోషల్ మీడియా అంటే బహిరంగ ప్రదేశమేనని, మనం పని చేసే సంస్థ మీద బహిరంగంగా విమర్శలు చేయడం కెరీర్ ఆరోగ్యానికి ఏ మాత్రమూ మంచిది కాదని విశ్లేషకుల అంచనా.

సోషల్ మీడియాలో మనం పోస్ట్ చేసిన కామెంట్లు వేలాది మందికి చేరే అవకాశం ఉంది. దీంతో అలా పోస్ట్ చేసిన వారి గురించి ఆయా కామెంట్లు చదివిన వారందరూ ఒక అంచనాకు వస్తారు. మనం పని చేసే కంపెనీని తిడుతూ, మన సహోద్యోగులను కోపిస్తూ పోస్టింగులు పెడితే.. ఫేస్ బుక్ స్నేహితులు దూరమవడమే కాక, ఆ పోస్టింగులు కంపెనీకి తెలిస్తే కనుక అక్కడా అలా చేసిన వారికి కష్టాలు తప్పవని, ఇంకా పెరిగే అవకాశమూ ఉందని సోషల్ మీడియాను విశ్లేషించిన వారు చెబుతున్నారు.ఉ ఒక చోట కోపాన్ని కక్కేయడం వల్ల ప్రయోజనం లేదని, అవమానం జరిగినప్పుడే ఎదుర్కోవాలని సైకాలజిస్టులు సలహా ఇస్తున్నారు. ఇతరులను అవమానించి, బెదిరించి బతికే వారు అన్ని సంస్థల్లోనూ ఉంటారు.. అందరినీ వేధిస్తుంటారు. ప్రతిసారి మనల్ని ఏదో విధంగా వేధించే వారితో జాగ్రత్తగానే ఉండాలి. ఒక సీనియర్ అధికారిని వారి జూనియర్ల ముందు అవమానించడం కొందరు ఉన్నతోద్యోగుల లక్షణం. ఇది వారి ఆత్మాభిమానాన్ని దెబ్బ తీయడమే కాక, మానసికంగానూ బాధపెడుతుంది. అది ఉద్యోగాన్ని, కెరీర్‌ను ఎలా దెబ్బతీస్తుందో చెప్పలేనంత దుష్పరిణామాలు ఉంటాయని తెలుస్తోంది.

ఒక్కోసారి వేధింపులు ఒక్క మాట కూడా అనకుండా ఉంటాయి. ఆఫీసులో అందరిని పిలిచి, ఏదన్నా కార్యక్రమానికి ఒక్కరిని మాత్రం పిలవకుంటే.. వారికి అవమానమే. అదే కొనసాగితే ఆ నరకం బాధ చెప్పనక్కర్లేదు. ఇలా ఏళ్ల తరబడి బాధపడుతన్న వాళ్లు ఉంటారు. చాలా సంస్థల్లో వేధింపులను నియంత్రించడానికి సరైన వ్యవస్థలు ఉండకపోవచ్చు. అంత మాత్రాన సోషల్ మీడియాకెక్కడమనేది మన సమస్యతో బజారున పడడమేనని అంటున్నారు నిపుణులు. అయితే.. వేధింపులను తట్టుకోలేని వారు తమకు ఫ్రీగా దొరికిన సోషల్ మీడియాలో తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కుతున్నారు.

ఇది ఏ మాత్రం మంచిది కాదని, ఏ స్థాయి ఉద్యోగికైనా తగదని నిపుణుల అంచనా. పైగా కెరీర్‌కు మంచి చేయని దానిని అనవసరంగా ఆచరించడం తగదని పరిశోధకుల సలహా. పైగా ఆయా పోస్టులు చూసిన వారు మనల్ని భావోద్వేగాలు ఎక్కువ కలిగిన వారుగా, పని లేద నైపుణ్యం లేని వారిగానూ పరిగణించేఅవకాశమూ ఉందట. ఈ సోషల్ మీడియా కాలంలో మన సోషల్ మీడియా ప్రొఫైల్ స్పందనల కారణంగానూ ఉద్యోగాలు వస్తాయి. లింక్‌డ్ ఇన్ నెట్‌వర్క్ ఇందుకు తార్కాణం. అలా మన కెరీర్‌కు ఉపయోగపడే ఏ నెట్ వర్క్ నైనా మన కోపానికి వేదికగా చేసుకోవడం ఎంత మాత్రమూ మంచిది కాదని, వేధింపులకు పనితో సమాధానం చెప్పడమే సరైన పరిష్కారమని, సోషల్ మీడియా మన ఉద్యోగంలోని ఆగ్రహం వెళ్లగక్కడానికి వేదిక కానేకాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కెరీర్ అనేది నిజాయితీ, పనితీరు, మానసిక స్థిరత్వం మీద ఆధారపడి ఉంటుందని, అంతే కానీ కేవలం ఆగ్రహావేశాల మీద ఆధారపడి ఉండదని సైకాలజిస్టులు, ఇతర నిపుణుల అంచనా.

ఆస్పత్రుల్లో అపరిశుభ్రతకు చెల్లుచీటీ

త్వరలో అందుబాటులోకి ప్రత్యేక కెమెరాలు



జెనీవా: పరిశుభ్రత పాటించకుండా ఆస్పత్రుల్లో రోగుల ప్రాణాలతో చెలగాటమాడే సిబ్బంది ఆటలు ఇక చెల్లవు. సరైన జాగ్రత్తలు పాటించకుండా ఇన్‌ఫెక్షన్లకు కారణమయ్యే వారిని పట్టించేందుకు శాస్త్రవేత్తలు కొత్త సిస్టంను రూపొందించారు. పరిశోధకులు తయారు చేసిన కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) కలిగిన పరికరం ఎప్పటికప్పుడు ఆస్పత్రుల్లోని సిబ్బంది, వైద్యులు, రోగులు చేస్తున్న పనులను మనిషిలాగే అంచనా వేస్తుంది. దీంతో చేతులు శుభ్రంగా కడగకుండా రోగులకు ఇన్ ఫెక్షన్లు కలిగించే ఆస్పత్రుల సిబ్బందిని సులువుగా గుర్తించవచ్చు. ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసే ఈ ప్రత్యేక కెమెరాలు రక రకాల చిత్రాల ద్వారా ఆస్పత్రుల్లో సిబ్బంది అపరిశుభ్రతను గుర్తించి సంబంధిత అధికారులకు రిపోర్ట్ చేస్తాయి. వివిధ ఆస్పత్రుల్లో ఇన్‌ఫెక్షన్ల కారణంగా రోగులకు కలుగుతున్న ఇబ్బందులను పరిశీలించిన స్విస్ ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు కృత్రిమ మేధస్సుతో పనిచేసే మెడికల్ పరికరాన్ని తయారుచేశారు. సుమారు170 మందిపై ప్రయోగం చేయగా 30 మందిమాత్రమే పరిశుభ్రతలో సరైన పద్ధతులను పాటిస్తున్నట్లు గుర్తించారు. సిబ్బంది అపరిశుభ్రతలో 80 శాతాన్ని ఫోటోల ద్వారానే గుర్తించారు. ఈ కృత్రిమ మేధస్సు పరికరం ఇచ్చే ఆల్‌గరిథమ్ సూచికల ద్వారా ఆస్పత్రుల్లో సిబ్బంది పరిశుభ్రతను అంచనా వేశారు. ప్రయోగాత్మకంగా మంచి ఫలితాలనిచ్చిన ఈ సరికొత్త విధానం త్వరలో అందుబాటులోకి రానుంది.

డేరా వారసులెవరు...?



డేరా సచ్చాసౌదా బాబా గుర్మీత్‌కు 20 ఏళ్ల జైలు శిక్షపడిన నేపథ్యంలో ఆయన డేరాలకు ఎవరు నాయకత్వం వహిస్తార నేది చర్చనీయాంశమైంది. బాబాను కోర్టు దోషిగా నిర్ధారించిన రోజే ఆయన వెంట ప్రత్యేక హెలికాప్టర్‌లో వెళ్లిన దత్త పుత్రిక హనీ ప్రీత్ ఇన్సానే వారసురాలని ప్రచారం జరుగుతోంది. అయితే గుర్మీత్‌కు సొంత కూతుళ్లు అమన్ ప్రీత్,చరణ్ ప్రీత్, కుమారుడు జస్మీత్ ఇన్సాన్ ఉన్నారు. డేరాలో ఎక్కువ పలుకుబడి కలిగి ఉన్నట్లు బాబా అనుచరులు చెబుతుండటంతో డేరాల వారసులపై సస్పెన్స్ కొనసాగుతోంది. బాబా కూతుళ్లు,లేదా కుమారుడిని డేరాల నాయకత్వం లభించే అవకాశం ఉందని అతని సన్నిహితవర్గాలు చెబుతున్నారు. గుర్మీత్ దత్తపుత్రికగా చెప్పుకునే హనీప్రీత్ పెంపుడు తండ్రిని దైవంగానూ, రాజుల కూరాజుగానూ అభివర్ణించింది. సొంతంగా వెబ్ సైట్ నిర్వహిస్తున్న ఆమె గుర్మీత్ హితబోధనలను అందులో పోస్ట్ చేస్తోంది. ఇక సోషల్ మీడియాలో హనీప్రీత్‌కు మంచి ఫాలోయింగ్ ఉంది. హనీప్రీత్ ట్విట్టర్‌లో 10లక్షల మంది,ఫేస్‌బుక్‌లో 5 లక్షల మంది, ఇన్‌స్టాగ్రామ్‌లో లక్ష 88 వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. "ఎంఎస్‌జి ది వారియర్స్ లైన్ హార్ట్" సినిమాలతో పాటు గుర్మీత్ సింగ్ తీసిన అన్ని సినిమాల్లో హనీ ప్రీత్ నటించింది. తనను నటిగా, దర్శకురాలిగా, ఎడిటర్‌గా, రచయితగా...అన్నింటికన్నా సింగ్‌కు గొప్ప కూతురుగా హనీ ప్రీత్ చెప్పుకుంటుంది.

దత్త పుత్రిక ఎలా పరిచయం?

డేరా బాబా దత్త పుత్రికగా చెప్పుకునే హనీ ప్రీత్ అసలు పేరు ప్రియాంక తనేజా. 1999లో బాబా అనుచరుడు విశ్వాస్ గుప్తాను పెళ్లాడిన హనీప్రీత్.. కొన్ని రోజులకే అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని బాబాను ఆశ్రయించింది. అప్పటి నుంచి భర్త దగ్గరకు వెళ్లకుండా బాబా దగ్గరే ఉండిపోయింది. గుర్మీత్ బాబా హనీప్రీత్‌ను దత్త పుత్రికగా స్వీకరించినట్లు అతని అనుచరులు చెబుతున్నారు. అయితే తన భార్యను అపహరించారని 2011 లో విశ్వాస్ గుప్తా కోర్టును ఎక్కడంతో హనీప్రీత్ భర్తకు విడాకులు ఇస్తున్నట్లు ప్రకటించింది.

రామ్‌దేవ్‌కు పోటీగా ఆయుర్వేద ఉత్పత్తులు

ముంబై: డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ సింగ్ కు ఎన్నో కోణాలున్నాయి. తనను తాను దేవుడిగా చెప్పుకునే బాబా ప్రజల్లో అమితమైన ఆదరాభిమానాలను చూరగొంటూనే వారికి తన బ్రాండ్ ఉత్పత్తులను అలవాటు చేశాడు. దేశీయ ఆయుర్వేద ఉత్పత్తుల్లో ఓ వెలుగు వెలుగుతున్న బాబా రాందేవ్ ఆయుర్వేద ఉత్పత్తులకు ధీటుగా తన ఆయుర్వేద ఉత్పత్తులను మార్కెట్‌లోకి వదిలాడు గుర్మీత్.2016 లో ఆయుర్వేద ఉత్పత్తుల తయారీని ప్రారంభించిన డేరాబాబా స్వదేశీ ఉత్పత్తుల పేరుతో జనాదరణ పొందాడు. సహజ సిద్ధంగా తయారుచేసిన ఆయుర్వేద ఉత్పత్తులంటూ మార్కెట్‌లోకి ప్రవేశించిన డేరా బాబా ఉత్పత్తులు మీ ఆరోగ్యం...మా ఆశయం పేరుతో ప్రజలను ఆకట్టుకున్నారు.



డేరా బాబాకు 20 ఏళ్లు జైలు

- రెండు నేరాలకు వేర్వేరుగా శిక్ష
- జడ్జి ముందు మోకరిల్లిన గుర్మీత్
- చిన్న పిల్లాడిలా కంటతడి
- శిక్ష తగ్గించాలని వినతి
- తిరస్కరించిన న్యాయమూర్తి
- కోర్టులో బైఠాయించిన గుర్మీత్
- బలవంతంగా లాక్కెళ్లిన భద్రతా సిబ్బంది
- పంజాబ్, హర్యానాలో కర్ఫ్యూ వాతావరణం

రోహతక్(హర్యానా): అత్యాచారం కేసులో డేరా సచ్చా సౌద చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ కు పంచకుల సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. గుర్మీత్‌కు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు 30 లక్షల జరిమానా విధించింది. ఒకే తరహా నేరం ఎన్నిసార్లు చేసినా ఒకే శిక్ష పడుతుందన్న భావనకు చరమగీతం పాడుతూ ప్రతి నేరానికీ విడివిడిగా శిక్షలను అమలు చేయాల్సిందేనని న్యాయస్థానం స్పష్టం చేసింది. మొదటి మహిళను అత్యాచారం చేసినందుకు పదేళ్లు, రెండో మహిళను అత్యాచారం చేసినందుకు మరో పదేళ్లు శిక్షను విధిస్తూ, మొదటి శిక్ష పూర్తయిన తర్వాత మరో శిక్షను అమలు చేయాల్సిందిగా న్యాయస్థానం చెప్పడంతో మొత్తం 20 ఏళ్ల శిక్షా కాలాన్ని దోషి బాబా రాం రహీం అనుభవించాల్సి ఉంటుంది. ఐపీసీ సెక్షన్ 376 ప్రకారం మొదటి మహిళను అత్యాచారం చేసినందుకు పదేళ్ల కఠిన జైలు శిక్షతో పాటు రూ. 15 లక్షల జరిమానా విధించారు. ఇందులో రూ. 14,00,000 బాధితురాలికి చెందాలని పేర్కొంటూ ఒకవేళ జరిమానా కట్టలేని పక్షంలో మరో 2 సంవత్సరాలు అదనంగా కఠిన జైలు శిక్షను అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు. 2002లో ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసిన గుర్మీత్...క్షమించరాని నేరం చేశారని తీర్పు సందర్భంలో న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. తనను నమ్మి వచ్చిన మహిళలపై లైంగిక హింసకు పాల్పడటం దారుణమన్నారు. నిందితుడికి జీవిత ఖైదు వేయాలని బాధితులు కోరారని పేర్కొన్న జడ్జి...తనను క్షమించాలన్న గుర్మీత్ విజ్ఞప్తిని తిరస్కరించారు. అత్యాచారం చేసిన వ్యక్తిని పోలీసులు వీవీఐపీలా చూడడాన్ని కూడా న్యాయమూర్తి ఆక్షేపించారు.

వెనువెంటనే వైద్య పరీక్షలు...సెల్ కేటాయింపు

డేరా సచ్చా సౌద చీఫ్ గుర్మీత్‌కు శిక్ష ఖరారైన నిమిషాల్లోనే అతనికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గుర్మీత్‌కు హైబీపీ ఉందని అతని తరఫు న్యాయవాదులు తెలపగా...వైద్యపరీక్షల్లో బాబా ఆరోగ్యం సాధారణంగానే ఉందని తేలింది. దీంతో వెంటనే అతనిని సెల్‌కు తరలించారు. న్యాయమూర్తి తీర్పు ప్రకారం గుర్మీత్‌కు ఎలాంటి వీవీఐపీ సేవలు కల్పించకుండా సాధారణ ఖైదీలకు కేటాయించే సెల్‌లో ఉంచారు. వెంటనే రంగురంగుల దుస్తులను ధరించేవాలని గుర్మీత్‌కు ఖైదీలకు ఇచ్చే తెల్లటి దుస్తులను అందించారు.

యూపీలోని షామ్లీ జిల్లాలో

కోర్టులోనే బోరున ఏడ్చిన గుర్మీత్



తనకు 20 ఏళ్ల జైలు శిక్ష విధించగానే గుర్మీత్ సింగ్ ఒక్క సారిగా కుప్పకూలాడు. 20 ఏళ్ల జైలు శిక్షను తాను భరించ లేనని చిన్న పిల్లాడిలా బోరున ఏడ్చేశాడు. తాను నిరపరాధినని... తన ను క్షమించి వదిలేయాలని న్యా యమూర్తికి మొరపెట్టుకున్నాడు. ''ముజే మాఫ్ కర్‌దోజీ'' అంటూ వేడుకున్నాడు. తీర్పు వెలువడిన తర్వాత పది నిమిషాల పాటు తనకు ఈ శిక్షతగదని న్యాయమూర్తి ముందు ప్రాధేయపడ్డాడు. అయినా న్యాయమూర్తి చలించలేదు. తప్పు చేసిన వారికి శిక్షపడాల్సిందే అని వ్యాఖ్యానించారు. నిన్ను నమ్మి వచ్చిన అమాయకులకు ద్రోహం చేశావ్.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

భద్రత కట్టుదిట్టం

డేరా సచ్చా సౌద చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ కు శిక్ష ఖరారు నేపథ్యంలో సోమవారం హర్యానాతో సరిహద్దు కలిగిన ఉత్తర్ ప్రదేశ్ జిల్లా షామ్లీలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. పానిపట్ - కైరానా హైవేపై, కర్నాల్ - మీరట్ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసిన ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. గుర్మీత్ సింగ్ అనుచరులు దాడులకు పాల్పడే అవకాశం ఉందన్న అనుమానంతో కొన్ని ప్రాంతాల్లో రోడ్లను మూసివేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అదనపు బలగాలను రంగంలోకి దించారు. గుర్మీత్ కు శిక్ష నేపథ్యంలో పాఠశాలలకు కూడా సెలవు ప్రకటించారు.



డేరా బాబా అనుచరుడి ఇంట్లో 38 లక్షలు సీజ్

అత్యాచారం కేసులో గుర్మీత్ సింగ్‌కు శిక్ష ఖరారైన కొన్ని నిమిషాల్లోనే పోలీసులు బాబా అనుచరుడి ఇంట్లో 38 లక్షలు సీజ్ చేశారు. గుర్మీత్‌కు శిక్ష ఖరారైన వెంటనే హింసను ప్రేరేపించేందుకే ఆ డబ్బును వాడాలని సమకూర్చినట్లు అంబాలా ఎస్పీ అభిషేక్ జోర్వాల్ తెలిపారు. డేరా బాబా అనుచరుడు జై రామ్ పరారీలో ఉన్నాడని వెల్లడించారు. హర్యానా పోలీసులకు చిక్కిన అశోక్ కుమార్ ను విచారించగా..డబ్బు విషయాన్ని బయటపెట్టాడని తెలిపారు. హింసకు కుట్ర చేసిన వారి పేర్లను కూడా అశోక్ వెల్లడించాడని చెప్పారు.

తీర్పునకు ముందే బాబా యువ సైన్యం హింసకు కుట్ర

కోర్టులో డేరా బాబా కు వ్యతిరేకంగా తీర్పు వచ్చిన వెంటనే అల్లర్లు, దాడులు చేసేందుకు కొన్ని రోజుల క్రితమే గుర్మీత్ యువసైన్యం సిద్ధమైనట్లు పంజాబ్ పోలీసుల విచారణలో తేలింది. శుక్రవారం తీర్పు వెలువడగానే ఎక్కడికక్కడ వాహనాలు, రైల్వే స్టేషన్ల దహనం, ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేసింది ఈ యువసైన్యమే అని సంగూరు జిల్లా పోలీసులు వెల్లడించారు. అల్లర్లు, దాడులకు పాల్పడిన ప్రధాన నిందితుడు సహా 23 మందిని అరెస్ట్ చేసిన పంజాబ్ పోలీసులు 12 ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలకు పాల్పడినట్లు నిర్ధారించారు. సంగూరు జిల్లాలో జరిగిన విధ్వంసంలో 23.72 లక్షల ఆస్తినష్టం జరిగిందని అంచనా వేశారు. జిల్లాలో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు 85.17 లక్షలను ఖర్చు చేశామన్నారు.

డేరాల్లో మారణాయుధాలు

చీకటి సామ్రాజ్యానికి రాజుగా చలామణి అయిన గుర్మీత్ సింగ్ తన డేరాలను మరణాయుధాల కేంద్రంగా మార్చుకున్నాడు. గుర్మీత్ అరెస్ట్ తర్వాత డేరా బాబా ఆశ్రమాల్లో సోదాలు నిర్వహించిన పోలీసులు గుట్టగుట్టలుగా పడిఉన్న మారణాయుధాలను గుర్తించారు.

ఎదురుదాడికి సిద్ధం



సిర్సా: తనను తాను దేవుడిగా ప్రబోధించుకునే డేరా సచ్చా సౌద చీఫ్ గుర్మీత్ సింగ్ అనుచరుల ఆగడాలపై ఓ గ్రామం కన్నెర్రజేసింది.ఎంచకుల సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు తర్వాత ఎలాంటి హింసకు పాల్పడిన బాబా అనుచరులను ప్రతిఘటించేందుకు షాపూర్ గ్రామస్థులు సిద్ధమయ్యారు. ఇన్నాళ్లు చూస్తూ ఊరుకున్న గ్రామస్థులంతా ఏకమై బాబా అనుచరుల దాడులను తిప్పికొట్టేందుకు కర్రలు,రాళ్లు, ఇనుప రాడ్లతో ముందుకు కదిలారు. అయితే ఎక్కడికక్కడ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేయడంతో ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదు.

తీర్పు ప్రకంపనలు.. మళ్లీ చెలరేగిన హింస

అత్యాచారం కేసులో గుర్మీత్ సింగ్‌కు 20 ఏళ్ల జైలు శిక్షపడిన గంటల్లోనే బాబా మద్దతుదారులు రెచ్చిపోయారు. సిర్సాలో రెండుకార్లు దగ్ధం చేశారు. దీంతో పోలీసులు హర్యానా, పంజాబ్, ఢిల్లీలో హై అలర్ట్ ప్రకటించారు. పంజాబ్ లోనిబర్నాలాలో సోమవారం రాత్రి 9 గంటల నుంచి మంగళవారం ఉదయం 9 గంటల వరకు కర్ఫ్యూ విధించారు. హింసకు పాల్పడిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.



ఈ రాక్‌స్టార్ ఆల్‌రౌండర్

- ఆధ్యాత్మికంతో పాటు ఇతర రంగాల్లోనూ ప్రవేశం
- 151 ఉత్పత్తులతో వ్యాపార సామ్రాజ్యం
- రూ. 100 కోట్లతో నాలుగు సినిమాలు... తనే హీరో
- రాజకీయ పార్టీల్లోనూ అభిమానులు
- సామాజిక సేవలోనూ డేరా బాబా ముందంజ

ఆయనో బాబా ..వందకోట్ల రూపాయిలతో సినిమా తీసారంటే ఎవరైనా నమ్ముతారా? ఎవరు నమ్మకపోయినా అది వాస్తవం.ఆయన కదిలితే వెంట వంద కార్లు ఉండాల్సిందే.ఆయన దేశంలో 36 మంది వీఐపీల్లో ఒకరు. ఆయనకు జెడ్ ప్లస్ కేటగిరి భద్రత ఉంది. అన్ని విధాల అండదండలు,అందరినీ తన మాటల సమ్మోహనాస్త్రాలతో ఆకర్షించే శక్తి ఉన్నవాడు కనుకనే ఏభై ఏళ్ళు రాకుండానే దేశవ్యాప్తంగా లక్షలాది మంది శిష్యులు,అభిమాను లు,అనుచరులను సంపాదించగలిగారు. అంతేకాదు, అన్ని రంగాల్లో ఆయన తనదైన ముద్ర వేశాడు.ఆయనే హర్యానాలోని పంచకుల కోర్టుచే దోషిగా నిర్ధారించబడిన డేరా సచ్చా సౌధా అధిపతి గుర్మీత్ రామ్‌రహీమ్ సింగ్. సిబీఐ కోర్టు పదిహేనేళ్ళ విచారణ అనంతరం తీర్పు చెప్పగానే ఆయన అనుచరవర్గం, అభిమానులు రెచ్చిపోయారు. దేశ రాజధాని ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలతో సహా, హర్యానా,పంజాబ్, ఉత్తరప్రదేశ్,రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో చెలరేగిపోయారు.కోట్లాది రూపాయిల ప్రభుత్వ ఆస్తులను విధ్వంసం చేశారు.దగ్ధం చేశారు. ఘర్షణల్లో నాలుగు పదుల మంది ప్రాణాలు కోల్పోయారు.ఆయనకు వ్యతిరేకంగా కోర్టు ఇచ్చిన పంచకుల కోర్టు వద్దకు రెండు రోజుల ముందే రెండు లక్షల మంది జనం చేరుకున్నారంటే ఆయన అభిమానులు ఎంతమంది ఉన్నారో అంచనా వేయవచ్చు. ఆయనకు ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్,బీజేపీ, ప్రాంతీయ పార్టీలైన అకాలీదళ్, తదితర పార్టీల్లో అభిమానులు ఉన్నారు. ఎన్నో రంగాల్లో ప్రావీణ్యం ఉండటం వల్లనే ఆయన ఏభై ఏళ్ళ వయసులో దేశంలో అత్యంత ప్రధానమైన వ్యక్తుల్లో ఒకనిగా పేరొందారు.

డేరా బాబాగా పిలవబడే రామ్‌రహీమ్ సింగ్ సరిగ్గా ఏభై ఏళ్ళ క్రితం 1967 ఆగస్టు 15వ తేదీన జన్మించిన ఆయన తన ఉపన్యాస ప్రావీణ్యంతోనే అందరినీ ఆకట్టుకున్నారు. ఆయన మంచి గాయకుడు కూడా కావడం జనాన్ని ఆకర్షించేందుకు ఎంతో ఉపయోగపడింది. ఆయన డేరా సచ్చా సౌధా ఆశ్రమానికి అధిపతిగా వ్యవహరిస్తున్నప్పటికీ, సంసారిక జీవనాన్ని గడుపుతున్నారు. ఆయన తన పలుకుబడితో సిర్సాలో ఆశ్రమాన్ని 700 ఎకరాల్లో విస్తరింపజేశాడు. ఢిల్లీ, రాజస్థాన్,పంజాబ్,ఉత్తరప్రదేశ్ పశ్చిమ ప్రాంతాల్లో వందలకుపైగా శాఖలను ఏర్పాటు చేశాడు.

అన్నిపార్టీల్లోనూ అభిమానులు

ఆయనకు కాంగ్రెస్‌లో ఎంత మంది అభిమానులు,అనుచరులు ఉన్నారో, బీజేపీ లోనూ అంతే మంది ఉన్నారు. ఎటువంటి కేసు నుంచి అయినా బయటపడేందుకు వ్యక్తులనే కాక,వ్యవస్థలను మేనేజ్ చేయగల సామర్థ్యం,చాకచక్యం,నైపు ణ్యం ఆయనకు ఉన్నాయి.అంతటి శక్తి మంతమైన బాబా వంటిమీద ఈగవాలి తే ఊరుకోమని హెచ్చరించడానికే వినా యక చవితి పర్వదినం నాడు మూడు రాష్ట్రాలను ఆయన అనుచరులు గడగడ వణికించా రు.ఆయనను దోషిగా నిర్ధారించింది ప్రత్యేక కోర్టు మాత్రమే.దానితీర్పుపై హైకోర్టుకు, సుప్రీంకోర్టుకుకూా అప్పీలు చేసుకోవచ్చు. అయినప్పటికీ ఆయన అనుచరులు అలా రెచ్చి పోవడానికి రాజకీయ కారణం వేరేఉంటుం దన్న విశ్లేషణ నిరాధారం కాదు.

బాబా ఒక వ్యవస్థ

డేరా బాబా ఒకవ్యక్తి కాదు.ఒక శక్తి, ఆయన వెనక జాట్ సామాజికవర్గం అంతా ఉంది.హర్యానాలో ముఖ్యమంత్రి పదవిని జాట్ సామాజిక వర్గానికి చెందినవారికే కట్టబెట్టడం ఆనవాయితీ. అటువంటిది ప్రధానమంత్రి నరేంద్రమోడీ హర్యానా ముఖ్యమంత్రిగా సంఘ్ పరివార్‌లో తన సహాధ్యాయి అయిన మనోహర్‌లాల్ కట్టార్‌ని ఎంపిక చేశారు.ఆ పదవిని ఆశించి కాంగ్రెస్ నుంచి బిజేపీలోకి ఫిరాయించిన రావుఇంద్రజిత్ సింగ్ వంటి జాట్ నాయ కులు నిరాశ చెందారు. వారిలో అసంతృప్తి చాలా కాలంగా గూడుకట్టుకుంది. అది ఇప్పుడు డేరా బాబా అరెస్టు అయిన తర్వాత ఒక్కసారిగా అగ్నిపర్వతంలా బద్దలైంది.

పదిహేనేళ్ల నాటి కేసు

2002లో వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఒక మహిళ ఆయనకు ఒక లేఖ రాసింది.ఆమె డేరా సచ్చా సౌధలో సభ్యురాలు.తననూ,తనలాంటి వారిని బాబా లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపించింది.దానిపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. డేరాబాబా సంస్థకు వ్యతిరేకంగా వరుసగా కథనాలను పత్రికలకుపంపిన రామచందర్ ఛత్రపతి హత్యకు గురి అయ్యాడు.ఆ హత్యను బాబాయే జరిపించినట్టు ఆరోపణలు వచ్చాయి.కేసుల నుంచి తప్పించుకోవడానికి అవన్నీ కట్టుకథలనీ,తనకు అంతటి సామర్థ్యం లేదని కూడా బాబా చెప్పుకోవల్సి వచ్చింది. ఆయన రాసిన సినీ గీతాలకు దాదాసాహెబ్ ఫాల్కే ఫిలిం ఫౌండేషన్ అవార్డుకూడా లభించింది. తన గీతాలతో, నటనతో అలరించి ఆయన జనానికి మరింత దగ్గరయ్యారు.

బీజేపీ సంకట స్థితి

పదేళ్ళ పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ హయాంలోనే డేరాబాబా తన ఆస్తులనూ,అనుచరవర్గాన్ని పెంచుకున్నారు. భూపీందర్ సింగ్ హోడా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డేరాబాబా హవా బాగా నడిచింది.ఆ సమయంలోనే బీజేపీ కి చెందిన ప్రస్తుత కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్ వంటి వారు బాబాకి తమ అండదండలను అందించారు. అందుకే, ఆ పార్టీ నాయకులు ఇప్పుడు బాబా అనుచరులు భారీ ఎత్తున విధ్వంసాన్ని సృష్టిస్తున్నా నోరు మెదపడం లేదు. కాంగ్రెస్ వినోదం చూసి ఆనందిస్తోంది.

సామాజిక సేవ

డేరా బాబా సామాజిక సేవలో కూడా పేరు సంపాదించారు.ఆయన శిష్యులు ఎన్నో సార్లు రక్తదాన శిబిరాలను నిర్వహించారు.తుపానులు వచ్చినప్పుడు బాధితులను ఆదుకునే కార్యక్రమాలను నిర్వహించారు. గత ఫిబ్రవరిలో ఆయన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చేతుల మీదుగా ఉత్తమ నటుడు, అత్యుత్తమ



వ్యక్తిత్వం గల నాయకునిగా అవార్డును అందుకున్నారు.యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆయనకు ద్రోణాచార్య అవార్డును ప్రదానం చేసింది. అధికారంలో ఎవరుంటే వారి ప్రాపకం సంపాదించడం,వారి నుంచి అవార్డులు,ఆస్తులు సంపాదించడంలో ఆయన ఆరితేరిన వారు.ఆయన సంగీత దర్శకత్వం వహించిన అనేక చిత్రాల పాటలు ప్లాటినం డిస్క్‌లు విడుదలయ్యాయి.



మోడీ ప్రశంసలు

మూడేళ్ళ క్రితం ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో డేరా బాబాని పొగడ్తలతో ముంచెత్తారు.ఢిల్లీ, బీహార్‌లలో కూడా బీజేపీ అభ్యర్థుల తరపున డేరాబాబా అభిమానులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.హర్యానా మంత్రి అనిల్ విజ్ డేరా బాబా సంస్థ క్రీడలను ప్రోత్సహిస్తోందని ప్రశంసిస్తూ ఏభై లక్షల రూపాయిల గ్రాంటును కూడా ప్రకటించారు.పంజాబ్ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్‌సింగ్,ఆయన భార్య,కుమారుడు డేరాబాబా ఆశ్రమాన్ని సందర్శించి మద్దతు కోరారు. అన్ని పార్టీలవారితో,అందరితో సంబంధాలు కలిగి ఉంటూ తన ఆశ్రమాన్ని వటవృక్షసదృశంగా శాఖోపశాఖలుగా బాబావిస్తరింపజేశారు.

ఆస్తుల విలువ కోట్లలో...

దేశవ్యాప్తంగా ఆయన ఆస్తుల విలువ వేల కోట్లు ఉంటుంది. కేంద్రమంత్రులు,ముఖ్యమంత్రులు ఆయన ఆశ్రమానికి క్యూకట్టడం ఆయన పలుకుబడికి నిదర్శనం. ఆయన ఆధ్యాత్మిక వేత్త, సాంఘిక సంస్కర్త,నటుడు,దర్శకు డు,ప్రయోక్త,గాయకుడు.ఆయన రాజస్థాన్‌లోని గంగానగర్ జిల్లాలో గురుదాసర్ మోడియా పట్టణంలో నాలుగైదు రాష్ట్రా ల్లో సామాజికంగా,రాజకీయంగా మంచి పట్టు ఉన్న జాట్ సామాజికవర్గానికి చెందిన వాడు కావడం ఆయనకు కలిసొచ్చింది. పంజాబ్ నుంచి హర్యానా విడిపోయి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్నవారిలో జాట్‌లే ఎక్కువ. తొలి ముఖ్యమంత్రి రావు బీరేదర్‌సింగ్ ఏర్పరిచిన మంత్రివర్గం కొద్ది కాలంలోనే కుప్పకూలినప్పటికీ, పార్టీ ఫిరాయింపులకు అంకురార్పణ జరిగింది అప్పుడే, పొద్దునఒక పార్టీలో,సాయంత్రం మరో పార్టీలో శాసనసభ్యులు దర్శనమిచ్చేవారు.ఆయారామ్,గయారామ్‌లనే పేరు అప్పుడే స్థిరపడింది. హర్యానాను ఎక్కువ కాలం పాలించిన జాట్ నాయకుల్లో బన్సీలాల్ మొదటి వారు.ఎమర్జెన్సీ రోజుల్లో ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీని ప్రసన్నం చేసుకోవడానికి ఆయన చేసిన వ్యాఖ్య రాజకీయరంగంలో శాశ్వతంగానిలిచిపోయింది.అప్పట్లో ఇందిర పార్టీ చిహ్నం ఆవుదూడ.కాగా, దూడను కట్టేస్తే,ఆవు దానంతట అదే వస్తుందంటూ ఆనాడు బన్సీలాల్ చేసిన వ్యాఖ్యపై రాజకీయ వ్యంగ్య చిత్రాలుఎన్నో వెలువడ్డాయి. దూకుడుకూ,చొరవకూ పెట్టింది పేరైన సామాజికవర్గం నుంచి రావడం వల్లనే డేరా బాబా అనతికాలంలో అంతమంది అభిమానులను సంపాదించగలిగారు.

జడ్జి ఏమన్నారంటే?

రోహతక్: లైంగిక వేధింపుల కేసులో డేరా సచ్చాసౌదా చీఫ్ గుర్మీత్ రాం రహీమ్ సింగ్‌కు సీబీఐ ప్రత్యేకన్యాయస్థానం సోమవారం పదేళ్ల కఠినకారాగార శిక్ష జైలు శిక్ష విధించింది. తీర్పు సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ జగదీప్ సింగ్ పలు అంశాలు ప్రస్తావించారు. ఇది క్షమించరాని నేరమని పేర్కొన్నారు. తనను నమ్మి వచ్చిన అమాయకులపై అత్యాచారానికి పాల్పడడం దారుణమని వ్యాఖ్యానించారు. గుర్మీత్ రాం రహీమ్ సింగ్‌కు జీవితఖైదు విధించాలని బాధితురాలు కోరినట్టు వెల్లడించారు. తనను క్షమించాలన్న గుర్మీత్ విజ్ఞప్తిని జడ్జి తోసిపుచ్చారు. గుర్మీత్‌ను సాధారణ ఖైదీలాగే చూడాలని ఆదేశించారు. అతడిని వీఐపీలాగా చూడటంతో పోలీసులపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపిస్ట్‌కు అదనపు సౌకర్యాలు కల్పిస్తారా అని చివాట్లు పెట్టారు. కాగా, కోర్టు తీర్పుపై బాధితురాలు అసంతృప్తి వ్యక్తం చేశారు. గుర్మీత్‌కు పదేళ్ల జైలు శిక్ష సరిపోదని అన్నారు. గుర్మీత్ సింగ్ చేసిన సేవలను దృష్టిలో పెట్టుకుని నిరపరాధిగా విడిచిపెట్టాలని లేదా శిక్షను తగ్గించాలని ఆయన తరపు న్యాయవాది చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చింది. జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించగానే గుర్మీత్ సింగ్ కోర్టులోనే కన్నీళ్లు పెట్టుకున్నారు. కోర్టు హాలు నుంచి బయటకు రావడానికి నిరాకరించడంతో ఆయనను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి జైలుకు తరలించారు

ఆమె నాతో ఉండాలి: గుర్మీత్



రోహతక్: జైలులో తనతో పాటు తన కుమార్తె హనీప్రీత్ ఇన్సాన్ కూడా ఉండాలని గుర్మీత్ పిటిషన్ వేశారు. ఇద్దరం ఒకే జైల్లో ఉండాలనుకుంటున్నామని గుర్మీత్ పిటిషన్‌లో పేర్కొన్నారు.అయితే ఇందుకు సీబీఐ న్యాయస్థానం ఒప్పుకోలేదు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తాము కలగజేసుకోమని తేల్చి చెప్పింది. గుర్మీత్‌కి నడుము నొప్పి, మైగ్రేన్ ఉందని ఆయనకి తరచూ ఆక్యూప్రెజర్ చేస్తుండాలని హనీప్రీత్ న్యాయస్థానాన్ని కోరింది. ఇందుకోసం రోహ్‌తక్ జైలు అధికారులను గుర్మీత్ బెదిరించినట్లు సమాచారం. హనీప్రీత్‌ని తనతో పాటు జైల్లో ఉండనివ్వకపోతే జైలు అధికారులను సస్పెండ్ చేయిస్తానని బెదిరించారట. వివాహిత అయిన హనీప్రీత్‌ని గుర్మీత్ 2009లో దత్తత తీసుకున్నారు. ఆమె అసలు పేరు ప్రియాంక తనేజా. ఆమె స్వస్థలం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫతేపూర్. అత్తింటివారు కట్నం కోసం వేధిస్తున్నారని హనీప్రీత్ గుర్మీత్‌ను ఆశ్రయించడంతో ఆమెను దత్తత తీసుకున్నారు. ఆయన నటించే సినిమాల్లో హనీప్రీత్‌కు అవకాశాలు ఇచ్చేవారు.

కేసు పరంపర....

- **ఏప్రిల్ 2002:** సిర్సాలోని డేరా సచ్చా సౌదలో గుర్మీత్ సింగ్ మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని పంజాబ్,హర్యానా హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు పేరు ప్రస్తావించని వ్యక్తి లేఖ.
- **మే 2002:** ఆరోపణలపై విచారణ జరపాలని సిర్సా జిల్లా కోర్టుకు హైకోర్టు ఆదేశం
- **సెప్టెంబర్ 2002:** డేరా బాబాపై అత్యాచారం కేసు నమోదు చేసిన సీబీఐ. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక.
- **జూలై 2007:** అంబాల కోర్టులో గుర్మీత్‌పై చార్జిషీట్ దాఖలు చేసిన సీబీఐ. ఇద్దరు సాధ్వీలపై అత్యాచారం జరిగినట్లు చార్జిషీట్‌లో పేర్కొన్న సీబీఐ.
- **సెప్టెంబర్ 2008:** సెక్షన్ 376 కింద గుర్మీత్ పై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో ఆరోపణలు.
- **2009-2010:** కోర్టు సమక్షంలో రెండు ఫిర్యాదులపై స్టేట్ మెంట్ల రికార్డ్
- **ఏప్రిల్ 2011:** సీబీఐ ప్రత్యేక కోర్టు అంబాలా నుంచి పంచకులకు తరలింపు
- **జూలై 2017:** రోజు వారీ విచారణకు కోర్టు ఆదేశం
- **ఆగస్ట్ 17, 2017:** ఇరు వర్గాల మధ్య వాదోపవాదనలు, తీర్పు ఆగస్టు 25కు వాయిదా
- **ఆగస్ట్ 25:** గుర్మీత్‌ను దోషిగా తేల్చిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం .
- **ఆగస్టు 28:** గుర్మీత్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధింపు

క్వార్టర్స్‌కు అమిత్, గౌరవ్



హంబర్గ్: 19వ ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో భారత క్రీడాకారులు అమిత్ ఫంగల్, గౌరవ్ బిధురి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. అమిత్ 49 కేజీల విభాగంలోను, గౌరవ్ 56 కేజీల విభాగంలోను ప్రత్యర్థులను ఓడించారు. వీరిద్దరూ బలమైన పంచ్‌లతో విరుచుకుపడుతూ, ప్రత్యర్థిని కుదురుకోనీయకుండా చేశారు. 2011 కాంస్య పతక విజేత, మూడో సీడ్ ఆటగాడు వికాస్ క్రిషన్ 75 కేజీల విభాగంలో రౌండవ రౌండ్‌లోనే వెనుదిరిగాడు. ఇగ్లండ్ బాక్సర్ బెంజిమెన్ విట్టకెర్ చేతిలో పరాజయం పాలయ్యాడు. ఏడో సీడ్ ఆటగాడు కార్లోస్ క్విపో (ఈక్వెడార్)ని అమిత్ తన పంచ్‌లతో మట్టికరిపించాడు. తన తదుపరి గేమ్‌లో బలమైన ప్రత్యర్థిని ఢీకొట్టాల్సి ఉంది. ఉజ్బెకిస్తాన్ క్రీడాకారుడు, రెండో సీడ్ హసన్‌బాయ్ డస్‌మతొవ్ తో తలపడనున్నాడు. ఏసియన్ గేమ్స్‌లో కాంస్యపతకం సాధించిన 21 ఏళ్ల అమిత్‌కు ఈ చాంపియన్‌షిప్ కీలకమైనది. దీనితర్వాత అతను సీనియర్ లెవల్‌కు చేరుకోనున్నందున, పరిణితితో కూడిన ఆటతీరును ప్రదర్శించాల్సి ఉంటుది. కాగా, గౌరవ్ కూడా అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. ఉక్రెయిన్ ఆటగాడు మైకొలా బుట్సెన్‌కొను ఓడించి క్వార్టర్ ఫైనల్ చేరాడు. గౌరవ్ తుదపరి పోటీ తునీసియా బాక్సర్ బిలెల్ మహ్మదిని ఎదుర్కోనున్నాడు. పతకంపై ఆశలతో బరిలోకి దిగిన ఏసియన్ సిల్వర్ మెడల్ విజేత సుమిత్ సంగ్వాన్ (91 కేజీలు) ఈసారి నిరుత్సాహ పరిచాడు. ఆస్ట్రేలియన్ క్రీడాకారుడు జాసన్ వాటెలీతో జరిగిన గేమ్‌లో స్ప్లిట్ నిర్ణయంతో వెనుదిరగాల్సి వచ్చింది. వైల్డ్ కార్డ్ ఎంట్రీతో ఈవెంట్‌లోకి ప్రవేశం పొందిన ఈ ఢిల్లీ బాక్సర్ బుట్సెన్‌కొతో సరిసమానంగా పంచ్‌లు విసిరాడు. అయితే, న్యాయనిర్ణేతల స్ప్లిట్ తీర్పు సుమిత్‌వైపు రావడంతో బరిలోనుంచి తప్పుకున్నాడు.

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్

ఐపీఎల్ వేలంపై జోక్యానికి సుప్రీం నో

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్‌లో భాగంగా మీడియా హక్కులకు బీసీసీఐ వేలం నిర్వహించడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ అంశంలో జోక్యం చేసుకోలేమని, బీసీసీఐకి ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన బెంచ్ ప్రకటన చేసింది. వచ్చే యేడాది ఏప్రిల్ సీజన్ నుంచి ఐదేళ్ల ప్రసార హక్కులకు సంబంధించిన వేలం ప్రక్రియను నిలిపివేయాలన్న బీజేపీనేత వ్యాఖ్యలతో న్యాయస్థానం విభేదించింది. కాగా, ఈ వేలం ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలపై గతంలోనే ధర్మాసనం వివరణ కోరింది. ఈ-వేలం కంటే తాజా పద్ధతి ఏవిధంగా మంచిదో తెలపాలని పరిపాలక కమిటీ అధ్యక్షుడు వినోద్ రాయ్‌కి సూచించింది. బీసీసీఐ అడ్మినిస్ట్రేషన్ కమిటీ తరఫున సీనియర్ న్యాయవాది పరాగ్ త్రిపాఠి వాదనలు వినిపించారు. మీడియా హక్కుల కోసం నిర్వహించే ఆన్‌లైన్ బిడ్డింగ్ ప్రక్రియ, బిడ్డర్లకు మంచి అవకాశమని పేర్కొన్నారు. కాగా, ఈ వేలం కుట్రపై తాను మధ్యంతర పిటిషన్‌ను దాఖలు చేస్తున్నట్లు సుబ్రహ్మణ్యస్వామి కోర్టుకు తెలిపారు. సొంతంగా ఓ చానల్ నడిపిస్తున్న బీసీసీఐ కార్యనిర్వాహకుడి దీనిద్వారా ప్రయోజనం చేకూర్చేందుకు క్రికెట్ బోర్డు ప్రయత్నిస్తోందని ఈ సందర్భంగా స్వామి ఆరోపించారు. మధ్యంతర పిటిషన్‌ను సుప్రీం కోర్టు విచారణకు అనుమతించింది.

చివరి క్షణాలే మార్చేశాయి

- స్వర్ణం చేజారినా, ఫైనల్ మ్యాచ్ సంతృప్తినిచ్చింది
- దేశం తరఫున రజతం సాధించడం గర్వంగా ఉంది
- ఈ మ్యాచ్ నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది
- భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించిపెడతా
- బ్యాడ్మింటన్ తెలుగు తేజం పీవీ సింధు వెల్లడి



గ్లాస్కో: ప్రపంచ చాంపియన్ షిప్ బాడ్మింటన్ టోర్నీలో బంగారు పతకాన్ని పీవీ సింధు తృటిలో చేజార్చుకుంది. హోరాహోరీగా సాగిన థ్రిల్లింగ్ ఫైనల్ చివరి సెట్లో జపాన్ క్రీడాకారిణి నొజొమి ఒకుహరాదే పైచేయి అయింది. నువ్వా నేనా అన్నట్లు సాగిన తుదిపోరులో ఈ ఇద్దరూ నాణ్యమైన ఆటతీరుతో ఆకట్టుకున్నారు. ఇటీవల జరిగిన మహిళల ఫైనల్స్‌లో ఇదొక బెస్ట్‌ఫైనల్‌గా నిలుస్తుందని క్రీడా పండితులు అభివర్ణించారు. ఈ పోరులో జపాన్ క్రీడాకారిణి 21-19, 20-22, 22-20 తేడాతో సింధుపై స్వల్ప ఆధిక్యతతో స్వర్ణపతకాన్ని ఎగరేసుకుపోయింది. మొత్తంగా టోర్నీలోనే సుదీర్ఘంగా సాగిన (1.49 గంటలు) ఫైనల్‌లో తన ఆటతీరు సంతృప్తినిచ్చిందన్న సింధు, చివరి క్షణాల్లో గెలుపు చేజారిందని పేర్కొంది. ఫైనల్ గురించి 22 ఏళ్ల హైదరాబాదీ మాట్లాడుతూ.. "మూడో గేమ్ నన్ను నిరాశపరిచింది. 20-20 పాయింట్లతో సమవుజ్జీలుగా ఉన్న క్షణాన విజయం ఇద్దరికీ సమాన దూరంలోనే ఉంటుంది. స్వర్ణ పతకాన్ని గెలవాలని ప్రతి ఒక్కరికీ లక్ష్యమే. కానీ, నేను చాలా దగ్గరగా వెళ్లాను. చివరి క్షణాల్లో అంతా మారిపోయింది. నొజొమి ఒకుహరా తేలికైన ప్రత్యర్థి కాదు. మేము తలపడిన ప్రతీసారి ఆమె బలమైన ప్రత్యర్థిగానే ఉంటుంది. ఆమెను నేనెప్పుడూ తేలిగ్గా తీసుకోను. సుదీర్ఘంగా మ్యాచ్‌ను ఆడాలని సిద్ధమయ్యాను. కానీ, ఈ రోజు నాది కాదని ముందుగానే భావించాను. ప్రతీర్యాలీ సుదీర్ఘంగానే సాగింది. ఇద్దరం మంచి కసిమీదున్నాం. హోరాహోరీగా పోరాడాం. స్కోరు కూడా చాలా సమీపంగా కదిలింది. ఒక దశలో 14-14, 18-18, 20-20గా ఉంది. ఇలాంటప్పుడు విజయం ఎవరివైపైనా మొగ్గుచూపే అవకాశం ఉంది. ఇది చాలా పెద్దమ్యాచ్.. చాలా మంచి మ్యాచ్ కూడా. దురదృష్టవశాత్తు నేను నెగ్గలేక పోయాను.

మొత్తంమీద ఈ చాంపియన్ షిప్ ఫైనల్ మ్యాచ్ భారతీయులకు చాలా సంతృప్తినిచ్చింది. భారతీయులుగా సైనా, నేను పతకాలు సాధించడం గర్వంగా ఉంది. దేశం తరఫున రజతం సాధించినందుకు గర్వంగా ఉంది. దీనిద్వారా నాలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధిస్తాను" అని వెల్లడించింది. బ్యాడ్మింటన్ ఫార్మాట్‌లో మార్పులపై స్పందిస్తూ, స్కోరింగ్ బోర్డు విధానం వంటి అంశాలను మార్చాల్సిన అవసరం లేదు. ఇప్పుడున్న పద్ధతి బాగానే ఉందని సింధు వ్యాఖ్యానించింది. 21 పాయింట్లు మంచిదే. లాంగ్ ర్యాలీలు ఉంటాయి. ప్రపంచ చాంపియన్ షిప్‌లో అందరూ ప్రపంచ శ్రేణి ఆటగాళ్లే ఉంటారు. 30-40 నిమిషాల ర్యాలీలను కొనసాగించడం సాధ్యం కాదు అని తెలుగుతేజం అభిప్రాయపడింది.

సింధు, సైనాలకు బాయ్ నజరానా

ప్రపంచ బ్యాడ్మింటన్ టోర్నీలో అద్భుత ప్రదర్శనతో దేశానికి పతకాలు సాధించిన పీవీ సింధు, సైనా నెహ్వాల్‌కు బాయ్ (బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) నజరానా ప్రకటించింది. ఈమేరకు బాయ్ తాత్కాలిక అధ్యక్షుడు హిమంత బిశ్వ శర్మ ప్రకటించారు. రజత పతక విజేత సింధుకు 10 లక్షలు, కాంస్య పతకం సాధించిన సైనాకు 5 లక్షల రూపాయల నగదు బహుమతి ప్రకటించారు.

వ్యూహం మార్చుకున్నా: ఒకుహరా

గతేడాది జరిగిన రియో ఒలింపిక్ గేమ్స్‌లో సెమీ ఫైనల్‌లో సింధుతో తలపడిన ఒకుహరా పరాజయం పాలైంది. అయితే ఈసారి ప్రతీకారం తీర్చుకుని ప్రపంచ చాంపియన్‌గా నిలించింది. "ఈ మ్యాచ్ నుంచి నేనెంతో నేర్చుకున్నాను. నా వ్యూహాన్ని మార్చుకున్నా. సింధు కదలికలను గమనించడంపైనే దృష్టిసారించాను. మూడో గేమ్ హోరాహోరీగా సాగింది. అప్పటికే నేను బాగా అలసిపోయాను. మరోవైపు ఆమె కూడా అలసి ఉందని గమనించాను. నాపై ఆధిపత్యం కోసం చాలా కష్టపడుతోందని అర్థమైంది. ఆటను ఆస్వాదిస్తూ, ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా పాయింట్లు సాధించాలని నిర్ణయించుకున్నాను. అయినా విజయం కోసం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది' అని ఒకుహరా పేర్కొంది. ప్రపంచ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో స్వర్ణం సాధించిన ఏకైక క్రీడాకారిణిగా ఈమె రికార్డు సృష్టించింది.

గెలుపు మంత్రాన్ని మరచిపోయాం

- శ్రీలంక కెప్టెన్ చమర కపుగెదర



పల్లకెలె: భారత్‌తో వరుస పరాజయాలపై శ్రీలంక టెస్టు జట్టు తాత్కాలిక కెప్టెన్ చమర కపుగెదర ఆవేదన వ్యక్తం చేశాడు. మేం గెలుపు సూత్రాన్ని మరచిపోయామంటూ నిర్వేదంతో మాట్లాడాడు. నాలుగో వన్డేకు ముందు గత తప్పిదాలనుంచి పాఠాలు నేర్చుకోవాలి. విజయం కోసం జట్టు బాధ్యతగా ఆడాల్సిన అవసరం ఉంది. ఇప్పటిదాకా ఎదురైన ఓటములకు అందరూ బాధ్యత వహించాలి. బయటి సమస్యలేవీ జట్టును ప్రభావితం చేయడం లేదు. ఎటొచ్చీ విజయ సూత్రమే విస్మరించినట్లుంది. ఇలాంటి గడ్డు పరిస్థితులు చాలా జట్లకు ఎదురవుతూనే ఉంటుంది. ఒక్కసారి విజయం సాధించామంటే తిరిగి గాడిలో పడతాం. బౌలర్ల ప్రదర్శనపై సంతృప్తి వ్యక్తంచేసిన కపుగెదర, బ్యాట్స్‌మన్ రాణించడంపైనే గెలుపు ఆధారపడివుందని అన్నాడు. ప్రస్తుత పరిస్థితులకు గాయాలు కూడా కారణమే. దీనిని ఎవరూ కాదనలేరు. జట్టును ఒంటిచేత్తో గెలిపించే ప్రధాన బౌలర్లు గాయాలతో దూరమయ్యారు. అయినా యువకులు శక్తిమేరకు రాణిస్తున్నారు. భారత జట్టులో మహేంద్ర సింగ్ ధోనీ ఈ మధ్య కాలంలో బాగా రాణిస్తున్నాడు. పరిస్థుతులకు తగ్గట్లుగా కూల్‌గా విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడుతున్నాడు. అతను మాకు అవకాశం ఇవ్వడం లేదు అని కపుగెదర వ్యాఖ్యానించాడు.

హైదరాబాద్ క్రికెట్ కోచ్‌గా అరుణ్‌కుమార్



హైదరాబాద్: జె.అరుణ్‌కుమార్ హైదరాబాద్ క్రికెట్ జట్టు కోచ్‌గా నియమితులయ్యారు. 2017-18 సీజన్‌కుగాను అరుణ్‌కుమార్ (42) కోచ్‌గా వ్యవహరించనున్నారని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వివేకానంద్ తెలిపారు. అరుణ్‌కుమార్ కోచ్‌గా కర్నాటక జట్టు అనేక టోర్నమెంట్లు గెలుచుకుందన్నారు. ఆయన శిక్షణలో హైదరాబాద్ జట్టు రాటుదేలుతుందన్న నమ్మకముందన్నారు. ప్రస్తుత కోచ్ భరత్ అరుణ్ జాతీయ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా నియమితులు కావటంతో ఈ స్థానంలో అరుణ్‌కుమార్‌ను ఎంపిక చేశారు. లెఫ్ట్‌హ్యాండ్ బ్యాట్‌మన్‌గా 1993-94లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టిన అరుణ్ కుమార్ 2008లో రిటైరయ్యారు. ఐపీఎల్ పంజాబ్ ఎలెవన్ జట్టుకు కూడా ఆయన కోచ్‌గా పనిచేశారు.

శివ థాప ఔట్



హంబర్గ్: ప్రపంచ చాంపియన్‌షిప్ బాక్సింగ్ 60 కేజీల విభాగంలో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. డిఫెండింగ్ కాంస్య పతక విజేత, ఐదోసీడ్ బాక్సర్ శివథాప పోటీ నుంచి తప్పుకున్నాడు. అనారోగ్య కారణాలతో రింగ్‌లోకి దిగకుండానే చాంపియన్ షిప్ టోర్నీనుంచి వైదలగాడు. ఫుడ్ పాయిజన్ కారణంగా తీవ్ర జ్వరంతో థాప బాధపడుతున్నాడు. మూడు సార్లు ఏసియన్ చాంపియన్ షిప్ విజతేగా నిలిచిన ఇతను, రెండో రౌండ్‌లో జార్జియా ఆటగాడు ఒటార్ ఎరానొసిన్‌తో తలపడాల్సి ఉంది. ఆదివారం నుంచి తీవ్రజ్వరం థాప నీరసంగా ఉన్నాడు. రింగ్‌లోకి దిగేందుకు శాయశక్తులా ప్రయత్నించాడు. కానీ స్థిరంగా నిలబడలేని పరిస్థితి ఏర్పడింది. చాలా నిస్సత్తువగా అయిపోయాడు అని ఇండియన్ టీమ్ అధికారి ఒకరు వెల్లడించారు.

ఒంటికాలితోనైనా పాక్‌పై ఆడతా


చెన్నై: 2019 వరల్డ్ కప్‌లో ఆడబోయే భారత జట్టులో మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీకి చోటుకల్పిస్తారా? అన్న చర్చ నేపథ్యంలోనే శ్రీలంకతో రెండవ, మూడో వన్డేలలో రాణించి విమర్శకుల నోటికి ధోని తాళం వేశాడు. క్లిష్ట సమయాల్లో జట్టును విజయతీరాలకు (మ్యాచ్ ఫినిషింగ్) చేర్చే బాధ్యతను తీసుకోవడంలో తనకు తానే సాటని మరోసారి నిరూపించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆసియా కప్ నాటి ఘటనను చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ గుర్తుచేశారు. తమిళనాడు స్పోర్ట్స్ జర్నలిస్టుల అసోసియేషన్ అవార్డుల వేడుకలో పాల్గొన్న సందర్భంగా ప్రసాద్ మిస్టర్ కూల్ గురించిన ఆసక్తికర విషయాలను చెప్పాడు.



అది 2016 ఫిబ్రవరి.. ఆసియా కప్ టోర్నీ.. పాకిస్తాన్‌తో భారత్ తలపడాల్సిన మ్యాచ్. 'అర్ధరాత్రి జిమ్‌లో కసరత్తులు చేస్తున్న సమయంలో ధోనీ వెయిట్ ఎత్తబోతుండగా.. వెన్నులో పట్టుకున్నట్టు అయింది. దీంతో అతను బరువు వదిలేశాడు. అదృష్టంకొద్దీ ఆ బరువు అతనిపై పడలేదు. కానీ, అతను నడవలేకపోయాడు. దాదాపు పాకుతూనే అలారం బెల్ మోగించాడు. వైద్య సిబ్బంది వెంటనే వచ్చి అతనికి ప్రథమ చికిత్స అందించి.. స్ట్రెచర్‌పై తీసుకెళ్లారు. అప్పట్లో సెలెక్టర్‌గా ఉన్న నేను ఢాకాకు చేరుకోగానే ధోనీకి ఏమైంది అన్న ప్రశ్న విలేకరుల నుంచి ఎదురైంది. నా వద్ద సమాధానం లేదు. పాకిస్థాన్‌కు మ్యాచ్ ఎంతో కీలకమైనది. ఏమైందో తెలుసుకోవడానికి నేను ధోనీ గదికి వెళ్లాను. 'ఆందోళన చెందకండి ఎమ్మెస్కే భాయ్. ఒంటి కాలితోనైనా పాకిస్తాన్‌తో మ్యాచ్ ఆడతా' అని చెప్పాడు' అని ఎమ్మెస్కే వివరించారు.

ఛేదనలో ధోనీనే టాప్

క్యాండీ: భారత క్రికెట్ జట్టు మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ.. మ్యాచ్‌లను విజయవంతంగా ముగించడంలో దిట్ట అని అందరికీ తెలుసు. ఎన్నో మ్యాచ్‌లక ు తనదైన శైలిలో విన్నింగ్ షాట్ కొట్టి నాటౌట్‌గా నిలిచి జట్టుకి విజయాలు అందజేశాడు. తాజాగా భారత్-శ్రీలంక మధ్య జరిగిన మూడో వన్డేల్లోనూ ధోనీ 67 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే.గొప్ప ఫినిషర్‌గా పేరు తెచ్చుకున్న ధోనీ ప్రపంచ క్రికెట్ చరిత్రలో అరుదైన రికార్డును అందుకున్నాడు. ఛేదనలో నాటౌట్‌గా నిలిచి జట్టుకి విజయాలు అందించిన ఆటగాళ్ల జాబితాలో ధోనీ అగ్రస్థానంలో నిలిచాడు. ఇప్పటి వరకు 299 వన్డేలు ఆడిన ధోనీ మొత్తం 121సార్లు నాటౌట్‌గా నిలిచాడు. లక్ష్య ఛేదనలో 40సార్లు నాటౌట్‌గా నిలిచి రికార్డు సృష్టించాడు. ఆ తర్వాతి స్థానాల్లో జాంటీ రోడ్స్(33), ఇంజమామ్ ఉల్‌హాక్(32), రికీ పాంటింగ్(31) ఉన్నారు.



ఆసీస్ 217 ఆలౌట్

- కంగారూలను కట్టడి చేసిన బంగ్లా బౌలర్లు

ఢాకా: స్వదేశంలో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో బంగ్లా బేబీలు కంగారూలను తారెత్తించారు. తద్వారా తొలి ఇన్నింగ్స్‌లో 43 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. ఢాకాలోని షేర్ ఇ బంగ్లా స్టేడియంలో జరుగుతున్న టెస్టు మ్యాచ్ రెండో రోజున బంగ్లా బౌలర్లు రెచ్చిపోయారు. బలమైన ఆస్ట్రేలియా బ్యాటింగ్ లైనప్ వెన్ను విరిచారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 88 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

300 పరుగుల ఆధిక్యం సాధించగలిగితే విజయంపై మాకే అవకాశం ఉంటుంది. ఈ పిచ్‌పై లక్ష్య ఛేదన సులువు కాబోదు. అసీస్‌కు గట్టి సవాల్ విసురుతామన్న నమ్మకం ఉంది. మా బౌలర్లు సమష్టిగా రాణించారు. మ్యాచ్‌పై పట్టుబిగించే అవకాశం కల్పించారు. బ్యాట్స్‌మన్ మిగతా పనిని పూర్తిచేయాలి. కంగారూల ముందు భారీ లక్ష్యాన్ని ఉంచాలి అని బంగ్లాదేశ్ ఆల్ రౌండర్ మెహిది హసన్ పేర్కొన్నాడు. రోజులు గడుస్తున్న కొద్దీ పిచ్‌పై బ్యాటింగ్ కష్టతరం అవుతుందని చెప్పాడు. తొలి ఇన్నింగ్స్‌లో తాము 260 పరుగులే చేసినా, ఆసీస్‌ను తక్కువ స్కోరుకే కట్టడిచేయగలిగామని చెప్పాడు. మూడోరోజు పిచ్‌పై బంతి మరింతగా గింగిరాలు తిరుగుతుంది. బ్యాటింగ్ అంత సులువు కాదు. షకీబ్ భాయ్ బౌలింగ్‌కు తోడు మిగతా వాళ్లు తైజుల్, ముస్తఫిజ్ రాణించారని మెహిది హసన్ తెలిపాడు.

నవంబర్ 3 నుంచి గ్లోబల్ టీ20 లీగ్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా ఆతిథ్యంలో గ్లోబల్ టీ20 సిరీస్ జరగనుంది. న్యూలాండ్స్ వేదికగా నవంబర్ 3నుంచి ఈ లీగ్ జరుగుతుంది. కేప్‌టౌన్ నైట్ రైడర్స్, ప్రిటోరియా మావెరిక్స్ పరస్పరం తలపడనున్నాయి. ఏబీ డివిలియర్స్, డ్వేన్ బ్రావో, మోర్నీమార్కెల్ బృందం క్రిస్‌గేల్, జేపీ డుమిని, డేల్ స్టెయిన్ బృందాన్ని ఎదుర్కోనుంది. మొత్తంగా 44 రోజులపాటు జరిగే ఈ సిరీస్‌లో 57 మ్యాచ్‌లు జరుగుతాయి. ఫైనల్ మ్యాచ్ డిసెంబర్ 16న జరుగుతుంది. జోహాన్స్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియం ఫైనల్‌కు వేదికగా నిలవనుందని టోర్నమెంట్ డైరెక్టర్ రస్సెల్ ఆడమ్స్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ ఆటగాళ్లతో ఈ టోర్నీ రసవత్తరంగా జరుగుతుందని చెప్పారు.

'టాలెంట్ సెర్చ్' గేమ్ ఛేంజర్

నేషనల్ స్పోర్ట్స్ టాలెంట్ సెర్చ్ పోర్టల్ ప్రారంభించిన వెంకయ్యనాయుడు



న్యూఢిల్లీ : క్రీడలు వ్యక్తులను ఉన్నతులుగా చేసి, సమాజాన్ని ఉత్తమమైనదిగా తయారుచేసి ప్రజలలో సానుకూల ధృక్పథాన్ని కలగజేస్తాయని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ రూపొందించిన నేషనల్ టాలెంట్ సర్చ్ పోర్టల్ వెబ్ సైటును ప్రారంభించారు. క్రీడలు మనుషులలో నాయకత్వ లక్షణాలను, సమిష్టిగా పనిచేసే స్ఫూర్తిని పెంచుతాయని, సమభావాన్ని పెంపొందించి గెలుపోటములను సమానంగా స్వీకరించే గుణాన్ని పెంచుతాయన్నారు. ఆటలు మరియు క్రీడలు పిల్లలలో పెరుగుదలను పెంచుతాయని, వారి నేర్చుకునే గుణాన్ని మెరుగు పరచి చదువులో కూడా రాణించడానికి సహకరిస్తాయన్నారు.

క్రీడలు బాలికలలో ఆత్మ స్థైర్యాన్ని పెంచుతాయని, లింగవివక్షను దాటుకొని వారు ముందుకు పోవడానికి రహదారులు పరుస్తాయని అన్నారు. క్రీడా వ్యవహారాలను అతి తక్కువ ఖర్చుతో స్థానికంగా లభించే వనరులతో చేపట్టవచ్చని వెంకయ్య అన్నారు.

పురాతన కాలం నుండి మనం ఎంతో నేర్చుకున్నామని, యువతీ యువకుల నైపుణ్యానికి సానపట్టవలసిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి అన్నారు. క్రికెట్ మరియు హాకీ తప్పిస్తే, మిగిలిన జట్టు క్రీడలలో మన విజయాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని, వ్యక్తిగత ప్రయాస మరియు నైపుణ్యాలపైనే ఎక్కువగా మన విజయాలు ఆధారపడ్డాయని అన్నారు. సానియా మీర్జా, పీవీ సింధు, సైనా నెహ్వాల్, పీటీ ఉష, మిల్కా సింగ్ ఇంకా అభినవ బింద్రా వీరంతా వ్యక్తిగత నైపుణ్యాలతోనే దేశానికి పేరు తెచ్చారని అన్నారు.మనదేశంలోని అన్ని రాష్ట్రాలలో క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడవలసిన అవసరం ఉందని, పిన్నవయసు నుండే బాలలలో క్రీడా స్ఫూర్తిని కలిగించవలసిన అవసరం ఉందని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. శిక్షణా ఎకాడమీలు, కోచింగ్ సెంటర్లు దేశమంతా ఉండాలని అన్నారు. ఈ నేషనల్ స్పోర్ట్స్ టాలెంట్ సర్చ్ పోర్టల్ ఒక గేమ్ చేంజర్ కానుందని, దీనిని ముందుకు తీసుకువచ్చిన కేంద్ర క్రీడలు మరియు యువజన వ్యవహారాల శాఖ మరియు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలకు ఉపరాష్ట్రపతి అభినందనలు తెలిపారు. విద్యావిధానంలో క్రీడలు ఒక భాగం కావాలని, ప్రభుత్వ ఉద్యోగాలలో, ఉన్నత విద్యలో క్రీడాకారులకు కోటా పెంచే రీతిలో ఆలోచించాలని ప్రభుత్వానికి వెంకయ్యనాయుడు సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనేనానుడిని నొక్కిచెప్పారు. ఈ పోర్టల్ ని స్మార్ట్ ఫోన్ లోనికి డౌన్ లోడ్ చేసుకునే విధంగా మొబైల్ యాప్ గా రూపొందించ బడిందని, దీనిని ఉన్నత ప్రమాణాలు కలిగిన సాఫ్ట్ వేర్ మరియు డేటా ఎనాలిసిస్ కంపెనీ ఐఆర్ఐఎస్ తయారు చేయడం తనకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడలు మరియు యువజన వ్యవహారాల మంత్రి విజయ్ గోయల్, మంత్రిత్వశాఖ మరియు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన అధికారులు, అనేక మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively Interaction For Ever
ఆంధ్రప్రభ
లైఫ్ 11
మంగళవారం 29 ఆగస్టు 2017

రైతుకు యాపద్బాంధవి



★ రైతులకు మేలు చేస్తున్న వ్యవసాయ యాప్.. ప్లాంటిక్స్
★ జర్మనీ సంస్థ పీట్ సహకారంతో... తెలుగులో అభివృద్ధి
★ విలువైన సమాచారమిచ్చిన ఇక్రిశాట్ ,ఎన్‌జిరంగా శాస్త్ర వేత్తలు
★ యాప్‌కు.. ప్రోగ్రెస్సివ్ ఎన్విరాన్‌మెంట్ అగ్రికల్చర్ టెక్నాలజి
★ 350రకాలకు పైగా తెగుళ్ల గుర్తింపు... ప్రత్యేక నివారణ చర్యలు
★ వాతావరణ వివరాలు ఐదు రోజులు ముందుగానే వెల్లడి
★ నివారణ తెలియాలంటే...ఆకును ఫొటో తీసి పంపడమే
★ తెలుగులో దాదాపు 18రకాల పంటలపై సహకారం
★ 90శాతంకు తగ్గకుండా కచ్చితమైన వివరాలతో రికార్డ్
★ ప్లాంటిక్స్...రియల్ టైమ్ పెస్ట్ అండ్ డిసీజెస్ మానిటరింగ్
★ ఐక్యరాజ్యసమితి అవార్డును దక్కించుకున్న ప్లాంటిక్స్
★ రైతులకు రూపాయి ఖర్చు లేకుండా నివారణా మార్గాలు
★ వ్యవసాయంలో దుబారా ఖర్చును కట్టడి చేసిన ప్లాంటిక్స్

దేశానికి వెన్నెముక రైతు. అతడు ఆరుగాలం కష్టించి పనిచేస్తేనే మన నోటిలోకి అన్నం మెతుకులనేవి వెళతాయి. అలాంటి రైతు ఇవ్వాళ చేనుకు పట్టిన చీడతో నిరాశా ,నైరాశ్యాల్లో మునిగిపోయాడు. రకరకాల తెగుళ్లు పంటలను తినేస్తూ ఉండడం, అనుకోకుండా వాతావరణం మారిపోతూ ఉండడంతో .... ఏం చేయాలో తెలియక సందిగ్ధంలో పడిపోతున్నాడు. విషయం ఇదీ అని తెలుసుకునే లోపల జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. అందుకే ఇక్రిశాట్ , ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్ర వేత్తలు జర్మనీ సంస్థ పీట్ తో కలిసి తెలుగు ప్రజలకు అనుగుణంగా ఉండే సరికొత్త వ్యవసాయ యాప్‌ను తయారుచేశారు. దాని పేరే ప్లాంటిక్స్ .దీనికోసం వారు ప్రోగ్రెస్సివ్ ఎన్విరాన్‌మెంట్ అగ్రికల్చర్ టెక్నాలజిని వినియోగించారు.

ప్లాంటిక్స్ యాప్‌ను జర్మనీయులు వారి అవసరాల కోసం తయారుచేసుకున్నారు. అది సత్ఫలితాలను అందించింది. దాంతో మన ఇండియన్స్ కూడా దీనిపై ఆసక్తి చూపించడంతో ఇక్కడకి ఎంట్రీ ఇచ్చింది. అయితే ఎవ్వరూ ఊహించని విధంగా దక్షిణాదిలో ప్లాంటిక్స్ యాప్‌ను రెండు తెలుగు రాష్ట్రాలు విరివిగా ఉపయోగిం చుకుంటున్నాయి.
ప్లాంటిక్స్ ఉపయోగంతో వ్యవసాయ నిపుణుల కొరత తీరిపోయినట్లయింది. మెషిన్ లెర్నింగ్‌తో రైతులు ముందుకు సాగుతున్నారు. ఎవరో రావాలి ఏదో చేయాలి అని ఎదురుచూడకుండా ఎవరికి వారు ప్లాంటిక్స్ యాప్‌ను నమ్ముకుంటున్నారు. విలువైన సమాచారాన్ని.... ప్లాంటిక్స్ పైసా తీసుకోకుండా అందజేస్తుంది.
ఇక్రిశాట్, ఎన్‌జి రంగా శాస్త్రవేత్తలు దీనిని తెలుగువారికి అనుగుణంగా మలిచారు. ఎంతో విలువైన డేటాను తెలుగులోకి తర్జుమా చేసి మనకందిస్తున్నారు. 350కు పైగా తెగుళ్ల రకాలు, ప్రత్యేక నివారణ చర్యలు ప్లాంటిక్స్ యాప్ ద్వారా రైతులు తెలుసుకోవచ్చు. ఇప్పటికే ఈ యాప్‌కు ఐక్యరాజ్యసమితి అవార్డు కూడా వచ్చింది. దీంతో ప్లాంటిక్స్‌పై రైతుల్లోనే కాకుండా... ఆధునిక వ్యవసాయం చేసేవారిలోను నమ్మకం పెరిగింది.

ప్లాంటిక్స్‌ను ఎలా వాడుకోవాలి

కాస్త చదువుకున్న వారు ఉద్యోగం వదిలేసి గ్రామాలకు వెళ్లి స్వయం ఉపాధి వెతుక్కుంటున్నవారు ప్లాంటిక్స్ యాప్ ను తేలికగానే ఉపయోగించగలరు. అయితే అంతగా చదువురాని రైతులకు దీనిని ఉపయోగించడం మొదట్లో కొద్దిగా కష్టంగానే అనిపించింది. అయితే రెండు మూడు సార్లు గైడ్ చేయడంతో వారు కూడా ప్లాంటిక్స్‌ను ఆపరేట్ చేయడం... ఇంత ఈజీనా అంటున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్లలో అందుబాటులో ఉన్న ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకున్న సమయంలోనే తెలుగు భాషను ఎంచుకోవడం ద్వారా మనకు కావల్సిన పంటలకు సంబంధించిన వివరాలు తెలుగులోనే అందుబాటులోకి వస్తాయి. యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్నాక స్క్రీన్ పై ఉన్న 18 పంటలలో మనకు కావల్సిన పంట ఏమిటో సెలెక్ట్ చేసుకోవల్సి ఉంటుంది. ఆ తరువాత దానిని సెలెక్ట్ చేసి మన వ్యవసాయ క్షేత్రంలో ఆ పంట ఆకును ఫొటో తీయాల్సి ఉంటుంది. యాప్ వెంటనే ఆ ఆకును స్కాన్ చేసి అది ఏ పంటో గుర్తిస్తుంది. అప్పుడు మనం సెండ్ బటన్ నొక్కడం ద్వారా ... ఫొటో తీయబడ్డ పంట సర్వర్ కు వెళ్తుంది. కేవలం 5 సెకండ్ల వ్యవధిలో మన పంటకు పట్టిన చీడ ఏమిటో తెలుగులో చె ప్పేస్తుంది. ఈ వ్యవస్థను మన తెలుగు శాస్త్రవేత్తలు ఎంతో కష్టపడి మరీ యాప్‌కు అందించారు.

ఎలాంటి పంటలకు ఇది పని చేస్తుందంటే...

తెలుగు ప్రజలు ఎక్కువగా పండించే పంటలు ఏవైతే ఉన్నాయో వాటిపైనే సైంటిస్టులు దృష్టిసారించి...వాటినే యాప్‌లో పెట్టారు. అందులో మన ప్రధాన పంట వరికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆ తరువాత పత్తి, వేరుశనగ,కందులు ,మినుములు ,పెసలు,గోధుమలు,మిరప,మొక్కజొన్న,సెనగలు, సోయాబీన్‌తో పాటు మామిడి చెట్ల సమాచారాన్ని యాప్‌లో పొందుపరిచారు. అలాగే కూరగాయలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని ఇందులో భద్రపరిచారు. వీటితో పాటే అరటి,చిక్కుడు,టమోటా,దానిమ్మ,బంగాళదుంప,బొప్పాయి,వంకాయ వివరాలు ఈ యాప్‌లో ఉన్నాయి. మీకు తెలుసో లేదో దాదాపు 350కు పైగా తెగుళ్లకు సంబంధించిన సమాచారం ప్లాంటిక్స్ లో మనకు లభిస్తుంది. కాబట్టి రైతన్నలు ఎలాంటి దిగులు లేకుండా సమస్త సమాచారాన్ని తెలుసుకునే అవకాశాన్ని ప్లాంటిక్స్ ద్వారా ఉచితంగా దక్కించుకున్నారు.

ప్లాంటిక్స్‌తో ఎవరికి మేలు

పంటకు సమస్య వస్తే టెక్నీషియన్ రాకపోతే రైతనేవాడు ఎంతగానో ఆందోళన చెందుతాడు. ట్రేడర్ దగ్గరకు వెళితే అలాంటి ఇలాంటి తెగులు వచ్చిందని చెప్పి ఒకటికి మూడు మందులిచ్చి అతన్ని నిలువెల్లా ముంచేస్తాడు. వేయి రూపాయలతో అయిపోయే దానికి ఏకంగా మూడు నాలుగు వేలు బాదేస్తాడు. దీనితో పెట్టుబడి పది... రాబడి ఐదు అన్నట్లుగా ఉంటుంది. ఇలాంటి వాటికి చెక్ పెట్టడానికి అన్నట్లుగా ప్లాంటిక్స్ యాప్ కచ్చితమైన వివరణ ఇస్తుంది. సమస్య ఎక్కడ వచ్చిందో స్పష్టంగా చెప్పేస్తుంది. దానికి ఎలాంటి ఎరువులు వాడాలో కూడా చెబుతూ ఉండడంతో తన చేను చీడ నివారణకు కావల్సిన మందునే రైతు కొనుగోలు చేస్తాడు. దీని ద్వారా అతనికి అనవసర ఖర్చు తగ్గిపోతుంది.

ప్లాంటిక్స్‌తో పాటు.... పలు రకాల అగ్రి యాప్‌లు

వ్యవసాయ రంగంలోని సమాచార వ్యవస్థను మరింత వేగవంతం చేయడానికి అన్నట్లుగా పలు రకాల యాప్ లు అందుబాటులోకి వచ్చేసాయి. వాటిలో ప్లాంటిక్స్ యాప్ పనితీరు ఎలా ఉందో చూశాం.అలాగే రైస్ ఎక్స్‌పర్ట్,కిసాన్ సువిధ, అగ్రి మార్కెట్ యాప్ లు కూడా రైతుల మన్ననలు పొందుతున్నాయి.

రైస్ ఎక్స్‌పర్ట్: ఈ యాప్‌ను కోల్‌కత్తాలోని జాతీయ వరి పరిశోధనా సంస్థ అభివృద్ధి చేసింది. ఈ యాప్ వరికి సంబంధించిన చీడపురుగుల నివారణ,ప్రాంతాలకు తగ్గ వరి రకాలు, యంత్రాలు,పనిముట్లతో పాటు ఆధునిక సమాచారాన్ని నేరుగా రైతుకు సందేశ రూపంలో పంపిస్తుంది.

కిసాన్ సువిధ: అన్ని రకాల పంటలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తున్న యాప్ కిసాన్ సువిధ. రానున్న వారం రోజులలో వాతావరణ ప్రభావం ఎక్కడ,ఎలా ఉంటుందో చెప్పేస్తుంది.మార్కెట్ ధరలు,సస్య రక్షణ విషయాలను స్పష్టమైన లెక్కలతో సహా అందిస్తుంది. మనం పండించిన పంటలకు మన తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలో ఏయే ప్రాంతాలలో మార్కెట్ ఎలా ఉందో చెప్పేస్తుంది.

అగ్రిమార్కెట్ : రైతుకు గిట్టుబాటు ధర రావడం కోసం తయారుచేసిన యాప్ ఇది. ఈ యాప్ మన మొబైల్ లో వేసుకుంటే... 50కిలోమీటర్ల పరిధిలోని మార్కెట్లలో పంటల విపణిధరలను తెలుపుతుంది. మొబైల్ జీపీయస్ ద్వారా మొబైల్ వాడుతున్న వ్యక్తి ఉన్న ప్రదేశాన్ని పరికరమే గుర్తిస్తుంది. జీపియస్ ద్వారా వద్దనుకుంటే యాప్ ద్వారా నేరుగా దేశంలో ఎక్కడి మార్కెట్ నుంచైనా ధరల సమాచారం పొందవచ్చు.

ఒక యాప్ వ్యవసాయ దారునికి ఇంతలా ఉపయోగపడుతుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. ఇక్కడ కాన్సెప్ట్ మంచిది కావడంతో రైతుల్లోకి ఇది ఇట్టే దూసుకుపోయింది. మరింత సమాచారాన్ని తర్జుమా చేస్తూ ఉండడంతో ప్లాంటిక్స్ రైతులకు ఇంకా భాగా ఉపయోగపడే విధంగా ముందుకు వెళ్తుంది. అగ్రికల్చరల్ అధికారి అందుబాటులో లేకపోయినా... ప్లాంటిక్స్ తో వ్యవసాయ నిపుణుల కొరత తీరిపోతుంది. రియల్ టైమ్ పెస్ట్ అండ్ డిసీజెస్ మానిటరింగ్ గా ఇది ఉపయోగపడుతుంది. 90శాతం కచ్చితమైన రిపోర్ట్ లను అందిస్తూ ఉండడంతో రైతులు ఈయాప్ పై నమ్మకాన్ని మరింతగా పెంచుకుంటున్నారు. రానున్న రోజులలో ప్లాంటిక్స్ .మార్కెటింగ్ అవసరాలను కూడా తీర్చేవిధంగా రూపాంతరం చెందుతూ ఉండడంతో ప్లాంటిక్స్ మున్ముందు వ్యవసాయ రంగంలో అధ్భుతాలను సృష్టిస్తుందని స్పష్టంగా చెప్పవచ్చు.

- సూర్యమ్ కలిదిండి



ప్లాంటిక్స్ నిపుణుడితో వ్యవసాయ అధికారి

ప్లాంటిక్స్ యాప్ రైతులకు నేడు ఎంతో మేలు చేస్తోంది. భారత్‌లో అత్యధికంగా డౌన్ లోడ్ చేసుకున్న ఎడ్యుకేషనల్ యాప్స్ లో ప్లాంటిక్స్ 9వ స్థానం దక్కించుకుంది. ప్రస్తుతం మేము ఇంగ్లీష్‌లో ఉన్న వ్యవసాయ సమాచారాన్ని తర్జుమా చేస్తున్నాం. లక్షా 80వేల డౌన్‌లోడ్స్‌తో ప్లాంటిక్స్ సంచలనం సృష్టించింది. తెలుగు రాష్ట్రా ల పరంగా చూస్తే... ఆంధ్రాలో 80శాతం తెలంగాణలో 20శాతం మంది రైతులు ఈ యాప్ ను వాడుతున్నారు.

ప్రతిరైతును ఎడ్యుకేట్ చేస్తున్నాం



రైతులు ఈ యాప్‌ను వాడుకునేలా అన్ని జిల్లా వ్యవసాయ కేంద్రాలలో ట్రైనింగ్ ఇస్తున్నాం. రైతులు ట్రేడర్ల దగ్గర మోసపోకుండా... ఈ యాప్ ఎలాంటి మందులు వాడాలో స్పష్టంగా చెప్పేస్తుంది కాబట్టి... రైతును తేలిగ్గా ఆదుకోవచ్చు. ఈ కారణాలతోనే రైతులకు ప్లాంటిక్స్ పై నమ్మకం మరింత పెరుగుతున్నది. త్వరలో డౌన్ లోడ్ల సంఖ్య మరింత పెరగవచ్చు. ఆంధ్రాలో సూపర్ సక్సెసైన ఈ యాప్‌ను త్వరలో తెలంగాణాలోని వ్యవసాయదారుల చెంతకు తీసుకువెళతాం. మరిన్ని మంచి ఫలితాలు సాధిస్తాం.

రూపావతారం శ్రీకాంత్,
డిజిటల్ అగ్రికల్చరల్ శాస్త్రవేత్త

సత్వర పరిష్కారం

సాగు సమస్యలకు సత్వర పరిష్కారం చూపిస్తూ... వ్యవసాయ నిపుణుల కొరత తీర్చడమే కాకుండా.. రైతుకు ఎంతో మేలుకరంగా ఉపయోగపడుతున్న ప్లాంటిక్స్ పనితీరును మెచ్చుకోకుండా ఉండలేం. కృష్ణ పశ్చిమ గోదావరి జిల్లా రైతులు.... ప్లాంటిక్స్ యాప్‌ను ఎలా వాడాలో ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు. రైతులకు ... వివిధ పంటల సాగులో ఎదురవుతున్న చీడపీడల నివారణ, పోషకాల సమస్యలకు ... ఈ యాప్ ఎంతో ఉపయోగకరం. రైతు యాప్‌ను ఇట్టే అర్ధం చేసుకోవడానికి.... అలాగే వెంటనే పైరుకొచ్చిన సమస్యపై చర్యలు తీసుకోవడానికి... ఏ తెగుళ్లకు ఏ మందు వాడాలో తెలుసుకుని తర్వాతి అడుగు వేయడానికి ప్లాంటిక్స్ అన్ని రకాలుగా ఉపయోగపడుతుంది. పంటలకు కావల్సిన పోషకాలు ఏమిటో చెప్పే ఈ యాప్ వలన పంటపై అవగాహన లేని రైతులు కూడా లబ్ధి పొందుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే వ్యవసాయంలో వినూత్న విప్లవాన్ని ప్లాంటిక్స్ యాప్ తీసుకువచ్చింది.

మాగంటి వీరాంజనేయులు..
వ్యవసాయ నిపుణులు



ప్లాంటిక్స్ యాప్ నిపుణురాలితో అరటి రైతులు

ప్లాంటిక్స్ యాప్ గురించి మా అన్నయ్యగారి అబ్బాయి చెబితే నమ్మలేదు. ఆ తర్వాత మా అల్లుడు కూడా చెప్పడంతో ప్లాంటిక్స్ గురించి తెలుసుకునే ప్రయత్నం చేశాను. అయితే వచ్చిన ఫలితాలపై నమ్మకం కుదరక వ్యవసాయాధికారులతో మాట్లాడాను. వారు కరెక్ట్ ఫలితాలను ఇస్తుందని చెప్పడంతో నమ్మకం కుదిరింది.నా అరటితోట తెగుళ్ల సమస్యలకు ప్లాంటిక్స్ చక్కని పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు చెబుతోంది. దాంతో నా తోటి రైతులకు కూడా ప్లాంటిక్స్ ప్రాముఖ్యతను వివరించి చెబుతున్నాను.



ఆర్ .శ్రీనివాస్ రాజా , సఖినేటి పల్లి



దశాబ్దానికి పైగా హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి విసుగుచెందిన నేను... ఇటీవల ఊరొచ్చి కూరగాయల పంటలు పండిస్తున్నాను. వినూత్న వ్యవసాయ పద్దతుల ను అమలు చేసే విధానంలో భాగంగా నా ఫ్రెండ్ ఒకతను ప్లాంటిక్స్ యాప్ గురించి చెప్పాడు.ఈ యాప్‌ను సరదాగా ట్రై చేశాను. చీడ పీడల గురించే కాకుండా.. వాతావరణ పరిస్థితులపై ప్లాంటిక్స్....సరైన సమయంలో అప్రమత్తం చేయడంతో ఎప్పటికప్పుడు జాగ్రత్త పడుతూ పంటను చేజారకుండా చూసుకుంటున్నాను. నాలాంటి వారికే కాకుండా అంతగా చదువురాని రైతులకు ప్లాంటిక్స్ మంచి సహాయకారి.

క్రాంతి కుమార్ సుంకరి ,
భద్రాచలం డివిజన్ , ఖమ్మం జిల్లా

నిల్వ @1000 రోజులు

పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధర లేకపోతే రైతు ప్రాణం విలవిల లాడిపోతుంది.ధర వచ్చే వరకు ఆగుదామంటే గోదాములో ఎలుకలతో గొడవ. ఎందుకిలే ఆరుబయటే ఉంచుదామంటే వాన ఎప్పుడు ముంచుకొస్తుందో తెలియదు. ఖర్చు పెట్టి కోల్డ్ స్టోరేజీల్లో ఉంచుదామన్నా... కొంతకాలమే వాటిని నిల్వ చేసుకోవచ్చు. మరి రైతు వీటినుంచి ఎలా బయటపడాలి. తన పంటను లాంగ్ టైమ్ తన వద్దే అట్టిపెట్టుకుని ధర వచ్చిన టైమ్లోనే అమ్ముదామంటే ఏం చేయాలి. మన దేశంలో సగటు రైతు సమస్యలు త్వరలో రైతు కల తీరబోతుంది. సమస్యకు పరిష్కారం దొరకబోతోంది. ఇదే గనుక జరిగితే టన్నుల కొద్దీ టమోటాలు,క్వింటాళ్ల ఉల్లిపాయలు రోడ్ల పాలయ్యే పరిస్థితులు ఇక కనిపించవు.
ఇంతకీ రైతును ఈ కష్టాల సుధీర్ఘకాలం నుంచి గట్టెక్కించే పరిస్థితులను తీసుకువచ్చిన ఆ టెక్నాలజీ ఏంటనే కదా మీ డౌట్. అదే బ్లాక్ బాక్స్ టెక్నాలజి. రై తు తాను పండించిన పంటను ఏకంగా వెయ్యి రోజుల



పాటు నిల్వ చేసుకునే విధంగా బ్లాక్ బ్లాక్స్ టెక్నాలజీ చైస్తుంది. ఈ ప్రాసెస్‌లో ఆహారం ఎక్కడా కుళ్లిపోదు. ఇంతటి గొప్ప టెక్నాలజీని స్పెయిన్ శాస్త్రవ్రేత్తలు తయారుచేశారు. ఫ్యాక్టరీ లేదా ప్లాంట్స్ లో ఎక్కడైనా ఈ టెక్నాలజీని ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. మనకు తెలిసి కోల్డ్ స్టోరేజీల్లో నైట్రోజన్ సాయంతో పదార్థాలను నిల్వ చేస్తుంటారు. బ్లాక్ బాక్స్ పద్దతిలో అలాంటివేవి ఉండవు. ఎలాంటి ప్రిజర్వేటివ్స్ నిలువ ఉంచే రసాయనాలు ఉపయోగించరు. అయినప్పటికీ... పోషక విలువలు చెక్కు చెదరవు. పండ్లు, కూరగాయలు, మాంసం అలాగే నిలువ ఉంటుంది. అమెరికా పేటెంట్ కలిగిన బ్లాక్ బ్లాక్స్ టెక్నాలజీ ని చాలాదేశాల్లో వాడి చూసారు. ఇపుడు ఇండియాకు వచ్చింది. విజ్తార్ అగ్రిటెక్ కంపెనీ ఈ టెక్నాలజీని అడాప్ట్ చేసుకుంది.ఇందుకోసమని స్పెయిన్ కు చెందిన నైస్ ఫ్రూట్స్ కంపెనీతో టైఅప్ అయింది. ఇండియాలోని కోల్డ్ స్టోరేజీ ప్లాంట్లకు ఈ టెక్నాలజీని అనుసంధానం చేయబోతున్నారు. అందులోను మొదటి రెండు యూనిట్లు హైదరాబాద్ లో ఏర్పాటు చేయబోతున్నారు. హిందూస్తాన్ ఎల్ఎన్జీతో కలిసి హైదరాబాద్‌లో రెండు కోల్డ్ స్టోరేజీ ప్లాంట్లు తెరవబోతున్నారు. మహారాష్ట్ర,ఉత్తరప్రదేశ్‌లో మామిడిపండ్ల నిల్వ కోసం మరో రెండు యూనిట్లు తెరవబోతున్నారు. బ్లాక్ బాక్స్ టెక్నాలజీ ద్వారా రైతులు ఆదాయం నాలుగు రెట్లు పెరిగే అవకాశముంది. కాబట్టి రానున్న రోజులలో రైతుకి గిట్టుబాటు ధర అందకపోవడం అనే సమస్య ఉండకపోవచ్చు.

చింతన

దివ్యప్రేమకు సంకేతం

రాధాకృష్ణులు



రాధ ఎవరో మనకు తెలుసు. ఆమె కృష్ణుని చెలి. నిస్వార్థ దివ్య ప్రేమకు సంకేతం. ఆ రాధాదేవి పుట్టినరోజు భాద్రపద శుక్ల అష్టమి. ఆమెను లక్ష్మీదేవి అవతారంగా కూడా భావిస్తారు. కొందరు రాధను మానవ యువతిగా, శ్రీకృష్ణుని దేవునిగా, వారి ప్రేమను దైవానికి, మానవులకు మధ్య ప్రేమకు చిహ్నంగా పేర్కొంటుంటారు. భాగవతంలో ఎక్కడా రాధాదేవి ప్రస్తావన నేరుగా లేదని బ్రహ్మ వైవర్త పురాణం, పద్మపురాణం మొదలైన వాటిల్లో ఉందని చెబుతారు. అయితే అథర్వ వేదంలోనూ, తైత్తరీయ బ్రాహ్మణంలోనూ తైత్తరీయ సంహితలో కూడా ఆమె ప్రస్తావన ఉన్నట్టు చెబుతారు.

నేడు రాధాష్టమి

అయితే ఆరాధిత అనే గోపిక పేరే రాధ అయిందని ఆమె అందరికన్నా కృష్ణుని అమితంగా ప్రేమించేదని చెబుతారు. రాధా తత్త్వం లోతుగా ఆలోచించదగినదని అంటారు. జన సామాన్యంలో కూడా రాధా కృష్ణుల ప్రస్తావన ఎక్కువగానే ఉంది. రాధాకృష్ణ అనే పేరు ఎక్కువ ప్రఖ్యాతం. గోలోకంలో రాధాకృష్ణులు గోవుల మధ్య ఉంటారనే వర్ణనలు కూడా ఉన్నాయి. కృష్ణాష్టమి జరిగిన పక్షం రోజులకు రాధాష్టమి వస్తుంది. వారిద్దరూ పుట్టినది అష్టమి తిథినాడే అయితే మాసాలు వేరు. రాధాష్టమి సందర్భంగా దేశవ్యాప్తంగా చాలా ప్రదేశాలలో ఉన్న ఇస్కాన్ ఆలయాలలోనూ, కృష్ణునితో సంబంధమున్న మధుర, బృందావనం, రాధా దేవి పుట్టిన ప్రదేశంగా భావించే బర్సానాలోనూ పూజలు, వేడుకలు జరుగుతాయి. బర్సానా కూడా ఉత్తర ప్రదేశ్‌లోనే ఉంది.

లోకకల్యాణకారకులు



చేసే వృత్తి వల్ల కులాలు ఏర్పడ్డాయి కాని గుణాల వల్ల కాదని కొందరు అంటారు. కులానికన్నా గుణమే ప్రధానమని భారతీయులు నమ్ముతారు. అందుకే కులానికి ప్రాధాన్యమీయని భారతం అడుగడుగునా మనకు ధర్మ ప్రబోధాన్ని చేస్తుంది. గణికలు అంటే వేశ్యలు. ఇతరులకు ఆనందాన్ని పంచివ్వడానికి ఒకప్పుడు వేశ్యలుండేవారు. వారిది వేశ్యాకులమని కూడా అనేవారు. వారిలోనూ మహితాత్ములు లోక కల్యాణకారులు ఉండేవారు. అలాంటివారే తమ ప్రాణాలను పణంగా పెట్టి తమ దేశం సస్యశ్యామలంగా ఉండాలని విభాండకుని పుత్రుడైన ఋష్యశృంగుని అంగదేశానికి తీసుకొని రావడంలో ఫలప్రదులయ్యారు.

ఏ విషయమైనా గుడ్డిగా చేస్తే అది మంచి ఫలితాలను ఇవ్వదు. ఒక్కోసారి మంచి ఫలితమే వచ్చినట్టు అనిపించినా అది ఎక్కువకాలం సాగదు. ప్రతి పనిని కూడా వివేచించి వివేకంతో చేయమని పెద్దలు చెప్తుంటారు. అర్థం తెలుసుకొని చేస్తే పని నైపుణ్యంతో చేయవచ్చు. దానివల్ల మంచి జరిగి లోకకల్యాణ కారకులు కావచ్చు.

చేసే వృత్తి వల్ల కులాలు ఏర్పడ్డాయి కాని గుణాల వల్ల కాదని కొందరు అంటారు. కులానికి కన్నా గుణమే ప్రధానమని భారతీయులు నమ్ముతారు. అందుకే కులానికి ప్రాధాన్యమీయని భారతం అడుగడుగునా మనకు ధర్మప్రబోధాన్ని చేస్తుంది. గణికలు అంటే వేశ్యలు. ఇతరులకు ఆనందాన్ని పంచివ్వడానికి ఒకప్పుడు వేశ్యలుండేవారు. వారిది వేశ్యాకులమని కూడా అనేవారు. వారిలోనూ మహితాత్ములు లోకకల్యాణకారులు ఉండేవారు. అలాంటివారే తమ ప్రాణాలను పణంగా పెట్టి తమ దేశం సస్యశ్యామలంగా ఉండాలని విభాండకుని పుత్రుడైన ఋష్యశృంగుని అంగదేశానికి తీసుకొని రావడంలో ఫలప్రదులయ్యారు.

ఒకానొక కాలంలో అంగదేశంలో క్షామం ఏర్పడింది. ఎన్నో ఏళ్లు వర్షాలు లేక చెట్టు చేమ ఎండిపోయాయి. వాగులు, వంకలు, చెరువులు, ఆఖరికి నదీనదాలు కూడా ఎండిపోయే దశకు వచ్చేస్తున్నాయి. అంగరాజు రోమపాదునికి దేశక్షేమానికి ఏం చేయాలో అర్థం కాలేదు. ఋషులను, మునులను, పండితులను, పామరులను అందరినీ సమావేశపరిచాడు. అందరి సలహాలను తీసుకొన్నాడు. విభాండకుని పుత్రుడు ఋష్యశృంగుని తమ రాజ్యంలోకి ఆహ్వానించి తీసుకొని వస్తే చాలు క్షామం నుంచి తప్పించుకోవచ్చునని అంగరాజుకు కొందరు తెలిపారు. ఋష్యశృంగుడు ఎక్కడ అడుగు పెడితే అక్కడ వర్షాలు పడి ఆ ప్రదేశం సస్య శ్యామలమవుతుందని ఇంద్రుడు ఒకసారి వరమిచ్చాడు. అందువల్ల అతనిని తమ రాజ్యానికి తీసుకురావాలని అంగరాజు ఆలోచించాడు.

విభాండకుడు పుత్రుడు లోకవ్యవహారాలు తెలియని జ్ఞాని. విభాండకుడు బ్రహ్మచారిగా తపస్సు చేసుకొనే సమయంలో ఒకసారి నదీస్నానం ఆచరించేటపుడు ఊర్వశి అనే అప్సరసను చూశాడు. ఆయనకు రేతస్సు పతనమై నదిలో కలిసింది. ఆ నీటిని ఓ దుప్పి తాగింది. దాని వల్ల ఆ దుప్పి గర్భవతి అయింది. దుప్పి జన్మనిచ్చిన శిశువే విభాండకుని పుత్రుడు ఋష్యశృంగుడు. ఈ ఋష్యశృంగుడిని విభాండకుడు బ్రహ్మచారిగా పెంచాలనుకొన్నాడు. తను చేసిన తప్పు కూడా తన కొడుకు చేయకుండా ఉండి బ్రహ్మపథాన్ని పొందాలని అనుకొన్నాడు. ఏ విషయమూ తెలియకుండా ఉంటేనే బ్రహ్మచారిగా ఉంటాడని విభాండకుడు అనుకొన్నాడు. ఘోరారణ్యంలో ఆశ్రమం ఏర్పాటు చేసుకొని అక్కడే తన కొడుకుతో నిత్యం హోమాగ్నులను చేస్తూ తపస్సు ఆచరిస్తూ విభాండకుడు కాలం గడుపుతున్నాడు. విధిరాతకు ఎవరూ ఎదురీదలేరు కదా. కాలం ఎవరేమి చేసినా తన పని తాను చేసుకొని పోతూనే ఉంటుంది.

భారతంలో చిన్న కథలు

అంగరాజు విభాండకుడికి తెలియకుండా ఋష్యశృంగుని తమ అంగదేశానికి కొనిరావడమెలాగా అని ఆలోచించాడు. గణికలు ఈ పనిని సానుకూలంగా చేయగలరని అనుకొన్నాడు. వెంటనే వారికి పనిని అప్పగించాడు.

వారు కూడా తమ దేశాన్ని క్షామపరిస్థితుల నుంచి కాపాడాలనుకొన్నారు. వెంటనే ఋష్యశృంగుని ఎలా తీసు కొని రావాలో ఆలోచించారు. ఋష్యశృంగుని గురించి బాగా తెలుసుకొన్నారు. వెంటనే ఒక నావలో సర్వసౌఖ్యాలను ఏర్పాటు చేయించుకొన్నారు. వివిధ తినుబండారాలను, నాగరిక జీవనంలో వున్న వసతులను కూడా ఆ నావలోనే ఏర్పాటు చేసుకొన్నారు. కొంతమంది కలిసి విభాండకుని ఆశ్రమానికి దగ్గరలో తమ విడిది ఏర్పాటు చేసుకొన్నారు.

విభాండకుడు లేని సమయంలో ఋష్యశృంగునికి కావాలని తారసపడ్డారు. ఏమీ తెలియని వారిలాగా ఋష్యశృంగుని యోగక్షేమాలు దినవారి కృత్యాలను గురించి అడిగారు. ఋష్యశృంగునికి ఆడ, మగ తేడా తెలియదు. ఇదివరకెన్నడూ చూడని అందచందాలున్న గణికలను చూచి వారు కూడా మునులేమోనని అనుకొన్నాడు. కాని వారిని చూడడం తోటే మనసున తెలీని అవస్థకు లోనయ్యాడు. ఏది చేయాలో తెలియని పరిస్థితుల్లోకి వెళ్లుతూ వారి మాటలను విన్నాడు. ఆ వచ్చిన గణిక కూడా ఋష్య శృంగుని ఏమాత్రం అనుమానం రాకుండా తాము కూడా మునిగణానికి చెందినవారమేనని తమ అభిమానాన్ని కౌగిలింత ద్వారా ప్రకటిస్తూ మా మర్యాదలు ఇలానే ఉంటాయని చెప్పింది. విషయం తెలియని ఋష్యశృంగుడు ప్రకృతివశుడయ్యాడు. గణిక స్పర్శసుఖం కోసం తహతహలాడాడు. అట్లా ఋష్యశృంగునిలో మార్పునకు బీజాలు వేసి తమ కాలకృత్యా లకు వేళ దాటుతోందని మరలా వస్తామని చెప్పి ఆ గణిక దూరమైంది. కాని ఋష్యశృంగునిలో ఆ గణిక ప్రభావం చాలా పడింది. దాంతో అతడు నిత్యకృత్యాలు చేయలేక అస్థిమితుడయ్యాడు. విభాండకుడు వచ్చాడు. అతని కొడుకు పరిస్థితి అర్థం చేసుకొన్నాడు. ఎవరో పని గట్టుకుని తన కొడుకును తప్పుదారి పట్టిస్తున్నారని ఆలోచించాడు. వారి కోసం వెతికాడు. కాని గణికలు చాతుర్యంతో విభాండకుని కన్నుగప్పి తిరిగారు.

అన్ని హితవచనాలు చెప్పి ఆ వచ్చిన మునిస్వాములకు దూరంగా ఉండాలని విభాండకుడు తన కొడుకుకు చెప్పాడు. కాని ఋష్య శృంగునికి మాత్రం ఆ గణికను చూడాలనే బుద్ధి దూరం కాలేదు. కొద్దిరోజుల అనంతరం విభాండకుడు తన నిత్యకృత్యంలో మునిగిపోయాడు. సమిధలు తెస్తానని ఋష్యశృంగుడు ఆశ్రమాన్ని వదిలి దూరంగా వచ్చాడు. కాని ఋష్యశృంగుని మనసు మరలా ఆ గణికస్వామి మీదనే ఉంది. ఎక్కడైనా కనిపించకపోతారా అని వనం అంతా వెతుకుతున్నాడు. ఆ సమయం కోసమే ఎదురుచూస్తున్న గణికలు ఋష్యశృంగుని దగ్గరకు వచ్చారు. ఎంతో సంతోషంతో తమ నావలోకి తమ ఆశ్రమం అంటూ ఆహ్వానించారు. నాగరికత రుచి చూపించారు. వివిధ తినుబండారాలు వసతులు స్పర్శాసుఖం అన్నింటిని ఒక్కొక్కటిగా రుచి చూపిస్తూ ఇంకా మా నగరంలో ఎన్నో వింతలు వున్నాయని వాటిని మేము పరిచయం చేస్తాము రండి అంటూ తమ నగరానికి ఋష్యశృంగుని ఆహ్వానించారు.

వింతలను చూడాలన్న ఆశతో వారితో ఋష్యశృంగుడు బయలుదేరాడు. అలా అంగదేశం చేరిన ఋష్యశృంగునికి అంగరాజైన రోమపాదుడు ఘనస్వాగతం పలికాడు. అంతఃపురంలోకి తీసుకొని వెళ్లాడు. అప్పటివరకు చూడని కొత్తలోకాలను చూస్తూ ఋష్యశృంగుడు ఆశ్చర్య ఆనందాలకు లోనయ్యాడు. రోమపాదుడు తన కూతురు శాంతను చేపట్టి తమకు అల్లుడు అవమని ప్రాధేయపడ్డారు. ఋష్యశృంగుడు సరేనన్నాడు. శాంతా ఋష్యశృంగులకు వైభవంగా అంగరాజు వివాహం జరిపించాడు. అంగదేశంలో వర్షాలు పడ్డాయి. క్షామపరిస్థితులు క్రమంగా దూరం అయ్యాయి. నవనవోన్మేషంగా ప్రకృతి పులకరించింది. దేశమంతా సస్యశ్యామలం అయింది. కాని ఋష్యశృంగుని తండ్రికి జరిగింది తెలిస్తే ఏమి శపిస్తాడో అన్న శంక అంగరాజైన రోమపాదునిలో దూరం కాలేదు. అందుకే ఋష్యశృంగుని వెతుకుతూ విభాండకుడు వస్తాడేమోనని ఆదారంతా గోగణంతో రోమపాదుడు నింపాడు. అక్కడ సేవకులను నియమించాడు. వారంతా ఋష్యశృంగుని సేవలకులమని భావింప చేశాడు.

ఎక్కడ చూసినా విప్రులకు ఆదర అభిమానాలు కలుగేట్లుగా చేశాడు. గోగణాన్ని పూజించే ఏర్పాటు చేశాడు. అనుకొన్నట్లే విభాండకుడు తన దివ్యదృష్టితో జరిగిన సంగతి తెలుసుకొని రోమపాదుని దగ్గరకు వచ్చాడు. దారిలో గోగణాలకు ఏర్పాటు చేసిన వసతులను చూచి సంతృప్తి చెందాడు. బ్రాహ్మణులకు లభిస్తున్న మర్యాదలను చూచి తృప్తి చెందాడు. అంగరాజు దగ్గరకు వచ్చాడు. తన కొడుకు కోడల్ని చూశాడు. విభాండకుని మనసు ప్రశాంతత పొందింది. తన కొడుకును, కోడలిని ఆశీర్వదించాడు. తమ అజ్ఞానంతో బ్రహ్మచారిగా ఉంచాలనుకొన్న కొడుకు గృహస్థాశ్రమంలోకి అడుగుపెట్టడం విధికృతంగా భావించాడు. గృహస్థుగా ఋష్యశృంగుడు చేస్తున్న మంచి కార్యాలను చూచి విభాండకుని మనస్సు ఊరడిల్లింది. దాంతో నీవు రోమపాదునికి వంశాకురాలనిచ్చి తిరిగి తన్ను కలుసుకోవాల్సిందిగా తన కొడుకుకు, కోడలికి చెప్పి తిరిగి విభాండకుడు ఆశ్రమబాటపట్టాడు.


ఇలా గణికలు దేశ క్షేమం కోరి చేసిన పనిని కొనియాడి తీరవలసిందే. విభాండకుని శాపానికి గురి అవుతామనే భయం ఉన్నా వారు ఋష్యశృంగుని అంగదేశానికి తీసుకొని రావడానికే ముందుకొచ్చారు. వారి దేశభక్తిని కీర్తించవలసిందే.

అడవుల్లో అరణ్యాల్లో మానవులు సంచరించని చోట ఇంద్రియాలు అణగదొక్కి తపస్సు చేస్తే వచ్చే ఫలితం కన్నా త్యాగగుణంతో గృహస్థాశ్రమాన్ని తీసుకొని ధార్మిక పథంలో నడిచి పొందే ఫలితమే మిన్న అని తెలుసుకొన్న విభాండకునిలాగా మనమూ కుటుంబ వ్యవస్థలోనే ఉంటూ త్యాగమే మహోన్నత గుణమని తెలుసుకోవాలి. స్వార్థాన్ని వీడి త్యాగ గుణాన్ని వృద్ధి పరచుకోవాలి. తనకోసం కాక అందరికోసం బతికే వీలున్న ధార్మికపథంలోనే అడుగులు వేస్తూ ముందుకు సాగాలన్న ఋష్యశృంగుని కథను మననం చేసుకోవాలి.

- అశ్విని

భగవద్గీత

ఆత్మదర్శుల నుంచి జ్ఞానం పొందాలి



అధ్యాయం 4

శ్లోకం 34:

తద్విద్ధి ప్రణిపాతేన
పరిప్రశ్నేన సేవయా।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం
జ్ఞానినస్తత్త్వదర్శినః॥

తాత్పర్యం: గురువు చెంత చేరి సత్యం తెలుసుకొనేందుకు ప్రయత్నించాలి. వినయంతో ప్రశ్నలు వేసి సేవ చేయాలి. ఆత్మదర్శులు తత్త్వ దర్శనము చేసిన వారవటం వల్ల నీకు జ్ఞానాన్ని ఉపదేశిస్తారు.

భాష్యం: ధర్మమనేది భగవంతుడు మాత్రమే ఇవ్వగలడు. దానిని పాటించేందుకు గురువు శిక్షణ అత్యావశ్యకం. గురువును సమీపించి అతనిని శరణు పొందిన గాని జ్ఞాన సముపార్జన మొదలు కాదు. అటువంటి ఆత్మసాక్షాత్కారాన్ని పొందిన గురువును సంతృప్తి పరచుటయే ఆధ్యాత్మిక జీవన పురోగతికి మూలాధారము. గురువు నుండి వినమ్రతతో వినటమే కాక, అహంకారాన్ని పక్కన పెట్టి శ్రద్ధతో దాసుని వలె సేవ చేయాలి. అలాగే సేవయే కాక వినమ్రతతో ప్రశ్నలు అడిగి స్పష్టమైన అవగాహనను పొందాలి. ఎంతో దయాళువైన గురువు అటువంటి శిష్యునికి జ్ఞానాన్ని ఇస్తాడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

ఆంధ్రప్రభ యాప్‌లో శ్రావ్యమైన ఆడియోతో...

సౌభాగ్యదాయిని దూర్వాష్టమి

శుక్లాష్టమీ తిథిర్యాతు మాసి భాద్రపదే భవేత్
దూర్వాష్టమీతు సాజ్ఞేయా నోత్తరాసావిధీయతే

భాద్రపద శుక్ల అష్టమి సప్తమీ విద్ధ అయినదే గ్రహించవలెను. నవమి విద్ధను గ్రహించరాదని హేమాద్రిలో చెప్పి ఉన్నారు. భాద్రపద శుక్ల అష్టమిని దూర్వాష్టమి అని కూడా వ్యవహరిస్తారు. చంద్ర లగ్నంలో చంద్రుడు ఉచ్చలో ఉన్నపుడు భాద్రపద శుద్ధ అష్టమి మొదలందైనా, మిగులందైనా దూర్వాష్టమిగా వ్యవహరించాలి. కానీ ఈ దూర్వాష్టమి మూల, జ్యేష్ఠ నక్షత్రం లేనపుడు ఆచరించాలి.

దూర్వాష్టమీ సదాత్యాజ్యా జ్యేష్ఠా మూలరక్ష సంయుతా

అనగా జ్యేష్ఠ నక్షత్రంతో ఉన్న దూర్వాష్టమి ఆచరిస్తే సంతానం క్షయ మవుతుంది, ఆయుష్యం హరిస్తుంది. అందువల్ల జ్యేష్ఠ, మూలలతో ఉన్న దూర్వాష్టమిని త్యజించాలి.

సింహస్థేసోత్తమాసూర్యే అనుదితే ముని సత్తమా

ఈ దూర్వాష్టమిని కన్యా సంక్రమణంలో కాకుండా సింహ సంక్రమణంలో ఆచరించాలి అని స్కాంద పురాణంలోని మదన రత్నంలో ఉంది. భాద్రపద శుక్ల అష్టమి నాడు లక్ష్మీదేవిని కానీ గౌరీ దేవిని కానీ 108 గరిక దళాలతో పూజించాలి. గరిక పూలు దొరికితే లక్ష్మీదేవిని లేదా దుర్గాదేవిని సూర్యోదయానికి ముందే పూజించాలి. స్త్రీలు ఈ దూర్వాష్టమి వ్రతాన్ని తప్పక ఆచరించాలి.

ప్రతి సంవత్సరం స్త్రీలు దూర్వాష్టమి వ్రతాన్ని శ్రద్ధాభక్తులతో ఆచరించాలి. ఈ వ్రతాన్ని ఆచరిస్తే 82 జన్మలు భర్త వియోగాన్ని పొందక భర్త అనురాగం, ఉత్తమ సంతానం, సమాజ గౌరవం లభిస్తాయి.

ఒకవేళ జ్యేష్ఠ, మూల నక్షత్రాలే అష్టమి నాడు ఉంటే ఆ రోజు ఒక పూటే భుజించి దూర్వ (గరిక) ను లక్ష్మీదేవి, పార్వతీ దేవిగా పూజించాలి. కానీ దూర్వాపూజ లేకుండా ఉండరాదు.

శుచౌ దేశే ప్రజాతాయాం దూర్వాయాం బ్రాహ్మణోత్తమా
స్థాప్య విష్ణుం తతో గంధైః పుష్పైః ధూపైః సమర్పయేత్
దధ్యక్షతైః ద్విజశ్రేష్ఠ అర్ఘ్యం దద్యాత్ త్రివిక్రమే
దూర్వాశమీభ్యాం విధివతు పూజయేత్ శ్రద్ధయాన్వితః

పరిశుద్ధమైన పవిత్రమైన ప్రదేశంలో పుట్టిన గరికలో శ్రీమహావిష్ణువును ప్రతిష్ఠించి గంధ, పుష్ప, ధూప, దీపాలతో, దధి అక్షతలతో త్రివిక్రమునికి అర్ఘ్యం ఇవ్వాలి. గరికతోటి, జమ్మి ఆకుతో శ్రీమహావిష్ణువుని పూజించాలి. పైశ్లోకంలో 'విష్ణుం' అన్న చోట 'లింగం' అని 'త్రివిక్రమే' ఉన్న చోట 'త్రిలోచనే' అని కూడా చెప్పియున్నారు. అనగా శివ భక్తులు ఈ దూర్వాష్టమి నాడు గరికపై శివలింగం ఉంచి పూజించాలి

పూజా మంత్రం

త్వం దూర్వే అమృత జన్మాసి వందితాహి సురాసురైః
సౌభాగ్యం సంతతిం దేహి సర్వ కార్య కరీభవ

యథా శాఖా ప్రశాఖాభిః విస్తృతాసి మహీతలే
తథా మమాపి సంతానం దేహిత్వం అజరామరం

అనగా 'దూర్వా నీవు అమృతంలో పుట్టావు, సురాసురలతో నమస్కరించబడుతున్నావు, నాకు సౌభాగ్యాన్ని సంతానాన్ని ప్రసాదించు, సర్వకార్యాలను ఆచరింపజేయి. నీవు శాఖ, ప్రశాఖలతో విస్తరించినపుడు నాకు కూడా అజరామరమైన సంతానాన్ని ఇవ్వు.

ఇక అధిక భాద్రపద మాసమొచ్చినపుడు శుక్ల పక్షంలో జ్యేష్ఠా నక్షత్రం వచ్చిన నాడు జ్యేష్ఠా నక్షత్ర పూజ లేక జ్యేష్ఠాదేవి పూజ చేయాలి. ఈ పూజ రాత్రి చేయాలి.



నేడు భాద్రపద శుక్ల అష్టమి

జ్యేష్ఠాపూజ చేసి ఈ క్రింది మంత్రంతో ఆవాహన చేయాలి.

ఈ మంత్రంతో పూజించాలి

ఏ హ్యేహిత్వం మహాభాగే సురాసుర నమస్కృతే
జ్యేష్ఠత్వం సర్వదేవానాం మత్సమీప గతాభవ

అనంతరం క్రింద ఇచ్చిన ధ్యాన, అర్ఘ్య మంత్రాలను పఠించాలి.

జ్యేష్ఠాయైతు నమస్తుభ్యం శ్రేష్ఠా యైతే నమోనమః
శర్వాయైతే నమస్తుభ్యం శాంకర్యైతే నమోనమః
జ్యేష్ఠే శ్రేష్ఠే తపో నిష్ఠే బ్రహ్మిష్ఠే సత్య వాదిని
ఏ హ్యేహిత్వం మహాభాగే అర్ఘ్యం స్వీకురు సరస్వతి!



- డా॥ కందాడై రామానుజాచార్య



నందీశ్వర అంతరార్థం

గణపతి నవరాత్రుల సందర్భంగా గజానన ఆంతర్యం తెలుసుకున్నాం. ఆ కథలో మరో అంతరార్థం ఉంది. అందులో గజాసురుడు శివుణ్ని తన ఉదరంలో దాచుకుంటాడు. దానిని నంది తన కొమ్ములతో చీలుస్తాడు. దీనిలోనూ అంతరార్థం దాగి ఉంది. శరీరానికి, మనస్సుకు, బుద్ధికి హితాన్ని, శుభాన్ని కలిగించే దానిని

గణపతి నవరాత్రుల ప్రత్యేకం

కావలసినంతే తీసుకోవాలి. అందరినీ, అన్నింటినీ నేనే అనుభవించాలి అనే ఆశకు ప్రతిరూపం ఉదరం. అనవసరమైన వాటిని స్వీకరించినందున నందీశ్వరుడు గజాసురుడి ఉదరాన్ని చీల్చాడు. మితం, హితం లేకుండా అన్ని ఉదరంలోనే దాచు కోవడం అసురత్వం. తాను ఒక్కడే తింటే రాక్షసుడు, పదిమందికి పెట్టిన వాడు మానవుడు, పదిమంది కోసం తాను తినడం మానేస్తే భగవంతుడు. కడుపునకు ఆశ, ఆకలి పెంచక రుచితో పాటు అభిరుచిని పెంచుకోవాలి. రుచి మనదైతే అభిరుచి లోకానిది. అందుకే నందికేశ్వరుడు గజాసుర ఉదరాన్ని చీల్చి శంకరుడిని బయటకు తీసుకువచ్చాడు. నంది అనగా గోవు, వృషభం. ఇది శబ్ద వృషభం అనగా

చత్వారి శృంగా త్రయోఅస్య పాదాః
ద్వేశీర్షే సప్త హస్తాసోఅస్య
త్రిధా బద్ధో వృషభోరోరవీతి
మహాదేవో మర్త్యాగ్ం ఆవివేశ

శబ్ద రూప వృషభాన్ని వేదమంత్రం ఇలా వర్ణించింది. ఈ శబ్ద వృషభం నాలుగుకొమ్ములు, మూడు పాదాలు, రెండు శిరస్సులు, ఏడు చేతులు కలిగి ఉంటుంది. ఇది శబ్దపురుషుని ఋషభ స్వరూపం. పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అనే నాలుగు వాక్కు భేదాలు నాలుగు కొమ్ములు. అలాగే భూత, భవిష్య, వర్తమాన కాలా లు మూడు పాదాలు. నిత్యం, అనిత్యం రెండు తలలు. అదే విధంగా ఏడు విభక్తులు ఏడు చేతులు. శబ్దం అనేది హృదయంలో పుట్టి శిరస్సుకు చేరి కంఠం ద్వారా బయటకు వస్తుంది. ఇది శబ్ద బ్రహ్మ. ఆనందరూపుడైన పరమేశ్వరుణ్ని తన స్వార్థ బుద్ధితో గజాసురుడు ఉదరంలో దాచుకోగా మంత్ర వశ్యుడైన శంకరుణ్ని మంత్ర రూపుడైన నంది తన మంత్రంతో బయటకు తెచ్చి ఆనందాన్ని లోకమంతటికి అందించాడు. నంది గజాసురుని ఉదరాన్ని కొమ్ము లతో చీల్చాడు. అనగా కొమ్ము లు నాలుగు విధములైన వాక్కులు కావున వాక్కులతో ఉపాసించి పరమేశ్వరుణ్ని సాక్షాత్కరించుకున్నాడు.

దినఫలాలు

మేష రాశి
ఆర్థిక లావాదేవీలు, దూరప్రయాణాలు, విద్యాప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. మంచి కార్యాలలో పేరు, ప్రఖ్యాతలు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ప్రభుత్వ వ్యవహారాల్లో వ్యతిరేకత ఉంటుంది. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి
కోర్టు వ్యవహారాలు అనుకూలం. ఆర్థికప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్యవిషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి.

మిథున రాశి
సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి
విదేశీ లావాదేవీలు కలిసి వస్తాయి. శుభవార్తలు వింటారు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. శత్రుభీతి పోతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి
గృహ కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి
ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు లభిస్తాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింప బడతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

తులా రాశి
విదేశీ లావాదేవీలు,సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్యరీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలం.

వృశ్చిక రాశి
స్థిరాస్తి కొనుగోళ్లు అనుకూలం. ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాలు, ఆరోగ్యం విష యంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపారపరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి
ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాలు ద్వారా లబ్ది చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కొగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి
విదేశీ సంభాషణలు ఉపకరిస్తాయి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పని సరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి
నూతన వాహన కొనుగోళ్లు వంటివి ఆనందాన్ని కలిగిస్తాయి. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆకస్మికవ్యయం లేకపోలేదు. ఆరోగ్య విషయంలో అనుకూల పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి. ప్రత్యర్థుల ద్వారా చిరుసమస్యలు ఉంటాయి.

మీన రాశి
ఋణప్రయత్నాలు లాభిస్తాయి. వాహన కొను గోళ్లు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాలు, ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనులు విషయంలో ఏకాగ్రత తప్పని సరి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

ఖులాసా



జీవనశైలి మార్పులతో 'డయాబెటిస్' అధిగమించొచ్చు

జీవనశైలిలో మార్పులు, తగ్గిన శారీరక శ్రమ, పెరిగిన మానసిక ఒత్తిడి వల్ల డయాబెటీస్ వ్యాధి వస్తుంది. మనిషి శరీరంలో ఉపయోగపడకుండా మిగిలిపోయిన చక్కెర పదార్థాల మోతాదు సాధారణ స్థితి కంటే ఎక్కువ మోతాదులో రక్తంలో ఉండటాన్ని డయాబెటీస్ అంటారు. డయాబెటీస్‌ను సంపూర్ణంగా నయం చేయవచ్చంటున్నారు ప్రముఖ ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ సునీల్ ఈపూరి

మెటాలిక్ డిజార్డర్ అయిన డయాబెటీస్ మూడు రకాలు. టైప్ 1 ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటీస్ ఎక్కువగా పిల్లల్లో వస్తుంది. శరీరంలోని క్లోమ గ్రంథిలో బీటా సెల్ నుంచి వచ్చే ఇన్సులిన్ ఉత్పత్తి పూర్తిగా ఆగిపోవడం వల్ల వస్తుంది. దీన్నే జువెనల్ డయాబెటీస్ అటారు. టైప్ 2 నాన్ ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటీస్. అవసరమైన మోతాదులో ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవడం వల్ల వచ్చే టైప్ 2 వ్యాధి ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, కాల్‌సెంటర్లు, మార్కెటింగ్ ఉద్యోగాల్లో పనిచేసేవారిలో వస్తుంది. టైప్ 3 జెస్టేషనల్ డయాబెటీస్ గర్భిణుల్లో కనపిస్తుంది.

మిగతా అన్ని సమస్యల్లాగే డయాబెటీస్ విషయంలో కూడా చాలామంది లేనిపోని అపోహలకు పోయి నష్టపోతున్నారు. డయాబెటీస్ వచ్చిందంటే అంతా ఏమనుకుంటారో, తమను చిన్నచూపు చూస్తారేమోనని దాపరికాలకు పోవటం, ఎవరేం చెప్పినా వినటం, మందుల పట్ల, ఇన్సులిన్ పట్ల రకరకాల అపోహలు పెంచుకుని చిట్కా వైద్యాలకు మారటం వంటివన్నీ చేస్తూ చేజేతులా సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. అపోహల వల్ల మన సమాజంలో కొందరు తమకు డయాబెటీస్ వచ్చిందని బయటకు చెప్పుకోవాలంటే ఇబ్బందికర వాతావరణం నెలకొంటుంది. డయాబెటీస్ నియంత్రణ తప్పితే చాలా రకాల సమస్యలు వస్తాయి. మహిళలకు గర్భస్రావాలవుతుంటాయి. రక్తంలో గ్లూకోజ్ అదుపులో లేకపోవడం మూలంగా గర్భం వచ్చినా నిలబడలేదు. నిజానికి చిన్న వయసు వారికి కూడా డయాబెటీస్ రావటమన్నది ఇప్పుడు సర్వసాధారణం. దానికి ఇన్సులిన్ ఇంజక్షన్ తీసుకోవటం పెద్ద సమస్యేం కాదు. ఈ విషయాలు బయటకు చెప్పుకుంటే వేరేగా చూస్తారేమోనని భయపడాల్సిన పనీలేదు. వివాహాల విషయంలో కూడా మధుమేహం ఉన్న ఆడపిల్లల విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన పనిలేదు. డయాబెటీస్ నియంత్రణలో ఉంచుకోవడానికి ఇప్పుడు ఇన్సులిన్‌తో సహా సమర్థమైన మందులున్నాయి. దాన్ని నియంత్రణలో పెట్టుకుంటే దాంపత్య జీవితం విషయంలో గానీ, సంతానం విషయంలోగానీ ఎలాంటి సమస్యలుండవు. మధ్యతరగతి వారు ఇలాంటి అనుమానాల్లోంచి బయటపడాల్సిన అవసరం చాలా ఉంది. అలాగే మందుల కంటే పసర్లు, కషాయాలు, పొడుల వంటివే ఉత్తమమనీ, వాటితో దుష్ప్రభావాలు ఉండవనీ.. ఇలాంటి అపోహల నుంచి బయటపడటం మంచిది.

కారణాలు

తల్లిదండ్రుల్లో ఈ జబ్బు ఉన్నట్లయితే సంతానానికి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. స్థూలకాయం, మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ తక్కువగా ఉండటం వల్ల డయాబెటీస్ వస్తుంది. ఎవరైనా సరే, రక్తంలో గ్లూకోజ్ పరగడపున 125 దాటినా, తిన్న తర్వాత 200దాటినా తమకు డయాబెటీస్ వచ్చినట్టేనని గుర్తించాలి. ఒక్కసారి అలా కనబడినా సరే, మందులు మొదలుపెట్టాల్సిందే. దాన్ని ఆహారంతో తగ్గించేస్తామని, వ్యాయామ నియమాలతో దారిలోకి తెచ్చేస్తామని తప్పించుకుని తిరగటానికి వీల్లేదు.

ఒకప్పుడు డయాబెటీస్‌ను తొలిసారి గుర్తించిన తర్వాత మూడునెలలపాటు ఆహార వ్యాయామ నియమాలు ప్రయత్నించండని (నాన్ ఫార్మలాజికల్ థెరపీస్) చెప్పేవాళ్లు. కానీ ఇప్పుడా విధానం సమర్థంగా లేదని, దానివల్ల ఉపయోగం లేకపోగా ముప్పులు ఎక్కువ అవుతున్నాయని తేలింది. రక్తంలో గ్లూకోజ్ ఒక్కసారి కనబడినా సరే.. మందులు మొదలు పెట్టాల్సిందేనని, దాన్ని అదుపులోకి తీసుకురావాల్సిందేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పుడు నొక్కి చెబుతోంది.



లక్షణాలు

అధిక దాహం, మూత్రస్రావం, ఆకలి, బరువు తగ్గిపోవడం, త్వరగా నీరసం రావటం, పిక్కల్లో నొప్పి, ఒళ్లు నొప్పులు, గాయాలు నయం కాకపోవడం, ఫంగల్ ఇన్ఫెక్షన్, చర్మ వ్యాధులు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు రావటం, సెక్స్ కోరికలు తగ్గిపోవడం.

సాధారణంగా డయాబెటీస్ వచ్చిన తర్వాత మొదటిపదేళ్ల పాటు పైకి పెద్దగా ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు.

దీంతో చాలామంది ఏళ్ల తరబడి మధుమేహాన్ని పట్టించుకోకుండా తోసేసుకుని తిరుగుతున్నారు. నాకేం సమస్యల్లేవని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. కానీ దీనివల్ల త్వరలోనే ఆరోగ్యం ఘోరంగా దెబ్బతిని ఆపదల పాలవుతున్నారు.

సైడ్ ఎఫెక్ట్స్

డయాబెటీస్ ఉన్నవారిలో సరైన చికిత్స లేక ఇతర రోగాలకు కారణమవుతుంది. డయాబెటిక్ ఫుట్, డయాబెటిక్ నెఫ్రోపతి, డయాబెటిక్ రెటినోపతి, డయాబెటిక్ న్యూరోపతి, అధిక రక్తపోటు, శరీరంలో కొలెస్ట్రాల్ లెవల్స్ పెరగడం, ఛాతినొప్పి, పక్షవాతం, గుండెపోటు, కాటరాక్ట్, గ్యాస్ట్రిక్ సమస్యలు వచ్చే ప్రమాదముంది. చాలామంది డయాబెటీస్ రోగులు రక్తంలో గ్లూకోజు ఒక్కటే చూసుకుంటూ ట్రైగ్లిజరైడ్లు, కొలెస్ట్రాల్, హైబీపీవంటివేమీ పట్టించుకోవటం లేదు. కానీ ఇది సరికాదు. ఎందుకంటే రక్తంలో గ్లూకోజు నియంత్రణలో ఉంటున్నా కూడా (అంటే పరగడపున రక్తంలో గ్లూకోజు 125 కంటే తక్కువగానే ఉంటున్నా కూడా) వీళ్లకు రక్తంలో కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు, హైబీపీ వంటివి ఎక్కువ ఉంటే డయాబెటీస్ కారణంగా వచ్చే దుష్ప్రభావాలన్నీ ముందుకొచ్చే ప్రమాదం ఉంటుంది. కాబట్టి రక్తంలో గ్లూకోజు మాత్రమే తగ్గించుకుంటే సరిపోదని గుర్తించాలి.

పరీక్షలు

ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, పోస్ట్ ప్రాండియల్ బ్లడ్ షుగర్, గ్లూకోజ్ టాలరెంట్ టెస్ట్, యూరిన్ షుగర్ లెవల్, రాండమ్ షుగర్ లెవల్స్‌తో పాటు బ్లడ్ యూరియా లెవెల్స్, సీరమ్ పరీక్షలు చేయించడం వల్ల కచ్చితమైన చికిత్స అందించేందుకు వీలవుతుంది. నిజానికి డయాబెటీస్ రోగులు రక్తంలో డయాబెటీస్ రోగులు రక్తంలో గ్లూకోజ్‌తో పాటు వూబకాయం, హైబీపీ, కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు.. ఈ నాలుగింటిని కూడా కచ్చితంగా పట్టించుకోవాల్సిందే. వీటిలో హైబీపీ, కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు ఎక్కువగా ఉంటే వాటికి కచ్చితంగా మందులు కూడా వాడుకోవాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా విస్తృతంగా ప్రచారం చెయ్యటం మూలంగా మన సమాజంలో ఇటీవలికాలంలో కొలెస్ట్రాల్, హైబీపీల మీద కొంత అవగాహన బాగానే పెరిగిందిగానీ ఇప్పటికీ ట్రైగ్లిజరైడ్ల గురించి చాలామందికి తెలియటం లేదు. ట్రైగ్లిజరైడ్లు ఎక్కువ ఉన్నా వాటిని అస్సలు పట్టించుకోవటం లేదు. కానీ ట్రైగ్లిజరైడ్లనూ చూసుకోవటం చాలా అవసరం. ట్రైగ్లిజరైడ్లు 200 లోపు ఉండాలి. 200లకు మించి 600ల్లోపు ఉంటే మందులువాడటం ఉత్తమం.

ఇక 600 దాటితే మాత్రం ఇన్సులిన్ తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే ట్రైగ్లిజరైడ్లను అదుపులో ఉంచుకునేందుకు పిండి పదార్థాలను తగ్గించాలి. అలాగని అన్నం మానెయ్యాల్సిన పనిలేదు గానీ, తేలికగా జీర్ణమయ్యే పిండి పదార్థాలు అంటే బ్రెడ్లు, బిస్కట్లు, జామ్ చిప్స్ వంటివి మానెయ్యాలి. మద్యం కూడా ట్రైగ్లిజరైడ్లను పెంచుతుంది. దాన్నీ మానేయాలి. మందులు వేసుకోవాలి.

చికిత్స

మధుమేహం వచ్చిందనగానే చాలా మంది టీ, కాఫీల్లో పంచదార మానేస్తుంటారు. డయాబెటీస్ నియంత్రణకు అదొక్కటే చాలనుకుంటారు. అలాగే అన్నం మానేసి చపాతీలకు మారిపోయి ఇక గ్లూకోజ్ అదే తగ్గిపోతుందని నమ్ముతుంటారు. నిజానికి ఆహారం తగ్గించటం వంటి చర్యలు ఇప్పటికే బరువు ఎక్కువగా ఉన్న డయాబెటీస్ రోగులకు ఉపయోగపడతాయి. వాళ్లకు అది అవసరం. కానీ వాస్తవానికి ఇప్పుడు డయాబెటీస్ రోగులకు నూటికి 70 మంది స్థూలకాయంతో ఉండటం లేదు. బక్క పలచగానే ఉంటున్నారు. వీళ్లు ఆహారం తగ్గించెయ్యటం వల్ల షుగర్ తగ్గటం మాట అటుంచి పోషకాహార లోపం, దానివల్ల ఇతరత్రా సమస్యలు ముంచుకొచ్చే ముప్పు ఉంటుంది. తిండి తగ్గించెయ్యటం వల్ల రోగ నిరోధక శక్తి కూడా క్షీణిస్తుంది. కాబట్టి ఆహారం తగ్గించెయ్యటం కాదు. తినే ఆహారంలో అన్నీ తగుపాళ్లలో ఉండేలా చూసుకోవటం ముఖ్యం. వాస్తవానికి డయాబెటీస్ వచ్చిన తర్వాత దాన్ని కేవలం ఆహారం, వ్యాయామాలతోనే తగ్గించేస్తాని ప్రయత్నించటం సరికాదు. ఆహారం తగ్గించేయడం వల్ల బరువు వేగంగా తగ్గిపోయి మనిషి బక్కచిక్కిపోతారు. జ్వరం, దగ్గు ఆరంభమై క్షయ వ్యాధికి దారితీయవచ్చు.

ఆహారం తగ్గించేస్తే రోగనిరోధక శక్తి సన్నగిల్లిపోతుంది. ఎప్పుడైతే రోగనిరోధక శక్తి తగ్గుతుందో వెంటనే క్షయ వంటి ఇన్ఫెక్షన్ల దాడి పెరిగిపోతుంది. కాబట్టి డయాబెటీస్ వచ్చిందని నోరు పూర్తిగా కట్టేసుకుని, ఆహారం పూర్తిగా మానెయ్యటం సబబు కానే కాదు. మధుమేహం వచ్చినా సరే, ఎవరైనా గానీ ఆరోగ్యకరమైన, సమతులాహారం తీసుకోవాలి. ఆహారంలో మాంసకృత్తులు, పిండిపదార్థాలు, పండ్లు, కూరగాయల వంటివన్నీ సమృద్ధిగా ఉండేలా చూసుకోవాల్సిదే. ఇప్పుడు చాలామంది డయాబెటీస్ వచ్చిందనగానే ధ్యాస అంతా ఆహారం మీదే పెడుతూ మందులకు ప్రాధాన్యత ఇవ్వటం లేదు. నిజానికి డయాబెటీస్ విషయంలో ఆహార వ్యాయామాల వంటివి ముఖ్యమేకానీ వాటికంటే కూడా గ్లూకోజ్ నియంత్రణకు వైద్యులు చెప్పినట్టుగా మందులు వేసుకోవటం, క్రమం తప్పకుండా పరీక్షలు చేసుకోవటం మరింత ముఖ్యం. మందులు- పరీక్షలకు తొలిప్రాధాన్యం. ఆ తర్వాతే ఆహారం, వ్యాయామం. అది కూడా అవగాహనతో చెయ్యాలి. అవసరమైతే డైటీషియన్లు, పోషకాహార నిపుణుల సలహా మేరకు ఆహార నియమాలు పాటించాలి.

డాక్టర్ సునీల్ ఈపూరి
కన్సల్టెంట్ ఎండోక్రినాలజిస్ట్
కాంటినెంటల్ హాస్పిటల్స్



ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉండాలంటే...

వర్షాకాలంలో సాధారణంగా ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా జలుబు..దగ్గు, శ్వాసకోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు వస్తాయి. వీటిని నివారించడానికి సరైన ఆహారం తీసుకోవాలి. ఈ ఆహారంలో విటమిన్లు, జీర్ణం కాదు. ఫ్రై చేసిన ఆహారం తింటే అజీర్తి సమస్య వస్తుంది. దాంతో గ్యాస్, అసిడిటీకి దారి తీస్తుంది. ఈ కాలంలో ఆకుపచ్చని కూరగాయలు, ఆకుకూరలు తినకూడదు. ఎందుకంటే వాటిలో క్రిములు, బాక్టీరియా




ప్రొటీన్లు సమృద్ధిగా ఉండేలాగా చూసుకోవాలి. మిరియాలు, వాము, శొంఠిపొడిని పాలు, మజ్జిగ, సూప్స్, టీ, ఫ్రైడ్‌రైస్‌లో వేసుకోవడం వల్ల శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు నివారించడంలో సహాయపడతాయి. ఉడికించిన గుగ్గిళ్లు, స్టీమ్ చేసిన మొలకలు, పప్పుసూప్, శనగల కట్‌లెట్స్, పనీర్ కట్‌లెట్స్, గుగ్గిళ్లతో చేసిన బేల్‌పూరి, పన్నీర్ పరాతా లాంటివి రోజువారి ఆహారంలో కనీసం ఒక్కసారైనా ఉండేలా చూసుకోవాలి. పండ్ల రసాలు, పానీపూరి, చాట్, బేల్‌పూరి లాంటి స్ట్రీట్‌ఫుడ్స్‌ని తీసుకోకూడదు. వీటిని కలుషితమైన నీరు, పదార్థాలతో తయారు చేస్తారు. ఇటువంటి ఇన్ఫెక్షన్లు అపరిశుభ్రంతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల వస్తాయి. వాంతులు, విరోచనాలు ఫుడ్ పాయిజన్ వల్ల అవుతుంది. అంతేకాదు బాగా వేయించిన ఆహార పదార్థాలను ఈ కాలంలో అసలు తినకూడదు. వర్షాకాలంలో మన జీర్ణ వ్యవస్థ పని తీరు మందగిస్తుంది. తిన్న ఆహారం సరిగ్గా ఎక్కువగా చేరే అవకాశం ఉంది. బాగా శుభ్రం చేసుకుని తినాలి. వర్షాకాలంలోనే చేపలు, రొయ్యలు గుడ్లను పెట్టి పిల్లల్ని కంటాయి. ఈ సమయంలో వాటిపై లార్వా, వైరస్‌లు, ఇతర క్రిములు ఎక్కువగా ఉంటాయి. మార్కెట్‌లో అమ్మే చేపలు, రొయ్యలపై ఈ కాలంలో తేమ ఉండటం వల్ల బాక్టీరియా ఎక్కువగా ఉంటుంది. ఇవి ఒక పట్టాన పోవు. ఈ కాలంలో చేపలు..రొయ్యలు తినకుండా ఉంటే మంచిది. వర్షాకాలం సమయంలో ఆహారం చాలా సులభంగా ఫంగస్‌కు ప్రభావితమవుతుంది. అంతేకాకుండా నగర వాతావరణంలో గాలిలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల ఆహారం త్వరగా పాడవుతుంది. అందుకే తక్కువ పరిమాణంలో ఆహారంను వండుకోవాలి. వండిన ఆహారంలో బాక్టీరియా చేరకుండా ఉండటానికి రెండు గంటలకు ఒకసారి మూత తీసి వండిన ఆహారాన్ని వేడి చేసి కలుపుతూ ఉండాలి.

రక్తహీనత...బయటపడే మార్గాలు



రక్తహీనత. తరచూ ఈ మాటని వింటూనే ఉంటాం. ఈ రక్తహీనత ఎక్కువగా మహిళల్లో కనిపించే సమస్య. యాభైశాతానికి పైగా మహిళల్లో ఈ సమస్య ఉంటుంది. ఈ సమస్య నుంచి బయటపడాలంటే శరీరానికి ఇనుము అనే పోషకం పుష్కలంగా అందేలా చూసుకోవాలి. ఇనుముతో ఎన్నో లాభాలు ఉన్నాయి. శరీరానికి కావాల్సిన పోషకాల్లో ముఖ్యమైంది ఇనుము. దీనిలోపం వల్లే రక్తహీనత శరీరాన్ని పట్టి పీడిస్తుంది. అలసటా, ఆయాసం, తలనొప్పి, శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు రక్తహీనత వల్లే ఏర్పడతాయి. ఇలా జరిగినప్పుడు దానికి సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి. గర్భిణీల్లో ఈ సమస్య ఉంటే ఆ ప్రభావం పుట్టబోయే పాపాయిపై పడుతుంది. అందుకే వైద్యులు సూచించే ఐరన్ మాత్రలు వేసుకోవాలి. ఇనుమును తగిన మోతాదులో తీసుకోవడం వల్ల హీమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది. ఈ హిమోగ్లోబిన్ శరీరం మొత్తానికి కావాల్సిన ప్రాణవాయువుని సరఫరా చేస్తుంది. ముఖ్యంగా మెదడు చురుగ్గా పని చేయాలంటే తగినంత ప్రాణవాయువు అందాలి. ఇనుము మన మేధస్సు..మానసిక ఎదుగుదలకి కీలకం. ఇనుము మీ శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తుంది. కండరాల ఆరోగ్యం కూడా దీనిపైనే ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఐరన్ తక్కువైతే కండరాలు సరిగా పని చేయక మీరు ఏ పని చేయాలన్నా ఓపిక ఉండదు. చేసినా తొందరగా అసిపోతారు. మనం తీసుకునే పదార్థాల ద్వారా శరీరానికి కావాల్సిన ఇనుము అందనప్పుడు వైద్యుల సలహా మేరకు ఇనుము, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడాలి.

పల్మనరీ సమస్యలకు బ్రాంకోస్కోపీ



ప్రతి ఒక్కరిలో శ్వాసలో సమస్య, గురక సమస్య ఆస్తమా వ్యాధితో అనుబంధం ఉన్నట్లు కాదు. ఈ పరిమాణం ఊపిరితిత్తుల్లో సంబంధిత వ్యాధుల నివారణ లోపాలు తెలుసుకోవడంలో కీలకంగా వ్యవహరిస్తాయి. 'బ్రాంకోస్కోపి' చికిత్స విధానంలో ఆస్తమాయేతర శ్వాసకోశ సంబంధ సమస్యలకు చికిత్స చేసేందుకు ఉపకరిస్తుంది. అప్పుడప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించడంతో ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల చికిత్స, వైద్య పరీక్షల నిర్వహణలో వచ్చే ఎలర్జీకి అవినాభావ సంబంధం ఉంది. అనువైన ఫైబర్ ఆప్టికల్ పరికరాలతో సమయోచితంగా మత్తుమందు వాడడం ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్ష నిర్వహిస్తారు. అందుకోసం సదరు రోగికి ఇంట్రావీనస్ ద్వారా మత్తునిస్తారు. 'బ్రాంకోస్కోపి' విధానం ఒకసారి అమలులోకి వచ్చిన తర్వాత అదనపు సమయోచితంగా గాలిలోకి మత్తును వదలడం ద్వారా దగ్గువల్ల రోగికి కలుగుతున్న అసౌకర్యాన్ని తగ్గిస్తారు. దీన్ని శిక్షణ పొందిన అసిస్టెంట్ పర్యవేక్షణలో రోగి నుంచి అవసరమైన నమూనాలను సేకరించేవరకు మత్తుమందు వాడాల్సి ఉంటుంది. ఒకవేళ ఐసీయూ/ ఎమర్జెన్సీ వార్డులో అవసరం వస్తే చేతిలో ఇమిడిపోయే వస్తువు వినియోగిస్తున్నారు. రోగికి ముక్కు నాసికా రంధ్రాలద్వారా గానీ, నోటిద్వారా గానీ, వాయువు ద్వారా గానీ రోగిలోకి ప్రవేశపెడతారు. హైదరాబాద్‌కి చెందిన సూర్య ఛాతి ఆసుపత్రి చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ వినయ్‌కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ''రోగి అదే పనిగా దగ్గుతున్నా, తెమడలో రక్తం వచ్చినా బ్రాంకోస్కోపి విధానం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. చెస్ట్ ఎక్స్‌రేలో అసాధారణ పరిస్థితులు నెలకొన్నా, ఇన్‌ఫెక్షన్‌తో ఊపిరితిత్తుల్లో మంట వచ్చినా ఈ వైద్య విధానమే పరిష్కారం. రక్తస్రావం నియంత్రణ, కండరాల్లో వాపు తదితర సమస్యలు వచ్చినప్పుడు పల్మనరీ ఫిజిషియన్లు బ్రాంకోస్కోపి విధానంలో చికిత్స అమలు చేస్తారు అని అన్నారు.

ముందస్తు చర్యలు

బ్రాంకోస్కోపి విధానంలో చికిత్సా విధానం అమలు చేయడానికి ముందు రోగులు అర్ధరాత్రి తర్వాత ఏదైనా తినాల్సి ఉంటుంది. సాధారణంగా రక్తస్రావం నియంత్రించడానికి ద్రవరూపంలో ఉన్న మాత్రలను వాడాల్సి ఉంటుంది. ఆస్ప్రిన్, వార్ఫరిన్(కౌడామిన్), స్టెరాయిడేతర టాబ్లెట్, ఐ బ్రూఫెన్ తదితర మందులు వాడాల్సి ఉంటుంది. మెడికేషన్ బట్టి ఔషధాల వినియోగ విధానం అమలు చేస్తారు. ఒక ప్రత్యేక పరిస్థితిలో రోగులు సంబంధించిన వైద్యులను తప్పనిసరిగా సంప్రదించాల్సి ఉంటుంది. మందుల వాడకంలో రోగులు ఎలర్జీ సమస్యలను ఎదుర్కొంటు న్నారా? లేదా అన్న విషయాన్ని వైద్యులు నిర్ధారించాల్సి ఉంటుంది. బ్రాంకోస్కోపీలో విధానంలో చికిత్సా విధానం అమలు చేయడానికి ముందు రోగులు అర్ధరాత్రి తర్వాత ఏదైనా తినాల్సి ఉంటుంది. సాధారణంగా రక్తస్రావం నియంత్రించడానికి ద్రవరూపంలో మాత్రలను వాడాల్సి ఉంటుంది. మెడికేషన్ బట్టి ఔషధాల వినియోగ విధానం అమలు చేస్తారు. ఒక ప్రత్యేక పరిస్థితిలో రోగులు సంబంధించి వైద్యులను తప్పనిసరిగా సంప్రదించాల్సి ఉంటుంది. మందుల వాడకంలో రోగులు ఎలర్జీ సమస్యను ఎదుర్కొం టున్నారా? లేదా? అన్న విషయాన్ని వైద్యులు నిర్ధారించాల్సి ఉంటుంది. బ్రాంకోస్కోపీలో వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత రోగులను ఒకటి, రెండు గంటలకు అబ్జర్వేషన్‌లో పెట్టాల్సి ఉంటుంది. మళ్లీ పరిస్థితులు చక్కబడే వరకు సదరు రోగులు డ్రైవింగ్ కు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే అదే పనిగా దగ్గుతున్నా, తెమడలో రక్తం వచ్చినా వారం లోపే వైద్యుడ్ని సంప్రదించాల్సిన అవసరం ఉంది. ఔషధాల వినియోగం, పద్ధతులను బట్టి వాటికి సంబంధించి ప్రత్యేక సమస్యలు తలెత్తుతాయి. బయాప్సీ తర్వాత రక్తస్రావం సాధారణంగా జరిగే ప్రక్రియ. ఊపిరితిత్తుల బయాప్సీ వల్ల గాలి లీకయ్యే అవకాశం ఉంది. ఇటువంటి న్యూమోథోరాక్స్ సమస్యల ఒక్క శాతం మంది లోపు రోగుల్లో మాత్రమే ఉంటుంది.

అభిమానులే మాకు పెద్ద వరం

నాగార్జున



లవ్, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్సే కాదు భక్తిరస కథాచిత్రాలను చేయడంలో కూడా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్న నాగార్జున ఇప్పుడు తొలిసారి హారర్ కామెడీ చిత్రంలో నటిస్తున్నారు. మరోవైపు నిర్మాతగా తన కుమారుల చిత్రాలను కూడా నిర్మిస్తూ బిజీగా ఉన్నారు. మంగళవారం తన జన్మదినోత్సవం సందర్భంగా నాగార్జున హైదరాబాద్‌లోని అన్నపూర్ణా స్టూడియోలో కొద్దిసేపు పాత్రికేయులతో ముచ్చటించారు.

రాజుగారి గది-2 ఎంతవరకు వచ్చింది?

కొంత ప్యాచ్‌వర్క్ మినహా అంతా పూర్తయింది. ప్రస్తుతం రీరికార్డింగ్ జరుగుతోంది. వచ్చేనెల రెండోవారంలో తొలికాపీ సిద్ధమవుతుంది. సినిమా కూడా చాలాబాగా వచ్చింది. అయితే లోగడ వచ్చిన రాజుగారిగది సినిమాకు, ఈ పార్ట్-2 సినిమాకు సంబంధం లేనేలేదు. బాగా పాపులర్ అయిన సినిమా కాబట్టి ఆ టైటిల్‌ను ఈ సినిమాకు ఉపయోగించడం జరిగింది. కొంత హారర్‌తో పాటు అధిక కామెడీ ఉండే సినిమాలంటే వ్యక్తిగతంగా నాకు చాలా ఇష్టం. ఎంతోకాలంగా హారర్ కామెడీ జానర్‌లో ఒక సినిమా చేయాలని అనుకున్నా. లక్కీగా అది ఈ సినిమాతో కుదిరింది. ఇందులో థ్రిల్లింగ్ అంశాలు కూడా ఉంటాయి.

ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?

ఇందులో నాది మెంటలిస్ట్ పాత్ర. నిజజీవితంలో అలాంటివారిని ఇద్దరు, ముగ్గుర్ని కలిశా. మీ మనసులో ఉన్నది వాళ్లు చాలా సులువుగా కనిపెట్టేస్తారు. కొన్ని ప్రశ్నలు అడిగి మీ మనసులో ఏమనుకుంటున్నారో ఇట్టే చెప్పేస్తారు. అదేమీ మ్యాజిక్ కాదు. గమనించే పవర్ ఎక్కువగా ఉండటం, మిర్రర్ మెమరీ వల్ల అది సాధ్యమవుతుంది. ఈ సినిమాలో కూడా మనిషిని చూడగానే వాళ్ల మనసులోని మాటల్ని కనిపెట్టగల పవర్స్ నాకుంటాయి. నా పాత్రలో పెద్దగా కామెడీ ఉండదు. కానీ డ్రామా ఎక్కువగా ఉంటుంది. వెన్నెల కిషోర్, ప్రవీణ్, అశ్విన్‌ల కామెడీ అలరిస్తుంది. అది కూడా సందర్భానుసారంగానే ఉంటుంది.

ఓంకార్‌తో కలిసి పనిచేయడం ఎలా అనిపించింది?

ఓంకార్ దర్శకుడిగా వృత్తిపట్ల చాలా ఖచ్చితంగా ఉంటాడు. చిన్న చిన్న లోపాల్ని కూడా వదలడు. అతనికి ప్రతీ సీన్ అనుకున్నట్లు కరెక్ట్‌గా రావాలి. అలా వచ్చేవరకు చేస్తూనే ఉంటాడు. అతనితో పనిచేయడం చాలా బావుంది. కథ చెప్పేటప్పుడు ఫుల్ స్క్రిప్ట్‌తో నా దగ్గరకు వచ్చాడు.

మీ అబ్బాయిల సినిమాలను మీరే నిర్మిస్తున్నారు కదా..ఒత్తిడి అనిపించడం లేదా?

ప్రేమ ఉన్నచోట వత్తిడి కూడా ఉంటుంది. అఖిల్ సినిమా బడ్జెట్ ఎక్కువ. జాగ్రత్తలు కూడా ఎక్కువగా తీసుకోవాలి. అయినా వాళ్ల సినిమాలను నేను నిర్మించడం ఆనందంగా ఉంది.

అఖిల్ సినిమా ఎందుకింత ఆలస్యమైంది?

హీరోయిన్‌ను ఎంపిక చేయడం కోసమే ఎక్కువ సమయం తీసుకున్నాం. సినిమా ఫ్రెష్ ప్రేమకథ. కాబట్టి హీరోయిన్ కూడా కొత్తగా ఉండాలని అంటే గీతాంజలిలో గిరిజలా, ఏమాయ చేసావేలో సమంతలా ఉండాలని అనుకున్నాం. చాలామందిని ఆడిషన్స్ చేశాం. చివరకు ప్రియదర్శినిగారి అమ్మాయి కల్యాణిప్రియదర్శినిని ఎంపికచేశాం. దర్శకుడు విక్రమ్‌కుమార్ ప్రణాళికబద్ధంగా, సృజనాత్మకతగా సినిమా తీస్తారు. ఈ సినిమాకు పెట్టిన హలో అనే టైటిల్‌కు కూడా మంచి స్పందన లభించింది. వాస్తవానికి ఈ సినిమాకు అన్నివిధాలా సరిపోయే టైటిల్ ఇది. తను ప్రేమించిన అమ్మాయి దగ్గర నుంచి ఒక హలో కోసం వెయిట్ చేస్తుంటాడు హీరో. ఇది నేను ఇచ్చిన టైటిల్. సినిమా యూనిట్ అంతా ఏం టైటిల్ పెట్టాలని ఆలోచిస్తున్నప్పుడు నాకు తట్టిన ఆలోచన ఇది.

మీ బంగార్రాజు చిత్రం మాటేమిటి?

నాక్కూడా ఆ పాత్ర చేయాలని చాలా కోరిక. దర్శకుడు కల్యాణ్‌కృష్ణ ఒక లైన్ చెప్పాడు కానీ అది నచ్చలేదు. అతను మంచికథ చెబితే చేసేస్తాను. కానీ అది సోగ్గాడే చిన్నినాయనకు సీక్వెల్‌లా ఉండకూడదని మాత్రం అనుకుంటున్నాను.

మలయాళ మహాభారతంలో నటిస్తున్నారట నిజమేనా?

వాళ్లు నన్ను కలిసిన మాట నిజమే కానీ చేస్తానా? చేయనా? అనేది మాత్రం ఇప్పుడే కచ్చితంగా చెప్పలేను. అందులో కర్ణుడి పాత్ర కోసం నన్ను కలిశారు. వచ్చే ఏడాది ఆ చిత్రం మొదలవుతుంది.

చైతన్య, సమంతల పెళ్లిని ఎలా ప్లాన్ చేస్తున్నారు?

అక్టోబర్ 6న చేయాలని అనుకుంటున్నాం. ఆ రోజే హిందూ, క్రిస్టియన్ పద్ధతిలో వారి పెళ్లి జరుగుతుంది. పెళ్లి వేడుకను చిన్నదిగా చేద్దామని వాళ్లే అన్నారు. ఆ తర్వాత కార్యక్రమాన్ని మాత్రం గ్రాండ్‌గా ఉండేలా నేను ప్లాన్ చేస్తున్నాను.

బర్త్‌డే సందర్భంగా అభిమానులకు మీరిచ్చే సందేశం ఏంటి?

వాళ్ల ప్రేమకు నా కృతజ్ఞతలు. అంతకన్నా వాళ్లకు ఇంకేం చెప్పగలను. నాన్నగారి దగ్గర నుంచి ఇప్పటివరకు అన్ని సమయాల్లోనూ వాళ్లు మాకు తోడుగా ఉన్నారు. వాళ్ల ఆదరణ మరచిపోలేనిది. వాళ్లే మాకు పెద్ద వరం అంటూ ముగించారు.

ఫైట్స్ చేస్తున్న అల్లు అర్జున్



అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం నా పేరు సూర్య-నా ఇల్లు ఇండియా. అను ఇమ్మాన్యుయేల్ కథానాయిక. వక్కంతం వంశీ దర్శకుడు. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ నిర్మిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ రామోజీ ఫిలింసిటీలో జరుగుతోంది. స్టంట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్‌ల సారధ్యంలో యాక్షన్ సన్నివేశా లను చిత్రీకరిస్తున్నారు. ఈ విషయాన్ని నిర్మాత శిరీష శ్రీధర్ తెలియజేస్తూ, భారీ తారాగణంతో ఎక్కడా రాజీపడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్, శేఖర్ సంగీతాన్ని అందిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 27న సినిమాను విడుదల చేయనున్నాం అని చెప్పారు. ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో యాక్షన్ కింగ్ అర్జున్, శరత్‌కుమార్ తదితరులు నటిస్తుండగా, సినిమాటోగ్రఫీని రాజీవ్ రవి, ఎడిటింగ్‌ను కోటగిరి వెంకటేశ్వరరావును అందిస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: బన్ని వాసు.



యుద్ధం శరణం పాటలు

నాగ చైతన్య, లావణ్య త్రిపాఠీ జంటగా నటిస్తున్న చిత్రం 'యుద్ధం శరణం'. శ్రీకాంత్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారు. వారాహి చలన చిత్రం సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. రజినీ కొర్రపాటి నిర్మాత. కృష్ణ ఆర్వీ మారి ముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. రజినీ కొర్రపాటి నిర్మాత. వివేక్ సాగర్ సంగీతాన్నందించిన 'యుద్ధం శరణం' ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. సంగీత దర్శకుడు కీరవాణి సీడీని విడుదల చేసి..దర్శకులు రాజమౌళికి అందించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ...'ఈ సినిమా షూటింగ్ చూసేందుకు వెళ్లినపుడు సెట్స్‌లో పండగ వాతావరణం కనిపించింది. అది చూసినప్పుడు సినిమా తప్పకుండా ప్రేక్షకాదరణ పొందుతుందని అనిపించింది. ట్రైలర్ చూశాక ఆ నమ్మకం మరింత బలపడింది. చైతన్య కథలు ఎంచుకునే తీరు నచ్చుతుంది. శ్రీకాంత్ గారి గెటప్ చాలా బాగుంది. వివేక్ సాగర్ సంగీతం వినాలనిపించేలా ఉంది.' అన్నారు.

నాగ చైతన్య మాట్లాడుతూ...'టీజర్ విడుదల తర్వాత వచ్చిన సానుకూల స్పందనతో మాకు ఎంతో నైతిక బలం వచ్చింది. సినిమా అనుకున్నట్లు వచ్చిందంటే నిర్మాత సాయి కొర్రపాటి గారే కారణం. ఈ చిత్రంలో మూడొంతుల మంది కొత్తవాళ్లే. వాళ్లను ఎంతో ప్రోత్సహించారు. దర్శకుడు కృష్ణ నేనూ చిన్నప్పటి నుంచి కలిసే చదువుకున్నాం. సెప్టెంబర్ 8న విడుదలయ్యే ఈ సినిమా యుద్ధంలో దర్శకుడిగా తను గెలిచి నిలుస్తాడు. ఓ సామాన్యుడు శక్తివంతంగా ప్రతినాయకుడిపై ఎలా గెలుస్తాడన్నది కథాంశం. ఈ పోరాటంలో ఎక్కడా ఆయుధాన్ని ఉపయోగించడు. హింస ఉండదు. సామాజిక మాధ్యమాలు, సాంకేతికత, తెలివి తేటలు మాత్రమే వాడుతాడు. వివేక సాగర్ సంగీతం చిత్రాన్ని మరో స్థాయికి తీసుకెళ్తుంది.' అన్నారు. దర్శకుడు కృష్ణ ఆర్వీ మారి ముత్తు మాట్లాడుతూ..' చైతన్య నాకు మంచి స్నేహితుడు. నన్నెంతో ప్రోత్సహించాడు. ఈ రోజు ఇక్కడ ఉన్నానంటే కారణం అతనే. ఈ సంస్థలో మళ్లీ సినిమాలు చేయాలని ఉంది.' అన్నారు. పాటలు బాగా రావడానికి యూనిట్ కృషి కారణమన్నారు సంగీత దర్శకుడు వివేక్ సాగర్. ఈ కార్యక్రమంలో నటుడు రానా మరో అతిథిగా పాల్గొన్నారు.

సాయికిరణ్ హీరోగా వలపు సౌధం

సాయి కిరణ్, ప్రాచీ అధికారి జంటగా నటిస్తున్న చిత్రం 'వలపు సౌధం'. బల్వాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. తుల్జా భవానీ ఫిలింస్ పతాకంపై సునీల్ సాగర్, మజ్ను సాహాబ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కృష్ణ మోహన్ దర్శకుడు కాగా...విజయ్ శేఖర్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'వలపు సౌధం' సినిమా ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. త్వరలో ఆడియోను విడుదల చేసి...సినిమాను ప్రేక్షకుల ముందుకు



సాయి కిరణ్
ప్రాచీ అధికారి

తీసుకొచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన సాగర్ సునీల్ మాట్లాడుతూ...' ప్రేమ, హారర్ అంశాలతో ఈ చిత్రాన్ని నిర్మించాం. ఏడు పాటలుంటాయి. నూతన సంగీత దర్శకుడు అందించిన స్వరాలు బాగున్నాయి. పాటలతో పాటు నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది.' అన్నారు. దర్శకుడు కృష్ణ మోహన్ మాట్లాడుతూ...' ఈ చిత్రంతో సాయి కిరణ్‌కు హీరోగా మంచి పేరు వస్తుందని నమ్ముతున్నాం. మాజీ మిస్టర్ ఆంధ్ర బల్వాన్ పోలీస్ పాత్రను పోషించారు. ఈ క్యారెక్టర్ సినిమాకు ఆకర్షణ అవుతుంది.' అన్నారు.

సత్యప్రకాష్, జీవా, కవిత, కోట శంకర్రావు, సంపత్ రాజ్, తిరుపతి ప్రకాష్, దిల్ రమేష్ నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా - యాదగిరి, ఫైట్స్ - సూపర్ ఆనంద్, ఎడిటింగ్ - సాయి శ్రీనివాస్, ఆర్ట్ - నాగేశ్వరరావు, డాన్స్ - బ్రదర్ ఆనంద్, కథ , స్క్రీన్ ప్లే, మాటలు, పాటలు , సంగీతం - ఎస్ కే మజ్ను.

మిల్క్ బ్యూటీ నృత్యాలు ప్రత్యేకమే..!



తమన్నా

'నాకు సకుటుంబ ప్రేక్షకులు కావాలి. పాపులర్ సినిమాలో భాగం కావాలని ఎపుడూ కోరుకుంటాను. నేను చేసే సినిమా అందరూ చూడాలి. అందరూ చూస్తేనే అది ప్రేక్షకాదరణ పొందుతుంది. అలా కావాలంటే ముందు నేను జాగ్రత్తగా సినిమాలో నటించాలి.' అని చెప్పుకుంటుంది తమన్నా. అలాగని చుట్టచుట్టుకుని కనిపించేందుకు ఇష్టపడదు. హద్దుల్లోనే అందాలు చూపించడంలో మిల్క్ బ్యూటీకి అభ్యంతరమేమీ లేదు. యాభై సినిమాలు దాటి వందో చిత్ర మైలురాయికి దూసుకెళ్తోంది తమన్నా. తమిళం, హిందీ, తెలుగులో ప్రస్తుతం ఆమెకు సినిమాలున్నాయి. నిన్నటిదాకా తమన్నా ఖాతాలో ఉన్న తెలుగు సినిమా సందీప్ కిషన్ దర్శకుడు కునాల్ కోహ్లీ తెరకెక్కిస్తున్న చిత్రమొక్కటే. ఇంతలో ఇద్దరు నందమూరి కథానాయకులు సరసన తమన్నా చేరిపోయింది. ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్‌లతో తమన్నా ఆడిపాడబోతోంది. ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం 'జై లవకుశ' లో తమన్నా ఓ ప్రత్యేక గీతం చేయనుంది. తమన్నాకు ప్రత్యేక గీతాలు కొత్తేం కాదు. 'అల్లుడు శీను', 'స్పీడున్నోడు', 'జాగ్వార్' లాంటి సినిమాల్లో చిన్నా, పెద్దా హీరో అనే తేడా లేకుండా తన సొగసైన నృత్యాలు చేస్తూ వస్తోంది. ఇటు ఎన్టీఆర్ కూడా మాస్‌కు చేరువయ్యేలా ప్రతి చిత్రంలో ప్రత్యేక గీతం ఒకటి ఉండేలా చూసుకుంటున్నాడు. మూడు పాత్రలతో ఎన్టీఆర్ ఈ చిత్రంలో అభిమానులను, ప్రేక్షకులను అలరించబోతున్నాడు. నాయికలుగా నివేదా థామస్, రాశీ ఖన్నా, నందితా రాజ్ నటిస్తున్నారు. 'జై లవకుశ' లో పాటకు దర్శకుడు చెప్పిన నేపథ్యం తమన్నాకు బాగా నచ్చిందట. దసరా పండక్కి ఈ సినిమా తెరపైకి రానుంది. ఇక తమన్నా మరో నందమూరి హీరో కళ్యాణ్ రామ్ సరసనా నటించనుంది. జయేంద్ర దర్శకత్వంలో కళ్యాణ్ రామ్ ఓ రొమాంటిక్ కామెడీ చిత్రంలో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ప్రారంభోత్సవం జరుపుకుంది. ఈ సినిమాలోనే తమన్నా కళ్యాణ్‌రామ్ జోడీగా కనిపించబోతోంది. వచ్చే సంక్రాంతి సీజన్‌లో ఈ చిత్రం విడుదల కానుంది.

యథార్థ సంఘటనల ఆధారంగా



సాయిధన్సిక

కబాలిలో రజనీకాంత్ కుమార్తెగా నటించిన సాయిధన్సిక ప్రధాన పాత్రలో నటిస్తున్న ద్విభాషా చిత్రం వాలుజడ. నవీన్ సంజయ్ హీరోగాను, బాలీవుడ్ నటుడు నానాపటేకర్ ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. తమిళ దర్శకులు చేరన్, గౌతమ్‌మీనన్, విక్రమ్‌కుమార్‌ల వద్ద దర్శకత్వశాఖలో పనిచేసిన రమణ మల్లం ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు.

సింహవాహిని చలనచిత్ర పతాకంపై సింహవాహిని నాగరాజు నిర్మిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ యాభైశాతం పూర్తయింది. సెప్టెంబర్ నుంచి మరో భారీ షెడ్యూల్ మొదలుకానుంది. కాగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్ కథానాయిక కాజల్‌అగర్వాల్ చేతులమీదుగా విడుదలైంది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. ఇందులో సాయిధన్సిక విభిన్నమైన పాత్రలో నటిస్తోంది. శరణం గచ్ఛామి, జానకి రాముడు లాంటి సినిమాల్లో నటించిన నవీన్ సంజయ్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు అని చెప్పారు.

ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో నాగరాజు, యోగికత్రి, గౌతమ్‌కుమార్, రైతుబిడ్డ నితిన్ తదితరులు తారాగణం.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ రామస్వామి, సంగీతం: రాధన్, ఎడిటింగ్: ప్రవీణ్.కె.ఎల్., స్టంట్స్: అన్బు, అరియు, ఆర్ట్:కిరణ్.

అక్టోబర్ 12న ఆక్సిజన్ విడుదల

గోపీచంద్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఆక్సిజన్'. అనూ ఇమ్మాన్యుయేల్, రాశీ ఖన్నా నాయికలుగా నటిస్తున్నారు. ఏఎం జ్యోతి కృష్ణ దర్శకత్వం వహించారు. శ్రీ సాయిరామ్ క్రియేషన్స్ పతాకంపై ఐశ్వర్య ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇటీవలే నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'ఆక్సిజన్'చిత్రం అక్టోబర్ 12న తెరపైకి రాబోతోంది. ఈ సందర్భంగా నిర్మాత ఐశ్వర్య



గోపీచంద్,
అనూఇమ్మాన్యుయేల్

మాట్లాడుతూ...'నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. గోపీచంద్ కెరీర్‌లో భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించాం. నిర్మాణ విలువల్లో ఎక్కడా రాజీ పడలేదు. దర్శకుడు జ్యోతి కృష్ణ రూపకల్పన స్థాయి ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందించిన పాటలను త్వరలో విడుదల చేస్తాం. అక్టోబర్ 12న చిత్రాన్ని తెరపైకి తీసుకొస్తాం.' అన్నారు.

జగపతి బాబు, కిక్ శ్యాం, అలీ, చంద్రమోహన్, నాగినీడు, బ్రహ్మాజీ, అభిమన్యు సింగ్, అమిత్, ప్రభాకర్, షాయాజీ షిండే, ఆశిష్ విద్యార్థి, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి యాక్షన్ - పీటర్ హెయిన్స్, స్టంట్స్ - సిల్వ, కొరియోగ్రఫీ - బృంద, సినిమాటోగ్రఫీ - వెట్రి, ఛోటా కె నాయుడు, ఎడిటింగ్ - ఎస్‌బీ ఉద్ధవ్.